1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 5
పుటలు : 68
రు. 25 లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఆగస్టు 2022

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in


శుభాకాంక్షలు

గిడుగు 159వ జయంతి
తెలుగునుడి పండుగ
స్వతంత్ర భారత అమృతోత్సవాలు



భారత సమైక్యతకూ పురోగతికీ అమ్మనుడుల సాధికారతే కీలకం

తెలుగుజాతి మహా వృక్ష మూలాలకే ముప్పు !
జాతి నిర్మాతల సంకల్పానికే ఎసరు !!



2022 ఆగస్టు 29

గిడుగు రామమూర్తి 159వ జయంతి

తెలుగు భాషా దినోత్సవం

భాషనశిస్తే జాతి నశిస్తుంది. భాషనూ జాతినీ రక్షించుకోవడానికై ఉద్యమిద్దాం

– పుట 5లో 'తెలుగు స్వాభిమాన ఉద్యమానికై పిలుపు' చూడండి

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఆగస్టు 2022

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. <u>హామీపత్రం తప్పనిసరి:</u> **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.

లోపలి పుటలలో....

ముఖచిత్రం, రేఖాచిత్రాలు	కార్టూన్లు	కంప్యూటర్
చిదంబరేశ్వరరావు	**సరసి**	**బండారు రఘురాం**

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

TELUGU JAATHI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **914020020387880**

IFSC Code : UTIB0000556

Telugu Jaathi

+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

94404 48244 లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, తెనాలి,
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ



2022 ఆగస్టు 29:
గిడుగు రామమూర్తి 159వ జయంతి
తెలుగు భాషాదినోత్సవం
తెలుగు స్వాభిమాన ఉద్యమానికై పిలుపు



తెలుగు ప్రజలకు కూడా ప్రజాస్వామ్యబద్ధమైన అన్ని హక్కులను రాజ్యాంగం ఇచ్చింది. ప్రజలు తమ భాషలో తమను తాము పరిపాలించుకొనేందుకే, జ్ఞానాన్ని పొందడం కోసమే భాషా రాష్ట్రాలు ఏర్పడ్డాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ తెలుగురాష్ట్రాలే. కానీ, తెలుగులో ప్రజలను వేడుకొని ఓట్లు సంపాదించి అధికారంలోకి వచ్చే రాజకీయ పార్టీలు పాలన తమచేతికి రాగానే ఆ సంగతిని మరచిపోతాయి. ప్రజలకు తెలియకుండా పాలించడం కోసం అన్ని ఉత్తర్వులనూ ఇంగ్లీషులోనే ఇస్తారు. కోర్టులో తీర్పులు ఇంగ్లీషులోనే వస్తాయి. చదువులనన్న ప్రజల భాషలో నేర్పరు. పరాయి పాలకులు వెళ్లిపోయినా మన దేశీయ దొరలే వారి తరఫున పరిపాలిస్తున్నారు. మన పాలక పక్షాలన్నీ ఇలాగే ప్రవర్తిస్తున్నాయి. ప్రతిపక్షాలు పట్టించుకోవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు పాలకుల మోసపు మాటలకు పొంగిపోక, వాస్తవాలను తెలుసుకోవాలి. అన్ని హక్కులతో పాటు భాషాహక్కులను కూడా రక్షించుకోవడానికై ఉద్యమించాలి. భాష నశిస్తే జాతి నశిస్తుంది. అంటే మన అస్థిత్వాన్నీ గుర్తింపునూ, గౌరవాన్నీ కోల్పోతాం. మనదైన అభివృద్ధినీ కొల్పోతాం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లోని విభిన్న భాషలవారు తమ భాషల్లోనే చదువుకొంటున్నారనీ, పాలించుకొంటున్నారనీ తెలుసుకోవాలి.

గిడుగు రామమూర్తి గారి పుట్టిన రోజును తెలుగు భాషాదినోత్సవంగా 20 ఏళ్ళకు పైగా జరుపుకొంటున్నాం. ఈ ఏడు కూడా ఆ రోజును ఘనంగా నిర్వహిద్దాం. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల రక్షణకు, మన డిమాండ్‌లను సాధించుకోవడానికై ఉద్యమిద్దాం. స్వాభిమానంతో ఉద్యమిద్దాం. మీకు వీలైన పద్ధతిలో సభలను జరపడంతో పాటు మన డిమాండ్లను జిల్లా, స్థానిక ప్రభుత్వ అధికారులకూ, ప్రజాప్రతినిధులకూ అందజేయండి.

ఇప్పుడు మనం ముందుకు తేవలసిన డిమాండ్లు ఇవి :

1. **తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులో జరగాలి. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ తెలుగులో ఉండాలి.**
2. **జాతీయ విద్యావిధానం ప్రకారం పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగును వినియోగించాలి. మాధ్యమంగా పాఠశాల స్థాయిలోనూ, ఒక భాషగా అన్ని పై స్థాయి చదువుల్లోనూ కొనసాగించాలి.**
3. **హైకోర్టు వరకు అన్ని కోర్టుల్లోనూ వాదోపవాదాలు, తీర్పులు తెలుగులో ఉండాలి.**

జాలవేదిక (వెబినార్) సహాయంతో కూడా సమావేశాలను నిర్వహించండి. పెద్ద, చిన్న పత్రికల్లోనూ, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర అన్ని సామాజిక మాధ్యమాల్లోనూ పాలుపంచుకోండి. కరపత్రాలను పంపిణీ చేయండి. ప్రజాప్రతినిధులను కలసి మీ డిమాండ్‌లను అందజేయండి. జిల్లా, స్థానిక స్థాయిలలో ప్రభుత్వ అధికారులను, జిల్లా కలెక్టర్, ఆర్.డి.ఓ., కమిషనర్ మొ॥వారిని కలిసి వినతి పత్రాలను అందచేయండి. పై మూడు డిమాండ్‌ల సాధనపై మనం శ్రద్ధ వహించాలి.

అన్ని కార్యక్రమాల్లోనూ గిడుగు స్ఫూర్తిని ముందుకు తేవడం, ఆయన ఆదర్శంతో ముందుకు సాగడం ముఖ్యం. ఈ ఆగస్టు 29 నుండి సరికొత్త చైతన్యంతో ముందుకు సాగుదాం. తెలుగు భాషోద్యమ సమాఖ్య శాఖలు, మిత్రసంఘాలు, రచయితలు, కళాకారులు, ఇతర ప్రజాసంఘాలు అందరూ ముందడుగు వెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

తెలుగు భాషోద్యమ సమాఖ్య

చుక్క రామయ్య గౌరవ అధ్యక్షుడు
సామల రమేష్‌బాబు గౌరవ అధ్యక్షుడు
సెల్: 98480 16136

గారపాటి ఉమామహేశ్వరరావు
జాతీయ అధ్యక్షుడు
98661 28846

'అమ్మనుడి' మాస పత్రికను ఇక ammanudi.org వలగూడులో చూడవచ్చును

అమ్మనుడి పత్రిక తెలుగు భాషాదినోత్సవం, 2022 ఆగస్టు 29న ammanudi.org వలగూడులో చోటు చేసుకోనుంది.

అమ్మనుడి పత్రికకు యూజీసీ కేర్ జాబితా 1 లో స్థానం ఉంది. అమ్మనుడి పత్రిక అంతర్జాతీయ పత్రికా సంఖ్యను(issn no: 2582-8738) కలిగి ఉంది.

ఆసక్తిగల పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను అమ్మనుడిలో ప్రచురించేందుకు పంపగలరు. మీ పరిశోధనా పత్రాలు అమ్మనుడిలో (వెబ్‌సైట్‌లో మాత్రమే) ప్రచురించేందుకు ఎలాంటి రుసుము లేదు. మీ పరిశోధనాపత్రం స్వీకరించబడితే మీకు డిజిటల్ ప్రమాణపత్రం అందిస్తాము. మీ పరిశోధనా పత్రాన్ని అమ్మనుడి వలగూడులో పాఠకుల పరిశీలనకు ఉంచుతాం. పరిశోధనా పత్రం తీరు తెన్నులు, సమర్పించాల్సిన విధానం గురించి వలగూడు విడుదల అయిన రోజు నుంచి వివరంగా సమాచారమిస్తాము.

మీ పరిశోధనా పత్రాల భాష మీరు ఏ మాధ్యమంలో చదువుతున్నా, తెలుగులోనే ఉండాలన్నది నిబంధన.

– సంపాదకుడు

నడుస్తున్న చరిత్ర అమ్మనుడి మాస పత్రికలలో ఇరవై ఏళ్ళుగా ప్రముఖ కార్టూనిస్టు

సరళి



తెలుగు భాష కోసం రచించిన వ్యంగ్య రేఖాచిత్రాలన్నిటినీ ఒక పుస్తకంగా వెలువరిస్తున్నాం.

విడుదల తేదీ: 2022 ఆగస్టు 29 తెలుగు భాషాదినోత్సవం– గిడుగు జయంతి సందర్భంగా...

తెలుగుజాతి(ట్రస్టు)

ఇవీ సంగతులు...

తెలుగుభాషా సంస్కృతులను అధ్యయనం చేసిన పంజాబీ విద్యార్థులు

సాంస్కృతిక ఎక్స్‌చేంజ్ కార్యక్రమంలో భాగంగా 22 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పంజాబ్ నుండి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. "ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్"(ఒక భారతదేశం, శ్రేష్ఠమైన భారతదేశం) ప్రాజెక్టులో భాగంగా మన రాష్ట్ర సాంస్కృతికాంశాలను అధ్యయనం చేసేందుకు వీరు వచ్చారు. పై ప్రాజెక్టులో "భాషా సీఖో"(భాషను నేర్చుకోండి) అనే అంశం ద్వారా ఈ విద్యార్థులు తెలుగులో వ్యవహరించేందుకు అవసరమయ్యే నూరు వాక్యాలు నేర్చుకున్నారు. ఆ పై ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, ఆటలు, నృత్యాలపై సమాచారాత్మక పటాలు, బొమ్మలు వేసారు. కార్యక్రమాంతంలో తమ అనుభవాలను పంచుకున్నారు. ఇక్కడి విద్యార్థులకు పంజాబీలో సులువైన పదాలు, వాక్యాలు నేర్పించారు.

పంజాబ్‌లోని ముక్త్‌సర్ జిల్లాలో బడుల్లో తెలుగు కార్యక్రమాలు చేపట్టాలని సూచించిన అక్కడి జిల్లా విద్యాధికారి.

పంజాబ్‌లోని ముక్త్‌సర్ జిల్లాలో ప్రతి పాఠశాలలో బడి స్థాయిలో, గ్రామ స్థాయిలో, బ్లాక్ స్థాయిలో, జిల్లా స్థాయిలో తెలుగుభాష నేర్చుకునేందుకు దోహదపడే విధంగా శిక్షణా కార్యక్రమాలు, పోటీలు నిర్వహించాలని అక్కడి జిల్లా అధికారి- మండల స్థాయి, పాఠశాల స్థాయి సిబ్బందికి సూచనలు జారీ చేసారు. అయితే అక్కడి విద్యార్థులు పదో తరగతి స్థాయి పంజాబీ భాష(ఆయా విద్యార్థుల మాతృభాష)లోనే పాస్ అవ్వలేకపోతున్నారు. మాతృభాషను నేర్పే ప్రయత్నాలు చేయకుండా, రాజకీయ కారణాల వలన తెలుగును ప్రోత్సహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. తెలుగుకు పంజాబ్‌లో రెండవ అధికార భాష హోదా లేదు అన్నది గమనార్హం.

తెలంగాణ పదవతరగతి ఫలితాల్లో తెలుగులో ఉత్తీర్ణతాశాతం అత్యల్పం

ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం పదవ తరగతి పరీక్షా ఫలితాలను ప్రకటించింది. సాధారణంగా సైన్సులోనో, గణితంలోనో అత్యల్ప ఉత్తీర్ణతా శాతం ఉంటుంది. కానీ ఈ ఏడాది తెలుగు భాషా పేపర్(మొదటి భాష, రెండవ భాష పత్రాలలో)లో అత్యల్ప ఉత్తీర్ణత వచ్చింది. 8, 9 జిపిఏ అంకెలు వచ్చిన విద్యార్థులు(80-90 శాతం మార్కులకు సరాసరి) సైతం తెలుగులో తప్పారు. ఎందరికో 10 జిపిఏ రాకపోవటానికి తెలుగులో తక్కువ అంకెలు రావటమే కారణమట. కొరోనా కష్టకాలంలో జరిగిన ఆన్‌లైన్ తరగతుల్లో సైన్స్, సోషల్, మ్యాథ్స్ విషయాలపై అధిక ప్రాధాన్యత వచ్చి, తెలుగు, ఇంగ్లిష్ భాషల బోధన సన్నగిల్లిందని అప్పట్లోనే ఉపాధ్యాయులు చెప్పారు. హైస్కూల్ విద్యార్థులు తెలుగులో చిన్న చిన్న పదాలను వాక్యాలను రాయలేకపోతున్నారని అప్పట్లో ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. వాటి పర్యవసానమే తెలుగు ఉత్తీర్ణతా శాతం క్షీణించినందుకు కారణమని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ఏడాది సైన్స్‌లో సోషల్‌లో 99 శాతం ఉత్తీర్ణతా శాతం ఉంటే, తెలుగు ప్రథమ భాషగా కలిగిన విద్యార్థుల్లో ఇది కేవలం 95% గా ఉంది. 2019లో 98.73%, 2018లో 97.87%గా తెలుగు ఉత్తీర్ణతా శాతం ఉండేది. మరో పక్క ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తెలుగు పంతుళ్ళ పేపర్లు దిద్దే పద్ధతి కఠినతరంగా ఉండటం వలన ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఒక విద్యార్థి ప్రకారం వారంలో తెలుగుకు కేవలం మూడు బోధనా తరగతులు జరిగేవని, పెద్ద పరీక్షలకు ఒక మూడు నెలల ముందు నుంచి మాత్రమే తెలుగు బోధన జరిగిందని తెలుస్తోంది. తెలుగు భాషను నిర్లక్ష్యం పెట్టడంలో తల్లిదండ్రుల పాత్రా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూకు రెండవ అధికార భాషగా గుర్తింపు

17 జూన్‌న ఒక ప్రకటన ద్వారా పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఉర్దూ భాషను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండవ అధికార భాషగా పరిగణిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సవరణ చట్టం 2022లో పొందు పరిచినట్టు, ఆ చట్టం అమలు వెంటనే జరిగేట్టు ఈ ప్రకటన తెలుపుతోంది.

రెండవ ఏడాది ఇంజనీరింగ్ పాఠ్య సామగ్రిని 12 భారతీయ భాషల్లో అందించేందుకు కసరత్తు మొదలుపెట్టిన ఏఐసీటీఈ.

జూలై 15న ఏఐసీటీఈ "జాతీయ విద్యా విధానం: భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్య" అంశంపై దిల్లీలో ఒక సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో భారతదేశంలోని పెద్ద ఇంజనీరింగ్ సంస్థల ఉపకులపతులు హాజరయ్యారు. గత ఏడాది మొదలుపెట్టిన భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్యకు మంచి ఆదరణ లభిస్తోందని, 10 రాష్ట్రాల్లోని 40 కళాశాలల్లో ఆరు భారతీయ భాషల్లో 2,070 మంది విద్యార్థులు నమోదయ్యారని ఈ సదస్సు నివేదికలో నిర్వాహకులు తెలిపారు. రూ. 18.6 కోట్లను రెండవ ఏడాది ఇంజనీరింగ్ పాఠ్యక్రమానికి సరిపోయే పాఠ్యాంశాలు అనువదించి రూపొందించేందుకు సిద్ధం చేసినట్టు తెలిపారు.

తెలుగు నుంచి ఆంగ్లానికి అనువాదమైన మొదటి రచనపై ఆరా

విశాఖపట్నం నివాసి, ఆంధ్ర విశ్వవిద్యాలయ కళల విభాగంలో ఆచార్యులు శ్రీనివాస్ శిష్ట్లా గారు తెలుగులో నుండి ఆంగ్లానికి అనువాదమైన మొదటి రచన గురించి పరిశోధన చేసారు. వారి ప్రకారం జన బాహుళ్యంలో సి.పి. బ్రౌన్ చేసిన వేమన పద్యాల సంకలనం తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువదించిన తొలి రచనగా తోస్తుందని అన్నారు. అయితే ఈ పని 1829 లో జరిగిందని. అంతకన్నా ముందే 1816లో ఏ.డి. క్యాంబెల్ రాసిన "ఎ గ్రామర్ ఆఫ్ తెలుగూ లాంగ్వేజ్" పుస్తకంలో నన్నయ ఆంధ్రమహాభారతంలోని కొన్ని పంక్తులు దర్శనమిస్తాయని అన్నారు. 1816 లోనే ఫ్రెంచి నుంచి ఆంగ్లానికి అనువాదమైన ఒక రచనలో వేమన పద్యం అనువాదం ఉందని ఆయన గమనించారు. అయితే 1767 లో ఎడ్వర్డ్ థాంసన్ రాసిన "సెయిలర్స్ లెటర్స్" అనే పుస్తకంలో ఒక కవిత కనిపిస్తుంది. ఆ కవిత గోగులపాటి కూర్మనాథ కవిది.

తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్ల మాధ్యమానికి మారిన తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో తొలినాటి తరగతి గదుల్లో తికమక.

మొత్తం ప్రభుత్వ 25,000 పాఠశాలల్లో తెలుగు మాధ్యమం పూర్తిగా తొలగించి ఆ స్థానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ఈ ఏడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ క్షేత్రస్థాయిలో బోధనా ఉపాధ్యాయులు ఇందుకు సిద్ధంగా లేరు. 80,000 మంది ఉపాధ్యాయులకు అజీం ప్రేంజీ విశ్వవిద్యాలయం వారు ఒక నెల పాటూ శిక్షణనిచ్చి ఆంగ్ల మాధ్యమ బోధనానికి సిద్ధపరిచినా, క్షేత్ర స్థాయిలో ఆచరణకు పరిస్థితులు సానుకూలంగా లేవని ఉపాధ్యాయులంటున్నారు.

ఇంగ్లిష్ ప్రధాన మాధ్యమంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఫిలిప్పైన్స్ ఉపాధ్యాయుల సంఘం

ఆంగ్ల మాధ్యమే ప్రధాన మాధ్యమంగా మొదలవటం వలన విద్యార్థులు చదువుల్లో వెనుకంజలో ఉన్నారని. ఆంగ్ల మాధ్యమం ప్రధాన మాధ్యమంగా కొనసాగితే మరింతగా చదువులు దిగజారతాయని అక్కడి ఉపాధ్యాయుల సంఘం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసింది.

కనీసం ప్రాథమిక తరగతుల వరకూ మాతృభాషా మాధ్యమంలోనే చదువులుండాలి: వెంకయ్య నాయుడు

చెన్నైలో వీఐటి సంస్థ వారి అంతర్జాతీయ విద్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కనీసం ప్రాథమిక విద్య వరకూ మాతృభాషా మాధ్యమంలో ఇటు ప్రభుత్వ అటు ప్రైవేట్ బడుల్లో ఉండాలని కోరారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని సొంతం చేసుకోవాలంటే స్వేచ్ఛగా అభిమానంతో మన మాతృభాషలో మాట్లాడాలని ఆయన అన్నారు. విలువలతో కూడిన విద్య మాతృభాష తోనే సాధ్యమని అన్నారు.

టర్కీ ఉన్నత న్యాయస్థానంలో మాతృభాషలకు అవమానం

టర్కీలో 22 మంది ఉపాధ్యాయులు అక్కడి మాతృభాషా దినోత్సవం ఫిబ్రవరి 26, 2016న విద్యార్థులకు ఒక గంట పాటూ మాతృభాషలో చదవడం వలన కలిగే లాభాలను వివరించారు. అక్కడి ప్రభుత్వానికి ఈ విషయం నచ్చక వారిపై చర్యలు తీసుకుని జీతాలలో తరుగు చేయగా ఆ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేసారు. ఈ నిరసనను చట్ట వ్యతిరేక చర్యగా పరిగణించిన ప్రభుత్వం ఆయా ఉపాధ్యాయులకు కఠినమైన శిక్షలు వేసింది. ఆ శిక్షలను సవాలు చేస్తూ కోర్టుకు వెళ్ళగా ఆ ఉపాధ్యాయులకు ఊరట ఇస్తూ కోర్టు రాజ్యాంగ న్యాయస్థానానికి అభ్యర్థన ఉంచవలసిందిగా ఉపాధ్యాయులకు సూచించింది. అయితే అక్కడి అత్యున్నత న్యాయస్థానం, రాజ్యాంగ న్యాయస్థానం, ప్రభుత్వ చర్యలను సమర్థిస్తూ ఉపాధ్యాయులను నిందితులుగా పేర్కొన్నది. ఇది మాతృభాషలకు పెద్ద అవమానం.

మరాఠీ మాధ్యమంలో ఇంజనీరింగ్‌కు డిమాండ్

మాతృభాషల్లో ఇంజనీరింగ్‌కు విరోధంగా కొందరు విద్యావేత్తలు పలు విమర్శలు చేసారు. అయితే ఈ ఏడాది జరిగిన కౌన్సెలింగ్‌లో మరాఠీ మాధ్యమం కోసం కేటాయించిన అన్ని సీట్లు అయిపోయాయి. మాతృభాషలో ఇంజనీరింగ్ చేసేందుకు ఇంత డిమాండ్ ఉందని మొదట్లో తెలియలేదని, వచ్చే ఏడాది మరిన్ని ఇంజనీరింగ్ సీట్లు మాతృభాషా మాధ్యమంలో అందజేస్తామని ఏఐసీటీఈ తెలిపింది.

మాతృభాషా మాధ్యమ విద్య దిశగా దక్షిణాఫ్రికా అడుగులు

ఆంగ్ల మాధ్యమం ప్రయోగాత్మకంగా అన్ని విద్యాలయాల్లో చేపట్టిన దక్షిణాఫ్రికా ప్రభుత్వ చర్య వలన అక్కడి విద్యార్థుల మార్కుల్లో పెద్ద మార్పు వచ్చి ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేదు. అందువలన తన ఆంగ్ల మాధ్యమ విధానానికి స్వస్తి పలుకుతూ అక్కడి ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుండి మాతృభాషా మాధ్యమంలో విద్యను అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ విషయమై అక్కడి ప్రాథమిక విద్యా శాఖ కేంద్ర మంత్రి ఏంజీ మోత్‌షెక్‌గా ఒక ప్రకటనను జారీ చేసారు.

నైజీరియాలో మాతృభాషామాధ్యమం

నైజీరియాలోని అక్వ ఇబొమ్ రాష్ట్రం అక్కడి మాతృభాషలపై ఉన్న నిర్లక్ష్యాన్ని ఒప్పుకుంటూ ఒక ప్రకటన జారీ చేసింది. ముఖ్యంగా యువత మాతృభాషలకు దూరంగా ఉంటున్నారని, మాతృభాషలను చదువుల్లో ప్రవేశపెట్టాల్సిన ఆగత్యం ఉందని అక్కడి డిప్యూటీ గవర్నర్ అన్నారు.

భారతీయ భాషల్లో డిజిటల్ సమాచార సృజనలో భారీ పెరుగుదల.

సోషల్ మీడియా విస్తృతి వలన నేటి యువతకు వారి నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఒక మంచి వేదిక ఏర్పడింది. పెద్ద పెద్ద సినీనటులకు సైతం పోటీగా ఈ డిజిటల్ మీడియా విషయవస్తు సృజనకారులకు అభిమానులు, అనుసరించేవారు ఉన్నారు. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ కొత్త తరం డిజిటల్ సామగ్రిని తయారు చేసుకునే వారు వారి వారి మాతృభాషల్లో ఈ సమాచారాన్ని సృష్టిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా భాషను పక్కన పెట్టి వీరు తయారు చేసిన పాటలను, సంగీతాన్ని, డైలాగులను విని ఆనందించేవారు, నకలు చేసి సంతోషపడేవారు కోట్లలో ఉంటున్నారు. పంజాబీ, కశ్మీరీ, డోగ్రీ, బిహారీ భాషల్లో భారీగా పాటలు, వీడియోలు సృష్టించబడుతున్నాయి. అదే స్థాయిలో వీరందరూ సంపాదించుకుంటున్నారు కూడా.

మాతృభాష ఆ భాషీయుడి సంప్రదాయ, సంస్కార మూలాల్ని నిత్యం తడుపుతూ, శుభ్రపరుస్తూ నవనవోన్మేషంగా పల్లవింపజేసే అంతఃస్రోతస్విని. అది జలజలా నిత్యం పారుతుండకపోతే ఆ భాషీయుడి జీవనం శుష్కించిపోవటమేకాదు, ఏ చిన్న జీవన విషాదానికైనా గజగజవణికి కుప్పకూలుతుంది. అట్లాంటి అంతశ్శక్తినిచ్చే సహజ పౌష్టికాహారం తల్లిభాష! –సి. ధర్మారావు

సంపాదక హృదయం

భారత సమైక్యతకూ పురోగతికీ అమ్మనుడుల సాధికారతే కీలకం

విదేశీయుల పరిపాలన నుండి మన దేశం విముక్తమై 75 ఏళ్లయింది. 'అజాదీకా అమృత్ మహోత్సవ్' అని ఏడాది పొడవునా పండగలు చేసుకొంటున్నాం. భారతదేశం ఒకనాడు విశ్వగురువనీ, ఇప్పుడు మళ్లీ విశ్వగురువు కాబోతున్నామనీ విపరీతంగా ప్రచారం చేసుకొంటున్నాం. కొంచెం అతిగా చెప్పుకొంటున్నామేమో అనిపిస్తుంది. నిజంగా ఏఏ రంగాల్లో మనం అభివృద్ధి సాధించామో నిశితంగా సమీక్షించుకోవడంతో పాటు, ఏ అంశాల్లో మనం వెనకబడివున్నామో, ఏ అంశాల్లో మరీ అట్టడుగున ఉన్నామో తరచి చూసుకోవాలి కదా! అదేమీ గట్టిగా చేస్తున్నట్లు కనిపించడంలేదు. గత ప్రభుత్వాలతో పోల్చి చూస్తే భాజపా ప్రభుత్వం కొన్ని కీలకరంగాల్లో ముందడుగు వేస్తున్న సంగతి నిజమేగాని, ఆ విజయాలను స్థిరీకరించుకోవడంలో తగినంత శ్రద్ధ చూపుతున్నట్లు లేదు. రక్షణ, విదేశాలతో సంబంధాలు, కాశ్మీర్, విదేశీ వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం వంటి అంశాల్లో చూపుతున్న శ్రద్ధ, సాధిస్తున్న పురోగతీ దేశంలో ఆంతరంగిక భద్రత, పౌర సంబంధాలు, దేశీయ శాస్త్ర సాంకేతికాభివృద్ధి, స్వదేశీ ఉత్పత్తులు, సామాజిక శాంతి భద్రతలు, పేదరిక నిర్మూలన, ధనికులకు బీదలకు మధ్య వ్యత్యాసాన్ని బాగా తగ్గించడం వంటి అంశాలపై చూపటం లేదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా, దారిద్ర్యం తాండవిస్తున్నది, సరైన వైద్య సౌకర్యాలు లేనందున చనిపోయేవారి సంఖ్య పెరుగుతున్నది. డబ్బు గుమ్మరించితే తప్ప కనీస వైద్యం దొరకని పరిస్థితి. ఇలాంటి సమస్యలెన్నో పరిష్కారంలేకుండా పెరిగిపోతున్నాయి. విద్యారంగ వ్యాపారీకరణతో చదువు భారమైపోతున్నది. ఈ అంశాలపై మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సరియైన విధానాలు, ప్రణాళికలూ లేవు.

కేంద్రంలో భాజపా పాలన వచ్చిన తర్వాత రాష్ట్రాలను కూడా తన గుప్పిట్లోకి తెచ్చుకోవడం కోసం వారి ఎత్తుగడలు ఇన్నేండ్ల రాజకీయ చరిత్రలో అరుదు. అందులోని మంచి చెడ్డల చర్చకు ఇది వేదిక కాదుగాని, ఆ పార్టీ తనను తాను సువ్యవస్థితం చేసుకోవడానికి రాజకీయంగా చేస్తున్నంత కృషి, తన పాలనలోని ప్రభుత్వాలను సరైన దారిలో నడపడానికి చేయడంలేదు. అంతేకాదు, ఇన్నేళ్లుగా తమ పార్టీ, ప్రజాజీవన రంగాల్లో పనిచేస్తున్న తోటి సంస్థలూ ప్రవచించిన, పోరాడిన అనేక అంశాలను గాలికి వదిలేసినట్లుగా స్పష్టం అవుతున్నది.

ఇవన్నీ అలా ఉంచి, ఇప్పుడు దేశంలో సమాజ ఐక్యతకూ అభివృద్ధికీ కీలకమైన ఒక అంశాన్ని గురించి– ఇది పదేపదే ఇంతవరకూ ప్రస్తావిస్తూనే ఉన్నాం గాని, ఇప్పుడు మళ్లీ సందర్భం వచ్చింది గనుక మరికొంత స్పష్టంగా చెప్పదలచుకొన్నాం.

రాజకీయ పార్టీగాని, నాయకుడుగాని, తాము నమ్మిన సిద్ధాంతానికి, తన ప్రభుత్వానికీ లేదా తనకూ ప్రయోజనం లేని పనిని దేనినీ చేయరు. ఇప్పుడు రాష్ట్రపతి పదవి అభ్యర్థిగా శ్రీమతి ద్రౌపది ముర్మ గారిని ఎంపిక చేయడంలోనే ఎంతో నేర్పును, శక్తిని భాజపా ప్రదర్శించింది. అందువల్ల దేశ ప్రతిష్ఠ ఇనుమడించడంతో పాటు, ఆ పార్టీ ప్రతిష్ఠకూడా ఎంతో పెరిగింది. ఒక ఆదివాసీ జాతికి చెందిన మహిళను– సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజాసమూహానికి చెందిన మహిళను– దేశాధ్యక్ష పదవికి ఎంపిక చేసిన ఘనతను ఆ పార్టీ సంపాదించుకొంది. భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ముగారు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో చేసిన ప్రసంగం, అందరి మన్ననలను పొందింది.

ఆమె హిందీలో ప్రసంగించారు. ఆమె మాతృభాష సంథాలీ. రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లోని 22 భాషలలో ఒకటి. ఆదివాసీల భాషలలో ఒకటి. ఒక ఉపాధ్యాయురాలిగానేగాక, రాజకీయంగా ఎదిగి రాష్ట్ర మంత్రిగా, గవర్నర్‌గా ఎదిగిన అనుభవశాలి ద్రౌపది ముర్ముగారు. కాని, మన రాష్ట్రపతి హిందీలోనే ప్రసంగించడం వల్ల ఎక్కువ మందికి అర్థమై ఉండవచ్చుగాని, ఆమె తన మాతృభాష సంథాలీలో ప్రసంగించి, పక్కనే హిందీలోకీ,

ఇతర భాషల్లోకి అనువాదం ఏర్పాటు చేసివుంటే మోదీ పార్టీకీ ప్రభుత్వానికీ మరెంతో ప్రతిష్ఠ ఒనగూడి వుండేది. ఆమె తోటి సంథాలీలూ ఇతర ఆదివాసీలు ఎంతో సంతోషించేవారు. తమ భాషకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు దొరికిందని మురిసిపోయేవారు. 22 జాతీయ భాషలకూ చెందిన ప్రజలు కొత్త ఉత్తేజంతో పొంగిపోయేవారు. విశాల భారతదేశంలోతాము కూడా భాగస్వాములైనందుకు దేశభక్తితో గర్వించేవారు. దేశంలోని సమైక్యతా శక్తులకు మరింత బలం చేకూరేది. దీన్ని భాజపా తన మరొక విజయంగా చెప్పుకోగలిగేది.

కానీ ఈ ఆలోచనే భాజపానేతల్లో వచ్చి ఉండదు. 'ఒకే దేశం' అనే భాజపా నినాదానికి కొన్ని పార్శ్వాలున్నాయి. అందులో ఒకటి 'ఒకే జాతీయభాష'. అది సంస్కృతీకరింపబడిన హిందీ. అదే భారతదేశ ఐక్యతా పతాకగా భాజపా ఊహించుకొంటుంది. దాన్ని సాధించే దిశగా ముందుకు సాగడానికి ఎన్నో సహజమైన ఆటంకాలున్నాయని దాని నేతలకు ఇప్పుడిప్పుడే అవగాహన అవుతున్నది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో భాషల రాజకీయ శక్తి ఆ పార్టీకి తెలియనిది కాదు. అందువల్లనే ఈ మధ్య తమిళనాడుపై అత్యంత శ్రద్ధవహిస్తున్నది. తమిళం ప్రపంచంలోనే ప్రాచీనభాష అని మోదీగారు పలుమార్లు పొగడుతూ అతిగా ప్రసంగాలు చేశారు!

ఇక్కడ కొన్ని శాశ్వత సత్యాలను తెలుసుకోవాలి. అదేమిటంటే– ఈ దేశం ఎన్నో మాతృభాషలను మాట్లాడే ప్రజల జన్మభూమి ఎంతో ప్రాచీన మానవ చరిత్రను కలిగివున్న ఉపఖండం గనుక ఇది సహజమైన పరిస్థితి. అయితే అనేక భౌగోళిక, చారిత్రక కారణాలవల్ల సంస్కృతీ బంధాల వల్ల ఇవన్నీ కలిసి మనుగడ సాగించక తప్పదు. చరిత్ర నేర్పుతున్న పాఠం ఇది. అందువల్లనే ఎందరో ప్రజల త్యాగఫలంగా ఇప్పుడున్న భారతదేశమే మనకు మిగిలింది. దీన్ని విధ్వంసం చెయ్యాలనీ, ఎదగనీయకూడదనీ, బలహీనంచెయ్యాలనీ కోరుకొనేశక్తులు దేశం బయటా లోపలా బలంగానే ఉన్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొనగల శక్తిని అన్ని విధాలా దేశం సంతరించుకోవలసి ఉంది. ఆ శక్తి మన కేంద్రప్రభుత్వానికీ దాని నేతలకూ ఉండాలి.

వారు తమ ఆలోచనాపరిధిని పెంచుకోవాలి. మరింత నిశితం చేసుకోవాలి. వాస్తవ స్థితిని గ్రహించాలి. రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే పెద్దలు 'జాతీయ భాష' ఫలానా అని నిర్ణయించలేక 15 ఏళ్ల తర్వాత చూద్దాం అని వాయిదావేశారు. ఆ వాయిదా నేటికీ కొనసాగుతూనే ఉంది. ఈ లోపు ఎన్నో మార్పులు చోటుచేసుకొన్నాయి. భాషా రాష్ట్రాల ఏర్పాటుతో కొన్ని భాషలు మరింత శక్తివంతమైనాయి. నిజానికి ఇప్పుడున్న సాంకేతిక అభివృద్ధి నేపథ్యంలో మన దేశానికి జాతీయభాష ఒకటి ప్రత్యేకంగా ఉండనక్కరలేదు. రాజ్యాంగం గుర్తించిన 22 భాషలనూ జాతీయభాషలుగా అధికారికంగా గుర్తించాలి. వాటిని సాధికారికం చెయ్యాలి. అందుకై ఆధునిక సాంకేతికతను పూర్తిగా వినియోగించుకోవాలి. అంతమాత్రాన ఇంగ్లీషు భాష పెత్తనంచేస్తుందనుకోవడంగాని, ఆ భయంతో హిందీని నెత్తిన పెట్టుకోవడంగాని చేయవలసిన అగత్యం భారతీయ భాషలకు– ముఖ్యంగా హిందీయేతర భాషీయులకు ఏమీ లేదు. అవి కూడా ఎంతైనా ఎదగగల శక్తిని కలిగే వున్నాయి. కావలసిందల్లా ప్రోత్సాహమూ, వనరులూ.

రాజ్యాంగం గుర్తించిన 22 భాషలను జాతీయభాషలుగా గుర్తిస్తూ రాజ్యాంగానికి సవరణ తేవాలి. వాటికి చట్టసభల్లో భాగస్వామ్యాన్నీ ఇవ్వాలి. అంతేకాదు. అన్ని జాతీయభాషలకూ ఆయా రాష్ట్రాల్లో ప్రజల సంఖ్యను బట్టి ప్రధాన భాషలుగా ఉపప్రధాన భాషలుగా తగిన స్థానం ఇవ్వాలి. కనీసం పాఠశాల విద్యను మాతృభాషా మాధ్యమంలో తప్పనిసరి చెయ్యాలి. విద్యార్థుల కోరికను బట్టి అదనంగా ఏ భాషనైనా చదువుకోవడానికి అవకాశం కల్పించాలి. అన్ని స్థాయిల చదువులకు ప్రోత్సాహం ఉండాలి. పాలన, బోధన రంగాల్లో అన్ని జాతీయ భాషలను సాధికారికం చెయ్యాలి. ఇదే మన ఆంతరంగిక సమైక్యతా సాధనకు కీలకం. భద్రతకు హామీ. ఇంతటి ఉదాత్తమైన, మహత్తరమైన చర్యలను భాజపా తలచుకొంటే చేయగలదు.

స్వతంత్ర భారతదేశం అమృతోత్సవాలను జరుపుకొంటున్న సమయం భాజపాకు కలిసివచ్చిన అవకాశం. భారతదేశంలో భాషా సమస్యను పరిష్కరించడంతోపాటు, దేశ ఐక్యతను పటిష్ఠం చేసుకొనేందుకు వచ్చిన అవకాశాన్ని నేటిపాలకులు చేజార్చుకోరని ఆశిద్దాం.


తేదీ : 29-07-2022

సామల రమేష్‌బాబు

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు
తెలుగునుడి పండుగరోజు

అల్లంసెట్టి చంద్రశేఖర రావు
9949605141

అత్యంత ప్రతిభావంతుడు "గిడుగు"



ప్రపంచ ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్తలను ముగ్ధులను చేసిన అరుదైన భాషా శాస్త్రవేత్త, ఊహకందని అత్యంత ప్రతిభాశాలి, గిడుగు రామమూర్తి గారి విరాట్ రూపాన్ని చూడాలంటే మనం తల ఎంత పైకెత్తినా అతని పూర్తి రూపాన్ని దర్శించడం సాధ్యం కాదు. నాకు కనిపించినంతమేర నేను వ్యక్తం చేయగలిగినంత మేర స్థాలీపులాకంగా వివరించడానికి ప్రయత్నిస్తాను.

గిడుగురామమూర్తి గారు 1885లో పర్లాకిమిడిలో నివాసం ఏర్పరచుకొన్నారు. సవరభాష నేర్చుకొన్నారు. 1894 నాటికి సవరలతో సవరభాషలో సంభాషించడం రామమూర్తిగారికి వచ్చు. సవర పాఠశాలలు పెట్టి సవరలకు చదువు నేర్పారు. సవరభాషకు సంప్రదాయ అక్షరమాల లేదు. రామమూర్తిగారు 1912-14 సం॥లలో తెలుగు అక్షరాలతో నాలుగు సోర రీడర్స్ (సవరవాచకాలు) ఒక సోర సాంగ్స్ (సవర పాటల) పుస్తకం రాశారు. తెలుగు- సవర నిఘంటువు రాశారు. గిడుగు రామమూర్తిగారు తాను నెలకొల్పిన సవర పాఠశాలలో సవర భాషను బోధిస్తున్న ఉపాధ్యాయులకోసం వీటిని రాశారు. ఇవి తెలుగు లిపిలో వున్నాయి.

రామమూర్తిగారి కృషి ఫలితంగా నాటి మద్రాసు ప్రభుత్వం గిరిజన గ్రామాలలో సవర పాఠశాలలు నెలకొల్పింది. అంతర్జాతీయ ధ్వనిలిపిలో విద్యాభ్యాసం సాగుతుండేది.

1927లో సోర (సవర) మాన్యుయల్, ఇంగ్లీషు-సోర(సవర) నిఘంటువు, సోర-ఇంగ్లీషు నిఘంటువులు రాయమని మద్రాసు ప్రభుత్వం రామమూర్తిగారిని కోరింది.

1931-1938 మధ్య సోర (సవర) మాన్యుయల్, ఇంగ్లీషు-సోర (సవర) నిఘంటువు , సోర-ఇంగ్లీషు నిఘంటువు, రాశారు. ఇవి ఆంగ్ల భాషలో వున్నాయి. వీటిలో సవర భాషను రాయడానికి అంతర్జాతీయ ధ్వనిలిపి ఉపయోగించారు. వీటిని మద్రాసు ప్రభుత్వం వరుసగా 1931, 1933, 1938 సంవత్సరాలలో ప్రచురించింది. **గిడుగు రామమూర్తిగారు సవర రచనల ద్వారానే ప్రపంచానికి పరిచయం అయ్యారు.**

"ఈ సోర మాన్యుయల్‌ను తయారు చేయడంలో నా ముఖ్యోద్దేశం ఇంగ్లీషు తెలిసిన ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఉపయోగపడడం. సోర ఏజెన్సీలో పరిపాలన జరిగే అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేసేవారికి కూడా ఉపయోగపడాలి. వారు సోరభాషను నేర్చుకొంటే సోరలతో నేరుగా వ్యవహరించవీలవుతుంది." అని రామమూర్తిగారు సోర మాన్యుయల్‌లో రాశారు. సోరభాషలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులయిన ఉద్యోగులకు నాటి బ్రిటిష్ ప్రభుత్వం పారితోషికాలు కూడా ఇచ్చింది.

1931 లో రామమూర్తిగారు రచించిన సోర మాన్యుయల్ అంతర్జాతీయ ధ్వనిలిపిలో రాయబడిన మొదటి వర్ణనాత్మక వ్యాకరణం. జిజ్ఞాసువులకోసం సోర (సవర) మాన్యుయల్‌ని కొద్దిగా పరిచయం చేస్తాను. సోర మాన్యుయల్‌కు రామమూర్తిగారు విజ్ఞానదాయకమైన ముందు మాటలు రాశారు. ముందుగా అతని మాటలు వినిపిస్తాను. మధ్య మధ్య నా వ్యాఖ్యానం వుంటుంది.

"సోర భాషకు శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనము చేయడానికి కావలసిన సామగ్రిని ఇంగ్లీషులో ప్రచురించమని పారిస్‌లోని ప్రొ॥యూల్స్ బ్లాక్ గారు నన్ను అర్థించారు. అలా చేసినట్లయితే ప్రపంచవ్యాప్తంగా పండితులకు ప్రయోజనకారి కాగలదని వారి అభిప్రాయము. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భాషాశాస్త్ర పండితులకు ఉపయోగపడడానికి అనువుగా ఈ మాన్యుయల్‌ను రూపొందించడానికి ప్రయత్నించాను. 'మీరు చేస్తున్న కృషికి మిమ్ము అభినందిస్తున్నాను. మీ ప్రణాళిక ఎంతో ఆచరణయోగ్యమైనది. పోలికలతోను, ఊహలతోను ఇది భారం కాకూడదని భాషాశాస్త్రజ్ఞులు ఆశిస్తారు. అవి సరియైనవయినా సందేహాలకు, చర్చలకు అవకాశాన్నిస్తాయి. మీ వంటివారు చెప్పినవి నమ్మదగినవి, నిరూపించబడినవి అయిననూ వాటిని వాస్తవాలతో జత చేయరాదు.' అంటూ యూల్స్ బ్లాక్ గారు నన్ను అభినందించారు." అంటూ రామమూర్తిగారు ముందుమాటలలో రాశారు.

" నా మిత్రుడు కాలేజీ డి ఫ్రాన్సు"లోని చైనా భాషాచార్యులు, భాషాశాస్త్రవేత్త అయిన హెచ్.మాస్పెరో "మధ్య ప్రత్యయాలగురించి వివరాలు కావాలని కోరుతున్నారు. వాటిని వివరించండి" అంటూ

యూల్స్ బ్లాక్ గారు రామమూర్తి గారిని కోరారు.

ఇక్కడ మధ్య ప్రత్యయాల గురించి కొద్దిగా వివరిస్తాను.

సవర భాషలో ''అర్'' నామ్నీకరణం (మధ్యప్రత్యయం). నామ్నీకరణం అంటే ఒక పదాన్ని నామవాచకంగా మార్చేది అని అర్థం.

సవర భాషలో 'గో' అంటే ఎక్కువ, చాలా, గొప్ప మొదలైన అర్థాలున్నాయి. "ద'అ" అంటే నీరు. (నామవాచకం)

"డా" అంటే 'నీటి–' అని అర్థం. (సమాసంలో '**అ** లోపించగా "డా" ఔతుంది). "అర్" నామ్నీకరణం (మధ్య ప్రత్యయం). "ఇ". కదలికను సూచించే క్రియ.

గో+డా+అర్+ఇ = (గొప్ప + నీటి + **నామ్నీకరణం** + ప్రవాహం) గోదారి అంటే గొప్ప నీటి ప్రవాహం అని అర్థం.

పిల్లలకి పాలు పట్టే "గరగ" కూడ సవర పదమే. 'గ' అంటే 'త్రాగు' అని అర్థం. ఇది పునరుక్తి కాగా 'గగ' ఔతుంది. పునరుక్తి కొనసాగింపును తెలియజేస్తుంది. అంటే 'తాగుతూ..తాగుతూ..' అని అర్థం. 'అర్' అన్న నామ్నీకరణం (మధ్య ప్రత్యయం) చేరగా "గ్ +అర్ + అ + గ = గరగ". గరగ అంటే తాగే కొమ్ముచెంబు కదా?

"సోరభాషను నేర్చుకొనడం నాకెంతో కష్టమయిన పనిగా తోచింది. సోరల భౌతిక నాగరికతను, శారీరక ఆకారాలను, వివాహ ఆచారాలను, దహన క్రియలను తెలుసుకోవడం కన్నా, వారి భాష గురించి తెలుసుకోవడం చాల కష్టమైన పని. వారి భాషపై ఆధిపత్యం సంపాదించాలంటే వారితో చాలా కాలం సదా కలసిమెలసి ఉండాలి." అన్నారు గిడుగు.

సవర భాష గురించి చెప్తూ "సోరభాష ఒరియా లేదా ఇతర ఆర్యభాషల వంటిదికాదు, తెలుగు లేదా ఇతర ద్రావిడ భాషల వంటిదికాదు. ఇంగ్లీషు భాష వంటిదీ కాదు. భారతదేశంలో ఇది ముండా భాషా కుటుంబానికి చెందినది. ఈ భాషా కుటుంబంలో సంతాలి, ముండారి వంటి పదహారు భాషలున్నాయి. ఈ భాషలను మాట్లాడేవారు అధికంగా ఛోటా నాగపూర్‌లో ఉన్నారు. మిగిలిన వారు ఒరిస్సా, గంజాం, విశాఖపట్నం ప్రాంతాలలో ఉన్నారు. ఈ భాషలన్నీ ఆస్ట్రిక్ భాషా కుటుంబానికి చెందినవి. ఈ మహా భాషాకుటుంబం ఇతర భాషల సముదాయాలకంటె అధికంగా ప్రపంచంలో విస్తరించింది. ఉత్తరాన ఈ భాషాకుటుంబ చిహ్నాలు పంజాబు కన్వర్‌లో లభించగా, దక్షిణాన న్యూజీలాండ్ వరకు లభిస్తున్నాయి." అని గిడుగు రామమూర్తిగారు సోర మాన్యుయల్‌లో రాశారు.

"సోరలతో వ్యవహరించుట కొరకు వారి భాషను నేర్చుకొనే వారి ఉపయోగార్థమే ప్రధానంగా ఈ మాన్యుయల్ రూపొందించాను. అయినప్పటికీ ఇది భాషాశాస్త్ర అధ్యయనమునకు కూడ ప్రయోజనకారి. ఇందుకొరకు వారికవసరమైన ముఖ్యసామగ్రి 'సోర భాషయొక్క వాస్తవవిషయాలే' అని గ్రహించాలి. అవన్నీ చాలవరకు ఇందులో ఇవ్వబడ్డాయి. నా శక్తి మేరకు వాటిని యథాతథంగా చెప్పడానికి తగిన శ్రద్ధ చూపించాను. ఇందులోని ఉదాహరణలన్నిటినీ సోరల ముందు చదివి ధ్రువపరచుకొన్న తరువాతనే ప్రూఫులను అచ్చుకు పంపించాను." అని చెప్పారు. (పరభాషకు వ్యాకరణం రాసే పండితులు రామమూర్తిగారిని ఆదర్శంగా తీసుకోవాలి.)

"విషయ సూచికను చూచిన వారు నేను అన్ని భాషాప్రక్రియలను, అన్ని భాషావిశేషాలను ఉదాహరణలతో వివరించినట్లు గ్రహించగలరు. సోర ప్రపంచములోని అనేక జీవితార్థాలకు, ఆలోచనలకు, అనుభూతులకు సంబంధించి సోరలు ఉపయోగించే జాతీయ పదబంధాలను చదువవలసిన పాఠాలలో చేర్చాను. ఇందులో అనేక విషయాల ప్రస్తావన ఉండడం చేత ఇవి ఎంతో కొంత సోరజాతి 'ఆత్మ' ను ప్రతిబింబించి బహిర్గతం చేస్తుందని నమ్ముతున్నాను." అని రామమూర్తిగారు అన్నారు.

సోర మాన్యుయల్‌ను రాయడానికి రామమూర్తిగారు చాలా శ్రమపడవలసి వచ్చింది. "సోర భాషకు చెందిన కొన్ని ముఖ్యలక్షణాలను గ్రహించడానికి నాకు ముప్పై సంవత్సరాలకుపైనే పట్టింది. ఇంకా నేను పరిష్కరించవలసిన సమస్యలెన్నో ఉన్నాయి. వాటన్నిటినీ నేను పరిష్కరించలేనేమో అని భయపడుతున్నాను. ఇప్పుడు సోరభాషను నేర్చుకొనేవారికి నేను పడిన శ్రమంతా తప్పిపోయింది. ఒక ఏడాదిలోనే వారు సోరభాషలో మంచి జ్ఞానాన్ని సంపాదించగలరు. నేను చేసినదానిని మెరుగుపరచగలరు. నేను చేసినది ఎంత మాత్రమూ పరిపూర్ణమైనది కాదని నాకు తెలుసును." అని రామమూర్తిగారు సోర మాన్యుయల్‌లో రాశారు.

సవర భాషలో పుస్తకం రాయాలంటే ఎదుర్కోవలసిన మొదటి సమస్య:– భాషను రాతలోకి తేవడం

"సోరలకు సంప్రదాయ అక్షరమాల లేదు. ఏ భారతీయ అక్షరమాలా పరిపూర్ణమైనదికాదు. నేను 1912–14 సం॥లలో తెలుగు అక్షరాలతో సిద్ధంచేసిన సోరవాచకాలు తెలుగురాని ఒరియావారికి ఉపయోగపడలేదు. పాశ్చాత్య విద్యార్థులకు అవి వుపయోగపడవు. అంతర్జాతీయ ధ్వని సంబంధ సంస్థ ఆమోదించిన ధ్వని సంకేతాలు ఇప్పుడు ఎంతో వ్యాప్తిలోకి వచ్చాయి. సోరభాషాశబ్దాలకు నేనా ధ్వనిసంకేతాలనే ఈ మాన్యుయల్‌లో ఉపయోగించాను. ధ్వనిసంబంధిత అక్షరమాల కూడా ఉజ్జాయింపుగా ఉండేదే అని విద్యార్థి గ్రహించాలి. వినికిడిధ్వనులను కనబడే సంకేతాలేవీ నిర్దిష్టంగా నివేదించలేవు... మాట్లాడేభాషలో భాషా వ్యవహర్తల భావస్థితి ననుసరించి వాక్యంలోని పదాల స్థాయీ భేదం వుంటుంది. దీనిని అక్షరాలలో చూపలేం." అని రామమూర్తిగారు సోర మాన్యుయల్‌లో

గురువు గిడుగు రామమూర్తిగారికి తాపీ ధర్మారావు ఇచ్చిన శ్రద్ధాంజలి– పత్రికల్లో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడం, సినిమాల్లో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడం, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టడానికి తీవ్ర కృషి చేయ్యడం, తనకు తాను ఆ ఉద్యమంలో ముందుపీటని ఉంచడం. ఇంతకుమించి ఏ శిష్యుడు ఏ గురువుకు ఏం ఇవ్వగలడు – ఏటుకూరి ప్రసాద్

రాశారు.

భాష వేరు, లేఖనం వేరు అనే అభిప్రాయం భారతీయ భాషలు చదువుకొన్నవారికి కలగక పోవచ్చు గాని ఇంగ్లీపు చదువుకొన్నవారికి ఉచ్చారణకీ లేఖనానికీ (స్పెలింగ్) భేదం వుందని తెలుసు. ఒక ధ్వనికి ఒకే అక్షరం వాడాలి. **అక్షరాలు ధ్వనివిధేయంగా వుంటే ఆ అక్షరాలలో ఏ భాషనైనా రాసుకోవచ్చు అనే అభిప్రాయంతో అంతర్జాతీయ ధ్వని సంబంధ సంస్థ పందొమ్మిదవ శతాబ్ది చివరలో ధ్వని విధేయంగా వుండే అక్షరాలను కనుగొంది.** ఇవి కొత్త అక్షరాలు కావు. ఇంగ్లీషులో 26 పెద్ద అక్షరాలు, 26 చిన్న అక్షరాలు ఉన్నాయి. మొత్తం 52 అక్షరాలు. ఈ 52 అక్షరాలతో అన్ని ధ్వనులను పలకలేం. కాబట్టి మరికొన్ని అక్షరాలు కావాలి. దానికోసం వారు కొన్ని గ్రీకు అక్షరాలను తీసుకొన్నారు. అక్షరం పై గీత, క్రింద గీత, ప్రశ్నార్థకం వంటి గుర్తులు కూడ వాడుకోవచ్చున్నారు. అక్షరాల స్థాన, కరణ, ప్రయత్న స్వర భేదాలననుసరించి ఏ ధ్వనికి ఏ గుర్తు రాస్తున్నామో ముందుగా వివరించాలి. **ఈ లిపిని అంతర్జాతీయ ధ్వని లిపి (ఐ.పి.ఎ.) అంటారు.** అవగాహన కోసం చిన్న వివరణ. ఐ.పి.ఎ.లో దీర్ఘాచ్చులకు అచ్చు పైన గీత గీస్తారు. నేను రెండచ్చులు రాశాను. తెలుగు భాషను ఐ.పి.ఎ.లో ఎలా రాసుకోవచ్చో ఈ ఉదాహరణల ద్వారా తెలుసుకోండి. కాకి(kaaki), కుక్క(kukka), అక్క(akka), మూర్తి(muurti), మోహన్ (moohan), మురళి(muraLi), మీరు(miiru), మిఠాయి(miThaayi), కథ (katha), ఐతే (aitee), ఆజ్ఞ(aagnya), దుఃఖము(duhkhamu), అ?ఆలు(a?aalu).

భాషలో స్వర భేదం గూడ చాలా ముఖ్యమైనదే. అందుకే సంభాషణా రచయితలు ఏ మాటను ఎలా పలకాలో బ్రాకెట్లలో సూచిస్తారు. భావాన్ననుసరించి నటుడు సంభాషణలు పలుకుతాడు. రామమూర్తిగారి విశిష్టత ఏమిటంటే సోర మాన్యుయల్‌లో వ్యావహారిక భాషలోని స్థాయీ భేదాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం. వారు సోర మాన్యుయల్‌లోని వ్యాకరణ విభాగంలో 'ఇంటోనేషన్' అని ఒక అధ్యాయం రాశారు. అందులో స్థాయీ భేదాలను అంకెలలో సూచించారు. ఉదాత్త అనుదాత్తాలే కాదు. సప్త స్వరాలను దాటిపోయారు. సవర వాక్యాలలోని పదాల స్థాయీ భేదాలను 1నుండి 9 వరకు అంకెలలో సూచించారు. ఏ స్థాయిలో ఏ పదం పలికితే ఏ అర్థం వస్తుందో ఉదాహరణలతో చూపించారు. పదాలపైన అంకెలు రాశారు.

రెండవ సమస్య:- ఏ మాండలికంలో రాయాలి

"సోర భాష అంతటా ఒకే విధముగా ఉండదని తెలుసుకోవాలి. ఈ భాష మురాకు మురాకు, గ్రామానికి గ్రామానికి మారుతుంది. ఒకే గ్రామములోకూడ ఉచ్చారణ భేదాలు కనిపిస్తాయి. ఒక్కొకసారి వయస్సును బట్టి, ఆడమగ తేడాను బట్టి కూడ ఉచ్చారణమారుతుంది. ఒకే వ్యక్తి మాటల్లో కూడ అతని భావస్థితి ననుసరించి, వేగము, స్థాయి, తీవ్రతననుసరించి భేదాలుంటాయి.... అన్ని సజీవ భాషల వలెనే సోరభాష కూడా మాండలికాలలోనే జీవిస్తున్నది. సోర భాషను మాతృభాషగా మాట్లాడేవారికి భేదాలున్నప్పటికీ ఒకరినొకరు అర్థం చేసుకోగలరు. నేను గుమ్మ ప్రాంతాన్ని చివరలో చూచాను. అయితే సవర భాషను నేర్చుకొనే విద్యార్థులు ఈ గుమ్మమాండలికాన్నే మొదట అభ్యసించాలని నేను ఎంపిక చేశాను. ఈమాండలికాన్ని ప్రామాణికంగా తీసుకొనవచ్చును. దుర్గమ ప్రాంతాలలో కూడ ఇది ఒకే విధంగా, ఆచరణ యోగ్యంగా ఉంటుంది. ఇతర మురావాళ్ళకు కూడ ఇది అర్థమౌతుంది. సోరలందరూ దీని ఆధిక్యాన్ని, స్వచ్ఛతను గుర్తించారు. ఒకటి మాత్రం మనం గుర్తుంచుకోవాలి. మాట్లాడే భాష ఏదీ వాస్తవానికి ప్రామాణికం కాదు. ప్రామాణిక ఆంగ్ల భాషను మాట్లాడే ఏ ఇద్దరి ఉచ్చారణ కూడ ఒకేవిధంగా ఉండదు. అన్ని సజీవ భాషలలోను ఉచ్చారణ భేదాలుంటాయి. ఎంతో అభివృద్ధిచెందిన ఆంగ్లభాషలో కూడ ఉచ్చారణ భేదాలున్నాయి. సాంప్రదాయకంగా వాడుతున్న స్పెలింగ్ దీనిని బయటకు తెలియనీయదు. వాటిని ధ్వనిననుసరించి నిర్మించిన నిఘంటువులలోనే చూడగలం." అని రామమూర్తిగారు భాష గురించి చక్కని వివరణ ఇచ్చారు. సవర రచనలను గ్రాంథికంలో రాయాలా? వ్యావహారికంలో రాయాలా? రాస్తే ఏ మాండలికంలో రాయాలి అన్న సమస్య రామమూర్తిగారికి ఎదురవలేదు.

1931లో రామమూర్తిగారు రచించిన సోర మాన్యుయల్ అంతర్జాతీయ ధ్వనిలిపిలో రాయబడిన మొదటి వర్ణనాత్మక వ్యాకరణం. సోర మాన్యుయల్, డిక్షనరీలలో రామమూర్తిగారు ఉపయోగించిన విశేషచిహ్నాలను నేడుగూడ యథాతథంగా వాడుకోవచ్చు అని సవర భాషాధ్వనులపై పరిశోధన చేసిన హవాయి యూనివర్సిటి ప్రొ॥ డేవిడ్ స్టాంప్ చాలా కాలం క్రితం అన్నారు. ఇటీవల అంటే ఏడెనిమిది సంవత్సరాల క్రితం వారు హైదరాబాద్ వచ్చారు. సవర ధ్వనులపై మరింత లోతుగా అధ్యయనం చేయడంకోసం ఇద్దరు సవరదంపతులను హైదరాబాద్ రప్పించుకొని వారి సంభాషణలను రికార్డు చేసుకొన్నట్టు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు ఫోన్‌లో చెప్పారు. ఇంకా ఏమన్నారంటే "రామమూర్తిగారు సవర ధ్వనులను సరిగా రికార్డు చెయ్యలేదేమో" అని డేవిడ్ స్టాంప్ తనతో అన్నట్టు చెప్పారు. సవరలు ఎక్కడనుండి వచ్చారు అని ప్రొ॥కృష్ణమూర్తి గారిని అడిగాను. పలాసనుండి అంటూ వారు క్రిష్టియన్లు అనిగూడ అన్నారు. **రామమూర్తిగారు సోర మాన్యుయల్‌లో గుమ్మమాండలికం వాడారు.** పర్లాకిమిడికి 25కిలో మీటర్ల దూరంలో ఎత్తయిన కొండలమధ్య గుమ్మ గ్రామం వుంది. ఇప్పుడు గూడ సీతంపేట మాండలికాన్ని గుమ్మ ప్రజలు అర్థం చేసుకోగలరు. వర్ణనాత్మక వ్యాకరణం రాసే నేటి భాషా శాస్త్రవేత్తలు తాము ఏ మాండలికానికి వ్యాకరణం రచిస్తున్నారో తెలియజేయవలసిన అవసరం వుంది అని సవర మాన్యుయల్ చదవడం ద్వారా గ్రహిస్తారు. ఇంతవరకు రామమూర్తిగారి ముందుమాటలు విన్నాం. ఇప్పుడు వారు రాసిన "సోర (సవర) మాన్యుయల్" చూద్దాం.

సోర (సవర) మాన్యుయల్ : అమెరికాలోని హవాయీ విశ్వ విద్యాలయంలో భాషాశాస్త్రంలో ప్రొఫెసర్‌గా వున్న స్టాన్లీ స్టరోస్టా సవరభాషమీద పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. తాను గిడుగు రామమూర్తిగారి సోర (సవర) మాన్యుయల్‌ని ఎక్కువగా వాడుకొన్నానని, దాని నిర్దుష్టతకు సమగ్రతకు ముగ్ధుణ్ణయానని రాశారు. సోర (సవర) మాన్యుయల్ చదివితే ఎవరైనా ముగ్ధులు కావలసిందే.

రామమూర్తిగారు రాసిన "సోర (సవర) మాన్యుయల్" ని

వ్యాకరణం అంటుంటారు. 254 పేజీల పుస్తకంలో వ్యాకరణ భాగం 73 పేజీలు మాత్రమే. ఈ మాన్యుయల్ సవరభాష నేర్చుకొనే వారికోసం రాశారు. భాషను ఎలా నేర్చుకోవాలో సోర (సవర) మాన్యుయల్ చూస్తే తెలుస్తుంది. సోర (సవర) మాన్యుయల్‌లో ఆధునిక భాషాబోధనా పద్ధతులున్నాయి.

ముందుగా ధ్వని అధ్యాయం చూద్దాం.

మాన్యుయల్‌లో ఇది మొదటి అధ్యాయం. భారతీయ భాషాధ్వనులకు, సవరభాషాధ్వనులకు పెద్ద తేడా లేదు. ఇంగ్లీషు భాషా ధ్వనులు వేరు. వాటి ఉచ్చారణ వేరు. భాష నేర్చుకొనేవారికి అంతర్జాతీయ ధ్వనిలిపి గూడ అంత ప్రయోజనకారి కాదు. అందుకే "ముందుగా భాషాధ్వనుల ఉచ్చారణను సోరలవద్ద నేర్చుకోవాలి. తరువాత మాన్యుయల్‌లోని ఉదాహరణలలో ఇచ్చిన మాటలను వాక్యాలను వారివద్ద చక్కగా ఉచ్చరించేదాకా మళ్ళీ మళ్ళీ అంటుండాలి." అని రామమూర్తిగారు బోధించారు.

అచ్చులు: సవరలో భాషలో అ, ఇ, ఉ, ఎ, ఒ అనే ఐదచ్చులున్నాయి. అయ్ అనే సంధ్యచ్చు గూడ వుంది. సవరలో హ్రస్వ, దీర్ఘాలకు అర్థం బోధించడంలో భేదంలేదు. దీర్ఘానికి బదులు హ్రస్వం వాడినా, హ్రస్వానికి బదులు దీర్ఘం వాడినా అర్థంలో భేదం రాదు. వ్యావహారిక భాషలో దీర్ఘాలు, ప్లుతాలు, ఇంకా ఎక్కువ దీర్ఘాలు వుంటాయి.

సవర భాషలో కంఠమూలీయ అవరోధం (glottal check) అనే వింత ధ్వని వుంది. ఇది మనకు కొత్త. దీనిని ఎపాస్ట్రఫీ ద్వారా తెలియజేయవచ్చు. ఉదా॥ da'an.. ఈ మాటలో రెండు a'a ('అ') (డ్ + అ + అన్) ల మధ్య ఎపాస్ట్రఫీ వుంది.. దీనిని "డ'–ఆన్ " గా వింటాం. మొదటి 'అ' చాలా పొట్టిగా పలకాలి. ఇక్కడ సవర్ణదీర్ఘ సంధి జరగదు. సవరభాషలో సంధులు లేవు. 'సోర (సవర) మాన్యుయల్‌లో సంధి ప్రకరణం లేదు.

ఈ ధ్వనిని సవరలనుండి ముఖస్థంగా నేర్చుకోవడం మంచిది. ఒక పదాన్ని ఉచ్చరిస్తున్నప్పుడు ధ్వనులు వరుసగా నోటినుండి వెలువడతాయి. ఈ విధంగా వెలువడుతున్న ధ్వనులలో ఒకదానిని బయటకు రానీయకుండా గొంతుకలోనే ఆపివేస్తే అది కంఠమూలీయ అవరోధం. ఒక చిన్నమూతిగల సీసానుండి నీరు బొట్లు బొట్లుగా పడుతున్నప్పుడు మధ్యమధ్య ఆగిపోయే ధ్వనితో సమానంగా ఈ కంఠమూలీయ అవరోధ ధ్వని వుంటుందని కొందరు వర్ణించారు. ఈ ధ్వని బయటకు వినిపించక పోయినప్పటికి ఇది వర్ణమే. కాబట్టి దీనికి అక్షరసంజ్ఞ అవసరం. దీనికి ఎపాస్ట్రఫీ వాడుతున్నాం. కంఠమూలీయ అవరోధం గల కొన్ని సవర పదాలు – ప'తలి = కుండ; సు'ఊజ్= ఇల్లు; నె'ఏబ్ = చెట్టు'; జె'ఏజ్ = కాలు; జ'అ = పాము; ము'ఉ= ముక్కు; లు'ఉ =చెవి; మొ'ఒ = కన్ను.

తెలుగులో 'అ ఆ' లు, 'ఇ ఈ' లు" అన్నప్పుడు "అ, ఆ" ల మధ్య, "ఇ, ఈ" ల మధ్య వినిపించేది కంఠమూలీయ స్పర్శం (glottal stop). అంతర్జాతీయ ధ్వనిలిపిలో దీనిగుర్తు (?). తెలుగులో 'అ?ఆ లు, ఇ?ఈ లు' అని రాయవచ్చు. కొందరు భాషాశాస్త్రవేత్తలు కంఠమూలీయ అవరోధాన్ని (glottal check) కంఠమూలీయ స్పర్శంగా (glottal stop) భావిస్తున్నారు. ఇది తప్పు.

హల్లులు: తెలుగుతో సమాన ఉచ్చారణగల హల్లులు– క గ ఙ, చ జ ఞ, ట డ, త ద న, ప బ మ, య ర ల వ స. తెలుగులో ఙ,ఞ ల వాడుక తక్కువ. సవరలో వీటి వాడుక ఎక్కువ.

(1) అవరోధితహల్లు (checked consonants) సవరలు పదాంతంలోని కొన్ని హల్లు ధ్వనులను బయటకు రాకుండ గొంతుకలోనే నొక్కివేస్తారు. ఈధ్వని వినిపించకపోయినప్పటికీ ఇది పదంలోని అంతర్భాగమే. అర్థభేదకసామర్థ్యం వుంది కాబట్టి ఇది ఆ భాషలో వర్ణం. దీనిని బ్రాకెట్లలో రాయడం జరిగింది. ఈ ధ్వనిని సవరలనుండి స్వయంగా నేర్చుకోవాలి. వినికిడి శక్తి బాగా వుండాలి.

"తియ్, తిజ్" అన్న రెండు పదాలలో బయటకు వినిపించేది "తి" మాత్రమే. "తి" తరువాత అవరోధితహల్లు వుంటుంది. పై రెండుపదాలు ఒకే విధంగా మనకు వినిపించినా సవరలు ఆ భేదాన్ని కనిపెట్టగలరు.

నేను సవరభాష నేర్చుకొంటున్నప్పుడు 'ఇచ్చు' అర్థం గల ఒక మాట వచ్చింది. నా గురువు (ఇంటర్మీడియట్ చదువుతున్న నా విద్యార్థి) "కంబోలన్ తి" (పుస్తకం ఇవ్వు) అన్నాడు. "తి" తరవాత ఒక హల్లు ధ్వని వుంటుంది. దానిని సవరభాషలో బయటకు పలకరు. నాకు 'తి' మాత్రమే స్పష్టంగా వినిపించింది. 'తి' తరవాత నున్న ధ్వని "య్" గాని "జ్" గాని అయి వుంటుంది. స్పష్టంగా వినబడలేదు. నేను 'తిజ్' అంటే కాదంటాడు. ఆ మాటకు వేరే అర్థం వుందంటాడు. చెప్పడు. ఎంత అడిగినా చెప్పడు. అసలు చెప్పనే లేదు. నా దగ్గర రామమూర్తిగారి సవర–ఇంగ్లీషు నిఘంటువు వుంది. "తియ్" అంటే 'ఇచ్చు' అనీ "తిజ్" అంటే 'స్త్రీ జనేంద్రియం' అనీ అర్థం ఇచ్చారు. హమ్మయ్య! ఒక సంకట పరిస్థితినుండి బయటపడ్డాను అనుకొన్నాను.

గనుర్ = వర్షం; దీనికి వర్తమానకాలబోధక ప్రత్యయం 'తె' చేరగా "గనుర్‌తె" ఔతుంది. "గనుర్‌తె" అంటే 'వర్షిస్తుంది' అని అర్థం. "గనుర్" కు వ్యతిరేకబోధక ప్రత్యయం 'తె(డ్)' చేరగా "గనుర్‌తె(డ్) అంటే 'వర్షం లేదు' అని అర్థం. పై రెండు మాటలు ఒక్కలాగే 'గనుర్‌తె' అనే వినిపిస్తాయి. కాని రెండవ రూపంలో అవరోధితహల్లు "(డ్)" వుంది.

అవరోధితహల్లును గుర్తించడమే రామమూర్తిగారి ప్రతిభా విశేషం. రామమూర్తిగారు సోర మాన్యుయల్‌లో సవరభాషలోని అవరోధితహల్లుల పట్టిక గూడ ఇచ్చారు. వీటికి ఉదాహరణలు ఇచ్చారు. రామమూర్తిగారు అవరోధితహల్లు కింద చిన్న సున్న వుంచారు. నేను బ్రాకట్లలో రాశాను. ఉదా॥ కిన్‌సో(ర్)=కుక్క. "తఙ్‌లి(ఙ్) = ఆవు. మనకు ఈ మాటలు "కిన్‌సో, తలి" అనే వినిపిస్తాయి.

రామమూర్తిగారు అవరోధితహల్లుని స్పష్టంగా విన్నారు. అతని

గిడుగువారి ఉద్యమ ఫలితంగా కవులకు గొంతుచెర వీడినది.
రచయితల చేతుల సంకెలలు ఊడిపోయినవి –తెలికిచర్ల వెంకరత్నం

వినికిడి శక్తి చాలా గొప్పది. **రామమూర్తిగారికి సవరభాష నేర్చుకొనే రోజుల్లో చెవుడు లేదు. సవర దేశంలో తిరిగిన కారణంగా వారికి మలేరియా జ్వరం వచ్చింది. జ్వరం తగ్గడంకోసం క్వినైన్ ఎక్కువగా వాడడం వల్ల రామమూర్తిగారికి చెవుడు వచ్చింది. ఈ విషయం కొంత మందికి తెలీదు.**

సోర (సవర) మాన్యుయల్‌లో రెండవ అధ్యాయం వ్యాకరణ విభాగం. దీనిలో రామమూర్తిగారు సంప్రదాయకంగా వస్తున్న పద్ధతిలోనే వరుసగా నామ, సర్వనామ, విశేషణ, క్రియా పదాలను, అవ్యయాలు వర్ణించారు.

మొదటిగా నామ పరిచ్ఛేదం పరామర్శిద్దాం: సవరభాషను అర్థం చేసుకోవడంలో ఎదుర్కోవలసిన క్లిష్టమైన సమస్యలు చాలా వున్నాయి.

సవరభాషలోని విశేషం:- సవరభాషలో సూర్యుడు, చంద్రుడు, భూమి, గాలి, నీరు మొదలైన వాటిని తప్పిస్తే, వ్యక్తులకు చెందదగిన వస్తువునైనా, వ్యక్తినైనా ఎవరో ఒకరికి చెందినదిగా చెప్తారు.

పుస్తకం చూపించి సవరవాడిని 'ఇది ఏమిటి?' అని అడిగితే 'కంబోల్ " అనడు. "కంబోల్ఇఞ్న్" అంటాడు. 'కంబోల్ " అంటే 'పుస్తకం'. "న్" అంటే 'నా' అని అర్థం. "ఇఞ్న్" అంటే 'నేను'. "ఇఞ్ " యొక్క కురుచ(సంబంధ బోధక)రూపం "ఞ్న్". సమాసాలలో కురచరూపం వాడతారు. (తెలుగులో కూడ). "కంబోల్ఞ్న్" అంటే "పుస్తకం నా" అన్నది పదాల అర్థం. కాని నా పుస్తకం అన్నదే భావం.

తెలుగు తమిళం మొదలగు ద్రావిడ భాషలతోను, హిందీ సంస్కృతం మొదలగు ఆర్య భాషలతోను పోలిస్తే సవరభాష విలక్షణంగా కనిపిస్తుంది. ఒక్కొక్కభాషకి ఒక్కొక్క సంప్రదాయం వుంటుంది. సవర భాషలో షష్ఠీ సమాసంలో పదాలు తారుమారౌతాయి. "కంబోల్ఞెన్" అన్న సమాసం మనకు ఏక పదం గానే అనిపిస్తుంది. ఇందులో రెండు పదాలున్నవని, ఇది షష్ఠీసమాసం అని తెలుసుకోవడమే రామమూర్తిగారి ప్రజ్ఞ. ఇది సమాసమని సవరలకు గూడ తెలీదు. అందుకే "ఇది నా పుస్తకం" అనడాన్ని 'ఇఞెన్ కంబోల్ఞెన్ " అంటుంటారు. 'ఇఞెన్' అంటే 'నేను' అని అర్థం. "కంబోల్ఞెన్ " అంటే "పుస్తకం నా' లేక 'నా పుస్తకం" అని అర్థం కదా? "ఇఞెన్ కంబోల్ఞెన్ " అంటే "నా యొక్క పుస్తకం" అనే అర్థంలో వాడుతున్నారు. కాని వాక్యంలోని మొదటి పదం "ఇఞెన్" అవసరం లేదు. సవర వాక్య నిర్మాణంలోని ఈ మార్పుకి కారణం ఇతర భాషల ప్రభావం కావచ్చు.

చివరగా క్రియాపరిచ్ఛేదం పరామర్శిద్దాం:

సవరభాషలోని వాక్యాలను అర్థంచేసుకోవడం కొంత ఇబ్బందిని కలిగిస్తుంది. ఆర్యభాషలు మాట్లాడేవారికి గాని, ద్రావిడభాషలు మాట్లాడేవారికి గాని సవరభాషలోని కర్త, కర్మ, క్రియల సంబంధాలు దురవగాహంగా వుండవచ్చు. "నేను వస్తున్నాను. నువ్వు వస్తున్నావు" అన్న వాక్యాలలో తెలుగులో కర్త ననుసరించి క్రియాంత రూపాలున్నాయి. సవరలో "ఇఞెన్ ఇయర్‌తాయ్" అంటే 'నేను వస్తున్నాను'. "అమన్ ఇయర్‌తాయ్" అంటే 'నువ్వు వస్తున్నావు' అని అర్థం. సవరలో "ఇఞెన్ ఇయర్‌తె" అంటే "నేను వెళ్తున్నాను', 'అమన్ ఇయర్‌తె" అంటే 'నువ్వు వెళ్తున్నావు' అని అర్థం. చివరి ప్రత్యయం మారితే అర్థం మారిపోయింది. 'వచ్చు', 'వెళ్ళు' గా మారిపోయింది. సవర భాషలో కర్త్రర్థక వాక్యంలో 'కర్త ననుసరించి క్రియ వుండకపోవడం' చూశారు కదా. కాని ఇది సరైన వివరణకాదు. "ఇఞెన్ జుమ్‌తాయ్ (నేను తింటున్నాను) అమన్ జుమ్‌తె (నువ్వు తింటున్నావు). ఇక్కడ 'కర్త ననుసరించి క్రియ వుంది'. ఇది గూడ సరైన వివరణకాదు. ఈ ఉదాహరణ చూస్తే మీకే అర్థం ఔతుంది. అమన్ జుమ్‌తె (నువ్వు తింటున్నావు). అనిన్ జుమ్‌తె (వాడు తింటున్నాడు). మధ్యమ, ప్రథమ పురుషలలో క్రియాంత రూపాలు ఒక్కలాగే వున్నాయి. సవర భాషలో రెండే పురుషలు. 'తాను, ఇతరులు'. (అవగాహనకోసం నేను రాసిన Savara Grammar. A Tagmemic model చూడండి) ఇటువంటి క్లిష్ట సమస్యలను ఛేదించడానికి రామమూర్తిగారు ఎంత లోతుగా ఆలోచించి వుంటారో కదా.

సవరభాషలోని మరొక విశేషం

కర్మతో కలిసి సంయుక్త క్రియలు (compound verbs) ఏర్పడడం.

మన భాషలలో ప్రార్థనా వాక్యంలో క్రియా ధాతువునే వాడతాం. ఉదాహరణ: 'నాకు ఇవ్వు'. సవరభాషలో "తిఞ్" అంటే 'ఇవ్వు' అని అర్థం. ఇది సాధారణ క్రియ. దీనికి కాలబోధక ప్రత్యయాలు మొదలైనవి చేరతాయి. "ఇఞెన్ "అంటే 'నేను'. దీని కర్మార్థక రూపం "ఇఞ్". అంటే 'నాకు, నన్ను"అని అర్థం. "తిఞ్" అంటే 'ఇవ్వు' నాకు' అని అర్థం. 'నాకు ఇవ్వు' అన్నదే భావం. "తియిఞ్" మనకు ఒక్క పదంగానే వినిపిస్తుంది. ఇది సంయుక్త క్రియ. దీనికి గూడ సాధారణ క్రియకు లాగే కాలబోధక ప్రత్యయాలు మొదలైనవి చేరతాయి.

ఈ ఉదాహరణలు చూడండి: 1."ఇఞెన్ అబొయ్ కమ్‌బోల్ తియ్‌ఇఞెన్" = (నేను + ఒక + పుస్తకం + ఇవ్వు నాకు.) 'ఒక పుస్తకం నాకు ఇవ్వు.' అన్నదే భావం. మొదటి పదం "ఇఞెన్" అవసరం లేదు. ఇది అధికం.

2."ఆనిన్ లేబున్ తియ్‌తిఞ్" = "ఆనిన్ + లేబున్ + తియ్ + త్ + ఇఞ్ "(వాడు + డబ్బు + ఇచ్చు+'త్'(వర్తమానకాల బోధకం) + నాకు) = వాడు నాకు డబ్బు ఇస్తున్నాడు.

3.ఇఞెన్ అమ్‌బెన్ పెన్నన్‌జి తియ్‌లబెన్ = (నేను మీరు పెన్నులు+ తియ్(ఇచ్చు) + ల్ (భూతకాల బోధకం) + బెన్ (మీకు) =నేను మీకు పెన్నులు ఇచ్చాను. రెండవ పదం "అమ్‌బెన్ " అవసరం లేదు. ఇది అధికం.

భాషలలో సంయుక్త క్రియలు (compound verbs) ఉంటాయని ఊహించడమే గొప్ప విశేషం. సవరభాషలో వాటిని ఎత్తిచూపించడం మహా విశేషం.

సోర (సవర) మాన్యుయల్‌లో మూడవ అధ్యాయం ప్రాథమిక పాఠాలు.

మొదటిగా వర్గీకృత పదజాలం అన్న విభాగం వుంది. సోర (సవర) మాన్యుయల్ ఇంగ్లీషు తెలిసిన విద్యార్థులకోసం రాసింది కదా. అందుచేత ఈ విభాగంలో ఇంగ్లీషులోని నామపదాలకు సవర భాషలో అర్థాలు రాశారు. ఇది అకారాది కాదు. ఇందులో వర్గీకరింపబడిన పదజాలం వుంది. ఇందులో 1 నుండి 39 ఉప శీర్షికలున్నాయి. ప్రకృతి, భూమి, నీరు, జంతువులు, పక్షులు, కీటకాలు, చెట్లు, చెట్లభాగాలు, ఋతువులు, ఇంటిలో వాడే వస్తువులు, మట్టి పాత్రలు,

బుట్టలు, ఆయుధాలు, వాద్య పరికరాలు, బంధు వాచకాలు, శరీర భాగాలు, రోగాలు, ఆభరణాలు, కాయధాన్యాలు, దుంపలు, కాయగూరలు, ఆకుకూరలు మొదలైన వాటి పేర్లు ఉన్నాయి. రుచుల పేర్లు వున్నాయి. పూజలు, ఉత్సవాల పేర్లు ఉన్నాయి. జంతువుల అరుపులు, కూతలు' ఎప్పుడు ఏ జంతువు ఎలా అరుస్తుందో చెప్పే పదాలు మన భాషకందని ఎన్నో పదాలు ఈ వర్గీకృత నిఘంటువులో వున్నాయి. ఈ నిఘంటువులో 31 రకాల మట్టి పాత్రల పేర్లు (కుండ, కడవ, దాక, చట్టి, బిడ్డి) వున్నాయి. అంతేగాక సవర భాషలో ఆడవారి పేర్లు, మగవారి పేర్లు ఉన్నాయి. గిడుగు రామమూర్తిగారు సవరలతో ఎంతగా కలిసిపోయారో ఊహించుకోండి.

రామమూర్తిగారు ఇంగ్లీషు క్రియలకు సవరభాషలో అర్థాలు రాశారు. ఇది అకారాది నిఘంటువు. క్రియ అకర్మకమో, సకర్మకమో వివరించారు. 'మోయు' అన్న క్రియకు 1.తలపై మోయు, 2.భుజంపై మోయు, 3.వీపుపై మోయు అన్న 3 క్రియారూపాలను సవర భాషలో చూపించారు. ఈ విభాగంలోనే క్రియల నిష్పన్న రూపాలను చూపించారు.

విద్యార్థి పాఠాలు, అభ్యాసాలద్వారా సవర వాక్య నిర్మాణం నేర్పాలనుకొన్నారు రామమూర్తిగారు. "భావ వ్యక్తీకరణకు వాక్యం ప్రధానమైనది. ఈపాటికి విద్యార్థి సవర ధ్వనులను బాగా అభ్యసించే వుంటాడు. విద్యార్థికి ఆ భాషలోని భాషాభాగాలు, (వ్యాకరణం) భాషలోని పదాలు తెలుసు. ఇక వాక్య నిర్మాణం తెలియాలి." అంటూ దానికి తగ్గట్టుగా పాఠాలు రాశారు. ముందుగా ప్రశ్నించే విధానం నేర్పారు. ఆజ్ఞా వాక్యాలు, విధి వాక్యాలు, వ్యతిరేకార్థక వాక్యాలు రాశారు. వాటికి ఇంగ్లీషు అనువాదాలు ఇచ్చారు. వర్తమాన కాలంలోను, భూత కాలంలోను ఉదాహరణ వాక్యాలు ఇచ్చారు. వాక్య విశ్లేషణ ఇచ్చారు. వాక్యంలో వివిధ భాషాభాగాల పనితీరులను వివరించారు. ఈ అధ్యాయంతో సవరభాష నేర్చుకోవడం పూర్తవుతుంది.

సోర (సవర) మాన్యుయల్‌లో నాలుగవ అధ్యాయం చదువుకొనేందుకు పాఠాలు. రామమూర్తిగారు ఈ అధ్యాయంలోని పాఠాలకు అనువాదం ఇవ్వలేదు. చదువరి సవరభాషను తనకు తానుగా అర్థం చేసుకోవాలి అనేది రామమూర్తిగారి అభిమతం. పాఠకులకు సహాయకారిగా అనుబంధంగా కొత్త పదాలకు అనువాదాలు, వ్యాకరణాంశాలకు నోట్సు ఇచ్చారు. ఇందులో కొన్ని సవర పాటలు, కథలు, సంభాషణలు వున్నాయి. రోగి వైద్యుల సంభాషణలు, సవరల దిన చర్యలు, కుటుంబంలోని సభ్యులు సంబంధాలు, సవరలు వేటాడడం, వ్యవసాయం చెయ్యడం, సవరల జీవితం, దెయ్యాలు, దేవతలు, సోది చెప్పడం మొదలైన అనేక విషయాలున్నాయి. ఈ అధ్యాయంలో 35 పాఠాలున్నాయి.

రామమూర్తిగారు ఆధునిక భాషాబోధనా పద్ధతులను ఆనాడే అవలంబించారని చాలామంది అంటుంటారు. సోర (సవర) మాన్యుయల్ చదివితే రామమూర్తిగారు ఎంత ముందున్నారో తెలుస్తుంది. ఈనాటికీ మనం అతనిని అందుకోలేకపోతున్నాం.

-- రచయిత - సవర వ్యాకరణంపై పిహెచ్.డి. పొందారు. సవర విద్యార్థులకు తెలుగు లిపిలో వారి భాషను నేర్పారు. 2002 నుండి సవర భాషాసంఘాన్ని నడుపుతూ సవర పిల్లలకు కథల పోటీలు నడుపుతున్నారు. 2005 నుండి ఒక సంవత్సరం పాటు 'సవర'బులెటిన్ నడిపారు. సవరలకు చేసిన సేవలో వీరి కృషి సాటిలేనిది.

కవిత

అగ్గిపిడుగు

జాతి ఆశ, శ్వాస భాష
అది ప్రతిఒక్కరి హృదయఘోష
రాత, మాట ఒక్కటై ఉంటేనే
నవత, సమత, ఘనత, భవిత

జన హితమే సాహితి అభిమతం
సమస్యల పరిష్కరణే పాలకత్వం
మంచిని పెంచి పంచడమే పాత్రికేయం
ఈ మూడింటికీ ఒకే మూలం స్వభాషీయం

సగటు మనిషి దరికి చేరని సారస్వతమెందుకు
సకాలంలో స్పందించలేని నేతాగణం దేనికని
భాషాపరిరక్షణకు దోహదపడని పత్రికలెందుకు
అక్షర శక్తిని విస్తృతపరచని బతుకు ఇంకెందుకని?

అన్ని సందేహాలూ తీరుస్తూ, సమస్యలు నివారిస్తూ
అడుగుపెట్టి, వాడుక తెలుగుకు గొడుగుపట్టి
ఛాందసవాదం పాలిట పిడుగయ్యావు రామ్మూర్తీ!
వడివడి అడుగుల 'గిడుగు'గా నువ్వే మా స్ఫూర్తి

చరిత్ర తెలిసిన, శాసన పరిశోధన చేసిన,
పలు పుస్తకాలతో మస్తిష్కాలను పదునెక్కించిన
వ్యవహార భాషోద్యమ పితామహా!
తరతరాలూ నిలిచే ఉంటుంది నీదైన శ్రమ

సంస్కరణల శర పరంపర నీది
పట్టిన పట్టును పక్కనపెట్టని పోరుపటిమ నీకుంది
ఆరు దశాబ్దాల నీ సేవాసహాయాల రీతి
ఎలా మరుస్తుందయ్యా సమస్త జాతీ?

నీవి మామూలు మాటలు కావు
శుష్కప్రియాలపైన ఈటెలూ తూటాలూ
పర వ్యామోహాల పనిపట్టే అస్త్రాలూ శస్త్రాలూ !
నువ్వన్నట్లు–
దేశభాషలో విద్యాబోధన
పాలన, న్యాయ అంశాల సరళీకరణ
వీటితోనే
మన తెలుగుకు ఎనలేని మన్నన
అమ్మనుడికే ఇక ఊరూవాడా సమాదరణ!

జంధ్యాల శరత్‌బాబు,
99483 45013

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు | తెలుగునుడి పండుగరోజు

గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

తొలి తెలుగు ఆధునిక భాషాశాస్త్రవేత్త: గిడుగు వేంకట రామమూర్తి



'**వ్యావహారిక** భాషా ప్రామాణ్య భానుడ'నీ, గ్రాంథిక భాషా గ్రహణం పట్టిన తెలుగును దాని నుంచి విడిపించి ప్రజల వాడుక భాషకు చేరువచేసిన భాషా వైతాళికుడు- గిడుగు అని అందరికీ ఎరుకే. అయితే ఆయన అత్యంత ప్రతిభావంతుడైన తొలి తెలుగు భాషాశాస్త్రవేత్త అని చాలామందికి తెలియదు. ప్రస్తుతం ఈ వ్యాసం ఆ లోటును పూడ్చేందుకు ప్రయత్నిస్తుంది.

అయితే ఆధునిక తెలుగు భాషాధ్యయనానికి నాంది పలికినది గిడుగు వేంకట రామమూర్తి పంతులు గారు 1908 నాడు మొదలుపెట్టిన వ్యవహారిక భాషోద్యమమే. తెలుగు భాషకు భవిష్యత్ క్రాంతికి మార్గదర్శకుడుగా సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న గ్రాంథికానికి బదులు వాడుకలో ఉన్న వ్యవహారికాన్ని తీసుకురావడానికి కొన్ని బలవత్తరమైన కారణాల నేపథ్యం ఉంది. ఆధునీకరణ చెందుతున్న సమాజం, ప్రజాస్వామికం అవుతున్న అక్షరాస్యత, విద్యాబోధన, ఆధునిక శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి దోహదం చేసేందుకు వీలుగా వైజ్ఞానిక సాంకేతిక అవసరాలు ఆధునిక భాషాభివృద్ధిలో భాగం కావాలనే తార్కిక చింతన, ప్రజాస్వామ్య పాలన ప్రజల భాషలో ఉండాలనే వాస్తవిక ఆలోచన, అందరికీ అక్షరాస్యతా సాధన దిశలో వాడుక భాష తప్ప గ్రాంథిక భాషకు చోటుండదని గుర్తించడం, కుల, మత, వర్గ, లింగ విచక్షణను పక్కనబెట్టి కొత్తగా తయారవుతున్న తెలుగు రచయితలకు ఊతంగా వాడుకభాషే ఉండాలనే తార్కిక నిర్ణయం -ఆ నిర్ణయానికి ఆలంబనగా ప్రజాస్వామ్యంలో ప్రజలకు చేరువయ్యేందుకు వాడుకభాష అవసరం అని అందరూ గుర్తించే దిశలో కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, వాడుక భాషాధ్యయనానికి భాషాశాస్త్ర పరిధిలో సరికొత్త ఆలోచనలను అందించారు. ఈ ఆలోచనా పరంపరే తరువాత నూరేండ్లపాటు జరిగిన భాషాశాస్త్ర పరిశోధనలకు ఆలవాలమయింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

విద్యలో వ్యావహారిక భాషే ఉండాలని 1919లో అత్యంత ప్రతిభావంత భాషాశాస్త్రవేత్త, ఉద్యమకారుడు శ్రీ గిడుగు వెంకట రామమూర్తి మొదలుపెట్టిన "తెలుగు" మాసపత్రికతో తెలుగుకు ఆధునిక యుగం మొదలైంది అని చెప్పాలి. గ్రాంథిక తెలుగు (క్లాసికల్ తెలుగు) అనేది కొంతమంది పండితులు పాఠశాలల్లో, కళాశాలల్లో, కొన్ని నియత రంగాలలో ఆనాడు ఉపయోగించబడుతున్న భాషా భేదం.

గిడుగు వెంకట రామమూర్తిగారు తమ సమకాలీన పడమటిదేశాల భాషాశాస్త్రజ్ఞులకు దీటుగా ఆధునిక భాషాశాస్త్రాన్ని నేర్చుకున్నారు. ఆ తరువాత విశాఖలో (1910-1912) భాషా శాస్త్రంలో ఉపన్యాసాలు చేశారు. ఆనాటి మేటి దేశ, విదేశీ భాషాశాస్త్రవేత్తలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. మొదట సవరభాషను ఆధ్యయనం చేసి వాచకాలు ప్రకటించారు. (1911-1918). ఇంకో ఇరవయ్యేళ్ళ తరవాత ఎ మాన్యువల్ ఆఫ్ సవర ల్యాంగ్వేజ్ (1931) ఆనే పేరిట వర్ణనాత్మక వ్యాకరణాన్నీ నిఘంటువునూ ప్రకటించారు. ఆటో జెస్పర్సన్ (Otto Jesperson) అనే భాషా శాస్త్రజ్ఞుడు ఇంగ్లీషులో రాసిన 'A Shorter English Grammar' ను గిడుగువారు వ్యావహారికంలోనికి అనువదించారని చేకూరి రామారావుగారు పేర్కొన్నారు (చూ. రామారావు, చే., 1986). 'ప్రత్యక్ష పద్ధతి'లో చేసిన భాషాబోధనతో భాషను నేర్చుకోవడం తేలికగానూ, త్వరగానూ సాధ్యమవుతాయని నిరూపించి, గిడుగువారు డేనియల్ జోన్స్ వంటి ప్రముఖ ధ్వనిశాస్త్రజ్ఞుల మెప్పు సంపాదించారు.

దేశ విదేశాలలో జరుగుతున్న శాస్త్ర పరిశోధనల ఆధారంగా ప్రచురితమైన భాషాశాస్త్ర పరిశీలనలనూ సంకలించి, వాటిని ఆకళించుకొని, ఆధునిక సామాజిక సిద్ధాంతాల నేపథ్యంలో తెలుగుభాషా స్థితిగతులను పరీక్షించి, తెలుగు భాషా విశ్లేషణపై అద్భుతమైన పట్టు సాధించారు. ఇది, ఆయన ఆనాడు ప్రచురించిన తెలుగు భాషాశాస్త్ర వ్యాసాలన్నింటా కనబడుతుంది. చేకూరి రామారావుగారు గిడుగు రామమూర్తిగారు వ్యావహారిక భాషావాది ఎందుకయ్యారు? అంటూ రాసిన ఒక వ్యాసంలో "తెలుగు భాషను గురించి ఆధునిక పద్ధతుల్లో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి" అని ప్రకటించారు. తెలుగు భాషా విశ్లేషణ గురించి ఆయన చేసిన వివేచనలు మౌలికమైనవేగాక భవిష్యత్తులో చేయవలసిన లోతైన పరిశోధనకు వీలుగా మార్గదర్శనం చేస్తున్నై. భాషకు సంబంధించిన ప్రతి అంశంలోనూ అంటే ధ్వని-వర్ణ నిర్మాణంలోనూ, పద నిష్పాదనలోనూ వాక్యనిర్మాణంలోనూ అనేక ప్రతిపాదనలు చేస్తారు. ఈ ప్రతిపాదనలు రాబోయే నూరేండ్ల తెలుగు భాషాశాస్త్ర పరిశోధనల కొలమానానికి

అవసరమైన తూనికరాళ్లను అందించినట్లైనై. 1912లో మద్రాసు గవర్నరుకు సమర్పించేందుకు తాను తయారు చేసిన "నేటి తెలుగును గురించి నివేదిక" అనుబంధాలలో ఆనాటికే తనకున్న వనరులతో గ్రాంథిక తెలుగుకూ వాడుక తెలుగుకూ మధ్య నలభై రెండు భేదక లక్షణాలను చర్చించారు. వాటిలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ చర్చించటానికి ప్రయత్నిస్తాను.

తెలుగు పదాలలోని అచ్చులలో వినబడుతున్న వివిధ ధ్వని భేదాలను మొదటిసారిగా గిడుగు రామమూర్తిగారే గుర్తించారు. ఉదాహరణకు తోట :: తోడు మొదలైన పదాలలోని మొదటి అచ్చు – ఓ ఉచ్చారణ, మీది :: మీద మొదలైన పదాలలోని మొదటి అచ్చు – ఈ ఉచ్చారణ ఒకేవిధంగా లేదు. అలాగే గుండు+ఆ నుంచి ఏర్పడిన గుండా, గుండె+ఆ నుంచి ఏర్పడిన గుండా, గుండ+ఆ నుంచి ఏర్పడిన గుండా పదాలలోని చివరి అచ్చు –ఆ ఉచ్చారణలో తేడాలు ఉన్నై. ఈ ఉచ్చారణా భేదాలతోపాటు, అర్థాలలో కూడా తేడా ఉంది. అయినప్పటికీ వాటిని మనం ప్రత్యేక అచ్చు గుర్తులతో రాయటం లేదు. కారణం, ఈ పలుకుబడిలోని తేడాలు ప్రాచీనాంధ్రంలో లేవనీ అందుకే లిపి సంజ్ఞలు ఏర్పడలేదనీ అంటారు. అలాంటి ఉదాహరణలే కోటు+ఆ –> కోటా, కోట+ఆ–> కోటా, కోటి+ఆ–> కోటా, మొదలైనవాటిలో కోటా లోని – ఆ అచ్చు ఉచ్చారణలు ఒకే రకంగా లేవు. ఇలాంటివే మేక+ఉంది :: మేకు+ఉంది నుంచి ఏర్పడిన మేకుంది లోని మొదటి అచ్చు–ఏ పలకడంలో ఉన్న తేడా. అచ్చులలో ఇలా ఉచ్చారణలో భేదం ఉన్నా, ఇట్లాంటి మాటలలోని అచ్చులను ఒకేరకంగా రాస్తున్నాం. ఇలా తెలుగు అచ్చులను పలకడంలో ఉన్న గుణాత్మక వైవిధ్యం నేటి రాతలో కనపడకపోవడానికి కారణం వీటిని ప్రాచీన వ్యాకరణాలు గుర్తించలేదు అంటారు. ఆధునిక భాషాశాస్త్ర ఆచార్యులైన భద్రిరాజు కృష్ణమూర్తి, జెరాల్డ్ కెల్లీ, చేకూరి రామారావు, లీ లిస్కర్, వెన్నెలకంటి ప్రకాశం, జే. వేంకటేశ్వరశాస్త్రి మొదలైనవారు ఎందరో ఈ అచ్చుల ఉచ్చారణ భేదాలపై పరిశోధనలు సాగించారు. ఆధునిక తెలుగు భాషాశాస్త్ర పరిశోధనలలో ఈ విధమైన ధ్వని భేదాలనూ వాటివల్ల పదాల గుర్తింపులో సమస్యలూ తద్వారా అచ్చులలో ఏర్పడిన సవర్ణ– వర్ణ స్థాయీ భేదాలకు సైద్ధాంతిక ప్రాతిపదికన పరిశోధనాంశాలుగా స్వీకరించి పరిష్కార మార్గాలను సూచించటానికి ప్రయత్నించారు. మరికొందరు వాటికి రాతలో లిపిచిహ్నాలను చూపించవలసిన అవసరం ఉందని సూచించారు. ఈ పదాలలోని అచ్చుల ఉచ్చారణలో మార్పులకు ప్రధాన కారణం అచ్చుల మధ్య ఆకర్షణ తద్వారా వాటిలోని ఆంశిక లక్షణాల విస్తరణతో అజాకర్షణ సూత్ర ప్రవర్తన, ప్రత్యేకంగా ఇక్కడ స్వర వివృతీకరణ సూత్రం చెల్లిందంటారు. 1912లో ప్రఖ్యాత బ్రిటిషు ధ్వని శాస్త్రవేత్త డేనియల్ జోన్స్ మద్రాసు విశ్వవిద్యాలయంలో ధ్వనిశాస్త్రం మీద ఉపన్యాసాలు ఇవ్వటానికి వచ్చినపుడు గిడుగు రామమూర్తి గారూ ఆయన కుమారుడు సీతాపతి గారూ ఈ స్వర వైవిధ్యాన్ని గూర్చి ఆయనతో చర్చించినట్టు తెలుస్తోంది. ఈ విషయంలో ఆనాడే రామమూర్తి గారు తెలుగులోని ఈ విధమైన ఉచ్చారణా భేదాలను ప్రత్యేకమైన ధ్వనిటైపురైటరుతో టైపు చేసి ధ్వని లిపిలో చూపిస్తూ ఓ పుస్తకాన్ని తయారు చేసినట్లుకూడా తెలుస్తోంది (చూ. రామారావు, చే., 1986).

గిడుగు రామమూర్తిగారి గ్రాంథికాంధ్రానికీ వ్యావహారికాంధ్రానికీ ఉన్న తేడాలను చెబుతూ పేర్కొన్న మరో పరిశోధనాంశం, ప్రాచీన తెలుగు పదాలలో పద మధ్య అచ్చులపైనుండే ఊనిక, పదాల మొదటికి చేరినందున, పదాల ఉచ్చారణలోనే గాక పదాల రూపురేఖలే మారినై. ఉదాహరణకు, ప్రాచీనాంధ్రంలో ఊనిక పదాంతానికి దగ్గరలో ఉండేది. దీనివలన పదంలోని మొదటి అచ్చుల ఉచ్చారణ బలహీనం కావడంతో తరువాతి అచ్చుల పక్కకు చేరి వాటితో కలిసిపోవడమూ పదాలలో రెండవ అక్షరంలో ఉన్న హల్లులు (ర,ల,ళ,న,మొ.వి) పదాదికి చేరటం కొన్ని సార్లు పదానికి సంయుక్తక్షరాలు ఏర్పడటం జరిగింది. ఉదా. నాకు (<* ఆనక) నారె (<* అనరె), నాన్ (<* అనన్), రెండు (<* ఇరందు), రోలు (<* ఒరలు) మొ.వి. ఈ మార్పుతో ఏర్పడిన కొన్ని మాటలు గ్రాంథిక తెలుగులో నిలిచిపోయాయి. అయితే, ఈ మార్పు ఆ తరువాత కొనసాగక ఆగిపోయింది. ఆధునిక తెలుగులో నిలిచిపోయాయి. అయితే, ఈ మార్పు ఆ తరువాత కొనసాగక ఆగిపోయిది. ఆధునిక తెలుగులో ఇలాంటి రూపాలు తక్కువ. అయితే ఇలా పదాది అచ్చు పదమధ్యన చేరటం, సంయుక్తాక్షరాలు ఏర్పడటం ఆనాటికే ద్రావిడ భాషా శాస్త్రం చదువుకున్నవాళ్లకు మాత్రమే స్ఫురిస్తుంది. అప్పటికి కాల్డ్వెల్ రచించిన ద్రావిడ లేక దక్షిణభారత భాషల తులనాత్మక భాషాశాస్త్రం అనే గ్రంథం మాత్రమే అందుబాటులో ఉంది. రామమూర్తిగారు ఈ గ్రంథాన్ని అధ్యయనం చేసినట్లు ఇక్కడ చర్చించిన విషయాల ద్వారా తెలుస్తోంది. అప్పటికి మనమెరిగిన ప్రముఖ ద్రావిడ భాషా శాస్త్రవేత్తల రచనలు అందుబాటులోకి రాలేదు. గిడుగు రామమూర్తిగారి ఈ విధమైన భాషాశాస్త్ర దృష్టి తెలుగువరకే గాక ద్రావిడ భాషల తులనాత్మక రచనల అధ్యయనం వరకూ సాగింది అని చెప్పాలి.

గిడుగు రామమూర్తిగారు పరుష–సరళాల మధ్యన కనబడే అయోమయాన్నీ తద్వారా ఏర్పడిన కడప–గడప, వెతకు–వెదకు, చితుకు–చిదుగు–చిదుకు–చితుగు మొదలైనవాటిలో కొన్నింటిని గ్రామ్యాలంటూ ఈసడించుకుంటున్న గ్రాంథికవాదులను ఉద్దేశించి, వాటి వ్యుత్పత్తిని సజాతీయభాషా పదాలతో సరిపోల్చి చూసి తెలుసుకుంటే–నేటి తెలుగు పదాల గురించి వాదులాటే ఉండదని పేర్కొంటారు. గిడుగు రామమూర్తిగారి భాషాశాస్త్ర వివేచనకు మచ్చుతునక గ్రాంథిక భాషలో కనబడే య'కార ఆగమం వ్యవహారిక భాషలో దాని లేమి. అయితే ఆయన య'కార ఆగమాన్ని ఇంగ్లీషు

గిడుగు 'ఏ మెమోరాండం ఆన్ తెలుగు'(1913), గురజాడ 'మినిట్ ఆఫ్ డిసెంట్'(1914) – ఈ రెండు పుస్తకాలూ తెలుగు వ్యావహారిక భాషోద్యమ చరిత్రలో నిలిచే తోరణ స్తంభాలని చెప్పవచ్చు – పోరంకి దక్షిణామూర్తి

పదాలలోని దీర్ఘాచ్చుల చివరన కనబడే య్, వ్ ల లాంటి వాటితో పోలుస్తారు (ఉదా. see [sij], go [gow], do [duw], way [wej]). ఉదా. ఈ+ఊరు > ఈయూరు లాంటి పదబంధాలలో మొదటి పదంలోని చివరి అచ్చూ, రెండవ పదంలోని మొదటి అచ్చూ ఒకదాని పక్కన ఒకటి చేరినప్పుడు ఆ పదబంధంలోని రెండో అక్షరంలోని -య్- సంధి స్వరమైన ఈ [i:j] లోని రెండవ అంశం నుంచి ఏర్పడింది అంటారు (చూ. రాధాకృష్ణ, 1991). అయితే నేటి తెలుగులో ఇలా య'కార ఆగమం రాదు. ఇలా రెండచ్చులు ఒకదాని పక్కన ఒకటి చేరినప్పుడు, అది దీర్ఘాచ్చు కానప్పుడు, మొదటి అచ్చుకు లోపం జరగటం నేటి తెలుగులో సర్వసాధారణం. కానీ గ్రాంథిక తెలుగులో అచ్చుల మధ్య య'కార ఆగమం తప్పనిసరి అనీ అలా కాక సంధి జరిగి అచ్చులోపించిన రూపాలు అసాధువులని కొట్టి పారేయటం ఔచిత్యంకాదని వాదించారు.

భాషలో సహజంగా వస్తున్న మార్పుకు లోనై ఏర్పడిన కొత్త రూపాలు గ్రామ్యాలు అంటూ తీసివేయడం అవివేకమని వాదించారు. ఇలాంటిదే తెలుగుకు అతి సహజమైనదీ, అతి విలక్షణమైనదీ అయిన ధ్వని సూత్రం అజాకర్షణ లేక అచ్చుల సమీకరణం. రెండూ అంతకంటే ఎక్కువ అక్షరాలు ((హ*)అ(హ*)(హ)అ(హ*)((హ)అ(హ*)*)) ఉన్న పదాలలో మొదటి అచ్చు తప్ప మిగిలిన అచ్చులు ధ్వని ఆంశిక లక్షణాలతో సమసిస్తాయి. అచ్చులలో కనబడే ఈ లక్షణం ప్రత్యేకంగా నామపద, క్రియాపద రూప నిష్పత్తిలో విస్తృతంగా కనబడుతుంది. ఉదా. కొలిమి+లు ->ట కొలుములుగా మారుతుంది. దీనిలో బహువచన ప్రత్యయమైన లు'వర్ణకంలోని ఉత్వం కొలిమి లోని మొదటి అచ్చు 'ఒ'ను తప్పించి లిమి'లను లుము'లుగా మార్చివేసింది. పదాలలో జరుగుతున్న ఈ మార్పును సాంప్రదాయిక వ్యాకరణాలు గుర్తించినా అజాకర్షణ సూత్రాన్ని ఏ వ్యాకరణమూ ప్రతిపాదించలేదని చెబుతూ మరుదులు లేక మఱుదులు మొదలైనవాటిని గ్రామ్యాలుగా పరిగణించడం విడ్డూరమని గిడుగు రామమూర్తిగారు పేర్కొంటారు. **ఇంకా ద్రావిడ భాషలన్నింటిలోకెల్లా తెలుగులోనే ఈ అజాకర్షణ సూత్రం విస్తృతంగా ప్రవర్తిల్లుతోందనీ అంతేగాక దీనివల్లే తెలుగుకు ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అనే పేరు వచ్చిందనిగూడా ఆయన అంటారు.**

కొన్ని క్రియాపదాల వాడుకపై వ్యాఖ్యానిస్తూ ప్రాచీన తెలుగులో కొన్ని ధాతువులు సహాయక క్రియల పొందులేకుండా వాడుకలో ఉండేవి, అయితే నేటి తెలుగులో సహాయక క్రియలు తప్పనిసరి అని పేర్కొంటూ ఈ కింది ఉదాహరణలు చూపిస్తారు. ప్రా.తె. వ్రేలు :: వ్రేలెను, నే.తె.లో వ్రేలాడెను (వ్రేలు+ఆడు+ఎను); ప్రా.తె. పాఱు :: పాఱెను, నే.తె.లో పారిపోయెను; ప్రా.తె. నాకది వలయును :: నే.తె.లో నాకది కావలెను. ఇలాంటిదే మరొకటి, ప్రాచీన తెలుగులో అకర్మక క్రియలు నేటి తెలుగులో సకర్మకాలుగా వాడుక ఉంది, ఉదా. ప్రా.తె. నాకుం గరుణింపుము :: నే.తె. నన్ను కరుణింపుము, మొ.వి. చారిత్రక తెలుగు భాషావ్యాకరణంపై ఆయనకు ఉన్న పట్టును సూచిస్తున్నాయి.

వ్యావహారిక భాషా బహిష్కార నిరసనము గురించిరాస్తూ "భాష పరమార్థము కాదు, అర్థసిద్ధికి సాధనము, ఉపకరణము వంటిది." అంటూ ఆనాడే భాషపట్ల హేతుబద్ధమైన తర్కాన్ని ప్రవేశపెట్టడం ఆ రోజుల్లో ఆయన ముందుచూపుకూ తార్కిక దృష్టికి తార్కాణం. ఇంకా చెబుతూ "చిన్నప్పటినుండిన్నీ అందరికీ సామాన్యముగ అలవడ్డ భాషకన్న ప్రయత్న పూర్వకముగా నేర్చుకొంటేనే కాని రాని భాష భావబోధకు అధికానుకూలమైన సాధనమవుతుందా?" అని ప్రశ్నిస్తారు.

తాను మొదలుపెట్టిన తెలుగు పత్రికకు పరిచయ వాక్యాలలో, తెలుగు భాష గురించి రాస్తూ, క్షేత్రాధ్యయనానికి పరిథులు లేవు. ప్రభుత్వంవారు ప్రారంభించిన భాషా పరిశోధనను మనం ముందుకు తీసుకు వెళ్లాలి. నేడు, వ్యాకరణాధ్యయన అవసరాలు మారినై. వ్యాకరణాధ్యయనం నేడు జీవ శాస్త్రం, మానవవికాస శాస్త్రాలతో ప్రభావితమైంది. భాషాధ్యయనం సిద్ధాంతాల రాద్ధాంతాలబడి గడ్డకట్టుకుపోవడం కాదు నిరంతర మార్పులతో సజీవంగా సహజంగా ఎప్పటికీ కొనసాగుతుండేది భాష అని పేర్కొంటారు. పదాల అర్థాలలో మార్పులూ చేర్పులూ, అర్థ విస్తరణలూ, అర్థ సంకోచాలూ, అర్థాపకర్ష ఇతర ఆలంకారిక ప్రయోగాలతో మార్పు చెందుతూ నిత్య సెలయేరులా పారుతుండేదే భాష. దేశ, విదేశీ భాషలనుంచీ వచ్చిన ఎన్నో అరువు పదాలు తెలుగు నోళ్లల్లో బడి నాటుపదాలలా ఒరిగిపోతాయి అంటారు.

"భాషాశాస్త్ర దృష్టికోణంలో మాండలికాలను అధ్యయనం చేసి, సామగ్రిని సేకరించి మాండలిక పదకోశాలను తయారుచేయాలి." అంటారు. ఈ విషయంలో పడమటి దేశాలలో మాండలికాల అధ్యయనం ఎంతగానో అభివృద్ధి చెందిందని పేర్కొంటారు.

చివరిగా ఆయన మాటల్లో, "వ్యాకర్తలు భాషను నిర్దేశించరు, దాన్ని అనుసరిస్తారు. వ్యాకర్తలు చేయవలసినదల్లా వాస్తవాలను ఒప్పుకొని తమ సమకాలీన వాడుక భాషను తమ శక్తి సామర్థ్యాలతో వర్ణించటమో లేక వ్యాకరించటమో చేయడం." అంటారు.

గిడుగు రామమూర్తిగారు 'నేటి తెలుగు గురించి నివేదిక'లో తాను చర్చించిన అంశం అత్యంత ప్రాధాన్యంగల సామాజిక సమస్యగా పరిగణిస్తున్నాను అని రాస్తూ, తెలుగు సమాజ సంక్షేమం, వాడుక భాషకు లభించే సరైన పరిష్కారం మీద ఆధారపడివుంటుంది అని అన్న వాక్యాలు ఈనాటికీ తెలుగువారందరూ చదివి తలకెక్కించుకోవలసినవే.

సంప్రదించిన రచనలు:

చేకూరి రామారావు. 1986. రామమూర్తిగారు వ్యావహారిక భాషావాది ఎందుకయ్యారు? మరోసారి గిడుగు రామమూర్తి, వ్యాస సంకలనం, పుటలు, 94-100. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్టు.

పోరంకి దక్షిణామూర్తి. 2014. గిడుగు వేంకట రామమూర్తి రచనా సర్వస్వం. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

బూదరాజు రాధాకృష్ణ. 1991. నేటి తెలుగు-నివేదిక. మూలం: గిడుగు వేంకట రామమూర్తి. 1912. A Memorandum of Modern Telugu కి అనువాదం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్..

రచయిత - విశ్రాంత ఆచార్యులు, కేంద్ర విశ్వవిద్యాలయం హైదరాబాదు, భారతీయ భాషా శాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షులు.

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు
తెలుగునుడి పండుగరోజు

గిడుగు వేంకట రామమూర్తి

భాషను స్థిరీకరించగలవారెవ్వరు?



మనుష్యుడి మెదడు ప్రతులు తీసే యంత్రమూ కాదు. అతడి నాలిక పునరావృత్తి చేసే యంత్రమూ కాదు.”

మద్రాసుప్రెసిడెన్సీ కాలేజీలో తెలుగు పండితులైన మ. రా.శ్రీ వి.సుబ్బారావు గారు “ఆధునికాంధ్ర వచన రచనా విమర్శన”లో తెలుగు భాష తొమ్మిది వందల సంవత్సరాల క్రిందటనే పరిష్కరింప బడ్డదని “స్థిరీకరింప” బడ్డదనీ, యింగ్లీషు యింకా మార్పులు చెందుతున్నదనీ, ఇప్పటికిన్నీ శుద్ధం కాని, స్థిరీకరింపబడని యితర భాషలు మారినవని తెలుగులో కూడా మారుపాటులున్నవనటం అర్థరహిత మన్నారు* తెలుగు ఇంగ్లీషుకన్నా వుత్తమ భాష అని, ఇంగ్లీషువారికి తమ భాషను పరిష్కరించుకోవలసిన అక్కర లేకపోయినా, తెలుగువారు, తమ ప్రాచీన భాషను ఎట్టిస్థితిలోనూ ‘చెడి’ పోనీరాదనీ ఆ పండితుని వుద్దేశ్యం. నవ్యాంధ్రపరిషన్నాయకులీ సిద్ధాంత ప్రకటనను అనుమోదించారు. వారు ప్రభుత్వానికి సంతకాలతో ఒక వినతిపత్రం సమర్పిస్తూ “గ్రాంథికాంధ్రంలో విప్లవాత్మకమయిన మార్పులు తేవాలనే ప్రచారాన్ని నిరాదరించ”మన్నారు.

ఇంగ్లాండులోనే కాక జర్మనీ, ఫ్రాంసు దేశాలలోనూ మన పండితులవలెనే తమతమ భాషలను స్థిరీకరించి వాటిని సర్వనాశనంనుంచి కాపాడాలని ఆతురపడుతున్న విద్యావంతులెవరో వుండేవారని ఈ సనాతన పండితుడూ, ఆయన శిష్యులూ, తెలుసుకొంటే వారికి జ్ఞానాభివృద్ధి కలుగవచ్చు. ప్రొఫెసర్ లౌన్స్‌బరీ అంటాడు.* “గతకాలపు వ్యక్తుల ముందొక ప్రత్యేక లక్ష్యం వుండేది ; అది వారి మాటలలో భాషను స్థిరీకరించటం. అది వక్కసారి సాధింపబడితే భాష మరి యెట్టి మార్పులనూ పొందదు. ఒకవేళ పొందినా అట్టిది అత్యంత సంకుచిత పరిణామంలోను, అదిన్నీ క్రమనిర్దిష్ట మార్గాలలోనూ మాత్రమే మారుతుంది. అపశబ్ద ధోరణులు – అవి నిజమైనవా, ఊహింపబడినవైనా – ఆ విధంగా శాశ్వతంగా నిరోధింపబడతాయి. సాహిత్యం వున్న ప్రతి దేశంలోను, ప్రతి కాలంలోను ఈ విధమైన నమ్మకం బహుళ వ్యాప్తిలో వుంటూవున్నది. విద్యావంతు లీవాదానికి చనవు యివ్వటం ప్రత్యేకంగా ఆశ్చర్యకరమైంది. భావవ్యక్తీకరణ సాధనంగా భాషను వారెంత ఎక్కువగా వినియోగించినా, సాధారణంగా భాషాచరిత్రను, దాని స్వభావాన్ని మారుస్తూ వుండే విభిన్నపు భావాలను గురించి వారికున్న జ్ఞానం అల్పాల్పమైనది. బెంట్లే వంటి మేధాశాలియైన పండితుడు ఈ వాదాన్ని ఉద్ఘోషించినప్పుడు ఈ భావం ఎంత బాగా వారి మనస్సులలో నాటుకపోయిందో తెలుస్తుంది. ఆయన “ఇకమీద మరో విదేశం మనపై దండెత్తి ఆక్రమించకుండావుంటే ప్రజలకు తమ భాషమీద ఏపాటి గౌరవమైనా వుంటే ఇంగ్లీషు భాషను మార్పుల కతీతం చేయటం కష్టసాధ్యమైన వుపాయం కాజాలద”ని వ్రాశాడు.

తరువాత కాలంలో కూడా, 1747లో ప్రచురింపబడిన తన నిఘంటురచనాప్రణాళికలో డాక్టర్ జాన్సన్ తన మహాప్రయత్నానికి “ఇంగ్లీషు భాషను స్థిరీకరించడం” ఒక ప్రధాన లక్ష్యమని ప్రకటించాడు. కాని, భాషాస్వభావాన్ని గురించి కొంచెంగానైనా తెలుసుకోకుండా వక వ్యక్తి ఆ భాషలోని శబ్దజాలాన్ని స్వీకరించలేడు. తన పని పూర్తికాగానే ఆయన ఈ ప్రత్యేక దోషంనుంచి బయటపడ్డాడు. ‘మానవ వ్యవహారాలన్నీ మారుతూవుండగా, మనుష్యులందరి ఆలోచనలను భావాలను పునరుక్తి చేసే భాష మార్పు చెందకుండా వుంటుందని వూహించడం అర్థరహిత”మని ఆయనే అన్నాడు” (చూ.లెస్లీ స్టీఫెన్, పుట 38) ఆంధ్ర నిఘంటుకారు లింతకన్నా సరిదిద్దరానివారు కారనుకొంటాము.

“చాలామంది సనాతనవ్యక్తులకు ఒక భాషను స్థిరీకరించాలంటే

---

* “ఇంగ్లీషులో భాషాసంస్కార మింకనూ జరుగుతున్నదని స్వీటు లోనగువారు వ్రాసివున్నారు. ఇంగ్లీషువారికి చక్కని భాష ఒక్కటి యేర్పడి 411 సంవత్సరము లయినవి. మనకు భారతము పుట్టి 900 సంవత్సరములయినవి. అప్పటికీ మనభాష సంస్కారములు పొంది శుద్ధమైనది. సంస్కార శుద్ధములు గాని భాషలు మారుపాటు చెందుతున్నవని శుద్ధమైన మన భాషను మార్చుకోవలసినదేనా?

* “ప్రయోగ ప్రమాణం” అన్న అతని గ్రంథం నుంచి ఈ భాగమూ, మరికొన్ని కూడా గ్రహింపబడ్డవి.

భౌతికంగా కాకపోతే మానసికంగానైనా ఆ భాషాభాషులందరూ చావటం ప్రథమావశ్యకత అన్న ప్రాథమిక సూత్రాన్ని గ్రహించట మసాధ్యమనిపిస్తుంది. ఇప్పటివారిలో కొందరికి కూడా ఈ అసాధ్యత వర్తిస్తున్నది. అప్పుడు మార్చేవాడొక్కడూ వుండడు కాబట్టి భాష మార్పులు చెందనే చెందదు."

భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేశారని చెప్పదగిన బెంట్లే, జాన్సన్ వంటి విద్వాంసులే యిలాటి అభిప్రాయాలను వ్యక్తీకరిస్తుంటే, భాష కేవలం భావవ్యంజనసాధనమని మాత్రమే తెలిసిన అక్షరజ్ఞానవంతుల నుండి యింత కన్నా జ్ఞానవంతమైనదే మాశింపగలము? భాషను స్థిరీకరింప నిచ్చగించడం బహుళ వ్యాప్తిలోవున్నది. విశ్వాసంతో ఉద్ఘోషింపబడ్డది కూడా. ఆంగ్ల భాషా రచయితలలోని కొందరుత్తమ జ్ఞానవంతులు నమ్మి వుద్ఘాటించడమేకాక యూరపుఖండంలోని విభిన్న సాహిత్య భాషలలో రచించినవారు కూడా వీరి వంటివారే వారు – ఇలాగే అన్నారు. "వ్యక్తులు అలవాటుగా తాము వాడుతున్న పదాలయొక్క చారిత్రక పరిణామాలను గురించి, వ్యాకరణ పరిణామాలను గురించీ ఏమీ ఎరుగరు. అందుచేతనే గతశతాబ్దులలో భాషా విషయకమై ఉత్పన్నసమర్థనీయం కాకపోయినా వ్యాఖ్యాన మొకటి వున్నది."

"ఇతోధికంగా వున్న భాషల క్షీణదశకు అచంచల నిదర్శనలుగా వారు సమకూర్చుతున్న దురుదాహరణలను, వారి హెచ్చరికలనూ, వాటిని గురించి ప్రజలు ప్రదర్శించిన నిర్లక్ష్యభావాన్నీ చూచినవారికి గతకాలవుటనుభవాలు అర్థవంతమగు సూచనలిస్తాయి. పూర్వ పూర్వ కాలాలలో తమలాగా తెలివితక్కువగా భావించిన ప్రముఖ వ్యక్తుల అభిప్రాయాలతో తాముగా పరిచితులైతే అర్వాచీనులకు వృథాకాలహరణం తప్పుతుంది."

భాషను పునీతం చేయదలచేవారికి మహాసమర్థుడైన ప్రతినిధి స్విఫ్ట్ : 1710 నాటి (నెం. 230 గల) "టాటర్" సంచికలో "ఇంగ్లీషు భాషలోని నిరంతర భ్రష్టత"ల నతడు నిందించాడు : "కాస్ట్, మాబ్" మొదలైన కత్తిరింపు మాటలను "షామ్, బ్యాంటర్, బుల్లీ" మొదలైన విరుద్ధపదాలను గురించి నిష్ఠూరపడ్డాడు కాని తరువాత తన ప్రయత్నాలు విఫలమైనవని అంగీకరించాడు. "కొంతకాలంగా మాబ్, బ్యాహ్"ల అభివృద్ధిని నిరోధించడానికి నేను చేయదగినదంతా చేశాను. కాని నాకు సహాయం చేస్తామన్నవారు మోసగించారు. : వారి సంఖ్యాబలానికి తలవొగ్గాను."

ఆ విధంగానే ఆంగ్లభాషను పరిష్కరించి స్థిరీకరించడానికి వక పరిషత్తును స్థాపించవలెనన్న ఆతని సంకల్పం పనికిమాలినదని నిరూపితమైంది. వార్బర్టన్, జాన్సన్లు దాన్ని వ్యతిరేకించారు. స్విఫ్ట్ సంకల్పం భాషా సాధారణ స్వభావజ్ఞానంలాగా లేదని, ఇతర భాషల చరిత్రను గురించిన సరియైన జ్ఞానమతనికి లేదనీ, ఆ వూహలలోని అర్థరాహిత్యాన్ని గ్రహించిన నిఘంటుకారుడు వర్ణించాడు.

"బహుశా భాషాస్వరూపాన్ని గురించి కొంచెం గూడా అప్పటికి తెలియని స్థితిలోవున్న పూర్వమహాపురుషులు భాషను క్రమబద్ధం చేయడమనే భావనలోని హేత్వాభాసాన్ని గ్రహించలేకపోయారంటే ఆశ్చర్యకరం కాదు ; ఫలితంగా అట్టి ప్రతినిధి సంస్థల ఉపయోగితలోని విశ్వాసం దేశవ్యాప్తం కావలసి వచ్చింది. ఫ్రెంచి పరిషత్తు కేవల ప్రభుత్వ పరిరక్షణలో వుండి కూడా ఫ్రెంచి భాషను స్థిరీకరించటంలో విఫలమైంది. ఆ సంస్థ స్థాపింపబడిన తరువాత శతాబ్దంలో యింకా మారింది(నవ్యాంధ్ర సాహిత్య పరిషత్తువారు వారి అడుగుజాడలనే అనుసరిస్తారా?) పరిషత్తుల ప్రయోజకత్వపు భావాల మీద నమ్మకం చచ్చిపోతూవుంది; అలాంటి సంస్థలు భాషాస్వభావపరిజ్ఞానం వృద్ధి చెందుతున్నందున ప్రజాభిరుచిని పొందజాలవనిపిస్తుంది.

ఒక భాష మారకుండా ఆవడానికి ఆ భాషాభాషి (సమాజమంతటికి) "సరిగా" మాట్లాడమని, వ్రాయమని జాగ్రత్తగా నచ్చచెప్పట మొక్కటే అత్యంత ప్రయోజనకర పద్ధతి; అంతేగాని, ప్రభుత్వ శాసనాలు, పరిషత్తుల 'అంక్షలు, విశ్వవిద్యాలయ నిబంధనలు, కాకపోతే నిఘంటువులు, వ్యాకరణాలూ అందుకు పనికిరావు. మహారచయితల గ్రంథాలెప్పుడూ మర్యాదావంతంగా వుండి, ఎప్పుడూ అధిక సంఖ్యాకజనంచేత చదువబడి పరిశీలింపబడుతూవుండి, ఆ గ్రంథాలలోని శబ్దజాలం, భావనలూ వ్యావహారికభాషతో ఏకీభవించి సజీవంగా శక్తిమంతంగా వున్నట్లయితే, సాహిత్యం జాతీయభాష మీద తన సాంప్రదాయిక ప్రభావాన్ని తప్పకుండా ప్రసరిస్తుంది. నిర్బంధ విద్యావిధానం వుండి, వుపాధ్యాయులు పదాల వుచ్చారణోపయోగాల విషయంలో జాగరూకులై వుండి, గ్రంథాలు తమనాటి భాషలో వ్రాయబడుతూవుండి, పిల్లలకు చదువు మీద అభిరుచి కల్పించబడివుంటే, అలా వున్నదేశంలో, బహుశా, భాషాపరిణామం వీలైనంత తక్కువగా వుంటుంది. కాని యిప్పట్లో నూటికి తొంభైయిద్దరకు పయిగా తెలుగువారు సంతకమైనా చేయలేరన్న యథార్థాన్ని దృష్టిలో పెట్టుకొన్న దురదృష్టు డెవడూ నవ్యాంధ్రసాహిత్య పరిషత్తుగాని విశ్వవిద్యాలయంగాని, పాఠ్యగ్రంథనిర్ణాయక సంఘంగాని తెలుగుభాషను స్థిరీకరించగలమని పందెంకాచినప్పుడు విశ్వసించలేడు.

తెలుగుభాష తొమ్మిది వందల సంవత్సరాల పూర్వమే స్థిరీకరింపబడ్డదనీ, అప్పటినుంచీ మారలేదనీ, సులభంగా నమ్మేవారెవ్వరు? పబ్లిక్ పరీక్షలనుంచి తెలుగు విద్యార్థులను పరీక్షించడానికి గ్రాంథిక కవిత్వంలోని పదపదానికి ప్రచురింపబడుతున్న టీకలను గురించి, "గ్రాంథికాంధ్రభాషను" అర్థం చేసుకోలేని తెలుగు పట్టభద్రుడి అశక్యతను గురించి, మనమేమని భావించాలి? తెలుగుభాష తొమ్మిది శతాబ్దాల సుదీర్ఘకాలానికి మునుపే "స్థిరపడి" వునట్లయితే సాహిత్యక భాషాశాస్త్రవైషయిక బహిరంగ చర్చలలో ఆ "స్థిరభాష"ను

తెలుగుపండితులెందుకు పరిహరిస్తున్నారు? ఇది తెలుగు మారిందని నిష్కర్షగా నిరూపిస్తున్నది; కాని ఆదర్శపురుషంమన్యులకొక నమస్కారం –ఆ పండితుడు తన భాషనే తనది కాదంటున్నాడు ; తాను గణనీయులలో వకడు కాగలందులకై, గ్రాంథిక వీరస్వరంలో తనకు ప్రవేశానుమతి లభించగలందులకై ఆతడు ఎప్పుడూ (జయప్రదంగా చేయలేకపోయినా) "ప్రామాణిక" కావ్యాలలోని పురాతనభాషను ప్రత్యుత్పత్తిచేయ ప్రయత్నిస్తున్నాడు. ఈ వాక్యమే గ్రాంథిక భాష తెలుగు తొమ్మిది వందల సంవత్సరాల క్రితమే స్థిరపడిందన్న పండితప్రవచనానికి భాష్యం చెబుతుంది. నవ్యాంధ్రసాహిత్య పరిషత్ నాయకులు, "పదివేలమంది తెలుగు పౌరులూ" ఆ వాదసామంజస్యానికి సాక్ష్యమిచ్చినా, అది అర్థరహితం, అబద్ధం కాకపోదు : యథార్థాలు దాన్ని అప్రమాణికరిస్తాయి ; భాష అంటే ఏమిటో తెలిసినవా డెప్పుడూ ఎన్నటికీ దాని నమ్మలేదు. ఏమైనా "సంప్రదాయాదర్శం" యథార్థ, మాతృభాషను ఘోరంగా నిర్లక్ష్యం చేయడానికి దారితీసింది; సమాజానికి జ్ఞానసంపాదనసాధనాలను, సాహిత్యాభిరుచిని పెంపొందించుకునే మార్గాలు లేకుండా చేసింది. వంగభాషను గురించి చక్కని .కరపత్రం ప్రచురించిన బాబూ శ్యామచరణ గంగూలీ, "ఒక కులానికే జ్ఞానాన్ని పరిమితం చేయుటయే లక్ష్యమైతే, వ్యవహృతభాషకన్నా లిఖిత భాష విపరీతంగా వేరుపడనివ్వటంకంటె తెలివిగల వుపాయం వుండజాలదు అలాటి కుయుక్తి పాపపరిపక్వంగానే వుంటుంది." వాల్టర్ ర్యాలీ శైలిని గురించిన వ్యాసంలో దీనికర్థ మేమిటో మనసుకు హత్తుకొనేలాగా విశదీకరించాడు.

"పరిణామమధ్యంలో స్థిరత్వం, ఏకతలోనే అస్థిరత – ఇదే భాషకు సరైన అంచనా. పాండితిని ఒక బృహదాశ్రయంగా, సభ్యతకు శాశ్వత నివాస స్థానంగా పరిణమింపజేయ ప్రయత్నించటాన్నిబట్టి, లేక, మధ్యాధ్గామిస్వభావాన్ని తమకు ఆపాదింపజేసుకొని పరిణామశిఖరాలపై విహరించటాన్ని బట్టి రచయితలు "సాంప్రదాయిక కవులు, భావకవులు అని విభజింపబడుతున్నారు. భావకవులు వ్యక్తివాదులు, స్వతంత్రులు ; వారి ఉద్వేగమయమంత్రోచ్చాటన ధోరణులకు సురక్షితానురూపతలుగల మహానగరాలుద్భవించి నీరవతను పోగొట్టలేవేమోగాని వారి కంఠస్వరానికి ఆకర్షింపబడి నక్షత్రగోళాలు తమ కక్ష్యలనుంచి దూసుకొనివచ్చి భయంకర దృశ్యాలను కల్పించగలవు. జ్వలదాత్మనుంచి బహిర్గమించిన వెలుగులో వారికి, సంఘం న్యాయం పనికిమాలిన గంధర్వ నగరాలుగా భాసిస్తాయి. ఆత్మవ్యక్తీకరణ సాధనకై చేసే ప్రయత్నాలలో వారు దూరంగా వుండి తమ జీవితాలను యమయాతనలు పెట్టారు. భాష యిచ్చే సర్వసాధనాలను, సర్వవిధానాలనూ వారు రంధితో స్వాధీనం చేసుకొంటారు; ఈ వక్క లక్ష్యసాధనకై రూపొందిస్తారు; నూతన శాస్త్రాలలోని పదభండారాన్ని వారు దోచుకుంటారు – లేదా విచిత్ర భ్రష్టభాషలను సృష్టిస్తారు. భాషలో అట్టి పదాలు సరిపడకపోయినా, తమ వాగ్యంత్రానికి సరిపడగలందులకై, వారు ప్రాతబడ్డ మాటలను అలంకరిస్తారు; లేకపోతే నిర్లక్ష్యంగా కొత్తవాటిని కలిపి కొట్టారు. సామాన్యావసరాలకు సరిపడిన తమదేశపు నుడికారాలను అవగతం చేసుకోక, వాటిని అన్ని దశలలోను వేటాడి స్వకీయాభిరుచికి తగినట్లుగా రూపాంతరీకరిస్తారు. సులభసాధ్యంకానిదేదైనా వైయక్తికత్వం తక్కువగా వుండే లక్ష్యాలవైపు మెల్లగా పురోగమించే సంప్రదాయవాద సమాజానికి, వృత్తిధర్మాన భిన్నమతావలంబులైన వీరు వ్యతిరేకులు. ఆధునిక విమర్శవల్ల సంప్రదాయాదర్శమనే యీ ఉదాత్తతకు చాలీ చాలని న్యాయం జరిగింది. విశ్వవ్యాప్త నాగరకతకు సాహిత్యాన్ని మకుటాయమానచిహ్నంగా తీర్చిదిద్దటం సర్వకాలాలలోను ఉత్తములుగా ఎన్నికైనవారిని ఏకత్రపరిచి వక మహోజ్జ్వలసభగా నిర్మించి గౌరవించటం, ప్రశ్నీయంకాని వక అవ్యాహత మర్యాదకు తలవొగ్గటం క్రమబద్ధత, తర్కబద్ధతలకైన మానవ జాతి చేసిన వేర్వేరు ప్రయత్నాలను కలిసికట్టుగా వక్కత్రాటిపై నడిపి భిన్నభాషలగందరగోళాన్ని వినష్టం చేయటం – ఇవన్నీ నిశ్చయంగా శ్రమయోగ్యమైన త్యాగయోగ్యమైన లక్ష్యాలే. సంప్రదాయవ్యతిరేకుల స్వయంవ్యంజకత్వం చాలామంది స్తుతి పాఠకులను సంపాదించుకొన్నది కాని, నవ్యకవిత్వోద్యమపుపండితులు తమ దేశభక్తిని, చిన్ననాటి మాతృభాషను, ప్రాచీనులతో పౌరసత్వసమభాగులం కావాలని, విద్యకు విశ్వాధికారులైన వారితో కలిసిమెలిసి జీవించాలనీ, వదలుకొన్నప్పటికంటె ఇప్పుడు గమ్యానికి యింకా దూరంగావున్న ఈ యితర కార్యంకోసమై బహిర్గమించిన ఆత్మధిక్కారాన్ని ఎవరు నగర్వంగా చెప్పుకొన్నారు ? సిసిరోకుటుంబంలోను, వర్జిల్ ధార్మిక బృందంలోను లెక్కకువస్తే చాలునని, పండితులు, వ్యాకర్తలు, చమత్కారులు, కవులు తమ విజ్ఞానజ్యోతిని, కష్టార్జితమైన స్వీయవిజయఫలితాలను మృతభాషాముఖవస్త్రంలో కప్పిపుచ్చి తృప్తి పడ్డాడు. విధికృతంగా పతనం కాదగిన ఉదాత్త భ్రాంతి అది. భాషలోని బహుముఖీన మేధావంతులు వారి ఊహా ప్రపంచపు ఏకరూపతకు వ్యతిరేకంగా గర్జించారు. కాలం పరిపక్వమైనప్పుడు తమకు తామ్వై దేవత్వాన్ని పొంది పరివారదేవతాకోటిలో స్థానం సంపాదించినవారే, స్వప్నజగత్తులోని ఆ నిర్మిత నగరాలలో నివసించవలసివున్న వారే, విప్లవకారుల నాయకులవైపుకు చెల్లాచెదరుగా చేరుకున్నారు. ఆ మహాస్వప్నదర్శకుల సమాధిమీది చరమశ్లోకం వ్యంగ్యశాసనంగా వుండి 'సంప్రదాయ' కవి అనగా 'చనిపోయిన భావకవి' అని నిర్వచిస్తున్నది."

భాష లేకపోతే భావం లేదు; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

వాస్తవానికి భావకవులు సరియైనవారు : సంప్రదాయాదర్శంలోవున్న స్వచ్ఛత పక్షవాతం మరణం అనే వాటిలోని స్వచ్ఛతవంటిది. పదాల వుపయోగాన్ని గురించిన సర్వజనాంగీకారం భావవ్యక్తీకృతిని సులభం చేస్తుంది. అయితే బాష భావబంధనంలో విపరీతంగా చిక్కుకపోతే, వ్యక్తీకరించడానికి ఏమీ మిగలదు. సంప్రదాయ పద్ధతియొక్క అడుగుజాడలలోనే భావశూన్యత పయనిస్తుంది. సుదీర్ఘపతనావస్థద్వారా ప్రతిబింబప్రాయమైన మహిమలచేత భావశూన్యత అంతటా దాస్యమే చేస్తుంది. నిర్నిరోధమై అపూర్వవ్యక్తిగతానుభవంకూడా పాతచట్రంలో బిగించబడినందున వెలవెలబోతుంది. తన సర్వస్వాన్నీ బైబిలులోనో, షేక్స్పియర్ రచనలలోనో, మహాభారతంలోనో దర్శించాలని ఉద్దేశించే వ్యక్తి, అలా చేయకపోవడమే మంచిదనుకున్నాడు. అట్టివాడు తనసృష్టికర్త కొక ప్రతిబింబం, ఒకఛాయ ; సృష్టికర్త కతడొక విమూఢదూషణ పత్రికా ప్రాయుడు. పునరుక్తిదోషానికతడు మొదటినుంచీ కట్టుబడి వుండనివాడు. "ఎంత నేర్పరియైనా వకసారి చూచిన వస్తువును మరోసారి చూడలేని, ఒకసారి జరిగినపని మరి పునరావృతం కాని ఈ పరిభ్రాంతవిశ్వంలో, భాష వక్కటే స్థిరత్వానికి, చరమస్థితికి పనికివచ్చేదని భావించటమే సాంప్రదాయికతావాదులలోని దోషం." తన్ను ఆ విధంగా బంధితురాలిని చేయదలచినవారిమీద ప్రకృతి పగదీర్చుకొంటుంది ; వారి యథార్థాలు ఆభాసలుగా పతనం చెందుతాయి ; వారు ప్రకృతికోసం నిర్మించిన హిమభవనాలలోనే వారి భావోద్వేగం చస్తుంది. శాశ్వతత్వం కొరకు వారుచేసే గవేషణలోనే వారు అయదారులు, అర్థశూన్యులు, నియమబద్ధులు, సాధారణీకరణ ప్రియులు, నిర్జీవకంకాళ పోషకులు అవుతారు :: వారి కళ శాస్త్రంగా మార్చబడుతుంది ; వారిభాష శాస్త్రీయ పదజాలంగా మారుతుంది; నిర్వికారతయే వారి ఆదర్శం, అది మృత్యుదేవత హస్తాలలోనే వారికీ లభిస్తుంది. పదాలు జీవించాలంటే అవి మారాలి. మరి వకపదం వకసారి స్థిరీకరింపబడితే కళాప్రయోజనాలకు పనికి రాకుండా పోతుంది. సాంప్రదాయిక రచనా పద్ధతి ఏలక్ష్యం వైపుకు మొగ్గుతుందో దానితో పరిచయం సంపాదించదలచినవారు శాస్త్రీయ పదజాలంలోనే ఆ లక్ష్యాన్ని వెదక వలసి వుంటుంది. శాస్త్రంలో పదాలు స్థిరీకరింపబడి చచ్చిపడివున్నాయి. అది వక రంగూ వాసనాలేని ఎండబారిన విత్తనాలపోగు – నామవాచకాలనే మోడుబారినతోట. దానిలో ప్రతి వక్క సంజ్ఞా ఏదో వక లక్ష్యంతోనో భావంతోనో వలుపుతో కట్టబడ్డవే. ఎండిపోయిన పుల్లలకు లాటిన్ (లేక సంస్కృతపు) భాషలో చీట్లు కట్టటంతో సతమతమవుతున్న శ్రామికుడి ప్రశాంతిని చెరుస్తూ ఆ తోటలో గాలి వీచదు ; సూర్యుడు ప్రకాశించడు.

(గిడుగు వేంకటరామమూర్తి రచనా సర్వస్వం–వ్యాసాలు
– పుట 57 తెలుగు అకాడమీ ప్రచురణ)

గౌతమీ గ్రంథాలయానికి రాసినది

రామమూర్తిగారు రాజమండ్రి గౌతమీ గ్రంథాలయాన్ని సందర్శించినప్పుడు లైబ్రరీ నోట్సులో రాసిన లేఖ :

నేను ఈ పట్టణమునకు వచ్చినప్పుడెల్లా గౌతమీ గ్రంథాలయమునకు వెళ్ళి అందులోని కొన్ని పుస్తకాలు అడిగి పుచ్చుకొని చదువుతూ ఉంటాను. నా పనికి అనుకూలముగా గ్రంథాలయాధికారులు నేను కోరిన సాయము చేస్తూ ఉంటారు. చెన్నపట్టణమందు దొరకని పుస్తకములు కొన్ని ఇందులో ఉన్నవి. గ్రంథాలయాధికారులు ప్రయత్నము చేస్తే తెలుగుదేశములోని యిండ్లలో తాటాకు పుస్తకములున్ను పూర్వకాలమందు ముద్రితములయిన గ్రంథముల ప్రతులున్ను ఇంకా అనేకముగా దొరకకపోవు. సారస్వత చరిత్ర, భాషా చరిత్ర నిర్మించుటకు పూర్వకాలపు శాసములున్ను, గ్రంథములున్ను ప్రధానమయిన ఆధారములు, అది ఆవశ్యకమని అందరికి తెలుసును. అచ్చుపడ్డ పుస్తకముల విషయములో కూడా మొదటి కూర్పు ప్రతులే కాక ఆ పిమ్మటి కూర్పులు ప్రతులున్ను సంపాదించవలసినవని విన్నవిస్తున్నాను. భారతాది ప్రాచీనాంధ్ర కావ్యముల వ్రాత ప్రతులు దొరికినన్ని సంగ్రహించడము వల్ల లాభమున్నది. పరిష్కర్తలు భ్రమ ప్రమాదాది దోషము వల్ల పాడయిన పాఠములు వీటి సాయమున దిద్దుకోవచ్చును.

అఖిల లోకోపకారమయిన గ్రంథముల గురించిన్ని అనేకముగా వ్యావహారికాంధ్రభాషను సుబోధకముగా మన పూర్వీకులు రచించేవారు. ఆ సంప్రదాయము ఈ కాలమందు నింద్య మయినది. పూర్వ గ్రంథముల వ్రాతప్రతులు కొన్ని చెన్నపట్టణములో ఉన్నవి. అట్టివి ఈ గ్రంథాలయమందు ఉండవలెను. పూర్వ సంప్రదాయము చొప్పున వ్యవహారిక భాష అపరిమిత ప్రయోజనమైనది. ఆ సంప్రదాయము చొప్పున రచించిన గ్రంథాలయము స్వకీయభవనమునందు సంస్థాపితమైనది. అక్కడ పుస్తకాలు చదువుకొనేవారికి నిండా అనుకూలముగానే గదులున్నవి. ఆంధ్రదేశమునకు ఈ గ్రంథాలయము ప్రధాన విద్యాలయముగా వృద్ధి పొందగలదని నమ్ముతారు. గ్రంథాలయాధికార్ల ఉద్యమము సార్థకమయినది, మిక్కిలి కొనియాడదగినది.

తేది 29 జూలై 1924
గి.వే.రా, పర్లాకిమిడి

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు | తెలుగునుడి పండుగరోజు

ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

భాషా వైతాళికుడు గిడుగు



"దేశభక్తి అంటే మా దృష్టిలో భాష మీద అభిమానమే. మాట్లాడుతున్న భాషను కాదని, మృత భాషను పూజించటం ఎలాంటిదంటే, ఆకలితో మాడి చస్తున్న సాటి మనిషికి అన్నం పెట్టకుండా, చనిపోయిన వారి పేరుతో, బ్రాహ్మణులకు శ్రాద్ధ భోజనం పెట్టడంలాంటిది"

తొలి ఆధునిక తెలుగు భాషావేత్తగా, అంతర్జాతీయ భాషా శాస్త్రవేత్తగా, భాషాసంస్కర్తగా, సవర భాషా సేవకుడుగా, వ్యావహారిక భాషోద్యమ పితామహుడుగా, పాఠ్యగ్రంథ రచయితగా, పీఠికల రచయితగా, గ్రంథ పరిష్కర్తగా, ఉత్తమ అధ్యాపకుడుగా, నిఘంటు నిర్మాణకర్తగా, నిఘంటువుల విమర్శకుడుగా, లక్షణ గ్రంథాల విమర్శకుడుగా, వ్యాకరణ గ్రంథాల విమర్శకుడుగా, శాసనాల పరిశీలకుడుగా, పరిశోధకుడుగా, వ్యాసకర్తగా, మహావక్తగా, రచయితగా, ప్రతికా సంపాదకుడుగా... ఇలా దేశ విదేశాల్లో ప్రముఖుల చేత ప్రశంసలు అందుకున్న గొప్ప మేధావి "కళాప్రపూర్ణ" గిడుగు వేంకటరామమూర్తి గారు.

పుట్టుకతోనే కొందరు గొప్పవారుగా పుడతారు. మరికొందరు పరిస్థితుల ప్రభావం వల్ల గొప్పవారు అవుతారు. కొందరు స్వయంకృషి చేత జీవితంలో గొప్పతనం సాధిస్తారు. గిడుగు స్వయంకృషి చేతనే మహానుభావుడయ్యారు. మహాపురుషులు తమ సమకాలీనుల మీద తమ ప్రభావం చూపుతారు. అంతేకాదు తర్వాత తరాల మీద కూడా వారి ప్రభావం బాగా కన్పిస్తుంది. దీనికి మంచి ఉదాహరణ గిడుగు. తన జీవితాన్ని భాషోద్యమం కోసమే త్యాగం చేసిన కార్యశూరుడు గిడుగు. ఆయన గూర్చి ఒక్క మాటలో చెప్పాలంటే "భాషా తపస్వి" గిడుగు. ఇలాంటివారు ఆంధ్రప్రదేశ్‌లో పుట్టడం మన అదృష్టం.

భాష అంటే ఏమిటి? భాష వల్ల ప్రయోజనాలు ఏమిటి? భాష ఎప్పటికప్పుడు మారుతుందా? లేదా? భాషా పరిణామం అంటే ఏమిటి? మానవ విజ్ఞాన వికాసంలో భాష పాత్ర ఏమిటి? అనే విషయాలపై మన సంప్రదాయ పిడి పండితులకు కనీస అవగాహన లేదు. తెలియదు కూడా. **పండితుల అజ్ఞానమే గిడుగుకు ఆయుధం అయింది. అదే వ్యావహారిక భాషోద్యమంగా మారింది.**

సృష్టి ఆది నుంచి వున్న భాష జానపద సాహిత్యం. జాతి జీవనాడులన్నీ జానపద భాషలోనే చక్కగా ఒదిగి పోయాయి. అదే నిజమైన తెలుగు భాష. అదే జీవద్భాష కూడా. పండితులు ప్రారంభం నుంచి ప్రజల వాడుక భాషను చిన్న చూపు చూశారు. ప్రజల భాషకు పట్టం కట్టలేకపోయారు పండితులు. **బుద్ధుడు ప్రజల భాషను, ప్రజలను ప్రేమించాడు, ఆదరించాడు, గౌరవించాడు. ప్రజలకు దగ్గరయ్యాడు. అందుకే గురజాడ "ఈ దేశంలోంచి బౌద్ధం మటుమాయమై పోయినపుడే, ఈ దేశం మత విషయకంగా ఆత్మహత్య చేసుకుంది" అని అన్నారు.**

ప్రజల భాషలో అంటే వాడుక భాషలో నన్నయ భారతాన్ని అనువదించలేకపోయాడు. శివ కవులు మొట్టమొదటగా ప్రజల భాషకు పట్టం కట్టారు. తమ భక్తి ఉద్యమాన్ని, వాడుక భాషలో ప్రజల దగ్గరకు తీసుకెళ్ళిన ఘనత శివ కవులకు దక్కుతుంది. తిక్కన భారతంలో తెలుగుదనం కన్పిస్తుంది, కాని ప్రజల భాషకు చోటు లేదు. ఎర్రన, శ్రీనాథుని యుగాల్లో పండితుల భాషే రాజ్యమేలింది. వేమన ప్రజల భాషకు ప్రాముఖ్యం ఇచ్చాడు. ప్రజలకు చేరువయ్యాడు. రాయలు "దేశభాషలందు తెలుగులెస్స" అన్నా, వాడుక భాషకు విలువ ఇవ్వలేదు. 17, 18 శతాబ్దాల్లో కూడా పండితుల భాషే గౌరవించబడింది. **కవులు తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించారే కాని, ప్రజల భాషలో రచనలు చేయలేకపోయారు. వందల యేళ్ళ నుంచి సామాన్య జనాలకు తెలుగు భాష కేవలం మాట్లాడుకోవడానికి, విని ఆనందించడానికి మాత్రమే పరిమితం అయింది. పాలకుల భాష వేరు. పాలితుల భాష వేరుగానే వుండిపోయింది.**

తెలుగువారి జనజీవనంలోకి సంస్కృతం అన్ని రూపాల్లోనూ చొచ్చుకుపోయింది. చివరకు సంస్కృత భాష లేకపోతే, తెలుగు భాషకు మనుగడ లేదన్న భావన ఏర్పడింది. అంతేకాదు సంస్కృతం నుండే తెలుగు భాష పుట్టిందనే గుడ్డి వాదన బలంగా పాతుకుపోయింది.

పాశ్చాత్యుల పరిశోధన పుణ్యమా అని, నిజాలు బట్టబయలు అయ్యాయి. పిడిపండితుల వాదనకు తెరపడింది.

ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో కందుకూరి తెలుగు సాహిత్యరంగంలోకి అడుగుపెట్టారు. తనదైన ధోరణిలో నిబద్ధతతో, సామాజిక సేవ సాహిత్యసేవ చేశారు. ప్రజలకు దగ్గరయ్యారు. 19వ శతాబ్ది చివరలో వాడుక భాషకు సాహిత్య గౌరవం తెచ్చినవారు– గురజాడ. వెయ్యి సంవత్సరాల్లో ఎవ్వరూ చేయని, చేయలేని ధైర్యం, సాహసం గురజాడ చేశారు. భాషకూ, సాహిత్యానికీ సమాజానికీ మేలు చేశారు. వ్యావహారిక భాషావాదాన్ని ఉద్యమస్ఫూర్తితో గిడుగు నడిపారు. **ఆధునిక దృష్టి, శాస్త్రీయ దృక్పథం, భాషానైపుణ్యం ఇవన్నీ గిడుగులో పుష్కలంగా వున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే గిడుగులాంటి మహా పండితుడు సమకాలీనుల్లో ఎవ్వరూ లేరు. భాషా భాస్కరుడు గిడుగు.**

ఆంధ్రదేశంలో ఒకే మారు మూడు ఉద్యమాలు వచ్చాయి. ఒకటి జాతీయోద్యమం. రెండు సంఘ సంస్కరణోద్యమం. మూడు భాషోద్యమం. కందుకూరి సంఘసంస్కరణోద్యమానికి నాయకత్వం వహించారు. గిడుగు భాషోద్యమానికి సారథ్యం వహించారు.

కేవలం గ్రాంథిక భాషలో రచనలు చేయడం చాలా కష్టం. అది ఎవరితరమూ కాదు కూడా. తప్పనిసరిగా అందులో వ్యావహారిక భాష చోటు చేసుకుంటుంది. అది కాల ప్రభావం. ఈ జ్ఞానం కూడా గ్రాంథిక భాషావాదులకు లేదు. రాదు కూడా. మన వ్యాకరణాలు అసమగ్రంగానూ, పరస్పర విరుద్ధంగానూ వున్నాయి. ఏ ఇద్దరూ ఒకే భాషకు వ్యాకరణం రాసినా, ఇద్దరి వ్యాకరణాలు ఒకే రకంగా వుండవు. అందువల్ల ఏది తప్పు, ఏది ఒప్పు అని నిర్ధారించడం చాలా కష్టం. అందువల్లే పూర్తిగా గ్రాంథిక భాషలో ఒక గ్రంథం కూడా రాలేదు. కాబట్టి గ్రాంథిక భాషావాదమే నూటికి నూరుపాళ్ళు తప్పు. గ్రాంథిక భాషావాదులు ప్రాచీన కవుల కావ్యాల్ని లోతుగా పరిశీలించలేకపోయారు. వాళ్ళకు అంత జ్ఞానం లేదు. పైపైనే చూశారు. వారికి అంత సత్తా లేదు. అంత ప్రతిభ కూడా లేదు. ఆ కారణంగా పండితులు, వ్యాకరణకర్తలు, పదకోశకారులు, తప్పుగా భావించారు. అదే పనిగా లక్షణ విరుద్ధాలయినవి గ్రామ్యాలని నిరూపించారు. కవుల ప్రయోగాలే మనకు పరమ ప్రామాణికం. కాబట్టి ఇతరులు చెప్పిన విషయాలను పరిగణలోనికి తీసుకోకూడదు. ఆ పద్ధతి తప్పు కూడా. **ప్రాచీనకాలంలో పండితుల కోసం, పండితుల చేత, పండితుల గురించే సాహిత్యం వచ్చింది. ఈ విషయం మన అందరికీ తెలిసిందే. కేవలం కొంతమంది కోసం ముఖ్యంగా వాళ్ళ స్వార్థం కోసం సాహిత్యం వచ్చింది. ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకున్నారు గిడుగు.** ప్రజల కోసం, ప్రజల భాషలో, ప్రజల గూర్చి, ప్రజా సాహిత్యం రావాలి. కావాలి. అందుకే ప్రజా ఉద్యమంగా భాషోద్యమం నడిపారు గిడుగు. విజయం సాధించారు. ప్రముఖులచే మన్ననలను పొందారు.

తాను చెప్పదలచుకున్న భావాల్ని, తాను నమ్మిన సిద్ధాంతాల్ని, భాషా విలువల్ని తూచ తప్పకుండా నిర్మొహమాటంగా నిర్భయంగా, ప్రజలకు చేరవేసిన ఘనత గిడుగుకి మాత్రమే దక్కుతుంది. కాకారాయుళ్ళకు జేజేలు కొట్టడం కానీ, భజనపరులకు దాసోహం అవ్వడం కానీ, ఆయనకు అలవాటు లేదు. ఆ అవసరం కూడా లేదు. **ఆయనలో రాజీ మనస్తత్వం భూతద్దం పెట్టి వెతికినా కన్పించదు.** వున్నది వున్నట్లు ఢంకా పగల కొట్టినట్లు, చెప్పడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

గిడుగు ఎన్నో వైవిధ్యపూరితమైన, పరిశోధనాత్మకమైన, విమర్శనాత్మకమైన, విశ్లేషణాత్మకమైన, తులనాత్మకమైన ఉత్తమ రచనలు చేశారు. ఇలాంటి రచనలు ఇంతవరకు ఎవ్వరూ రాయలేదు. ఆ ప్రతిభ, ఆ పట్టుదల, ఆ పాండిత్యం, ఆ భాషా నైపుణ్యం, ఒక్క గిడుగుకే వుంది. ఇదే విషయాన్ని చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు నొక్కి వక్కాణించారు కూడా. అందుకే గిడుగు "పిడుగు" అయ్యారు.

గిడుగు రాసిన రచనలో "బాలకవి శరణ్యం", "ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం", "గద్య చింతామణి", "వ్యాసావళి", "సూర్య రాయాంధ్ర నిఘంటువు విమర్శనం" మొదలైనవి చెప్పుకోదగ్గవి. గిడుగు వ్యావహారిక భాషావాదం స్థాపించడం కోసం చేసిన కృషిలో భాగంగా ఈ గ్రంథాలు వచ్చాయి. **కలాన్ని కత్తిగా మలచి ప్రజల్లో భాషా చైతన్యాన్ని కలిగించారు గిడుగు.** వ్యావహారిక భాషా గొప్పతనాన్ని గూర్చి గిడుగు చెపుతూ "స్వభాష స్వగృహం వంటిది. స్వేచ్ఛగా మనము మన ఇంటిలో వున్న ప్రతి వస్తువు ఎక్కడ ఏ మూల వున్నదో చీకటిలోనైనా తెలుసుకోగలిగినట్లే, స్వభాషలో మన అభిప్రాయములు మన ఊహలు స్వేచ్ఛగా తెలియజేయగలము" అని అన్నారు.

చిన్నయసూరి "బాలవ్యాకరణం"లోని దోషాన్ని ఎత్తి చూపడం కోసం గిడుగు "బాలకవి శరణ్యం" అనే అద్భుతమైన విమర్శ గ్రంథం రాశారు. ఈ గ్రంథంలో గిడుగు ప్రతిభా ప్రజ్ఞా పాటవాలు చాలా స్పష్టంగా కనబడుతున్నాయి. "బాలకవి శరణ్యం" గ్రంథాలన్ని బాలవ్యాకరణ విస్తరణ గ్రంథంగానూ, మంచి విమర్శ గ్రంథంగానూ మనం భావించవచ్చు.

భాషా పరిణామం ఎలా మారుతుందో ఈ గ్రంథంలో గిడుగు వివరించారు. సమగ్రమైన సాహిత్యాధ్యయనం లేకపోవడం వల్ల, భాషకు తీవ్రమైన నష్టం జరిగిందని గిడుగు వాపోయారు. తెలుగు భాషకు వ్యాకరణాలు, లక్షణ గ్రంథాలు, రాసిన పండితులకు భాష విషయంలో సంపూర్ణ జ్ఞానం లేకపోవడం వల్ల, చాలా దోషాలు వచ్చాయని గిడుగు 'బాలకవి శరణ్యం'లో తీవ్రంగా విమర్శించారు. ఈ గ్రంథంలో గిడుగు పదాల సాధుత్వాన్ని ఉదాహరణ పూర్వకంగా నిరూపించారు. అదే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు కూడా. ప్రాచీనాంధ్ర భాష మారదని, గ్రాంథిక వాదులు వాదించారు. **భాష నిరంతరమూ మారుతుందని గిడుగు వాదన.** కవుల ప్రయోగాలకు అను శాసనం లేనంతమాత్రాన, వాటి సాధుత్వానికి భంగం లేదని నొక్కి వక్కాణించారు గిడుగు. అదే మాటపై చివరివరకు వున్నారు. అలాగే పరిశోధనలు కూడా చేశారు. గ్రాంథిక భాషావాదులను చిత్తుచిత్తుగా ఓడించారు. వీరి అమూల్యమైన సూచనల్ని తర్వాత వ్యాకర్తలు అనుసరించారు. మార్గదర్శకంగా తీసుకున్నారు.

నిఘంటుకారులు, వ్యాకర్తలు, పండితులు, లక్షణకారులు, అసాధువులుగా భావించి, గ్రామ్యాలుగా చెప్పిన వేలకొలది పదాలకు ప్రాచీన కవుల ప్రయోగాలు కన్పిస్తున్నాయి. అందువల్ల ఆ ప్రయోగాలన్నీ సాధువులు అవుతాయని గిడుగు వాదన. తన విమర్శతో గిడుగు

పండితుల కళ్ళు తెరిపించారు. జ్ఞానోదయం కలిగించారు. **"బాలకవి శరణ్యం" గ్రంథం చూసి గ్రాంథిక భాషావాదులు గుండెలు బాదుకున్నారు.** గిడుగు ప్రతిభను చూసి యావత్తు ప్రపంచం బిత్తరపోయింది. గిడుగు ప్రజ్ఞ ముందు గ్రాంథిక వాదుల ప్రతిభ వెలవెల పోయింది. ఉత్తి ఆర్భాటం తప్ప, వాళ్ళ దగ్గర సరకు లేదని, పసలేదని ప్రపంచానికి తేటతెల్లమయింది. గిడుగు ప్రతిభలో నెం. వన్ అయ్యారు. ప్రభుత్వం గిడుగు ప్రతిభను గుర్తించి గౌరవించింది. ఆయన ప్రతిభకు పట్టాభిషేకం జరిగింది. గిడుగు అభిమానులు ఆనందంలో మునిగి తేలియాడారు. అప్పుడు గ్రాంథిక భాషావాదులు ఎక్కడు వున్నారో ఎవరికీ తెలియకుండా పోయారు.

భాషాక్రమ పరిణామాన్ని బట్టి, కాలాన్ని బట్టి, దేశ పరిస్థితులను బట్టి, వ్యాకరణ గ్రంథాల విస్తరణ అవసరం అన్న గిడుగు అభిప్రాయంతో ఆధునిక వ్యాకరణాలు కొన్ని వచ్చాయి. వాటిలో ముఖ్యమైనవి మల్లాది సూర్యనారాయణ శాస్త్రి "ఆంధ్ర భాషానుశాసనం", వడ్లమూడి గోపాల కృష్ణయ్య" వ్యావహారిక భాషా వ్యాకరణం, వజ్జల వెంకటేశ్వర్లు "ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం", వెన్నెలకంటి ప్రకాశం "వెన్నెలకంటి వ్యాకరణం" మొదలైనవి. **గిడుగు ఆశించిన ఆధునిక దృక్పథంతో సమగ్రమైన ఆధునిక తెలుగు వ్యాకరణం రాలేదు. ఈ పరిణామం విచారించదగ్గ విషయం.** మనం గిడుగును ఆదర్శంగా తీసుకుని ఆధునిక తెలుగు వ్యాకరణం రూపొందించుకోవాలి. అప్పుడే భాష ఆధునికీకరణ అవుతుంది.

వేదం వేంకటరాయ శాస్త్రి గారి గ్రంథాల్లో వుండే దోషాల్ని చెప్పడం కోసం "ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం" అనే గ్రంథాన్ని గిడుగు రాశారు. "భిషక్కు" అంటే "వైద్యుడు" అని అర్థం. "భేషజం" అంటే వైద్యుని ప్రవృత్తి అని అర్థం. అంతేకాక "భేషజం" అనే పదానికి డాంభికం, అతిశయం అనే అర్థాలు కూడా వున్నాయి. తెలుగు భాషా పండితుల్ని వైద్యులుతో పోల్చి రామమూర్తి గారు "ఆంధ్ర పండిత భిషక్కులు'' అని వ్యవహరించారు. భాషా తత్త్వాన్ని సరిగా తెలుసుకోకుండానే, పండితులు తమకే అంతా తెలుసునని అహంకారంతో ప్రవర్తించారు. తమ సాటివారినైనా, ఇతరులయినా, ఎవరికీ ఏమీ రాదని, అంతా మాకే వచ్చుననే భ్రమలో వుండి, అలాగే ప్రవర్తించడాన్ని గిడుగు "భాషా భేషజం" అని అన్నారు.

కొక్కొండ వేంకటరత్నం, వేదం వేంకట రాయశాస్త్రి, మానవల్లి రామకృష్ణకవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీభట్ల బ్రమ్మయ్యశాస్త్రి, వడ్డాది సుబ్బారాయుడు లాంటి వారిని గిడుగు ఆంధ్ర పండితాభిషక్కుల వర్గంలో చేర్చారు. ముఖ్యంగా వేదం వారిని దృష్టిలో పెట్టుకుని విమర్శించిన గొప్ప గ్రంథం ఇది. "ఆంధ్ర ప్రసన్న రాఘవం విమర్శనం" అనే గ్రంథాన్ని వేదం వారు రాశారు. ఇందులో 121 అంశాల్ని నిశితంగా పరిశోధించి, వారి గ్రంథమంతా తప్పుల తడకలతో కూడుకొని వున్నదని నిర్ధారించారు. అంతేకాదు వారి పాండిత్యమంతా డొల్ల అని తేల్చి చెప్పారు. **వేదం వారికి వ్యావహారిక భాషే కాదు, గ్రాంథిక భాష కూడా రాదని ఉదాహరణ పూర్వకంగా విమర్శించారు.** మహాపండితులైన గ్రాంథికవాదుల గ్రంథాల్లో గ్రాంథికానికి విరుద్ధమైన అనేక ప్రయోగాలు వున్నాయని నిరూపించారు. ముఖ్యంగా వేదం వారి విమర్శలోని అనౌచిత్యాన్ని, మాత్సర్యాన్ని లోకానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ రచనకు పూనుకున్నారు. **వేదం వారిని చీల్చి చెండాడారు. వేదం వారు మారు మాటలాడలేకపోయారు. గిడుగు ప్రతిభ అలాంటిది. గురజాడ చెప్పింది అదే "జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును".**

గిడుగు ఎంత ప్రతిభావంతుడో అంత గొప్ప పరిశోధకుడు. ఒక ప్రయోగం సాధువు అని చెప్పడానికి ఒక్క "భారతం" నుంచే 19 ప్రయోగాలు ఉదాహరణగా ఇచ్చారు. వేదం వారు అజ్ఞానంగా వెంకటరత్నం గారిని వేళాకోళం చేసి, విమర్శించారని గిడుగు తీవ్రంగా ఖండించారు. వేదం వారికి ప్రాచీనాంధ్ర భాషా సంప్రదాయం అసలు తెలియదని గిడుగు దుయ్యబట్టారు.

గిడుగు తమ వాడుక భాషా సిద్ధాంతానికి ఆధారంగా ప్రాచీన రచయితల వచన రచనల సంకలనం ''గద్య చింతామణి''. ప్రాచీనకాలంలో వచనం వ్యావహారిక భాషలోనే వుందని నిరూపించడం కోసం దీన్ని రూపొందించారు గిడుగు. ఈ గ్రంథం ద్వారా అనుకున్న ప్రయోజనాన్ని సాధించారు. నిజమైన భాషా సంప్రదాయం ఏమిటో ఇందులో చక్కగా వివరించారు. **అన్ని యుగాల్లో, అన్ని కావ్యాల్లో వాడుక భాష చోటు చేసుకుందని గిడుగు వాదన. దానికి గిడుగు ఎన్నో ఉదాహరణలు చూపించారు.** ప్రజలు మాటలాడే భాషను ప్రేమించి, ప్రజాస్వామ్యంలో భాషయొక్క ప్రాముఖ్యతను గూర్చి చెప్పిన విఖ్యాత భాషావేత్త గిడుగు.

"వ్యాసావళి"లో మంచి వ్యాసాలు వున్నాయి. ఈ వ్యాసాల్లో జీవద్భాష గొప్పతనం గూర్చి, ప్రయోజనం గూర్చి వివరించారు. సూర్యరాయాంధ్ర నిఘంటువులోని లోపాలను చెప్పడం కోసం "సూర్యరాయంధ్ర నిఘంటువు విమర్శనం" రాశారు. శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువుల గూర్చి గిడుగు చేసిన విమర్శలు, వారి నైఘంటిక విజ్ఞానాన్ని తెలియజేస్తున్నాయి. గిడుగు దృష్టి వ్యాకరణాలపైనే కాక, నిఘంటువులపైన కూడా పడింది. ఆధునిక నిఘంటువుల్లో పసలేదనీ, ఎక్కువ దోషాలు వున్నాయని తీవ్ర పదజాలంతో విమర్శించారు. గిడుగు మహా పండితుడు, గొప్ప మేధావి అని చెప్పడానికి ఆయన రాసిన వ్యాకరణ విమర్శ, నిఘంటు విమర్శలే ప్రధాన కారణం.

వ్యావహారిక పదజాలం ఉదాత్త విషయాలను తెలపడానికి పనికి రాదని గ్రాంథికవాదులు స్వార్థంతో గుడ్డిగా వాదించారు. గిడుగు దాన్ని తీవ్రంగా ఖండించారు. అంతేకాదు వ్యావహారిక భాష జీవనది వలె నిత్యమూ మార్పుకు లోనవుతుందని చెప్పిన ఆదర్శమూర్తి గిడుగు. వాడుక భాషోద్యమానికి సారథ్యం వహించి, గ్రాంథిక భాషావాదుల కళ్ళు తెరిపించారు గిడుగు. వీరు భాషకూ, సమాజానికి ఎంతో మేలు చేశారు. గ్రాంథిక భాషావాదుల డాంబికాల్ని గిడుగు తూర్పారపట్టారు.

"అమ్మా! నీ భాష కావాలి నిప్పులు చెరగటానికి చెమటను జల్లెడపట్టి సంపదలను తీయటానికి తెలుగు పౌరుషాగ్ని రాజెయ్యడానికి మాతృభాష కావాలి" **–ఛాయరాజ్** ('మాతృభాష'– కవిత)

కొమ్ములు తిరిగిన మహామహా పండితులకే సంస్కృతం సరిగా రాదని ఉదాహరణ పూర్వకంగా విడమర్చి మరీ తెలియజేశారు.

చిన్నయసూరి లాంటి గొప్ప వ్యాకరణకర్తకే సంస్కృత పరిజ్ఞానం తగినంతగా లేదన్నారు. **భారతాన్ని సరిగా చదవకుండా అప్పకవి లక్షణ గ్రంథం రాయడానికి పూనుకున్నాడని గిడుగు ఎద్దేవ చేశారు.** గిడుగు అంటే ఆ కాలంలో పండితులందరికీ భయం. భయం. మహా మహా పండితులు కూడా గిడుగు ప్రతిభను చూసి, ధారణాశక్తిని చూసి, భాషా పరిశోధనను చూసి, ఆశ్చర్యపోయారు. అదే గిడుగు ప్రత్యేకత. విశిష్టత.

గ్రాంథిక భాషపై ద్వేషం కానీ, చిన్న చూపు కానీ, గిడుగుకు లేదు. గ్రాంథిక భాష పరిమితులు, ప్రయోజనాలు వేరు అనీ, ఎప్పటికప్పుడు భాష మారుతుందనీ, దానికి అనుగుణంగా వ్యావహారిక భాష వుంటుందనీ నొక్కి వక్కాణించారు. సమాజంలోని అన్ని వ్యవహారాలు వాడుక భాషలో కొనసాగాలని గిడుగు వాదన. "వ్యావహారిక భాష తల్లి వలె నాకు ప్రేమ పాత్రం. ప్రాచీనాంధ్ర భాష మూలపుటమ్మవలె నాకు పూజ్యురాలు" అని గిడుగు అన్నారు.

గిడుగు భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసుల్ని సంతరించుకుంది. ఆయన ఉద్యమం తెలుగు భాషా సాహిత్యాలపై చెరగని ముద్ర వేసింది. ప్రజాస్వామ్యం, ప్రగతి పథంలో ముందుకు నడవాలంటే భాషా సంస్కరణ తప్పనిసరి. ఆ పని గిడుగు చేశారు. "గ్రాంథిక భాష పరిమిత ప్రయోజనము కలది, వ్యావహారిక భాష అపరిమిత ప్రయోజనము కలది" అని అన్నారు.

గిడుగు సమగ్రమైన తెలుగు వ్యాకరణం రావాలని కోరుకున్నారు. కందుకూరితో "ఆధునిక వ్యాకరణం" రాయించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. కందుకూరి రాయడానికి సిద్ధమయ్యారు. కందుకూరి చనిపోవడంతో ఆ వ్యాకరణం ప్రారంభంలోనే ఆగిపోయింది. గిడుగు కోరుకున్న ప్రధానమైన ఆశయాలు రెండు. అవి ఇప్పటికీ నెరవేరలేదు. విచారించదగ్గ విషయం. ఒకటి ఆధునిక వ్యాకరణం. రెండు సమగ్రమైన తెలుగు నిఘంటువు. ఈ రెండు ఎంత త్వరగా వస్తే అంతగా తెలుగు భాషకు మేలు జరుగుతుంది. గిడుగు ఆశయ సాధన కోసం ప్రభుత్వం, మేధావులు, భాషావేత్తలు, ముందుకు రావాలి.

ఈ రోజు అన్ని రంగాల్లో వాడుక భాష బాగా చోటు చేసుకుంది. ఇది అంతా గిడుగు పుణ్యమే. ఈ భాషా పరిణామం హర్షించదగ్గది. ఇంతటి విజయానికి మూలస్తంభమైన గిడుగు చిరస్మరణీయులు.

"గిడుగు వేంకటరామమూర్తి పంతులు తెలుగువారికి చేసిన మహోపకారం తరతరాలు విస్మరింపగలేనిది. తెలుగుభాష గురించి ఆయనంత పరిశ్రమ చేసినవారు, ఆయనంత పండితులు ఈ శతాబ్దిలో మరొకరు లేరు. వ్యక్తిగా ఆయన మహోన్నతుడు. శక్తిగా అసదృశుడు. అంతర్జాతీయ ఖ్యాతినందిన భాషావేత్త. మనస్వి. సామాజిక అభ్యుదయోద్బోధన పరాయణుడు. పండితుల నిరంకుశత్వాన్ని ఎదిరించి భాషా సాహిత్యాల సంకెళ్ళు వదిలించిన సంప్రదాయ పరిరక్షకుడు."

– అక్కిరాజు రమాపతిరావు

రచయిత – తెలుగు భాషా చరిత్ర, సాహిత్య చరిత్ర, సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, ఆధునిక భాషాశాస్త్రం, మున్నగు 88 గ్రంథాలు రచించారు. గ్రూప్ 1,2, సివిల్స్ పరీక్షల్లోనూ ఇతర అనేక ఉద్యోగాలకి సంబంధించిన పరీక్షల్లోనూ వీరి గ్రంథాలపైనే విద్యార్థులు ఆధారపడతారు. అనేక పరిశోధనా పత్రాలు వ్రాశారు.

కవిత

నిఘంటువులు

సాహిత్య పరీవాహక ప్రాంతం పొడుగూతా
అప్పుడప్పుడూ అక్కడక్కడా
ఆయా కాలాల్లో సృజనకారులు రచించిన
నగర నదుల్లోంచీ జనపదాల వాగుల్లోంచీ
పద జల కణాల్ని పదిలంగా పట్టుకొచ్చి
ఒక్క చోట కుప్పవోసిన ఈ నిఘంటువులు
ఆధునిక దేవాలయాలైన
అపురూప విస్తార జలాశయాలు
ఇవి ఏ త్యాగమూర్తులు చేసిన బైండింగులో?
ఇలా గట్టిగా నిర్మించబడి నిలిచిన ఆనకట్టలు

పదాల నిస్తూ పదమూలాల్ని పట్టిస్తూ
వ్యుత్పత్తుల్ని చెబుతూ
కొండొకచో పదబంధాల నందిస్తూ
పద స్వరూపాలు ప్రదర్శిస్తూ
అర్థాలతో పాటు అనేక అర్థ ఛాయల్నీ
ఆప్యాయంగా చూపుతోన్న ఈ నిఘంటువులు
నిజంగానే బహుళార్థ సాధక ప్రాజెక్టులు
ఇవి ఏ సాహిత్యకారులతో తయారైన నిండుకుండలో
అలా గేట్ల పుటలు తెరిస్తే చాలు తడిసిన ఆయకట్టులు

ఈ సాగునీటి అర్థజలాల్ని చూడగానే
అజ్ఞాన విహ్వలత్వంతో చస్తున్న మెదళ్ళు
క్షణంలో తెలివితేటల పంటల ఆగారాలు
ఆదిదంపతుల్లాంటి అన్యోన్య వాగర్థాలు

ఈ నిఘంటువులే పుష్పక విమానాల్లాంటి గిడ్డంగులు
ధాన్యపదాలు ఎందరు ఆరగించినా లేని అడ్డంకులు
ఈ నిఘంటువులే బాగా రద్దీ వున్న ఈనాటి బిగ్ మాల్స్
పదార్థాలు ఏవైనా ఇట్టే అందిస్తూ పెంచుకొనే సేల్స్

ఇవి ప్రతి పదానికి అర్థాన్ని గొప్పగా
కలిపి ముడేసిన లంకెబిందెలు
చదువరుల మేధోరసనను ఎల్లవేళలా
మధురాతిమధురం చేసే రాశీభూతపు తేనె పెరలు
ఏ కోశానా అర్థం తప్ప స్వార్థం తెలియని పదకోశాలు
ఎలా చూసినా దానం వినా అన్యమెరుగని అభిధానాలు

ఇవి శబ్దరత్నాకరాలు..దీపికా చంద్రికలు
శ్రీహరి నిఘంటువులు.. సూర్యరాయుళ్ళు
వాచస్పత్యాలివే వావిళ్ళలివే
ఓ కుండ పదం మరోటి అర్థమైన కావళ్ళు యివే
విమర్శోపలాలు విసిరినా ఫలాలు రాల్చే చెట్లివి
భాషాసౌధోపరి భాగానికి బహు చక్కగా చేర్చే మెట్లివి

నలిమెల భాస్కర్
9704374081

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు | తెలుగునుడి పండుగరోజు

జె. డి. ప్రభాకర్
85002 27185

భాషా ప్రజాస్వామీకరణ

సంక్షిప్తి: ప్రజాస్వామ్యంలో ప్రజలకు స్వేచ్ఛా, సమానత్వాలను అందించడంలో ప్రజల వ్యవహారిక భాషలు ముఖ్య భూమికను పోషిస్తాయి. మనిషికి జీవించే హక్కు ఎంత ముఖ్యమో, జన్మతో వచ్చిన భాషను జీవితంలో ఉపయోగించడమూ అంతే ముఖ్యం. కానీ స్వాతంత్ర్యం రాక మునుపు తెలుగు ప్రజల వ్యవహారిక భాష చదువుల్లోనూ, సాహిత్యంలోనూ వాడకుండా గ్రాంథికభాష వాడటంవలన ప్రజల మధ్య అసమానతలను సృష్టించిన అప్రజాస్వామిక ధోరణిని గిడుగు రామ్మూర్తి పంతులుగారు ఖండించి, వాడుక భాషను ప్రజాస్వామీకరణకోసం చేసిన ప్రయత్నాన్ని ఈ వ్యాసంలో చదవవచ్చు. భాష ప్రజాస్వామీకరణ నిర్వచనాన్ని దాని అవసరాన్ని తెలిపే ప్రయత్నం ఈ వ్యాసంలో చేయడం జరిగింది. అలాగే ప్రపంచీకరణ నేపథ్యంలో భాషల ఎంపికలపై మార్కెట్ చూపే ప్రభావాన్నీ, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి వల్ల వాడుక భాషల విస్తృతినీ కే. పి. ఎం. జి., గూగుల్, భారతీయ జనాభా గణన ఆధారాలతో చూడవచ్చు. సంపద సృష్టిలో స్థానిక వాడుక భాషల పాత్రను జరిగిన పరిశోధనలతో తెలపడం జరిగింది. అమ్మనుడి మాధ్యమాన్ని పిల్లలకు దూరం చేస్తూ పాలకులు చేసే ప్రణాళికలకు వ్యతిరేకంగా పోరాడే గిడుగు పోరాటం మళ్ళీ అవసరం అని ఈ వ్యాసం ద్వారా తెలుసుకోవచ్చు.

భారతదేశం మాతృభాషలతో ముక్తకంఠంతో స్వరాజ్యం కోసం పోరాడుతున్న కాలం అది. స్వేచ్ఛా సమానత్వాల కోసం సమర శంఖాన్ని పూరించిన స్వాతంత్ర్య సమరయోధులు నడయాడుతున్న నేల. ఆనాడు, అదే సమయంలో తెలుగు నేలపై పరాయి పాలన బానిసత్వంతోపాటు గ్రాంథిక భాషా కట్టడిలో ప్రజలు కునారిల్లుతున్నారు. ప్రజల వాడుక భాష పండితుల సంకెళ్లలో మగ్గుతోంది. బ్రిటిష్ పరిపాలనలో ధన, మాన, ప్రాణాలకోసం గర్జించే మన గొంతుకలు సాహిత్య సృజనలలో, చదువుల్లో గ్రాంథిక వాదుల వల్ల మూగబోవలసి వచ్చింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు సొంతవాళ్లే సంకెళ్లు వేశారు. తెలుగు నేలపై భాషాపరంగా అసమానత్వం నెలకొన్నది. పేద, బడుగు, బలహీన వర్గాలను ఈ గ్రాంథిక వాదం చదువులకు దూరం చేసింది. పండితులు అనీ పామరులు అనీ వర్గ భేదాలను సృష్టించింది. సామాజిక చైతన్యం కుంటుపడింది. సమాజంలో కొందరు పండితుల భాష అప్రజాస్వామిక రీతిలో ప్రజలను చదువులకు దూరంచేసి భావదాస్యంలోకి నెట్టింది.

నాటి కాలంలో వెలుతురు చూడని చీకటి కథలు ఎన్నో? వికసించకుండా రాలిన మొగ్గలు ఎన్నో? ఆత్మగౌరవ పోరాట కథలకు అక్షరం కరువైంది. గ్రాంథికవాదులు రాసిందే చరిత్ర అయింది. వీటన్నిటికీ కారణం గ్రాంథికవాదం జన వ్యవహారిక భాషను చదువులలోనూ సాహిత్యంలోనూ ప్రోత్సహించక అణిచివేయడమే. పరాయి పాలనలో చేతులకు వేసిన బానిస సంకెళ్ళను మాత్రమే కాదు, వ్యవహారిక భాషను వాడకుండా మన నోళ్లకు వేసిన సంకెళ్లను కూడా తెంచుకోవాలి అని ఒక స్వాతంత్ర్య యోధుడు ఒక భాషావేత్త రూపంలో బయలుదేరాడు. సమాజ ప్రగతికి గ్రాంథిక వాదం అవరోధంగా నిలిచిందని ప్రకటించాడు. సామాజిక అసమానత్వానికి గ్రాంథికం కూడా ఒక ప్రధాన కారణమని ప్రకటిస్తూ, జన వ్యవహార భాషకే పట్టం కట్టాలని తలపాగను చుట్టీ, సామాన్యుల ఆత్మగౌరవాన్ని పెంచుతూ, గ్రాంథిక భాషా సంకెళ్లను బద్దలు కొడుతూ, కారు చీకట్లను చీల్చుతూ, నిశ్శబ్దంపై విస్ఫోటనంగా విరుచుకుపడ్డ పిడుగే... గిడుగు!

గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు 1907 నుంచి 1940వ సంవత్సరం వరకు వ్యవహారిక భాషా ఉద్యమాన్ని చేపట్టి, ప్రజల వాడుక భాషకు సాహిత్యంలోనూ చదువుల్లోనూ తదితర ప్రజా రంగాలలోనూ స్థానం కల్పించాడు. 1907 లో ఇంగ్లీష్ దొర జే. ఏ. యేట్స్ ప్రోత్సాహంతో వాడుక భాష అవసరంపై ఉపన్యాసాలు ఇచ్చాడు. గొప్ప సామాజిక సంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగం పంతులు, శ్రీనివాస అయ్యంగారు కూడా వ్యవహారిక భాషా ఉద్యమంలో గిడుగు గారికి వెన్నుదన్నుగా నిలిచారు. నాటి వ్యవహారిక భాషా ఉద్యమం వలన నేడు మనందరం మన వాడుక భాషలో రాయగలుగుతున్నాం చదవగలుగుతున్నాం. కానీ నేటి సమాజంలో ప్రజా స్వేచ్ఛకూ ప్రగతికీ అండగా నిలిచిన వాడుక భాషకూ మళ్ళీ సంకెళ్లు పడ్డాయేమో అనిపిస్తోంది. సుదీర్ఘ పోరాటం చేసి సాధించుకున్న ప్రజల వాడుక భాష అంతరించడానికి అంచులో ఉందా? ప్రస్తుత, రానున్న కాలంలో మన భాషకు పొంచి ఉన్న ప్రమాదాలు ఏమిటో పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

భాషా ప్రజాస్వామీకరణ అంటే ఏమిటి?

అబ్రహాం లింకన్ ప్రజాస్వామ్యానికి ఇచ్చిన నిర్వచనం – ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కొరకు ప్రభుత్వం ఉండటం. మరి ప్రజాస్వామ్యంలో వాడుక భాష ఎవరి భాష ఉండాలి అని ప్రశ్నించుకుంటే, ప్రజలవాడుక భాషే ఉంటుంది. అలా ఉండటమే ప్రజాస్వామ్యం! ప్రతి మనిషికీ భూమి మీద పుట్టుకతో అమ్మనుడి వస్తుంది. పుట్టిననాటినుండే ప్రతి బిడ్డా అమ్మనుడి సవ్వడులకు స్పందిస్తూ తమ భావాలను వ్యక్తీకరించుకుంటూ ఉంటారు. భాష అనేది ప్రతి మనిషికి సృష్టిలో సహజంగా సిద్ధించినది. తల్లిదండ్రులకు ఉన్న ఆస్తిపై పిల్లలకు సహజంగా ఎటువంటి హక్కు ఉంటుందో, తల్లిదండ్రుల నుండీ, పెద్దలనుండీ పిల్లలకు వారసత్వంగా వచ్చిన భాషను సమాజంలో ఉపయోగించడానికీ అంతే హక్కు ఉంటుంది. జీవనం కోసం వలస వెళ్లి ఇతర భాషలను నేర్చుకోవచ్చునూ, కానీ సొంత ప్రాంతంలో అందరూ ఉపయోగిస్తున్న అమ్మనుడిని అన్ని రంగాలలో వాడడం ఒక హక్కుగా భావించాలి. కానీ ఒకే భాషా సమూహం ఉన్న ప్రాంతాలలో గ్రాంథికమనీ వ్యవహారికమనీ భాషా భేదాలను సృష్టించి, సమాజ ప్రగతిలోనూ చదువుల్లోనూ అగాధాన్ని

సృష్టించి అసమానతలకి దారి తీసిన విధానం అప్రజాస్వామికం. అలాంటి సమయంలో ప్రజలందరూ ఉపయోగించే ప్రజా వ్యవహారిక భాషని ప్రజాస్వామీకరణం చేయవలసి వచ్చింది. మరో మాటలో చెప్పాలంటే ప్రజలు తమ భాషను అన్ని రంగాలలో ఉపయోగించడమే భాషా ప్రజాస్వామికం. అబ్రహాం లింకన్ ప్రజాస్వామ్యానికి ఇచ్చిన నిర్వచనం భాషా ప్రజాస్వామ్యానికి కూడా వర్తిస్తుంది. సమాజంలోని అన్ని రంగాలలో భాషల వాడుక అనేది ప్రజల భాషలలోనే జరగాలి, అంటే సమాజంలో ప్రజలు వాడుతున్న భాషే, ప్రజల అవసరాలు తీర్చే భాషగా నిల్వాలి. దానినే మనం భాషా ప్రజాస్వామీకరణం అనవచ్చు. కానీ దీనిని విస్తృత కోణంలో చూడవలసి ఉంటుంది.

ప్రపంచీకరణ – భాషా ప్రజాస్వామికం:

ప్రపంచం ఎప్పుడూ నిశ్చల స్థితిలో ఉండదు. మనిషి జీవనం కోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళుతూ ఉండటం సాధారణమే. అయితే ఆయుధ బలం ఉన్నవాళ్లు ఇతర దేశాలనూ ప్రాంతాలనూ ఆక్రమించడం, దోచుకోవడం, ఎదురుతిరిగినవారిని చంపడం, మిగిలినవారిని భయభ్రాంతులను చేసి ఆక్రమించి పెత్తనం చేయడం జరుగుతూ వస్తోంది. అలా ఆక్రమణదారుల భాషలు కూడా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి అక్రమంగా విస్తరించడం జరిగింది. ఈ క్రమంలో బలహీనులపై భాషా పెత్తనం జరుతూ వస్తోంది. దోపిడిదారుల భాషే గొప్ప భాషలుగా ఎంచబడ్డాయి. నాడు ఇంగ్లీషు ఆక్రమణదారుల భాషగా ప్రపంచంలో ఆక్రమిత దేశాలకు పాకి ప్రపంచంలో పెత్తనం చేస్తుందంటే గతకాలపు వారి దురాక్రమణులూ దోపిడీలే గదా కారణం? ప్రపంచ దేశాల నుంచి దోచుకున్న సంపదతో వ్యాపారం మొదలుపెట్టారు. అదే మార్కెట్ ప్రపంచీకరణ చెంది, ఏ ప్రాంతంలో, ఏ దేశంలో, ఏ భాష వాడుకలో ఉండాలో నిర్ణయించే స్థాయికి ఎదిగింది. పుట్టిన శిశువుకు ఏ భాష నేర్పించాలో ఈరోజు మార్కెట్టే నిర్ణయిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. తల్లిదండ్రులూ పెరిగి పెద్దవుతున్న వారి పిల్లలూ సంపద సృష్టికి ఏ భాష అనుకూలంగా ఉంటుందో అదే భాషను నేర్పిస్తున్నారు. భాషనే కాదు శిశువు ఏ పాలు తాగాలి, ఏ బట్టలు వేసుకోవాలి, ఏ బడికి వెళ్లాలి, ఎక్కడ పని చేయాలీ, ఎక్కడ చావాలీ, చచ్చిన శవంపై ఏ అత్తరు చల్లాలో కూడా ఈరోజు మార్కెట్ నిర్ణయిస్తుంది. దీనిని పెట్టుబడిదారుల ధన దాహంగా భావించాలి.

'జనాన్ని నాశనం చేయాలి అనుకుంటే, మొదటగా వారి భాషను వారి నుండి లాగేయండి, అప్పుడు వారి ఆలోచనలూ, భావాలూ ప్రసారం కావు' అంటారు మార్క్ ఫెట్టిన్(చూ. ప్లాటీల్ రుద్ది 1996, ది గ్లోబ్ అండ్ మెయిల్). ప్రజలు నిత్యం వాడే భాషను వారి నుండి దూరం చేస్తే ప్రజల్లోని ఐక్యత దెబ్బతిని భావ ప్రకటనా స్వేచ్ఛను కోల్పోయి దోపిడి వ్యవస్థకు బానిసలుగా మారిపోతారు అని ఆయన భావం. 'స్థానిక భాషలను తీసివేసి, వాటి స్థానంలో వేరొక భాషను తీసుకువస్తే వారి ప్రపంచ దృక్పథం మారిపోతుంది' అని ఆమోస్ కీ పేర్కొన్నాడు (టోల్ స్కుట్నబ్ – కంగస్, 2008: 317). భాష కేవలం ఒకరితో ఒకరు సంభాషించుకునేది మాత్రమే కాదు, ఎలా ఆలోచించాలో దారి చూపిస్తుందని జోఆన్ వేనోల్ట్స్ తెలిపారు. అంటే మనిషి తన ఉన్న ప్రాంతంలోని జ్ఞానాన్నీ సంస్కృతినీ ఆధారం చేసుకుని తన భాషలో ఆలోచిస్తాడు. అది ప్రతి దేశంలోనూ ప్రతి ప్రాంతంలోనే ఉంటుంది. ఇది భాషా వైవిధ్యం. 'జీవ వైవిధ్యం జీవకోటి మనగడకు ఎంత అవసరమో భాషా వైవిధ్యం కూడా ఉద్యోగ భద్రతకు అంతే ముఖ్యం...' అని గారపాటి ఉమామహేశ్వరరావు గారు తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం (2017) పుస్తకంలో తెలిపారు. కానీ పెట్టుబడిదారులూ, వలసవాదులూ భాషా వైవిధ్యాన్ని పక్కన పెట్టి ఆక్రమణదారుల భాషలను స్థానిక ప్రజలపై బలవంతంగా రుద్దారు, రుద్దుతున్నారు.

మొదటి దశలోని ప్రపంచీకరణ అంతా కూడా స్థానిక భాషలను కనుమరుగు చేయాలి అనే ధోరణిలోనే సాగింది. ప్రజల భాషలను దోచుకుని వారికి ఆ భాషలో విద్యను అందనీయకుండా భాషపై అజమాయిషీ చేసి దోచుకోవడం జరిగింది. వాటి ఫలితాలను ఆంగ్ల పాలిత దేశాలు నేటికి చవిచూస్తూనే ఉన్నాయి. అటువంటి దురాక్రమణలకు దోపిడీకి అధికార దాహానికి తట్టుకొని నేటికీ దేశీయ భాషలు తమ ఉనికిని చాటుకున్నాయంటే కారణం ప్రజలు తమ భాషలను ఇళ్లల్లోనూ పనుల్లోనూ వాడటమే. సాహిత్య సృష్టిలోనూ వ్యవహారిక భాషలు తమ ఉనికిని కోల్పోకుండా ఉన్నాయి అంటే గిడుగు వెంకట రామ్మూర్తి పంతులుగారు చేసిన వ్యవహారిక భాషా ఉద్యమమే కారణం. ప్రపంచీకరణ వలయంలో చిక్కుకున్న దేశీయ భాషలు చదువుల్లోనూ సాహిత్యంలోనూ న్యాయ పాలనా రంగాలలోనూ ఉనికిని క్రమక్రమంగా కోల్పోతూ ఉన్నాయి. దానికి ప్రపంచీకరణ ఒక కారణం అయితే మన సొంత పాలకవర్గాలు శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రణాళికలు చేయడం మరో ముఖ్య కారణం.


సాంకేతీకరణ – భాషా ప్రజాస్వామీకరణ:

ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన విప్లవాత్మక మార్పులు భాషా ప్రజాస్వామీకరణానికి దారితీశాయి అని చెప్పవచ్చు. కంప్యూటర్, చరవాణుల వాడకం గణనీయంగా విస్తరించడంతో నేడు దేశంలో ప్రతి పల్లెలోని ప్రజలకూ కావలసిన సమాచారం సులువుగా అందుతోంది. ఈ సాంకేతికత రాకపూర్వం సమాచారం కేవలం కొద్ది భాషల్లోనే ఇమిడి ఉండేది. కానీ ఈ ఆధునిక సాంకేతికత వల్ల ప్రజలు స్థానిక భాషల్లో సమాచార వినిమయాన్ని జరుపుకొంటున్నారు. కే. పి. జి. ఎం.– గూగుల్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం భారతదేశంలో 53.6 కోట్లమంది ప్రజలు 2021 నాటికే తమ స్థానిక భాషలను ఉపయోగిస్తున్నారని తెలిపింది.

ప్రజలు సాంకేతికతను విస్తృతంగా వాడటం వలన ప్రపంచ మార్కెట్టు కూడా స్థానిక భాషలోనే వస్తూత్పత్తుల సేవలు చేయాలని నిర్ణయించుకుంది. అంతర్జాలంలో జరిగే మార్కెట్ వ్యవస్థ బాహ్యంగా జరిగే మార్కెట్ వ్యవస్థ స్థానిక భాషల్లోకి మారుతూ ఉండడం నేడు ప్రతి ఒక్కరం చూస్తూనే ఉన్నాం. భాషా స్థానికీకరణ జరగడం వలన దేశీయ భాషల అధ్యయనం కూడా విస్తృతంగా పెరిగింది. యంత్రాలను ఉపయోగించి స్థానిక భాషల్లో ఒక భాష నుండి మరొక భాషకు అనువదించడం పెరుగుతూ వస్తోంది. నేడు అంతర్జాలంలో జరిగే వ్యాపారం మొత్తం కృత్రిమ మేధను (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారం చేసుకుని నడుస్తోంది. కొనుగోలుదారుడు ఏ భాషలో వస్తు వాడకంపై అభిప్రాయాన్ని చెబుతున్నారో దృష్టి కేంద్రీకరించింది. ఆ భాషల అధ్యయనం, ఆయా భాషలలో అనువాదాలకోసం ఆ భాష వ్యవహర్తలను

ఎన్నుకుని ఉద్యోగాలు కల్పించడం జరుగుతోంది. దీని ఫలితంగా ప్రజలు ఇతరులతో ఏ భాషలో సంభాషించాలో, ఏ భాషలో సాహిత్యాన్ని సృష్టించాలో, ఏ భాషలో వస్తువినిమయం, సేవలు పొందాలో నిర్ణయించుకునే శక్తి వచ్చింది. సాంకేతిక విప్లవం వలన ప్రజలకు తమ అవసరాలకు తమ చేత తమ భాషలను ఎన్నుకొనే భాషా ప్రజాస్వామీకరణ జరుగుతోందని చెప్పవచ్చు.

గ్రాఫ్ 1:



భాషా వికాసం – ప్రజా వికాసం:

మనిషి బుద్ధి జీవి. భాషల వాడుకతో జ్ఞానాన్నీ సృజనాత్మకతనూ వివిధ రంగాలలో విస్తరించుకుంటూ వెళ్ళాడు. సామాజిక జీవనం భాషతోనే విస్తరించింది. సామాజిక చైతన్యం, సామాజిక విలువలూ, కుటుంబ వ్యవస్థా, చుట్టూ ఉన్న సమాజం దాని కట్టుబాట్లూ మొదలైనవాటిలో భాషే ప్రధాన పాత్ర పోషించింది. ప్రజా వికాసానికి సాహిత్యం ఎంతగానో తోడ్పడ్డది. సాహిత్యం అంటే గడిచిన, నడుస్తున్న సమాజ పోకడలనూ, చుట్టూవున్న పర్యావరణం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధీ గురించిన రచనలు, మొదలగునవి తెలిపేవి ఏదైనా కావచ్చు, సమాజం ఒక స్థితి నుంచి మరొక స్థితికి ప్రగతి పథంలో నడవడానికి సాహిత్యం అత్యంత క్రియాశీలక పాత్రను పోషించింది. ఈ సాహిత్యం ప్రతి తరంలోనూ ఎంతగానో వాడుకలో ఉండి, ఎంతో సృజనశీలంగా ఉంటేనే సమాజం అంతగా అభివృద్ధి చెందుతుందని అర్థం. అయితే, ఈ సాహిత్యం ఏ భాషలో ఉంటే మనిషికి సులువుగా అర్థమవుతుంది? సాహిత్యంలో ఉండే విషయం ఏ భాషలో ఉంటే ప్రజలు పూర్తిగా అందుకోగలరు అనేది ప్రశ్న.

పిల్లలు ఇంట్లో అమ్మ ఒడిలో అమ్మనుడితో పెరిగిన ఐదు సంవత్సరాల తర్వాత బడిలో చెప్పే చదువు ద్వారా వికాసం పొందడానికి తల్లిదండ్రులు పిల్లల్ని బడికి పంపిస్తారు. బడిలో విద్యామాధ్యమంగా ఉన్న భాష వికాసానికి మూల అంశంగా నిలుస్తుంది. పిల్లలకు క్రమశిక్షణ, నైతిక విలువలనూ నేర్పించి, స్వయం సమృద్ధితో, దేశానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దడమే విద్య ప్రథమ కర్తవ్యం. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు ఇంటి భాషలోనే విద్యను అందించడం ద్వారా ఇవన్నీ సులువుగా నేర్చుకొని వికాసం పొందుతారు. ఆ విధంగా కాకుండా కొందరు తల్లిదండ్రులు ఇంగ్లీషు భాష వ్యామోహంతో పిల్లలను ఇంగ్లీష్ మాధ్యమ విద్యలోకి పంపించడం వలన మన సమాజం మానవతా విలువలనూ వికాసాన్నీ కోల్పోతున్న దుస్థితి కనబడుతోంది. పిల్లల్ని బుద్ధి వికాసానికి కాకుండా సంపద వికాసానికి మాత్రమే ప్రస్తుత విద్యావ్యవస్థ పనిచేస్తోందనిపిస్తోంది. కొలువులూ వాటిద్వారా సంపద సృష్టీ కేవలం ఇంగ్లీషు భాష ద్వారా మాత్రమే వస్తుందనే భ్రమలో ఇటువంటి అనాలోచితమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వాలు సైద్ధాంతిక ఆధారాలను పరిశీలించకుండా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే దేశం జ్ఞాన సంక్షోభంలో పడక తప్పదు.

జన భాషలతోనే సంపద సృష్టి:

మన దేశ సంపద సృష్టి ఇంగ్లీష్ భాష ద్వారా ఎక్కువగా జరుగుతుందనుకోవడం ఒక భ్రమ. కొలువుల సాధనకు ఇంగ్లీషు మాత్రమే అవసరం అనుకోవడం ఒక మిథ్య. మన దేశంలోనే కాదు ప్రపంచంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలైన కొరియా, జపాను, చైనా మొదలైనవి మాతృభాషలోనే విద్యను అందిస్తూ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ అగ్రస్థానంలో నిలిచాయి. ఆర్థిక స్వావలంబనకు సహజ వనరులనే కాదు, వారసత్వంగా వచ్చిన సహజ భాషలను కూడా కాపాడుకోవడం అవసరమని శాస్త్ర అధ్యయనాలు తెలుపుతున్నాయి. హెల్లర్, ఎం. (2003) ప్రస్తావించినట్టుగా ప్రపంచీకరింపబడిన కొత్త ఆర్థిక వ్యవస్థ అనేక రకాలుగా భాషల గుర్తింపుతో ముడిపడి ఉంది (ఉదా. బామన్ 1997; కాస్టెల్స్ 2000; గిడెన్స్ 1990). భాషని ఆర్థిక వ్యవస్థను వేరువేరుగా చూడలేము. రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. మనదేశంలో చదువుకొని కొలువులు తెచ్చుకొని సంఘటిత రంగంలో ఆర్థిక కార్యకలాపాలు చేసేవారి కంటే చదువుకోనివారూ, ప్రాథమిక, మాధ్యమిక స్థాయి వరకు చదివిన ప్రజలు అసంఘటిత రంగంలో ఎక్కువగా ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటున్నారు. ఎన్. సి. ఈ. యు. ఎస్. (నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్ప్రైజెస్ ఇన్ ద అనార్గనైజడ్ సెక్టర్) నివేదిక

"బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనేది నా ఖచ్చితమైన అభిప్రాయం. విద్యావ్యాప్తికి పరిశ్రమించడమే విద్యాలయాల కర్తవ్యం. విద్యాలయాల్లో బోధనా మాధ్యమంగా మాతృభాషను స్వీకరిస్తే తప్ప ఈ లక్ష్యం నెరవేరదు." – రవీంద్రనాథ్ ఠాగూర్

అంచనా ప్రకారం 2005లో భారతదేశంలోని 45.8 కోట్ల మంది వ్యక్తులలో 95 శాతం లేదా 43.5 కోట్లమంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో 50.6 శాతం ఉత్పత్తి చేస్తున్నారు, రుద్దర్ దత్ (2008:134). తెలుగు రాష్ట్రాలలో సంఘటిత రంగంలో ఆర్థిక కార్యకలాపాలు చేసే వారి సంఖ్య కంటే అసంఘటిత రంగంలో ఆర్థిక కార్యకలాపాలు చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు (2017: 59) చేసిన అధ్యయనం ప్రకారం తెలుగు రాష్ట్రాలలో ఉన్న మొత్తం 1 కోటి 7 లక్షల, 950 మంది ఉద్యోగులలో 32.50 శాతం మంది నిరక్షరాస్యులే. మిగిలిన 67.50% అక్షరాస్యులలో 15.48 శాతం మంది మాత్రమే గ్రాడ్యుయేట్లు ఆపై చదువుకున్న వారు. అంటే నిరక్షరాస్యులూ, గ్రాడ్యుయేట్లుకాని అక్షరాస్యులూ మొత్తం 84.52% ఉద్యోగులు మాతృభాషనే ఆర్థిక కార్యకలాపాలలో వాడుతున్నారు. గ్రాడ్యుయేట్లలలో కూడా మాతృభాషను వాడి ఆర్థిక కార్యకలాపాలు చేస్తున్న వారిని కలుపుకుంటే మాతృభాషను ఉపయోగించి 89.67%, ఇంగ్లీష్ ను ఉపయోగించి 10.33 % ఆర్థిక కార్యకలాపాలు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్నాయని తేలింది.


నా పరిశోధనలో అనుభవంలోకి వచ్చిన ఆధారాలను బట్టి చూస్తే పని స్థలాలలో ఆర్థిక కార్యకలాపాలు చేసే పనివారు నూటికి 92% తమ మాతృభాషలను ఉపయోగించే పనిచేస్తూ ఉన్నారు. ఇంగ్లీష్‌ను ఉపయోగించేవారు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి పై స్థాయిలో ఉన్న అధికారులు మాత్రమే. పని స్థలాలలో ఆర్థిక కార్యకలాపాలలో వీరి చొరవ చాలా తక్కువగా ఉంటుంది. అంటే మన రాష్ట్ర సంపద 92 శాతం దేశీయ భాషల వాడకం ద్వారానే వస్తోందన్నమాట. జాతీయ స్థూల ఉత్పత్తిలో (GDP) దేశీయ భాషలే సింహ భాగాన్ని అందిస్తున్నాయి. అంతటా అమ్మనుడులను ఉపయోగించి ఆర్థిక కార్యకలాపాలు చేస్తున్న వారే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.

పట్టిక 1. భారతదేశంలోని గ్రాడ్యుయేట్స్ మరియు స్థానిక భాషల ఆర్థిక కార్యకలాపాలు:

గ్రాడ్యుయేట్ల సంఖ్య	గ్రాడ్యుయేట్ల శాతం	గ్రాడ్యుయేట్ ఉద్యోగులు %	గ్రాడ్యుయేట్ నిరుద్యోగులు%	స్థానిక భాషలలో ఆర్థిక కార్యకలాపాలు	ఇంగ్లీష్‌లో ఆర్థిక కార్యకలాపాలు
68,60,000	8.15	26	74	97.4 3	2.6

పై పటం 1 చూసినట్లయితే, మన దేశంలో గ్రాడ్యుయేట్లు 8.15% ఉన్నారు. ఇంగ్లీషు చదివీ, రాయగలిగీ, మాట్లాడగలిగే వారు ఈ గ్రాడ్యుయేట్లు మాత్రమే. ఈ గ్రాడ్యుయేట్లలో 74 శాతం మంది నిరుద్యోగులు. అంటే మొత్తం ఆర్థిక కార్యకలాపాలలో గ్రాడ్యుయేట్స్ ఇంగ్లీష్ ఉపయోగించి పనిచేసే వారి శాతం 2.6% మాత్రమే. ఆర్థిక కార్యకలాపాలలో వీరి సంఖ్య చాలా తక్కువ కనపడుతుంది. ఎక్కువగా

గ్రాఫ్ 2 :



పాల్గొనేది గ్రాడ్యుయేట్లు కాని వారు, ప్రాథమిక, మాధ్యమిక స్థాయి వరకు చదువుకున్న వారు, నిరక్షరాస్యులే. వీరందరూ స్థానిక భాషలలో సంభాషించుకుంటూనే ఆర్థిక కార్యకలాపాలు చేస్తారు.

మన నుడికోసం గిడుగు పోరాటం మళ్ళీ తప్పదా?

దేశంలోనే మొట్టమొదటిసారిగా భాషా ప్రయుక్త రాష్ట్రంగా పోరాడి సాధించుకున్న రాష్ట్రం మనది. తెలుగు ప్రజలు భారతీయ గణాంకాల 2011 ప్రకారం 8.1 కోట్లు. భారతదేశంలో తెలుగు నాలుగో స్థానం. భారత రాజ్యాంగం 19వ అధికరణం ప్రకారం వాక్ స్వాతంత్ర హక్కునూ, భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యాన్నీ మన వ్యవహారిక భాషలో ఉపయోగించుకుంటున్నామంటే దానికి కారణం అవిశ్రాంతంగా గిడుగు వెంకట రామమూర్తి గారు చేసిన వ్యవహారిక ఉద్యమం ఫలితమే. నేడు ప్రతి తెలుగు వారికీ తెలుగు విద్య సమానంగా అందుతోంది అంటే దానికి గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారి పోరాట ఫలితమే. కానీ కాలం గడుస్తున్న కొద్దీ తెలుగు మాట్లాడే చదివే పిల్లల సంఖ్య తగ్గుతూ వస్తోంది. భాషకు ఆ భాషను మాట్లాడే ప్రజలే బలం. కానీ ప్రస్తుత విద్యా విధానాలతో పిల్లలకు అమ్మనుడి దూరం అవుతూ వస్తోంది. పాలకులు రాజకీయ లబ్ధికై తల్లి భాషని పణంగా పెడుతున్నారు. మొదటి భాష లేదా మాతృభాషపై ఆధారపడిన విద్య ప్రారంభ సంవత్సరాల నుండి మొదలవ్వాలని యునెస్కో నమ్ముతోంది, ఎందుకంటే మాతృభాష బాల్య సంరక్షణకూ విద్యాభ్యాసానికి పునాది. మాతృభాషలు ప్రాథమిక విద్యా స్థాయిలో మాధ్యమంగా ఉండాలని నూతన విద్యా విధానం 2020 పేర్కొన్నప్పటికీ, దానితోపాటు ఇంగ్లీష్ మాధ్యమం కూడా ఉండాలని తెలుగురాష్ట్రాల పాలక పక్షాలు కోర్టులను ఆశ్రయిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. జి. గణపతి రావు " 'ఒకటి నుంచి 8వ తరగతి వరకు తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా బాధితులవుతారు. కేవలం ఇంగ్లీషు మీడియంతోనే చాలా పోస్టులు రద్దవుతాయి. మొత్తం విద్యార్థుల సంఖ్య 137 కంటే తక్కువ ఉన్న పాఠశాలల్లో కూడా చాలా పోస్టులు రద్దు చేయబడతాయి' అని ప్రకటించారు (ది హిందు, 14 జూన్ 2022). వాస్తవాలను పక్కనపెట్టి అశాస్త్రీయంగా ఇంగ్లీషు విద్యను మాత్రమే ప్రాథమిక స్థాయిలో అందజేయడం వల్ల విద్యార్థులకు మానసిక

తరువాయి 35వ పుటలో....

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు
తెలుగునుడి పండుగరోజు

అడపా రామకృష్ణారావు

సంఘ సంస్కర్తగా గిడుగు



సాధారణంగా సంఘసంస్కరణ కార్యకలాపాలలో ఆసక్తి చూపే వ్యక్తులు రెండు వర్గాలలో ఏదో ఒక దానికి చెందినవారై ఉంటారు. కొందరు తాము నమ్మిన సాంఘిక దురాచారాలపై ధ్వజమెత్తి, తమ సంస్కరణాభిలాషను ఒక ఉద్యమంగా మార్చి, ప్రజలలో ప్రచారం చేసి, అనేకుల దూషణ భూషణ తిరస్కారాలకు లోనవుతూ, తమ లక్ష్యాన్ని సాధించడం కోసం సమాజంలో తీవ్ర సంచలనం కలిగిస్తారు; మరికొందరు తన విశ్వాసాలను పనిగట్టుకుని ఇతరులకైతే బోధించరు గాని, తమ వ్యక్తిగత జీవితంలో మాత్రం తాము నమ్మిన ఆశయాలకు అనుకూలంగా ప్రవర్తించి, తమ సంఘసంస్కరణ ప్రియత్వాన్ని ఆచరణలో వ్యక్తం చేస్తారు. తెలుగుదేశంలో మొదటి వర్గానికి ప్రథమోదాహరణంగా పేర్కొనదగ్గవారు కందుకూరి వీరేశలింగం గారని నిరభ్యంతరంగా అందరూ ఒప్పుకుంటారు. కాని గిడుగు వెంకటరామమూర్తిగారు రెండవ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తారని మాత్రం చాలా మందికి తెలియదు. రామమూర్తిగారనగానే వ్యావహారిక భాషకు సంబంధించిన వాగ్వివాదాలూ, భాషను భ్రష్టం చేస్తున్నారని నాటి పండితులు కొందరు ఆయనను తిరస్కరించడమూ, ఆయన వారి పాండిత్యాన్ని అంతకు మించిన పాండిత్యంతో ప్రతిఘటించి, వారికి వాగ్బంధం చేసి, గిడుగు పిడుగుగా ప్రసిద్ధులు కావడమే అందరికీ జ్ఞప్తికి వస్తుంది. గొప్ప పట్టుదల గల మనిషి అనికూడా ఆయన పేరుపొందారు. ఐతే ఈ పట్టుదల కేవలం భాషావివాదానికీ, పర్లాకిమిడిని ఒరిస్సాలో చేర్చాలనే నిర్ణయాన్ని ప్రతిఘటించడానికీ మాత్రమే పరిమితం కాలేదని ఏ కొందరికోగాని తెలియదు. **రామమూర్తిగారు సంఘసంస్కరణ ప్రియులు కావడంవల్ల నిత్యజీవితంలో తమ విశ్వాసాలకు అనుకూలంగానే నడిచేవారు.** సాటివారు ఆక్షేపించినా, బెదిరించినా ఏమాత్రం చలించక తమకు ధర్మమని తోచిన ప్రకారమే జీవించేవారు. ఇది తెలుగువారందరూ అవశ్యం తెలుసుకోదగ్గ సంగతి.

పందొమ్మిదవ శతాబ్దం ఇంకా ఆరంభం కాకముందే మనదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం తల ఎత్తింది. రాజకీయ కారణాలవల్ల పాశ్చాత్యులతో మన కేర్పడిన సంబంధం ముఖ్యంగా ఇందుకు ప్రేరకమయింది. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ భౌతికశాస్త్ర విజ్ఞానం ప్రబలినకొద్దీ శతాబ్దాల తరబడి ప్రజల భావనపై సామంతం సాగించిన మత విశ్వాసాల ప్రాభవం సడలిపోవడం ప్రారంభమయింది. క్రమంగా 18వ శతాబ్దంలో వ్యాపించిన హేతువాదంవల్ల కొంత, 19వ శతాబ్దంలో తీగెలు సాగిన మానవతావాదం వల్ల, కాల్పనికోద్యమంవల్ల, మరికొంత మనిషి జన్మతః నికృష్టుడనీ, పాపాత్ముడనీ.. తరతరాలుగా క్రైస్తవ మతం ప్రచారం చేసిన సిద్ధాంతాన్ని పాశ్చాత్య సమాజం తిరస్కరించింది. పుట్టుకతో మనిషి ఉదాత్త స్వభావం కలవాడేననీ, పరిసరాలూ, అతని నడతను శాసించే ప్రభుత్వం వంటి సంస్థలూ అతని బాగోగులకు కారణమనీ, సమాజంలో ప్రతివ్యక్తీ ముఖ్యుడేననీ, వ్యక్తుల నైచ్యానికి దారితీసే సాంఘిక దురాచారాలను నిర్మూలిస్తే అందరూ సుఖంగా జీవించగలుగుతారనీ చాటే నూతన సిద్ధాంతాలు వ్యాప్తిలోకి వచ్చాయి. మొదట బ్రిటన్ వంటి యూరోపియన్ దేశాలలోనూ, తరువాత అమెరికాలోనూ బానిసల వ్యవస్థ, మితిమీరిన మద్యపానం, జైళ్లలో బందీలను క్రూరంగా హింపించడం, విద్యాభ్యాసంపేర పిల్లలను పాఠశాలలలో అమానుషంగా బెత్తాలతో దండించడం, స్త్రీలకు ఆస్తిమీదగాని, వోటు వెయ్యడానికిగాని హక్కులేకపోవడం వంటి అనేక దురాచారాలకు వ్యతిరేకంగా సంస్కరణోద్యమాలు ప్రారంభమయ్యాయి.

మనదేశంలో అప్పుడు కలకత్తానగరం మొత్తం దేశానికి రాజధానిగా ఉండి, ఆవేశపరులైన వంగయువకులు పాశ్చాత్యసంస్కృతి ప్రభావానికి ఎక్కువగా లోను కావడంవల్ల ఈ సంస్కరణోద్యమాలు ప్రప్రథమంగా ఆ రాష్ట్రంలో తలఎత్తాయి. రాజారామమోహనరాయ్ ప్రోద్బలంతో సతీసహగమనం, బాల్య వివాహం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభమయింది. ఆ ఉద్యమాల నీడ మన రాష్ట్రం మీద కూడా పడింది. వితంతు వివాహాలను జరపడం ఒక ఉద్యమంగా చేపట్టారు వీరేశలింగం పంతులుగారు. ఆనాడు వ్యాప్తిలో ఉన్న కన్యాశుల్క దురాచారాన్ని ప్రతిఘటించే ప్రయత్నానికి దోహదంగా ప్రజలలో భావవిప్లవం కలిగించే సంకల్పంతో గురజాడ వెంకట అప్పారావుగారు "కన్యాశుల్కం" నాటకం రచించారు. వారికి సమకాలికులే గాక సన్నిహితులు కూడా అయిన గిడుగు వెంకట రామమూర్తిగారు సహజంగా విజ్ఞులు కావడంవల్ల, వారికి కూడా సంఘసంస్కరణానురక్తి ఉండడంలో విశేషమేమీ లేదు.

రామమూర్తిగారి సంఘసంస్కరణాసక్తి ఆయన వ్యక్తిగత జీవితంలో ముఖ్యంగా మూడు సందర్భాలలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. పర్లాకిమిడిలో ఆయన అధ్యాపకులుగా ఉండగా Reading Room అనే పేరుతో ఆ ఊళ్ళో ఒక సాంస్కృతిక సమాజం ఉండేది. దానికి కొంతకాలంపాటు వారే కార్యదర్శిగా ఉండేవారు. ఆ సమాజం పక్షాన తరచుగా సంఘసంస్కరణకు సంబంధించిన సభలూ, చర్చలూ

జరుగుతూ ఉండేవి. బాలవితంతువులకు పునర్వివాహం చెయ్యడం మంచిదని వీరేశలింగం పంతులుగారు చేస్తున్న వాదం రామమూర్తిగారికి నచ్చింది. కాగా ఆ సంఘసంస్కరణకు వ్యతిరేకంగా నాటి సనాతన సంప్రదాయబద్ధులైనవారు చేసే ఆక్షేపణలను ఎదుర్కోడానికి ఆయన స్మృతులు చదివి సభలలో వీరేశలింగంగారి ఉద్యమాన్ని బలపరుస్తూ ఉపన్యసిస్తూ ఉండేవారు. ఆ రోజులలోనే పర్లాకిమిడిలో ఒక బాలవితంతు పునర్వివాహం చెయ్యడానికి వారు అవసరమైన ఏర్పాట్లు చేసి వీరేశలింగంగారికి ఉత్తరం వ్రాశారు. కాని ఆ సంగతి తెలిసి వారి మిత్రులలో ముఖ్యులైన వారొకరు వారి ప్రయత్నం విరమింపజేశారు. ఈ సంఘటనను వర్ణించిన వారి కుమారులు గిడుగు సీతాపతిగారు ఆ మిత్రుని పేరు వెల్లడించకపోవడంవల్ల వారెవరో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. అప్పటికే రామమూర్తిగారు కళింగదేశ చరిత్ర పరిశోధనలోనూ, సవరభాషకు సంబంధించిన పరిశోధనలోనూ నిమగ్నులై ఉండడంవల్ల కూడా వారు సంఘసంస్కరణోద్యమాలలో కార్యకర్తగా వ్యవహరించలేదు గాని తమ వ్యక్తిగత జీవితంలో మాత్రం తమ సంఘసంస్కార ప్రియత్వాన్ని ప్రకటిస్తూనే వచ్చారు.

మొదట తాము జరుపదలచుకున్న బాల్యవితంతు పునర్వివాహానికి ఆటంకం ఏర్పడినా, కొంతకాలం తరువాత – 1928లో – మరొక సందర్భంలో రామమూర్తిగారు ఒక వితంతు వివాహానికి ప్రోద్బలం ఇవ్వడమే కాక స్వయంగా కన్యాదానం కూడా చేశారు. అది పర్లాకిమిడిలోనే జరిగింది. బంకుమల్లి మల్లయ్యశాస్త్రిగారు సుప్రసిద్ధ విద్వాంసులు. ఆయన తమ కుమార్తె వివాహాన్ని ఆమె చిన్నపిల్లగా ఉన్నప్పుడే సంప్రదాయానుసారంగా తమ శాఖకు చెందిన పిల్లవాడికి ఇచ్చిచేశారు. కాని ఆ పెండ్లి జరిగిన కొద్దికాలానికి ఆ పిల్లవాడు మరణించడంవల్ల మల్లయ్యశాస్త్రిగారికి తన కుమార్తె గతి ఏమవుతుందని చాలా దుఃఖం కలిగింది. ఒక ఆలోచన తట్టి ధర్మశాస్త్ర గ్రంథాలు పరిశీలించడం ప్రారంభించారు. ఆ గ్రంథాలు చదివినవారు అప్పటికి పర్లాకిమిడిలో అనేకులున్నా వారిలో చాలామంది పూర్వాచారపరాయణులు. గిడుగు రామమూర్తిగారు, వాసా సూర్యనారాయణ శాస్త్రిగారూ, గాది నరసింగరావుగారూ ఈ ముగ్గురు మాత్రం కొంత ఉదారంగా యోచించేవారు కావడంవల్ల మల్లయ్యశాస్త్రిగారు తాము ధర్మశాస్త్రాలలో కనిపెట్టిన విషయం వారితో చర్చించారు. తమ కుమార్తెకు తిరిగి వివాహం చెయ్యడానికి ధర్మశాస్త్రం సమ్మతిస్తుందని ప్రమాణవాక్యాలు చూపించారు. ఐతే ఆమెను ఒకసారి కన్యాదానం చేశారు గనుక మళ్ళీ కన్యాదానం చేసే అధికారం మాత్రం ఆమె తల్లిదండ్రులకు ఉండదని కూడా శాస్త్రాలలో ఉన్నది.

ఆ పిల్లను వివాహం చేసుకోడానికి ఇష్టపడే యువకులకోసం అన్వేషణ జరిగింది. వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు సమ్మతించారు. ఆయన విద్వత్కవులు, శిష్టకుటుంబానికి చెందినవారు. సంబంధం మంచిదని అందరూ సంతోషించారు. వివాహం జరిగింది. మల్లయ్య శాస్త్రిగారికి కన్యాదానం చేసే అర్హత లేదు గనుక గిడుగు రామమూర్తి దంపతులు పీటలమీద కూర్చుని ఆ అమ్మాయిని తమ కుమార్తెగా భావించి కన్యాదానం చేశారు. రామమూర్తిగారు ఆ సందర్భంగా చూపిన చొరవకు కొందరు హర్షించారు. కొందరు విముఖత్వం ప్రకటించారు. ఇతరుల ఇష్టానిష్టాలకు ఏమాత్రం చలించక రామమూర్తిగారు మాత్రం తాము ధర్మమని విశ్వసించిన ఆ కార్యాన్ని అంతఃకరణ ప్రబోధాన్ని అనుసరించి ఆచరించారు.

గిడుగు రామమూర్తిగారి సంఘసంస్కరణాసక్తిని నిరూపించే మరొక సంఘటన 1908లో జరిగింది. కన్నేపల్లి లక్ష్మీనరసింహంగారు రామమూర్తిగారి దగ్గర యఫ్.ఏ. చదువుకున్నారు. తరువాత ఆయన ఇంగ్లండు వెళ్ళి బారిస్టర్ అయి స్వదేశానికి తిరిగివచ్చారు. రామమూర్తిగారినీ, తక్కిన మిత్రులనూ చూడడానికి ఆయన పర్లాకిమిడి వచ్చారు. రామమూర్తిగారి ఇంటిలోనే బస చేశారు. శిష్యుని మీది అభిమానం వల్ల రామమూర్తిగారు ఒకరాత్రి ఆయన గౌరవార్థం విందు ఏర్పాటు చేసి పదిమంది స్నేహితులను ఆహ్వానించారు. ఐతే పిలిచిన వారిలో ముగ్గురు మాత్రమే విందులో పాల్గొన్నారు. మిగిలినవారు రాలేదు సరికదా, **సీమకు వెళ్ళి జాతిభ్రష్టుడై తిరిగివచ్చిన వ్యక్తికి పంక్తిభోజనం పెట్టినందుకు రామమూర్తిగారిని ఊరిపెద్దలు ఆ మరునాటి నుంచి వెలివేశారు.**

వారి ఇంట్లో వంట చేసే వంటలక్క హఠాత్తుగా పని మానుకున్నది. మంచినీళ్ళు తెచ్చే బ్రాహ్మణుడు తిరిగి ముఖం చూపించలేదు. రామమూర్తిగారికి అత్యంత సన్నిహితులైన ఊరిపెద్దలే కొందరు కాశీగంగ తీర్థం పుచ్చుకోడానికి సమ్మతిస్తే వెలి తీస్తామని ఆయనకు వర్తమానం పంపారు. కాని అందుకు ఆయన ఒప్పుకోలేదు. "మరెందుకైనా ప్రాయశ్చిత్తం చేసుకుంటాను గాని ఇందుకు మాత్రం కాదు – మీరు వెలిలో ఉంచినా సరే, మానినా సరే" అని ఖండితంగా సమాధానం చెప్పారు.

మరి కొందరు మిత్రులు రామమూర్తిగారి కుటుంబాన్ని వెలిలో ఉంచడానికి ఒక వంక మనసొప్పక, కలుపుకోడానికి మరొకవంక ధైర్యంచాలక ఊళ్ళోసభలు జరిపి సముద్రందాటి విదేశాలలో ఉండి వచ్చినవారూ, వారిని తమలో కలుపుకున్నవారూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన అవసరం ఉన్నదా, లేదా అని చర్చించారు. కాని ఆ సభలవల్ల కూడా ప్రయోజనమేమీ లేకపోయింది. ఆ వెలి కొంతకాలం సాగి తరువాత ఏ ప్రయత్నమూ లేకుండానే తొలగిపోయింది. **సనాతనాచార పరాయణుల బెదిరింపులకు ఏమాత్రం లొంగక రామమూర్తిగారు మాత్రం ఆ సందర్భంలో తమ స్వతంత్ర ప్రవృత్తిని నిలబెట్టుకున్నారు.** సీతాపతిగారు చెప్పినట్టు రామమూర్తిగారు "మొదటి నుండిన్నీ సబబులేని అధికారమునకుగాని, అట్టి అధికారము వహించే వ్యక్తులకు గానీ లొంగక, తమ పట్టుదల వీడక, తమకు ఉచితమని తోచిన పని నిర్భయంగా సాగిస్తూవచ్చా' రనడానికి ఈ వెలి సంఘటన చక్కని తార్కాణం. **దేశకాల పరిస్థితులను లేశమైనా అర్థం చేసుకోక ఏనాడో రూపొందించుకున్న శాస్త్రనిషేధాలను యథాతథంగా పాటించడం అజ్ఞత అని రామమూర్తిగారు ఆచరణలో నిరూపించారు.**

ఇక రామమూర్తిగారి సంఘ సంస్కరణాసక్తిని వ్యక్తం చేసే మూడవ సందర్భం అస్పృశ్యత పట్ల ఆయన వైఖరికి సంబంధించినది. పర్లాకిమిడి ప్రాంతంలో ఉన్న సవరలు(శబరులు) అనే గిరిజనుల స్థితిగతులను చక్కబరచడానికి రామమూర్తిగారు వారి భాష నేర్చుకుని; నిఘంటు రచన చేసి, వారికి చదువు చెప్పడానికి సొంత ఖర్చుతో పాఠశాలలు నెలకొల్పి ఎన్నో విధాల కృషి చేశారు. ఈ సవరలలో కూడా కులాలు, తారతమ్యాలు ఉన్నవి. వారిలో అంటరానివారుగా పరిగణింపబడే పైడి (పానో) జాతికి చెందిన 'తపుడు' అనే సవర దగ్గర రామమూర్తిగారు

మొదట ఆ భాష నేర్చుకున్నారు. అతనికి సవరభాషతో పాటు ఒరియా, తెలుగు భాషలు కూడా రావడం వల్ల అతడు అచ్చమైన సవరభాషనుగాక కొంత మిశ్రమభాషను నేర్పాడు. ఈ సంగతి వారికి కొంత కాలం తరువాత తెలిసింది. ఐతే ఇక్కడ విశేషమేమిటంటే మన దేశంలో అస్పృశ్యతా నిర్మూలనోద్యమం, హరిజనోద్ధరణ కార్యక్రమం ప్రారంభం కావడానికి 40 సంవత్సరాలకు ముందే, **1894 ప్రాంతంలోనే, రామమూర్తిగారు గిరిజనులైన సవరలను, వారిలో అంటరానివారైన పైడి (పానో) జాతి వారిని తమ ఇంటిలో ఉంచుకుని తమకు దగ్గరగా కూర్చుండ బెట్టుకుని సవరభాష నేర్చుకున్నారు..**

అంతేకాదు. తరువాత కొంత కాలానికి హరిజనుల కోసం పాఠశాలలు వెలిశాయి. ఆ బడులలో చదువు ఎట్లా సాగుతున్నదో పరీక్షించడానికి తమ తోడి ఉపాధ్యాయులు వెనుకాడితే రామమూర్తిగారు మాత్రం సంతోషంగా వెళ్ళి ఆ బాధ్యత నిర్వర్తించి వస్తూ ఉండేవారు. **మనిషికీ మనిషికీ మధ్య అంటరానితనం కేవలం నిరర్థకమైన ఆచారమని ఆయన మాటలలో వ్రాతలలో కాక తమ చేతలతో నిరూపించారు.**

పైడివాని దగ్గర తాను నేర్చుకున్న సవరభాష స్వచ్ఛమైనది కాదని రామమూర్తిగారు. ఆ భాష నేర్చుకున్న రెండేండ్లకు గుర్తించారు. తరువాత వారు తమ కంటె వయస్సులో పెద్దవాడైన మరొక సవరతో "నేస్తం" కట్టారు. అంటే, స్నేహం చేశారన్న మాట. సవరలతో నేస్తం కట్టడం అనేది ఒక తతంగం.

మంచిరోజు చూసి నేస్తం కట్టదలచిన ఆ సవర, కుండెడు తేనె, అరటిపండ్ల గెల, పసుపుకొమ్ములు, నాలుగు.... కొండ చీపుళ్ళ కట్ట, మండిగ నిండా జొన్నలు, అల్లము, పొగాకు తీసుకుని రామమూర్తిగారి ఇంటికి వచ్చాడు. ఆయన ఆ అతిథిని ఆదరించి కుర్చీలో కూర్చోబెట్టారు. అతడిచ్చిన కానుకలను అందుకున్నారు. ఒక ఎరుపు రంగు తలపాగాను, రెండు కమలా ఫలాలను, తవ్వెడు బియ్యాన్ని, పసుపు కొమ్మును, అల్లం ముక్కను, పానకాన్ని, రెండు పొగాకు చుట్టలను కానుకగా అతని కిచ్చారు..... "గడీఞాన్ గడీనమ్." అని ఉభయులు మూడుసారులు అన్నారు. చీపురుపుల్లలు ఒకరి చేతి నుంచి మరొకరు పుచ్చుకుని రెండేసి ముక్కలు చేసి పారవేశారు. ఆ సవర మాటలకు "నా స్నేహితుడా, నీ స్నేహితుడను" అని అర్థమట. చీపురుపుల్లలు విరిచి పారవెయ్యడం ప్రమాణం చెయ్యడానికి సూచన. ఆయన ఈ విధంగా ఆ సవరకు సంతృప్తి కలిగేటట్లు నేస్తం కట్టి, అతనితో సవరభాష మాటలాడుతూ, అతడు కుదిర్చిన ఒక సవర పిల్లవాడిని తమ ఇంట్లో ఉంచుకుని వాడిదగ్గర స్వచ్ఛమైన సవరభాష నేర్చుకున్నారు. ఇక్కడ మనం గమనించవలసిన దేమిటంటే – దాదాపు నూరేండ్ల క్రిందటనే రామమూర్తిగారు ఎక్కడో కొండలమధ్య నివసిస్తూ, అతి సామాన్యస్థితికి చెందిన ఒక సవర వ్యక్తిని తనతో సమానంగా భావించి, కుర్చీలో కూర్చుండబెట్టి నిజంగానే స్నేహితుడిగా పరిగణించారు. హరిజనులను, గిరిజనులను ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్నామంటూ ఇటీవల మన సమాజంలో వెలిసిన స్వార్థపరులైన వంచకుల వర్తనతో పోల్చి చూస్తే రామమూర్తిగారి ఔన్నత్యం మనకు స్పష్టంగా అర్థమవుతుంది.

మతపరమైన నిరర్థకాచారాలను పాటించక పోవడమే కాదు, రామమూర్తిగారు అర్థంలేని సాంఘిక సంప్రదాయాలను, అంధవిశ్వాసాలను కూడా తిరస్కరించేవారని కొన్ని సందర్భాలలో వారి ప్రవర్తనవల్ల తెలుస్తుంది.

పర్లాకిమిడిలో మకరసంక్రాంతి పర్వంలో కనుమునాడు పశువుల పండుగ చేస్తారు. ఆరోజున పశువులకు చురకలు వేస్తారు. పశువులతోపాటు మనుష్యులకు కూడా చురకలు వేసే ఆచారం అక్కడ సాగుతూ ఉండేది. రామమూర్తిగారు రాజాగారి కుమారునికి పాఠం చెప్పుతూ ఉండగా రాజసేవకులు ఆయన దగ్గరకు వచ్చి "అయ్యా! మీకు కూడా కడుపు మీద రెండు చురకలు వెయ్యవలసినదని మహారాజావారి సెలవయిం"దని చెప్పారు. ఆయనకు వల్లమాలిన కోపం వచ్చింది. "మిగిలిన సంస్థానాలలో మావంటివారికి పండుగనాడు కట్నాలూ కానుకలూ ఇస్తారు. ఈ సంస్థానంలో కడుపుమీద వాతలు పెట్టడం మర్యాదకాబోలు. చాలా చక్కగా ఉంది" అని కటువుగా అన్నారు. పాఠం చదువుతున్న రాజకుమారుడు సేవకులను మందలించి పంపివేశాడు. మహారాజావారి ఆజ్ఞ తిరస్కరించి ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించారని సేవకులు రాజుగారితో చిలువలు, పలువలు చేర్చి చెప్పారు. "రాజాగారికి కోపం తెప్పించారు. మీ ఉద్యోగం ఊడిపోతుం"దని ఊరి పెద్దలు కొందరు రామమూర్తిగారితో అన్నారు. "ఉద్యోగం పోతే పోతుంది. అంతకంటే ఆత్మగౌరవం నిలబెట్టుకోవడం నాకు ముఖ్యం" అని ఆయన సమాధాన మిచ్చారు. ఐతే ఆయన ఉద్యోగం మాత్రం పోలేదు.

విజయనగరం సంస్థానంలో ఆనందగజపతి మహారాజుగారి పిల్లలకు 1913లో రామమూర్తిగారు చదువుచెప్పుతున్న రోజులలో కూడా ఆయన ఈ విధంగానే తన ఆత్మాభిమానాన్ని స్వతంత్రతను నిలబెట్టుకున్నారు. రాజాగారు సంగీత సభలను, హరికథలను ఏర్పాటు చేసేవారు. ఒకసారి వారు సభ్యులందరూ కూర్చున్న తరువాత తమ వేశ్యను వెంటబెట్టుకుని సభకు వచ్చారు. సభలో ఉన్నవారందరూ గౌరవసూచకంగా లేచి నిలబడ్డారు. వేశ్య కూడా రాజుగారి వెంట

"విజ్ఞానశాస్త్రాన్ని అమ్మభాషలో బోధించాలని ఉపాధ్యాయులను కోరుతున్నా. దానివల్ల చిన్నారుల్లో 'సైన్స్ సృజనాత్మకత' పెరుగుతుంది. పాఠ్యాంశాన్ని త్వరగా అర్థం చేసుకునే శక్తీ సమకూరుతుంది. నేను పదో తరగతి వరకూ మాతృభాషా మాధ్యమంలోనే చదువుకున్నా. తర్వాత ఆంగ్లం నేర్చుకున్నా. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలు చూపించే సృజనాత్మకతే వారి భవిష్యత్తుకు పునాది. ఆ సృజనాత్మకత అమ్మభాషలో చదువువల్లే సాధ్యం."

రావడంవల్ల ఇక అక్కడ ఉండటము రామమూర్తిగారికి ఇష్టం లేకపోయింది. వారి మిత్రులూ, ఆ సంస్థానం దివాన్ అయిన గురజాడ వెంకట అప్పారావుగారి వంక చూసి తాను వెళ్ళబోతున్నానని సైగ చేశారు. ఒక్క క్షణం ఆగవలసినదని అప్పారావుగారు ఆయనకు సూచించి, "మొన్న మీరు చెప్పిన పని పూర్తిచెయ్యవలసి ఉంది. గనుక నేనూ, రామమూర్తి తమ సెలవు తీసుకొని వెడుతున్నా"మని రాజాగారితో చెప్పారు. మిత్రులిద్దరూ వెళ్ళిపోయారు. నిజానికి వారప్పుడు నిర్వహించవలసిన రాచకార్యమేమీ లేదు. అది అప్పారావుగారి సమయస్ఫూర్తికి ఉదాహరణం మాత్రమే.

ఆనాటి నుంచి రాజాగారు ఏర్పాటుచేసే సభలకు రామమూర్తిగారు వెళ్ళడం మానుకున్నారు. "రామమూర్తి పంతులుకు చాలా గర్వం. రాజా వారి దర్శనంచేసుకోడు. వారి సభలకు రాడు" అని గిట్టని వారు రాజుగారితో చాడీలు చెప్పేవారు. కాని ఉదారహృదయుడు గనుక ఆయన వారిమాటలు పట్టించుకోలేదు. భోగం మేళాలను బహిష్కరించడం, వేశ్యలను ఉంచుకునే వ్యవస్థను ప్రతిఘటించటం ఒక ఉద్యమంగా సాగుతున్న కాలమది. కొంతకాలంపాటు మధురవాణిని తన పోషణలో ఉంచుకున్న గిరీశమే బుచ్చమ్మతో "దేవతలు విమానం పంపించి నన్ను స్వర్గానికి తీసుకువెళతారు. స్వర్గానికి వెళ్ళానని నాకు అక్కడ మాత్రం సుఖం ఉంటుందనుకున్నావా వొదినా? నవాభరణ భూషితురాలయి రంభ తక్కుతూ తారుతూ వొచ్చి పో! ప్రియా! గిరీశ! నీలాటి సుందరుణ్ణి యన్నడూ నేను చూడలేదు, రమ్ము, నన్ను చేకొమ్ము" అని రెక్కబట్టుకు లాగుతుంది. నే నేఁవంటాను? 'ఛీ! అవతలికి పో నేను యాంటినాచ్చి! సానిది తాకితే పరమ అపవిత్రంగా తలుస్తాము. పియర్సు సబ్బు రాసి కడిగితేనే గాని యీ చేతికి కశ్మలం పోదు'... అని అంటాను" అని ఉపన్యాస మిస్తాడుగదా. ఏ ఉపన్యాసాలూ లేకుండానే, విజయనగరం మహారాజా వారే ఏర్పరచిన సభ అయినా వేశ్య ముందు లేచి నిలబడడం ఆత్మగౌరవానికి భంగమని రామమూర్తిగారు అటువంటి సభలకు వెళ్ళక తమ స్వాతంత్ర్య ప్రియత్వాన్ని నిరూపించుకున్నారు.

మరొక సందర్భంలో మూఢవిశ్వాసాల పట్ల రామమూర్తిగారి విముఖత్వం స్పష్టంగా వెల్లడి అయింది. ఆయన పర్లాకిమిడిలో ఉంటున్న రోజులలో 1893లో అక్కడికి ఒక జ్యోతిష శాస్త్రవేత్త వచ్చాడు. రాజాగారితో తాను త్రికాలవేదినని చెప్పుకుని, సభ జరిపి తన విద్వత్తును పరీక్షించవలసినదిగా కోరాడు. సభ ఏర్పాటయింది. కేవలం జాతకచక్రం చూస్తే చాలు, ఆ వ్యక్తి పుట్టిన తిథి, మాస, సంవత్సర వివరాలు గ్రహాల ఉనికిని బట్టి తాను చెప్పగలనన్నాడు. కొందరు తమ జాతక చక్రాలను అతని కిచ్చారు. వాటిలో ఉన్న గ్రహస్థితిని బట్టి అతడు వారు పుట్టిన తేదీని సరిగానే చెప్పగలిగాడు. రామమూర్తి గారికి జ్యోతిషశాస్త్రం మీద నమ్మకం లేదు. "ఇప్పుడైనా ఆయనకు నమ్మకం కుదురుతుం"దని సభలో ఉన్నవారిలో ఒకరన్నారు. వెంటనే రామమూర్తిగారు "ఇంతవరకు ఈ దైవజ్ఞుడు చెప్పింది ఖగోళ శాస్త్ర విషయమే కాని జాతకఫల విషయం కాదు. ఖగోళశాస్త్రమూ, గణితమూ నేర్చుకున్న వారందరూ ఈ తేదీల సంగతి చెప్పగలరు. ఎట్లా చెప్పగలరో ఈ దైవజ్ఞుల నడిగితే వీరే చెప్పగలరు. నాకు నమ్మకం లేనిది జాతక ఫలాల విషయంలోనే కాని గణితానికి సంబంధించికాదు" అని సమాధానమిచ్చారు. ఆ జ్యోతిషశాస్త్రవేత్త అంతటితో ఊరుకుంటే బాగుండేది. కాని సభలో తనకు గౌరవం పెరగాలని "గణితంతో నాకు పనిలేదు. భగవంతుడు ప్రసాదించిన దివ్యజ్ఞానంతో నేను చెప్పగల"నని ప్రగల్భాలు పలికాడు. రామమూర్తి గారికి విపరీతంగా కోపం వచ్చింది. "ఐతే మీరు జాతకచక్రం చూడగానే పుట్టిన తేదీ వివరాలు చెప్పరేం? కాగితం మీద అంకెలు వేసుకుని పావుగంట పైగా కాలక్షేపం చేసి చెపుతున్నారేం?" అని నిలదీసి అడిగి అతనికి వాగ్బంధం చేయించారు. **తెలియనిది తెలిసినట్లు నటించేవారిని చూస్తే ఆయన ఎంత మాత్రం సహించలేకపోయేవారు.**

పందొమ్మిదవ శతాబ్దంలో మన దేశంలో నవయుగోదయానికి వైతాళికులైనవారి పట్టికలో రామమూర్తిగారి పేరు తప్పక మనకు కనిపిస్తుంది. **సందేహం వచ్చినప్పుడు అంతఃకరణ ప్రవృత్తినే ప్రమాణంగా పాటించి, తాను నమ్మిన ధర్మాన్ని నిర్భయంగా ఆచరించి చూపిన ఆదర్శజీవి ఆయన.** సంఘ సంస్కరణాన్ని ఒక ఉద్యమంగా పాటించకపోయినా, ప్రధానంగా ఇతర వ్యాపృత్తులలోనే కాలం గడిపినా, దైనందిన జీవితంలో మాత్రం తన సంస్కరణాసక్తి ననుసరించి ప్రవర్తించి అనేకులకు ఆయన మార్గదర్శకుడయ్యారు.

'మరోసారి గిడుగు రామమూర్తి' పుస్తకం నుండి.
సంపాదకులు కీ॥శే॥ చేకూరి రామారావు,
ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గార్లకు కృతజ్ఞతలతో.

31 వ పుట తరువాయి...

భాషా ప్రజాస్వామీకరణ.....

వికాసం, ప్రశ్నించే తత్వం, విషయ అవగాహన కొరవడతాయి. వాక్ స్వతంత్ర్యాన్నీ భావవ్యక్తీకరణనూ మన అమ్మనుడిలో కాక పరాయి భాషలో చేయడం వలన భావదాస్యంలోకి జారిపోతాం. మళ్లీ సమాజంలో అసమానతలు చెలరేగుతాయి. మూడు నాలుగు తరాల తర్వాత ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా మన తెలుగు భాషను చదవడం, రాయడం, మాట్లాడడం తగ్గిపోతూ చివరికి ఉనికిలోనే ఉండకపోవచ్చు. కాబట్టి మన భాషను సంరక్షించుకోవడానికి ప్రతి తరంలోనూ గిడుగు వెంకట రామమూర్తి గారి పోరాట స్ఫూర్తితో తెలుగుకు పొంచివున్న ప్రమాదాన్ని తెలుసుకొని తెలుగువారందరూ పోరాడాల్సిన అవసరం ఉంది. అమ్మనుడిని బ్రతికించుకోవటం కోసం తెలుగు భాషోద్యమంలో తెలుగువారు తప్పనిసరిగా పాలుపంచుకోవడటమే గిడుగు వెంకట రామమూర్తి గారికి మనం అర్పించే నిజమైన నివాళి.

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు | తెలుగునుడి పండుగరోజు

టేకుమళ్ళ కామేశ్వరరావు

నా వాఙ్మయ మిత్రుడు



1924 ప్రాంతంలో నేను విజయనగరం మహారాజావారి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూండేవాణ్ణి. గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు మా కళాశాలకి వచ్చి, తెలుగు వ్యావహారిక భాషమీద ఉపన్యాసమిచ్చేరు. మా అధ్యాపకులలో ఒకరు బుర్రా శేషగిరిరావు ఎమ్.ఏ.గారు. ఆయన రామమూర్తిగారి ముఖ్యానుచరులలో ఒకరు. బహుశా ఆయనే ఉపన్యాసాన్ని ఏర్పాటు చేసుంటారు.

పంతులుగారు సామాన్యం ఎత్తు. ఇది గిడుగుకాదు పిడుగు అన్నట్లుగా ఉంటారు. బింకమైన మొహం. ఆయనకుండే పట్టుదల అంతా మొహంలోనే కనబడుతుంది. ఎరుపు ఛాయ, తలపాగ, కోటు, పంచ అన్నీ తెల్లటివే ధరించేరు. వారు ఉపన్యాసంలో మధ్య మధ్య గట్టిగా కేకలువేస్తూ వచ్చేరు. భాషా విషయంలో వారి ఉద్రేకం పట్టరానిది. ఆ ఉపన్యాసంలో నాకు బోధపడినది అంతే!

పంతులుగారి దగ్గర మా నాయనగారు పర్లాకిమిడిలో(1898) ఎఫ్.ఏ.చదువుకొన్నారు.

రామమూర్తిగారు తెలుగు అను పేరుగల పత్రికను కొన్ని నెలలు ప్రచురించేరు. దాని తాలూకు ప్రతులు మా ఇంటిలో ఉన్నాయి. ఆ తర్వాత వాటిని అప్పుడప్పుడు తిరగవేస్తూండేవాణ్ణి. పిమ్మట బైండు చేయించేను.

1929 ప్రాంతాలలో వాడుక భాషలో రచనలు కొంత సకృతుగా ఉండేవి. నేను ఆకాలంలో భారతికి, గృహలక్ష్మికి, పుస్తకాలమీద సమీక్షలను (రివ్యూలను) వ్రాస్తుండేవాణ్ణి. మొదట సులభ గ్రాంథికంలో వ్రాస్తూ, అది సహజంగా కనబడకపోగా, వ్యావహారిక భాషలో వ్రాయడం మొదలుపెట్టేను. దాని కంతకూ రామమూర్తి గారు దేశంలో నాటిన వ్యావహారిక భాషావిత్తనమే కారణం. నేను ఊరుకోక మరొకమెట్టు పైకి వెళ్ళేను; వ్యావహారిక భాషా రచనకి కొన్ని నియమాలు అను పెద్ద వ్యాసాన్ని రాసి భారతిలో(1933) అచ్చువేశాను.

రామమూర్తి గారు పర్లాకిమిడిలో నివసించేవారు. ఆయన డెబ్భయ్యో పుట్టినరోజు వస్తూంది. వారి శిష్యులు అనుచరులు వారికి రాజమహేంద్రవరంలో పెద్ద ఉత్సవం చేయించ సంకల్పించారు. ఆరోజే అభినవాంధ్రకవి పండిత పరిషత్తునుకూడ చేస్తారు. దానికి రాయప్రోలు సుబ్బారావు ఎమ్.ఏ.గారు అధిపతి. తెలికిచర్ల వెంకటరత్నం ఎమ్.ఏ.గారు రామమూర్తి గారి రచనలను సంపుటాలుగా ప్రకటించడానికి పూనుకొన్నారు. ఇది గొప్ప ప్రయత్నం. ఎక్కడెక్కడోవున్న వారి రచనలన్నిటికి గ్రంథరూపం ఏర్పడుతుంది. ఆ ఉత్సవంలోనే ఆధునికాంధ్ర గ్రంథ ప్రదర్శనం కూడ ఏర్పాటయింది.

ఆ పెద్ద ఉత్సవం 27.12.1933 నాడూ, ఆమర్నాడు జరిగింది. రాయప్రోలు వారు – తమ అధ్యక్షోపన్యాసాన్ని పాటలాగు చదివేరు అది వారి ప్రత్యేకత అని తెలుసుకొని సభాసదులు ముచ్చటగా ఆలకించేరు. ఆధునిక గ్రంథ ప్రదర్శనాన్ని నేను చూస్తున్నాను. గిడుగువారు వచ్చి ఆ ప్రదర్శనంలో కొన్ని గంటలసేపు ఉన్నారు. ప్రతి పుస్తకాన్ని వివరంగా పరిశీలించేరు. వాటిలో ఏదో ఒక గ్రాంథిక పుస్తకం ఉంది. దాని పేరు ఇప్పుడు నాకు బాగా జ్ఞాపకంలేదు. గిడుగువారు ఆ పుస్తకాన్ని ఎత్తి “ఇది కూడ ఇక్కడికెందుకు వచ్చింది” అన్నారు. వారికి వ్యావహారిక భాష, తమవాదము, అంతే ముఖ్యం. అట్టి పట్టుదల వల్లే వారి ఉద్యమం తెలుగులోకంలో వ్యాపించింది. వారి వాదము సరియైనది కాబట్టి అది వ్యాపించింది, అని మనం తృప్తి పడడానికి లేదు. **వారికి పట్టుదల లేకుండా ఉంటే, అది పుట్టుకలోనే పురుగుముట్టుకు పోయుండేది.** మంచి దయితేనే లోకంలో వ్యాపిస్తుంది, చెడ్డదైతే వ్యాపించదు అన్న నిబంధన లోకంలో ఎక్కడా లేదు. **ప్రచారం ముఖ్యం. మొత్తంమీద గిడుగువారి ఉత్సవం అద్భుతంగా జరిగింది.**

ఈ పట్టున వ్యావహారిక భాషోద్యమాన్ని గురించి టూకీగా చెప్తాను. తెలుగు వాఙ్మయంలో పూర్వకాలం నుంచి పద్యకావ్యాలను గ్రాంథికభాషలో రాయడం అలవాటు. సుమారుగా శ్రీనాథుడి కాలందాక పద్యకావ్యభాషకి, నాడు వాడుకలో ఉన్న భాషకి ఎక్కువ తేడా లేదని పండితులంటారు. పిమ్మట దేశంలో మార్పుచెందుతూన్న వాడుక భాషకి సంబంధం లేకుండా పద్యకావ్యభాష స్థిరపడి గ్రాంథిక భాష అనిపేరు పొందింది. ఇదినేటి వరకు కూడ పద్యకావ్యాలలో కవులు వాడుతున్నారు. అయితే పద్యకావ్యాలను విడిచిపెట్టి మిగత వాటికి – అనగా శాసనాలు, గ్రంథవ్యాఖ్యలు, లేఖలు మొదలైన వచన రచన లన్నిటికి గ్రాంథిక భాషగాక, ఆయా కాలాలనాటి వ్యావహారిక భాషను వాడుతూ వచ్చేరు. ఇది మన వచన సంప్రదాయం. అయితే అసలు తెలుగు దేశంతో రాజకీయ సంబంధం విడిపోయిన దాక్షిణాత్య ప్రాంతాలలోని దాక్షిణాత్యాంధ్ర వాఙ్మయంలో వచన గ్రంథాలను

చాలవరకు గ్రాంథిక భాషలోనే వ్రాసినారు. అది మొత్తం మీద తెలుగు వాఙ్మయ లక్షణమని చెప్పడానికి లేదుకదా! పరిస్థితులిట్లుండగా, పందొమ్మిదో శతాబ్దపు పూర్వార్థభాగంలో పరవస్తు చిన్నయసూరి వచన సంప్రదాయాన్ని తారుమారు చేసి నీతి చంద్రికను(1854) గ్రాంథిక భాషలో వ్రాసేడు. అతను మంచి పలుకుబడిగల ఉద్యోగంలో ఉండడం చేత గ్రాంథిక వచన రచనను పాఠశాలలలో వ్యాప్తిలోకి తెచ్చేడు. **అనగా అతను సహజమైన వచన మార్గాన్ని అరికట్టి, అసహజమైన దానిని ఆచరణలో పెట్టేడు.** అంతమాత్రంచేత సర్వమూ మారిపోలేదు. కందుకూరి వీరేశలింగం తన ప్రహసనాదులను వాడుక భాషలోనే రాస్తూ వచ్చేడు. గురజాడకవి ప్రఖ్యాతమైన తన నాటకాన్ని 1890లో వాడుక భాషలోనే సృష్టించేడు. వేదంవారు పాత్రోచిత భాష అను పేరున దానికి ప్రతాపరుద్రీయంలో 1895లో స్థాన మిచ్చేరు. ఏదైనా సంప్రదాయానికి ఎదురుగా గ్రాంథిక భాష కొంతకాలం నడిచింది. దాని అసహజత్వమె దానికి ముప్పు.

క్రమంగా గురజాడ, గిడుగు మొదలైన యోధులు అసలు వచన సంప్రదాయాన్ని గ్రహించి, గ్రాంథికం మీద ధ్వజమెత్తేరు. కాని అప్పటి కప్పుడే పండితులు కొందరు గ్రాంథిక భాషను దిగద్రావి, ఆ పక్షం వహించడం వల్ల వ్యావహారికవాదుల ప్రచారం ఏటికి ఎదురీత అయిన మాట నిజం.

గ్రాంథికవాదులు, వ్యావహారికవాదులు ఘోర యుద్ధం చేసుకొన్నారు. గిడుగువారు నిజమైన సంప్రదాయం , దిమోడర్న్ తెలుగు (నవీన తెలుగు) అను పుస్తకాలను అచ్చువేసేరు. జయంతి రామయ్య బి.ఏ.బి.యల్. గారు 'ఎ డిఫెన్స్ ఆఫ్ లిటరరీ తెలుగు' (గ్రాంథికాంధ్ర సమర్థన) అను పుస్తకాన్ని ప్రచురించేరు. దీనిలో ఉండే ఒక విచిత్ర మేమిటంటే – గిడుగువారుగాని, జయంతివారుగాని, ఇతరులుగాని ఇంగ్లీషుభాషలో పండితులు. వారు తమ మాతృభాషలో కంటె కూడ ఇంగ్లీషులో గొప్ప పండితులని చెప్పినా తప్పు లేదేమో! దానికి వారు వ్రాసిన ఆంగ్ల రచనలే సాక్షి.

వ్యావహారిక భాషావాదుల పట్ల సంప్రదాయం సహజత్వం కూడ ఉన్నాయి. ఎట్టకేలకు వారి వాదాన్ని అంగీకరించి, గవర్నమెంటు వారు 1913లో పాఠశాలలలో ప్రవేశపెట్టేరు. కాని గ్రాంథిక పండితుల గగ్గోలు రెచ్చిపోయింది. శెట్టి లక్ష్మీనరసింహం వ్రాసిన గ్రీకు పురాణ కథలను పాఠ్యగ్రంథంగా నిర్ణయించగా, దానిమీద వావిలికొలను సుబ్బారావు 'ది మోడర్న్ టెలుగు ప్రోజ్' (ఆధునిక తెలుగు వచనము) అను విమర్శగ్రంథాన్ని ప్రకటించేరు. బుర్రా శేషగిరిరావుగారు ప్రకటించిన 'విమర్శాదర్శ' అనుచిన్న పుస్తకం మీద ఆంధ్రభాషా సంరక్షక సమాజం వారు విమర్శాదర్శ విమరాందర్శము అను మూడు సంపుటాల గ్రంథాన్ని 1915లో ముద్రించేరు. ఈ గోలను భరించలేక గవర్నమెంటు వారు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకొన్నారు. దీనినిబట్టి తేలేది ఏమిటంటే సంస్కరణ ఒకేతూరి పైనుంచి శాసనంలాగు వస్తే ప్రయోజనం లేదని అధిక సంఖ్యాకులైన పండితులు కోరిన పిమ్మటే దానికి శాసనరూపం రావచ్చు అనీ.

1915లో బళ్ళారిలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తులో వ్యావహారిక భాషను హేళన చేయాలని ప్రతిపక్షులు కొందరు రామమూర్తిగారితో "బళ్ళారి ప్రాంతంలో 'బేడలు' అంటారు. వాటినే ఉత్తర సర్కారులలో 'పప్పు' అంటారు. ఈ మాండలికాలు ఒకరికొకరికి తెలియవు" అన్నారు. రామమూర్తిగారు లేచి, 'అయితే ఏ మాట వాడమంటారో సెలవియ్యండి' అన్నారు. పండితులు తెరమొహాలు వేశారు.

వ్యావహారిక భాష ప్రభుత్వ సింహాసనాన్ని ఎక్కి చవి జూచి, పదచ్యుతి కాగా, పట్టుదల ద్విగుణీకృత మవడంలో ఆశ్చర్యంలేదు. గిడుగువారు, వారి శిష్యులు, అనుచరులు ప్రచారానికి బద్ధకంకణులయేరు. వారి సంఖ్య నానాటికి వానర సైన్యంలాగు పెరిగి పోయింది.

వ్యావహారిక భాషావాదులు చాల వరకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించేరు. ఒకమారు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు "వారికి (వ్యావహారిక భాషావాదులకు) ఏ ప్రబంధంలో ఎన్ని అరసున్నలున్నాయో, బండిరలు ఉన్నాయో తెలుసు. నన్నయభట్టు ఎన్ని ఉత్పల మాలలను రాసేడో, తిక్కన ఎన్ని కందపద్యాలను రాసేడో చెప్పగలరు!" అన్నారు. చెళ్లపిళ్లవారుకూడా వ్యావహారిక భాషారచనను కృష్ణాపత్రికలో మొదలుపెట్టేరు. నేను గ్రాంథిక భాషలో రాయగలను. అని ఛాతీ విరుచుకొని రామమూర్తిగారి ఎదుట నిలబడ్డ పండితుడు లేడనే చెప్పవచ్చు. ఆయనకు గ్రాంథిక భాష అంత క్షుణ్ణంగా వచ్చు. అట్లు గిడుగువారు దేశంలో వ్యావహారిక భాషోద్యమాన్ని స్థాపించేరు. వారే ఆ ఉద్యమానికి నాయకులు.

రామమూర్తిగారు పర్లాకిమిడిలో ఉండేవారు. ఆయన అక్కడ కాలేజీలో ఉద్యోగం చేసి విశ్రాంతి తీసికొన్నారు. ఇట్లుండగా పర్లాకిమిడి జమీందారీని ఆంధ్ర రాష్ట్రంలో చేర్చడమా, ఓఢ్ర రాష్ట్రంలో చేర్చడమా అను చర్చ బయలుదేరింది. రామమూర్తి గారు, వాసా సూర్యనారాయణ శాస్త్రిగారు మొదలైనవారు ఆంధ్రరాష్ట్రం తరపున కృషి చేసేరు. రాజుగారికి వ్యతిరేక మయింది. దాని తాలూకు ఇబ్బందులు రామమూర్తి వర్గంవారు పడ్డారు. కడపటికి 1935లో పర్లాకిమిడి జమీందారీలో కొంత ఆంధ్రానికి, కొంత ఓఢ్రానికి విడగొట్టేరు. రామమూర్తిగారికి ఎదుటి పక్షంవారి ఒత్తిడి జాస్తి అయింది. వారు సంపాదించుకొన్న ఆస్తిపాస్తులను వదులుకొని, రాజమహేంద్రవరానికి 1935 ప్రాంతంలో చేరుకొన్నారు. అక్కడ ఆయన కుమారుడు సూర్యనారాయణమూర్తి గారు ఉపాధ్యాయోద్యోగంలో ఉన్నారు. ఆ ఊరికి వచ్చినప్పుడే నాకు రామమూర్తిగారితో పరిచయం ఎక్కువయింది.

వారు ఇన్నీసుపేటలో ఒక చిన్న మేడను బాడుగకు తీసుకొన్నారు. మేడమీది చిన్నహాలు పంతులుగారికి ప్రత్యేకం. ఆయన "నేను పర్లాకిమిడిలో నాకు అనుకూలంగా ఉండేటట్లు మేడను కట్టుకొన్నాను. అదంతా విడిచి పెట్టుకొన్నాను" అని కొంచెం నొప్పితో అన్నారు. ఆయన భార్య ముసలితనం వచ్చినా ఓపికగల మనిషి, పంతులు గారు తమ మనుమడికి అప్పుడప్పుడు సంస్కృతాన్ని బోధిస్తూండేవారు. ఆయన చాల ఓపికగల మనిషి, ఎంతసేపయినా నిల్చునే మాట్లాడేవారు.

"నేను అచ్చువేసిన జానకిప్రేమ అను కథల సంపుటాన్ని మీకు అంకితమిస్తాను" అని అనగా, ఆయన 'పూర్వకాలంలో రాజులకు అంకితమిస్తే, వారు ధనమో పొలమో ఇచ్చేవారు. నేనేమి ఈయగలను?" అన్నారు. "ధనం కోసం అంకిత మీయడం పద్ధతి ఇప్పుడు పోయింది.

నాకు మీయందున్న గౌరవంకొద్దీ అంకితమిస్తున్నాను" అన్నాను. ఆ పుస్తకాన్ని వారికి అంకిత మిచ్చేను.

రామమూర్తి గారి ఉద్దేశమేమిటంటే – వ్యావహారిక భాషా రచనకి నిబంధనలు అక్కరలేదనీ, వాడుక భాషకి వ్యాకరణమేమిటనీ. అందుకనే ఆయన శిష్యులు కొందరు "ఆయన ధ్వంసం చేయగలడుగాని పునరుద్ధరించలేడు" అన్నారు. చెడ్డని తొలగించడం మంచిని స్థాపించడం కోసమేగదా! నేను భారతిలో 1933 ప్రాంతంలో అచ్చువేసిన, 'వ్యావహారిక భాషా రచనకి కొన్ని నియమాలు' అను వ్యాసాన్ని పుస్తక రూపంలో ప్రచురించ దలచేను. దానికి వారిని పీఠికను రాయమని కోరేను. అందుకు ఆయన, 'వ్యావహారిక భాషకి నియమాలు అక్కరలేదనీ, ప్రమాణ భాష అనేది లేదనీ రాస్తాను', అన్నారు. 'మీ అభిప్రాయం ఎట్లుంటే అట్లే రాయండి' అన్నాను. కాని వారు చెప్పినంత తీవ్రంగా రాసినట్లు కనబడదు. వారి విపుల పీఠికతోనే పుస్తకాన్ని 1938లో అచ్చువేసేను.

తాను తెలుగు భాషలో చేసిన కృషి అంతా, తాను ఉద్యోగంలోంచి విరమించిన తర్వాతే చేసేను అన్నారు. దీనిని చదివినప్పుడైనా ఒక పెన్సిలును చేతబట్టుకొని, మాటల ప్రయోగాల కింద గీటు పెట్టుకొంటూ పోయేవారు. నేను ఆయన దగ్గరకు వెళ్ళినప్పుడు ఎప్పుడైనా ఏ ప్రయోగ మెట్లు వచ్చిందో వివరించజూచేవారు. అయతే నాకు దానిని అర్థం చేసుకోగలిగినంత పాండిత్యం లేకపోయింది.

ఆయన శిష్యులు కొందరు ఆయనను గురించి, "ఆయన ఒక రచనలోని భాషను గురించి తెలుసుకోగలరు గాని కళను గ్రహించలేరు" అన్నారు. ఆ మాట ఎంతవరకు నిజం? ఆయన ప్రత్యేకంగా కృషి చేసినది భాషా విషయకమే కింది స్థానంలోకి దిగిపోయింది. నేను 'రోజా' అను పేరున రాసిన కథ ప్రతిభ పత్రికలో అచ్చుయింది. అటుతర్వాత నేను వారి దర్శనానికి వెళ్ళగా "నీ కథను నేను చదవడం మొదలు పెట్టేను. పూర్తిచేసేను. పెన్సిలుతో గీట్లు పెట్టడం మాటే మరిచిపోయేను! నేను భాషలో ఇంత కృషిచేసేను. ఎందుకు? ఇటువంటి కథ ఒకటి రాసి ఉంటే ఎంత బాగుండును!" అన్నారు. నా కథ వారి మన్ననకు పాత్రమయినందుకు నమస్కరించేను.

అంతకుముందు నేను ప్రచురించిన ఒక నాటకం పేరు "కోపదారి మొగుడు" ఆయన కోపదారి అను మాటను విమర్శించి, "మాయదారి లాగుంది కాబట్టి సరిపెట్టుకోవచ్చు. కాని మొగుడు అన్న మాటేమిటి? ఆ రూపం ఎందుకు" అన్నారు. అదే పుస్తకంలో 'అప్పిడే పుచ్చుకుంటాను. తీసుగుంటాను' మొదలైన మాండలికాలను విమర్శించేరు. అది నాటకం కాబట్టి ఆ మాటలు పాత్రోచితాలు అన్న విషయం ఆలా గుంచండి. ఆయన మనసులో ఒక ప్రమాణ మనేది ఉంది అని చెప్పేటందుకు ఇట్టి విమర్శే నిదర్శనం. అయితే వాదనకు వచ్చేటప్పటికి మాత్రం ప్రమాణం అనేది లేదంటారు. ఈ విషయం వారి ఈ కింది అభిప్రాయం వల్ల పూర్తిగా రుజువవుతుంది. "మనం మాటలలో కొత్తరూపాలను ప్రోత్సహించకూడదు, సుళువుగా అంగీకరించకూడదు. అంతగా తప్పనిసరి అయితేనే ఒప్పుకోవాలి. లేకుంటే వెనుకటి గ్రంథాలకు మనకు సంబంధం బొత్తుగా తెగిపోతుంది" అన్నారు ఒకమారు నాతో. కాబట్టి ఆయన వట్టి తిరుగుబాటుదారుడే కాని మరేమీ కాదని చెప్పడానికి లేదు. అయితే ఆయన చేసిన పనిమాత్రం విధ్వంసం వరకే అనుకోండి. కాని ఆయన మనస్సులో భాషకి కొంత స్థిరరూప ముండాలి అనే ఉద్దేశం. అయితే మనం పది శతాబ్దాల కిందటి భాషను గాక ఈనాటి భాషలో రచించమంటారు. **ఆయన ఇట్లు వ్యావహారిక భాషకి పునరుద్ధారకుడు.**

"తెలుగులో వాడుకభాషలో రాసేటప్పుడు ఆయా ప్రాంతాలవారు తమ మాండలిక భాషలలో రాయాలిగాని ఇతర ప్రాంతాల మాటలతో గూడిన కలగలుపు భాషలో రాయకూడదు" అని నేను వాదించగా, ఆయన "ఇతర ప్రాంతాలలోని రూపాలు గూడిన మిశ్ర రచన శ్రేష్ఠం. ఇట్లు వ్రాస్తేనే కొంత కాలానికి ఎల్లెడల సమాన భాష అవుతుంది" అన్నారు. వారు చెప్పిన మాటే నిజమని నాకు నా దేశాటనానుభవం మీద రుజువయింది.

ఏ నవీన వాఙ్మయంలో నైనా యథార్థత (రియలిజమ్) వైపే రచయితల విధానం ప్రవహిస్తుంది. అట్లే వ్రాసే భాషకూడ మాట్లాడే భాష వైపే మొగ్గుతుంది. ఇట్లు వ్రాసేభాష మాట్లాడే భాష కూడ ఒక దాని మీద ఒకటి ప్రభావం కనబరుచుకొంటాయి.

చిలుకూరి నారాయణరావు ఎమ్.ఏ.ఎల్.టి. గారు 'ఆంధ్ర భాషా చరిత్రము' అను పెద్ద సంపుటాలను ప్రచురించేరు. "నా దగ్గరున్న పదార్థాన్నే తీసుకొని వెళ్ళి అతను పుస్తకంగా అచ్చువేసుకొన్నాడు" అన్నారు గిడుగువారు. ఆయన ఔదార్యం హద్దులేనిది. "నన్నయభట్టు వ్రాసిన భారత భాగం మూలమును పరిశోధించి తయారుచేయడానికి ఎందరో పండితుల సహాయముంటే కాని సాధ్యం కాదు" అన్నారు.

గిడుగువారు శబ్దరత్నాకరంలో లేని ప్రయోగాల నెన్నిటినో సేకరించేరు. దానిని గురించి చిలుకూరివారు 1.7.1948నాడు ఏమన్నారంటే – "గిడుగు రామమూర్తి పంతులు గారికి భాషా ప్రయోగాలను అందజేసినవాడు అరసవిల్లి గ్రామంలోని గోదా నరసయ్య గారు అను గొప్ప పండితుడు. ఆయనకు లెక్క లేనన్ని కావ్యాలు కంఠస్థం. ఒకేరకమైన వర్ణనలను వివిధ గ్రంథాలలోంచి నిల్చున్న పాటున అప్పజెప్పేవాడు. బండ్ల కొద్దీ భాషా ప్రయోగాలున్న కాగితాలను పంపగా గిడుగువారు వాటిని ఉపయోగించేరు" అన్నారు. ఈ నూతన ప్రయోగాలున్న శబ్దరత్నాకరాన్ని గ్రహించడానికి నారాయణరావుగారు

"చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్ర విజ్ఞానంలోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థికి పాఠశాల గది బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, పాఠశాల గదిలో పరాయిభాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు, శాస్త్రం మీదే కాక, చదువు మీద కూడా ఆసక్తి తగ్గుతుంది' – డి.ఎస్. కొఠారి

పాటు పడ్డారు. కాని ఆయనకు దక్కలేదు.

గిడుగువారు తమకు తెలిసినవాటిని గురించే కాని అన్నిటిని గురించి అభిప్రాయాన్ని ఇచ్చేవారు కాదు. "దేవుణ్ణి గురించి మీ అభిప్రాయమేమిటి" అని అడిగితే 'ఏమో' అని మాత్రమే సమాధానం.

ఆయన ఆరోగ్యం పైకి కనబడినంత దృఢంగా లేదు. ఏదో కాలక్షేపం చేసేవారు. మూత్రకోశం తాలూకు బాధ ఏదో ఉన్నట్లు తెలిపేవారు, మొత్తం మీద దీర్ఘకాలం జీవించి 22.1.1940 నాడు అస్తమించేరు.

ఎడబాటుకి విచారిస్తూ అనేకమంది వ్యాసాలు రాసేరు. నేను కూడ రాస్తాననుకొన్నారు. కాని నాది మూగబాధ అయిపోయింది.

ఒక ఉద్యమాన్ని లేవతీయడం కష్టం. అది ఏ కొందరి సొమ్మో! గిడుగువారు దానిని సాధించేరు. వారి తెలివి, పట్టుదల, ఓర్పు, నేర్పు, ఔదార్యం, పాండిత్యం, సమయస్ఫూర్తి ఇత్యాదులు అద్భుతం. వాటిని మించినది నిష్కల్మషమైన హృదయం.

రామమూర్తిగారి కార్యదీక్ష అచంచలమైనది. జంకడ మంటూ ఎప్పుడూలేదు. సవరభాష కోసం మన్నెపుటడవులలో తిరిగి క్వినైన్‌ను ఎక్కువగా వాడి పాపం చెముడును కొనితెచ్చుకొన్నారు.! పర్లాకిమిడిని ఆంధ్ర రాష్ట్రంలో చేర్చే ప్రయత్నంలో తమ ఆస్తిపాస్తులను ధారవోసుకున్నారు. అట్టి త్యాగధనుడు! ఆయనది గొప్ప స్వభావం, అనవసరమైన ప్రాక్ నిర్ణయాలు (ప్రిజుడిసెస్) లేవు. అందరూ సమానమే కాని భాషా విషయం పట అట్టి సమదృష్టి లేదు. వాడుకభాష ఒక్కటే! ఏకమేవా ద్వితీయమ్!

నిత్యజీవిత వ్యవహారాలలో కూడ ఆయనకు పట్టుదల జాస్తి. వారి పుత్రులలో ఒకాయన తాము తలచుకొన్నట్లుగా పరీక్షలో గొప్పగా పాసు కాలేదని ఆయనతో సంవత్సరం మాట్లాడడం మానివేసేరట!

వ్యావహారిక భాషోద్యమం ప్రజలకెంతో ప్రయోజనం. ఇదివరకు భాషను పండితులు పెట్టెలలో బంధించేసేరు. దానికిప్పుడు సంకెళ్ళు వదిలేయి. పాశ్చాత్య వాఙ్మయంలో విక్టర్ హోగో, డ్యూమా, బాల్జాక్, గస్టేవ్ ఫ్లాబర్ట్, ఎమిలి జోలా, మాపసా, టాల్‌స్టాయి మొదలైన గొప్ప వచన కళాకారుల వంటివారు మన భాషలో కూడ బయలుదేరవచ్చు. రెండక్షరాలు వచ్చిన ఎవరైనా సరే, పిల్లల దగ్గరనుంచి పెద్దలదాకా ఏ పత్రికనో, కొత్త పుస్తకాన్నే తీసుకొని చదవవచ్చు. **ప్రజా విద్యకి రామమూర్తిగారి ఉద్యమం పునాదిరాయి. మన రాజకీయ నాయకులు శ్రమపడి మనదేశానికి స్వాతంత్ర్యం తెచ్చినట్లే, రామమూర్తిగారు శ్రమపడి మనభాషకి పండితుల చేతులలోంచి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టేరు. మనదేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొన్నట్లే, భాషా స్వాతంత్ర్యాన్ని కూడ శాశ్వతంగా కాపాడుకోవాలి.**

తెలుగుజాతి ఘనత రాజకీయాలలో మురిగిపోయింది. అక్కడ మనవారి హనుమంతుడి చేష్టలే గాని, వేరే నాయకత్వం లేదు. కాని సంఘ సంస్కరణలో కాని, భాషా సంస్కరణలో కాని అట్లుకాదు, మహానాయకులను సృష్టించుకొన్నాము. రాజకీయాలకు అదెప్పుడో! ముందెప్పుడో!

'మరోసారి గిడుగు రామమూర్తి' పుస్తకం నుండి.
సంపాదకులు కీ॥శే॥ చేకూరి రామారావు,
ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గార్లకు కృతజ్ఞతలతో.

తెలుగు సరస్వతి నోముల పంట 'గిడుగు'

గిడుగు వేంకట రామమూర్తి జయంతి సందర్భాన్ని మాతృభాషా దినోత్సవంగా స్మృత్యంజలి సమర్పించటం ఎంతైనా సముచితం. తెలుగు భాషావధూటిని గ్రాంధిక వాద సంకెళ్ళు సడలింపచేసి తేట తెలుగు మాధుర్యంతో తెలుగువారి నాల్కలపై తేలియాడే సజీవ మాతృభాషగా ప్రభవింపచేసిన వ్యవహారిక భాషోద్యమ సారధి గిడుగును తలచుకొని, తెలుగుజాతి తలవంచి నేటికీ దోయిలించుకోవలసిన సందర్భం. తెలుగుతల్లి పాదార్చనలో త్రిమూర్తి కీర్తిమంతులైన కందుకూరి, గురజాడ, గిడుగు కారణజన్ములుగా మనం ఆరాధించవలసివుంది.

1962లో ముద్రితమైన 'హితసూచిని' పీఠకలో సామినీన ముద్దు నరసింహనాయుడు వచన రచనకు తెలుగు వ్యవహారికం ఎల్లా ఉపయుక్తమో చర్చించినా, తర్వాత కందుకూరి వీరేశలింగం, తమ నాటక ప్రహసనాలలో సరళ గ్రాంధికం వాడినా, 1897 నాటికి గురజాడ కన్యాశుల్కం వ్యావహారికంలో వెలువరించినా, దాన్ని గ్రామ్యభాషగా అవమానించే పండిత ఛాందస భావాలపై అవిశ్రాంత పోరాటం చేసి, ప్రత్యర్థుల నోళ్ళు మూయించిన గిడుగు, మూడు దశాబ్దాల ఉద్యమం తర్వాత తెలుగు భాషా ప్రస్థానానికి జీవం అందించింది.

1919లో వీరేశలింగం అధ్యక్షతన 'వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం' కార్యదర్శిగా గిడుగు వ్యవహరించారు. వ్యావహారిక భాషకు సమగ్ర వ్యాకరణం రాస్తానన్న కందుకూరి, 1919లో డిసెంటు పత్రం రాసి గ్రాంథేయవాదుల గుండెలలో రైళ్లు పరుగెత్తించిన గురజాడ 1915లోనే తనువులు చాలించారు. అయినా గిడుగు జైత్రయాత్ర, భాషాసంగ్రామం ఆఖరి ఊపిరి వదిలే వరకు 1940 జనవరి 22 వరకు కొనసాగించారు. జనవరి15న మద్రాస్ ప్రజామిత్ర పత్రికా కార్యాలయంలో తెలుగు పత్రికల సంపాదకులు, రచయితలకు కట్టకడపటి సందేశం తుది విన్నపం అయింది.

గిడుగువారి 'తెలుగు'పత్రిక 1919 సెప్టెంబరు నుంచి 1920 ఫిబ్రవరి వరకు వెలుగు చూసింది. ఆంధ్రపండిత భిషక్కుల భాషా భేషజం, మిథ్యాపవాదం వంటి కొరడా ఝళిపింపులు ఈ పత్రిక ద్వారానే వెలువరించారు. జనసామాన్యంలో విజ్ఞాన దీపం వెలిగించటానికి భాషా సంస్కారాన్ని మించిన సాధనం లేదని, ప్రజల విద్య, సాహిత్యం, తాత్త్వికతమాతృభాషా సజీవవికాసంపై ఆధారపడి వుంటాయని చాటి చెప్పిన గిడుగు వేంకట రామమూర్తి ఆధునిక భారతీయ సాహిత్య నిర్మాతగా జాతి స్మృతిలో సదా చిరంజీవి.

జయసూర్య
91149 48336

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు | తెలుగునుడి పండుగరోజు

గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

గిడుగువారిని గుర్తు చేసుకుంటూ...



1972 ప్రాంతంలో విశాఖపట్టణం గుప్తా బ్రదర్స్ బుక్ షాపు ఎదురుగా ఒక గ్రంథాలయం ఉండేది. దాని ఎదురుగా లండన్ మిషనరీ సొసైటీవారి చర్చి కూడా ఉంది. ఇది 1805లో నిర్మాణమైన పురాతన దేవాలయం అక్కడే చాల ప్రాచీనమైన భవనంలో ప్రజా గ్రంథాలయం ఉండేది.

అక్కడ ప్రతినెలా రెండో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇష్టాగోష్ఠి జరిగేది. ఆ గోష్ఠికి ప్రముఖులైన సాహితీ వేత్తలు వచ్చేవారు. పురిపండా అప్పల స్వామి, శ్రీశ్రీ, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, రావి శాస్త్రి మొదలయినవారు తప్పక వచ్చేవారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ఔత్సాహికులయిన సాహితీ పరులు కూడా పాల్గొనేవారు. నాకు బాగా గుర్తు 1972 సెప్టెంబర్ 2వ ఆదివారం జరిగిన ఇష్టాగోష్ఠిలో నేను పాల్గొన్నా. ఆరోజు అంశం వ్యవహారిక భాష నిలబడుతుందా? ఇది చాలా తమాషాగా ఉంది. ఆ రోజుల్లో ఏదయినా సభ జరిగే విషయం పోస్టుకార్డు ద్వారా చేతి రాతతో అన్ని వివరాలతో వచ్చేది. అదే చౌక అయిన సందేశ సమాచార పత్రం. విషయం తెలిసిన నాలాంటి వాళ్లు సాయంత్రం సరిగ్గా సమయానికి అక్కడకు చేరేవాళ్ళం. చాలా పాత భవనం రాతి కట్టడం పెద్ద హాలు కాదుకాని, పాతిక, ముప్పై మంది కూర్చునే వీలున్న గది. అంతా కిందే కూర్చోవాలి. కుర్చీలు లేవు. దాదాపు నాలుగు గోడలకు ఆనుకుని కుర్చుంటే కొద్దిమంది మధ్యలో కూర్చునేవారు. ఇది అక్కడి వాతావరణం.

నిజానికి సమయపాలన చాలా బాగా జరిగేది. సరిగ్గా ఐదు గంటలకు ముందే పెద్దలు వచ్చేవారు. సరదాగా సాహితీ కాలక్షేపం జరిగేది. నేను వెళ్లిన రోజు పురిపండా అప్పలస్వామి, రావి శాస్త్రి, శ్రీశ్రీ, రంగనాయకమ్మ, తూమాంటి దొణప్ప, గంటి జోగిసోమయాజి మొదలయిన వాళ్ళు వచ్చారు. చర్చను పురిపండా ప్రారంభించారు. ఆయన మాటలు చాలా స్పష్టంగా పూర్తి వ్యావహారిక భాషలోనే సాగింది. పైగా ఆయన అప్పటికే వ్యావహారిక భాషలో 'వచన భారతం' రాశారు. అది పలు మన్ననలు పొందినట్లు అప్పుడే మాకు తెలిసింది. భాష జీవం కలిగి ఉంటుందని వ్యావహారికమైన భాష జీవం కలిగి ఉంటుందని, వ్యావహారికమైన భాషే జీవద్భాషగా మన గలుగుతుందని, సజీవమైన భాష ఎప్పుడు ప్రజల నోళ్ళలో నానుతుందని అది తరతరాలను నడిపిస్తూ,జాతి మనుగడకు ప్రధాన భూమిక అవుతుందని చెప్పారు. గ్రాంధికం అనేది పండితుల భాష అయినందువలన దాని పరిధి చాలా చిన్నది. అందువల్ల అది కృతమై, కృశించి మరణిస్తుందని అన్నారు. దానికి సర్దాగా ఒక ఉదాహరణ చెబుతూ ఒక పాశ్చాత్యుడు తెలుగు భాష పండితుల వద్దనే నేర్చుకున్నాడు. అదీ గ్రాంధిక భాషలోనే మాట్లాడటం, అలాగే రాయడం అలవాటయింది. ఒకసారి బస్టాండ్‌కి వెళ్ళిఎంక్వయిరీలో శ్రీకాకుళమునకు వెళ్ళు వాహనము ఎన్ని గంటలకు రాగలదు చెప్పగలరా దయచేసి అని అడిగాడట. అక్కడ ఉన్నవాడు కాస్త తిక్క మనిషి. అదే పద్ధతిలో కతిపయ నిముసములకు రాగలదని తెలియజేయడమైనది అని సమాధానం చెప్పాడట. విషయం అవగాహన కాని పాశ్చాత్య ప్రయాణికుడు తెల్లముఖం వేసి చూశాడు అందరూ నవ్వులు! అనంతరం దొణప్పగారు మాట్లాడారు. ఆయన పక్కా వ్యావహారికి భాషావాది. కాని మాట మాత్రం గ్రాంధికంలా అనిపించేది. ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో తెలుగు శాఖ అతి ప్రాచీనమైనదని, అందులో ప్రారంభం నుంచి పండితులు గ్రాంధిక వాదులే గనుక బోధన, పరిశోధన, వ్యాస రచనలన్ని గ్రాంధికంలోనే సాగేవని చెప్పారు. దీనివలన విద్యాబోధన సజావుగా సాగదని,వ్యావహారిక భాషవలన శ్రోతకు, రచయితకు, పాఠకునికి అనుస్యూతమైన ఆంతరంగిక ఆత్మీయత పెరుగుతుందని అది భాషా ప్రేమకు, భాషా గౌరవానికి, భాషా అవగాహనతోపాటు భాషా రుచికి దోహద పడుతుందని చెప్పారు. విన్న వెంటనే అర్థం కావాలి. అర్థం అయిన దాన్ని ఆస్వాదించి ఆనందించాలి. అదే భాష పరమార్థం అంటూ, విశాఖపట్నం గ్రాంధిక భాషా ఉద్యమానికి పునాది అని, యేజే ఏట్స్ అనే పాశ్చాత్య ప్రభుత్వ విద్యాధికారిని గూర్చి వివరించారు. 1906లో గోదావరి, విశాఖపట్నం, గంజాం జిల్లాల పాఠశాలల అధికారి (మనం డి.ఇ.ఓ. అనవచ్చు అనుకుంటా లేదా యింకా ఆపై పదవి)గా ఉన్నాడు. ఆయన దగ్గర మున్షీ చెప్పే తెలుగుకు నిత్యం ప్రజాజన వ్యవహారికంలో ఉన్న తెలుగుకు భేదం కనిపించింది. అక్కడే ఉన్న పి.టి. శ్రీనివాస అయ్యంగారితో మాట్లాడితే విజయనగరంలో ఉన్న గురజాడ అప్పారావు గారిని, పర్లాకిమిడిలో ఉన్న గిడుగు రామమూర్తిగారిని కలుసుకోమని సలహా ఇచ్చాడు. యేట్సు దొరకు గురజాడకు అంతకు ముందే ఉత్తర

ప్రత్యుత్తరాల ద్వారా పరిచయం ఉంది. అందువల్ల ఇద్దరూ కలిసి గిడుగువారితో సంప్రదించి గ్రాంథిక భాషలో ఎందుకు బోధిస్తారో చెప్పమని అడిగారు.

తాపీ ధర్మారావుగారు గిడుగు శిష్యులలో ప్రథముడు. తాపీవారి సహకారంతో గిడుగువారు భాషా చరిత్రకు సంబంధించి అహోరాత్రులు శ్రమించి ముందు ఉపాధ్యాయులలో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించారు. ఆపై 1907లో వేసవి సెలవుల్లో విశాఖ పట్టణంలోనే ఉపాధ్యాయ పరిషత్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆపై 1908లో మరొకటి, 1910లో మూడవ పరిషత్తు సభ ఏర్పాటు చేశారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో అధ్యాపకులలో కొంత మార్పు వచ్చింది. ఈ వివరాలు కొన్ని తాపీ ధర్మారావుగారి రాలురప్పలు పుట 74లో మరికొన్ని వివరాలు చూడవచ్చు. ఈ మధ్యలో గ్రాంథిక వాదులు, వ్యావహారిక వాదులనే భేదభావాలు ఏర్పడి పండిత పరిషత్తులలో కొంత గందరగోళం ఏర్పడిరది. గ్రాంథిక వాదులు వ్యవహారిక భాషను 'కులట' అని ఈసడిరచారు. ఇది ఇలా ఉండగా మద్రాసు విశ్వవిద్యాలయం వారు 1911 జులై18న రాసిన లేఖలో ఇంటర్మీడియెట్ పరీక్ష పత్రాలు ఏ ప్రామాణిక భాషలో రాయాలన్న దానిపై ఒక కమిటీని వేశారు. అందులో ప్రొఫెసర్ రంగాచారి, కందుకూరి వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు, పి.టి. శ్రీనివాస అయ్యంగార్, పి. రామాయణియం, జె.ఆర్. సెట్వెల్‌లను నియమించారు. అనంతరం 1911 అక్టోబరులో గుమ్మడిదల వెంకట రంగారావుగారిని, 1912లో గురజాడ అప్పారావుని చేర్చారు. తర్జన భర్జనల అనంతరం ఈ కమిటీ కొనసాగలేక పోయింది. 1913 మార్చి నెలలో జయంతి రామయ్య, గిడుగు రామమూర్తి, బుర్రా శేషగిరిరావు పేర్లను చేర్చారు. ఈ సమితి 'సాహిత్యంతో ప్రయోగాన్ని బట్టి, చదువుకున్న ప్రజలు శిష్టవ్యావహారిక భాషను ఉపయోగించాలనే తీర్మానం చేశారు. ఇది గ్రాంథిక వాదులకు కంటగింపు అయింది. దీనివల్ల వ్యావహారిక భాషా బహిష్కారోద్యమ సభలు 1914 జూన్ నుంచి కాకినాడ, బెజవాడ, నూజివీడు, గుంటూరు,పిఠాపురం, కడప, పెద్దాపురం, తుని తిరుపతి, ప్రొద్దుటూరు, అమలాపురం, ఎలమంచిలి, తణుకు, రాజమండ్రి, అనంతపురం బళ్ళారి, కర్నూలు, పెనుగొండ, నెల్లూరు, బరంపురం, హర్పన హళ్ళి, బారువ, అన్నవరం మొదలయిన ప్రాంతాలలో 24 సభలు రెండు నెలల్లో జరిపారు. ఈ ప్రభావం విశ్వవిద్యాలయం వారుకూడా అంగీకరించే స్థితికి వచ్చింది. అయినా గిడుగు, గురజాడ వదల్లేదు. 1914లో కాకినాడలో జరిగిన సాహిత్య పరిషత్తు నాల్గవ వార్షికోత్సవ సభల్లో గ్రాంథిక–వ్యావహారిక భాషల వినిమయంపై వాదోపవాదాలు జరిగాయి. అనంతరం వ్యావహారికి వాదులు, గ్రాంథిక వాదులు దూరమై నిత్యం పత్రికల్లో తిట్టుకునే పరిస్థితి ఏర్పడిరది.ఐతే వెన్నుదన్నుగా ఉన్న గురజాడ 1915లో అస్తమించారు. అనంతరం 1916–17 ప్రాంతాల్లో జరిగిన సభల్లో కొవ్వూరు రాజమండ్రి ప్రాంతాల్లో గిడుగు, తాపీ ధర్మారావు మరింత ముందుకు సాగారు. రాజమండ్రిలో 1919లో 'వర్తమానాంధ్ర భాషా ప్రవర్తన సమాజము' అనే పేర ఒక సంస్థను స్థాపించి గిడుగు, జయంతి గంగన్న, కందుకూరి ప్రభృతులతో చేరి వ్యావహారిక భాషోద్యమాన్ని కొనసాగించారు. ఇది జీవద్భాషా ఉద్యమమని,భాషా స్థిరీకరణ జరిగే పోరాటమని నొక్కివక్కాణించారు. అదేకాలానికి కొంచెం ముందు శ్రీశ్రీ నాన్నగారు శ్రీరంగం వెంకటరమణయ్య విశాఖపట్నం ఎవిఎన్ కళాశాలకు అనుబంధంగా ఉన్న పాఠశాలకు హెడ్ మాస్టర్‌గా పనిచేశారు. ఆ కళాశాలకు పి.టి. శ్రీనివాస అయ్యగారు ప్రాచార్యులు. వారి ప్రోత్సాహం కూడా లభించింది. శ్రీశ్రీ 1910లో విశాఖలోనే జన్మించాడు. నాన్నగారి ప్రభావం శ్రీశ్రీపైన బాగా పడింది. ఈ నేపథ్యంలో విజయనగరంలో ఆంధ్రా యూనివర్సిటీ స్థాపించాలని విజయనగరం మహారాజా విజయరామ గజపతి (1883–1922)1921 ప్రాంతంలో ఆదిభట్ల నారాయణ దాసు, బుర్రా శేషగిరిరావు, భోగరాజు నారాయణ మూర్తి ప్రభృతులతో చర్చించారు. అంతకుపూర్వమే సంగీత కళాశాల స్థాపన, కోరుకొండలో అఖిల భారత క్రీడోత్సవం నిర్వహించారు. కొన్ని లక్షల విరాళంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం విజయనగరంలో స్థాపించాలనే ప్రగాడమైన కోరిక ఆయనకుండేది. 1922లో మరణించడంవల్ల అది సాధ్యపడలేదు.

గిడుగు వారి నిరంతర శ్రమ వ్యావహారిక భాషా ఉద్యమం ఆనాడు పండితులు, ఛాందసుల నిరాదరణకు గురి అయినా పట్టు వదలలేదు. దీన్ని ప్రజా ఉద్యమం చేయడానికి గిడుగు శిష్యులు, గురజాడ సహకారం మరువలేనిది. ఈనేపథ్యంలోనే మదరాసు విశ్వ విద్యాలయం వారి 'కాంపోజిషన్ కమిటీ'లో సభ్యులుగా ఉన్న గురజాడ ప్రకటించిన అసమ్మతిపత్రం (Minuteof Dissent) వ్యావహారిక భాషకు జీవం పోసింది. దీనికోకారణం ఉంది. 1914 ఆగష్టు 14 వతేది విశ్వవిద్యాలయ ప్రయోజనాల నిమిత్తం ఆధునిక తెలుగును గుర్తించడానికి వీలులేదని కరాఖండిగా చెప్పేసరికి దీని లోతుపాతులు, ఆనుపానులు, సాధ్యాసాధ్యాలు, ప్రజా జీవద్భాషకు ఏర్పడే ముప్పును వివరిస్తూ గురజాడ అసమ్మతి పత్రం మరో దుమారమయ్యింది. ఒక సందర్భంలో వ్యావహారిక భాషా వాదులయిన గిడుగు గురజాడ, వజ్ఝల చిన సీతారామశాస్త్రి, బుర్రా శేషగిరిరావు, గిడుగు సీతాపతి, తాపీ ధర్మారావు లాంటివారిని గ్రాంథిక వాదులయిన జయంతి రామయ్య ఏ సభలో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వలేదు. జయంతి రామయ్యకు తోడు పిఠాపురం మహారాజావారు బాగా ప్రోత్సహించడంతో వ్యావహారిక వాదులకు కాస్తంత ఇబ్బంది జరిగింది. ఈ నేపథ్యంలో గురజాడ 1915లో అస్తమించారు. గురజాడ మరణం కొంత అశనిపాతమయినా గిడుగు తన ఉద్యమ స్ఫూర్తిని విడువలేదు. 1916లో కొవ్వూరులో జరిగిన తృతీయ ఆంధ్ర మహా పరిషత్తు గిడుగువారు మాట్లాడే అవకాశం కలిగింది. ఆయన ప్రసంగం పరిస్థితులలో కొంతమార్పుకు కారణం అయ్యింది అది 1917లో వేటూరి ప్రభాకర శాస్త్రి వాడుక భాష రాసే విధానం గూర్చి మార్చి 31 నాటి కృష్ణా పత్రికలో'గ్రామ్య మీమాంస' అనే వ్యాసం చాలామందికి కనువిప్పు కలిగించింది. కవి పండితుల ఆమోదం కలిగే విధంగా భాషా చైతన్యం తెచ్చారు గిడుగు వారు. ఇదే కాలంలో అంటే 1924లో కాశీనాధుని నాగేశ్వరరావుగారు భారతీ పత్రికను స్థాపించడం, అందులోప్రాచీనాంధ్ర సాహిత్యంతోపాటు ఆధునిక వ్యావహారిక భాషకు తగిన ప్రోత్సాహమిచ్చి ఆదరించారు. దీనితో వ్యావహారిక భాష కొంత నిలబడింది. వానికితోడు చివర్లో గిడుగు వ్యావహారిక భాషా నిర్ధారణకు, సహేతుకమైన విశ్లేషణకు కందుకూరి వారు కూడా మద్దతు తెలిపారు. ఇంత చరిత్ర అనంతరం ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయం మొదట వ్యావహారిక భాషలో కూడా సమాధాన పత్రాలు రాయొచ్చని బోర్డ్ ఆఫ్ స్టడీస్, అకడమిక్ కౌన్సిల్

నుంచి సిండికేట్ ఆమోదం వరకు నడవడానికి రెండేళ్లకు పైగా పట్టింది. తొలుత మెట్రిక్యులేషన్ అనంతరం డిగ్రీ, పీజి స్థాయిలో సమాధాన పత్రాలు వ్యావహారిక తెలుగుతో రాయడానికి అంగీకరిస్తే అది పరిశోధనా వ్యాసాలకుకూడా అనంతరం ఆమోదించడం జరిగింది. ఇంత చరిత్ర కొండను అద్దం ముందు ఉంచుతున్నానని తూమాటి దొణప్పగారు వివరించారు. (ఆ రోజు నేను రాసుకున్న విషయాలు కొన్ని చేర్పులు, మార్పులు గుర్తున్నవి ఈ వ్యాసంలో చేర్చడం జరిగింది) గిడుగు రామ్మూర్తిగారి కార్యనిర్వహణ, కర్తవ్యం గురించి ఈరోజు మనం చర్చిస్తున్నాం. దీనికి కొంత పాశ్చాత్యుల రచనల గూర్చి రేఖా మాత్రంగా చెప్పుకోవలసిన అవసరం ఉంది. 1746లో బెంజిమన్ షూల్జ్ ప్రచురించిన తన తొలి తెలుగు గ్రంథాలన్ని వ్యావహారిక భాషలోనే వచ్చాయి. నిజానికి చాలా కాలం వరకు గ్రాంధిక వ్యావహారికం కలగలుపుగానే నడిచింది. ఈరోజు అసలు సిసలైన గ్రాంధిక రచన చేసేవారు, చేయగలిగేవారు లేరు. జీవద్భాష ఎప్పుడూ ప్రజల నోళ్ళలో నానేదిగా ఉంటుంది. అదే తరతరాలను వెలిగిస్తుంది. అది జాతి జనజీవనానికి, సాహిత్య విస్తృతికి, సమసమాజ సాహిత్య సారసత్వ నిర్మాణానికి మార్గమవుతుంది. గిడుగు వారు పండించిన సాహిత్య ఫలాలు నేడు మనం వ్యావహారిక భాషా రుచితో ఆస్వాదిస్తున్నాం.

గిడుగు వారి అడుగులు 1940 ప్రాంతాల్లో వదిలినా ఆ అడుగుల్లో నడిచిన వేలాది మంది అమ్మభాషనే ఆచరించారు. ఆచరిస్తూ కొనసాగిస్తున్నారు. అది జీవద్భాషకున్న సహజ లక్షణం. ఈనేపథ్యంలో ఆంగ్ల ప్రభుత్వం నుంచి పగ్గాలు దేశీయ ప్రభుత్వం చేతికి మారినా నిత్య వ్యవహారాలు ఆంగ్లంలోనే కొనసాగడం జరిగింది. విద్యాబోధన కూడా ఇంగ్లీషు మీడియంలోనే కొనసాగింది. మళ్ళీ ఇక్కడో ఉద్యమం.తెలుగు భాషలోనే విద్యాబోధనసాగాలన్నదానికి విద్యాలయాల్లో ప్రవేశ పెట్టడం, దానికి పుస్తకాల తయారీకి తెలుగు అకాడమీ చేయూత నివ్వడం అనంతర పరిణామ క్రమం. అది అంతవరకూ బాగుంది. సైన్సు, ఆర్ట్సు గ్రూపులకు వేర్వేరు తెలుగు అనువాదాలు వచ్చి అధ్యాపకులు ప్రారంభంలో కాస్తంత ఇబ్బంది పడిన మాట వాస్తవం. ఈరోజు తెలుగు బోధనకు అలవాటయిన తర్వాత ఇంగ్లీషులో బోధించాలంటే భయపడిన మాట కూడా వాస్తవమే. ఈనేపథ్యంలో అంటే 70-80 ప్రాంతంలో ఆంధ్రప్రదేశమంతటా ఇచ్చవచ్చినన్ని ఇంగ్లీషు మీడియం పాఠశాలలు ఏర్పడ్డాయి. కార్పొరేట్ వ్యవస్థ భాషా వ్యవహారంలో తలదూర్చి విద్యావ్యవస్థను, భాషా వ్యవస్థను తలకిందులు చేసింది. తెలుగు వాళ్లకి ఇంగ్లీషు మీడియం చదువులు అంటే ఒక కృతక గౌరవ భావం ఏర్పడి కుటుంబ జీవన వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. అమ్మా నాన్న, అక్కచెల్లిస్థానంలో మమ్మీ, డాడీలు, సిస్టో, బ్రోలు వచ్చాయి. గౌరవ వరుసలతో పిలుచుకునే అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల స్థానంలో గ్రాండ్ మా, గ్రాండ్ పా, గ్రాని లాంటి పదాలు సమాజంలో విరివిగా పెరిగి మన సంస్కృతీ సంప్రదాయ జీవితంలో పెనుమార్పులు తెచ్చింది. ఈ నేపథ్యంలో తెలుగు భాషను పునరుద్ధరించుకోవలసిన అవసరం ఏర్పడింది. సమాజంలో చైతన్యవంతులైన భాషా ప్రేమికులు మాతృభాషాభిమానంతో తెలుగు భాషోద్యమ సమాఖ్యను 2003 ఫిబ్రవరి 21 వ తేదిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంనాడు స్థాపించారు. నడుస్తున్నచరిత్ర, అమ్మనుడి పత్రికలు ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచాయి. పరిపాలన, బోధనా రంగాలలో తెలుగును పూర్తిగా వినియోగంలోకితేవడం, జనజీవనరంగంలో, పత్రికా ప్రసార రంగాల్లో తెలుగువాడుకను కాపాడుకోవడం, పొరుగు రాష్ట్రాల్లోన్ని తెలుగు వారిలో మాతృభాష రక్షణ-ప్రధానాంశాలుగా లోతైన చర్చలు జరిపి, దీర్ఘకాలిక లక్ష్యాలతో పటిష్టమైన తీర్మానాలను చేసి, ఉద్యమకార్యాచరణలోకి సమాఖ్య ముందడుగు వేసింది. అప్పటికే ఇవే కొన్ని లక్ష్యాలతో పనిచేస్తున్న మాతృభాషా చైతన్య సమితి, మరికొన్ని సంఘాలు సమాఖ్యతో కలిసి వచ్చాయి. అనేక అంశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలను నిర్వహించి ప్రజల్లో చైతన్యాన్ని తేగలిగారు. కొంతైనా ప్రభుత్వాలు కూడా కదలినట్లు కనిపించింది గాని, తగిన రాజకీయ సంకల్పం ప్రభుత్వ నేతల్లో రాలేదు. కోర్టుల ద్వారా కూడా సమాఖ్య కొన్ని విజయాలు సాధించింది. ఆగస్టు 29న గిడుగు జయంతిని 'తెలుగు భాషాదినోత్సవంగా' జరపడాన్నీ, ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని జరపడంలో ప్రభుత్వం కూడా ముందుకు వచ్చింది.

పాలక పార్టీలు కేవలం రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరిస్తూ, తెలుగు పట్ల చిన్న చూపుచూడడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు పాలకుల్లో తెలుగు వినియోగం సంగతి దిగజారుతూనే ఉంది. అయినా తెలుగు భాషోద్యమ సమాఖ్య పోరాడుతూనే ఉంది.

ఈ నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రంలో ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టడం పెద్ద దుమారమయింది. దానిపై ఉద్యమాలు జరుగుతున్నాయి. కోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. కాని, ఆత్మశుద్ధితో ఆలోచన చేస్తే బాల్యంలో అమ్మభాషపై ఉన్న పట్టు, అమ్మభాషపై అవగాహన ఇతర భాషపై ఉండదని జగమెరిగిన వాస్తవం. అయినా తర్జన భర్జన మధ్య ప్రభుత్వం భాషా విధానం సాగుతున్నది. నేడు కళ్ళకు కనిపించే సత్యం. మాతృభాషను ప్రాథమిక స్థాయిలో తప్పక బోధించాలనే నియమ నిర్ధారణతో పాటు ఏభాష అయినా నేర్చుకునే వెసలుబాటు కలిగించే విధంగా మన ప్రభుత్వాలు కృషి చేయాలి.

గిడుగు వారి తెలుగువ్యావహారిక భాషా ఉద్యమం నేడు భాషాబోధన స్థాయిలో నిలబడింది. ఇది కేవలం భాషోద్యమ సమాఖ్య మాత్రమే కాదు. తెలుగు భాషీయులందరి భవిష్య భాషోద్యమం కావాలి. రాబోయే తరానికి తెలుగును మృతభాషల లెక్కలో పరిగణచే ప్రమాదకరస్థితి రాకుండా కృషిచేయాలి. ప్రజలు ఇతోధికంగా సహకరిస్తారు.

తెలుగు భాష నాది, మాది అనే స్వాభిమానం కలగాలి. భాషను స్వంతంచేసుకునే ప్రతి వ్యక్తీ వర్ధిల్లుతాడు. భాషను స్వంతం చేసుకునే దేశం కూడా పురోభివృద్ధి చెందుతుంది. భాష మన ఊపిరి. భాష మన జీవితం. భాష మనకు సర్వస్వం. అదే మన జీవనవిధానం. అది గుర్తెరిగిన నాడు జాతి జీవనం, జీవన విధానం అందనంత ఎత్తుకు ఎదుగుతుంది. అదే సమాజానికి వెలుగినిస్తుంది. భాష సర్వ మానవ జీవన సహజ సౌందర్యానికి హేతువు. అది సర్వజన సంరక్షణ సమతా మమతల సేతువు.

రచయిత - ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
విశ్రాంతాచార్యులు. పరిశోధకులు, రచయిత.

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు
తెలుగునుడి పండుగరోజు

గిడుగు వేంకట రామమూర్తిగారు గతించడానికి కొన్ని రోజుల ముందు మద్రాసులో 'ప్రజామిత్ర' పత్రిక కార్యాలయంలో పత్రికా రచయితల సమావేశములో చేసిన ప్రసంగ పాఠం.

తుది విన్నపము



కళాపూర్ణ గిడుగు వేంకట రామమూర్తిగారు

29-8-1863 22-1-1940

"స్వరాజ్యం కావలెనంటున్నాము. ప్రత్యేకాంధ్ర రాష్ట్రముకోసం చిక్కుపడుకున్నాము. ప్రజాస్వామిక పరిపాలనం కోరుచున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు, సామాన్యజనులకు ఏ భాషద్వారా జ్ఞానం కలుగచేయవలసి ఉంటుందో, ఏ భాషలో గ్రంథరచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి. మీ చేతులలో పత్రికలున్నవి. పత్రికలద్వారా మీరు ఎంతైనా చేయగలరు."

మననూ మాటా చేతలలో ఒకే విధంగా వ్యవహరించేవారు ఉత్తమ మానవులు. వాటితో పాటు ఉద్యమ శీలం కూడా కలిగివుంటే అటువంటివారు నేతలైతే సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. 'గిడుగు' అటువంటి వ్యక్తి. చేపట్టిన కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో కడపటి వరకు కొనసాగించిన 'గిడుగు' తెలుగువారందరికి స్ఫూర్తి ప్రదాత ఆయన తన మరణాన్ని, ముందుగానే పసిగట్టారు. వివరంగా, స్పష్టంగా జాతికి సందేశాన్నిచ్చారు. ఈ సందేశాన్ని మనసుకు తీసుకొని తాపీధర్మారావు వంటి వారు ఆ ఆశయాల సాధన కృషికై ఎంతో కృషిచేశారు.

తెలుగు భాషోద్యమ కార్యకర్తలు, తెలుగు జనశ్రేయస్సును కోరే అన్ని రంగాల్లోని కార్యకర్తలూ 'గిడుగు'ను ఆదర్శంగా తీసుకోవాలి.

-సంపాదకుడు

నేడు సుదినం. మీవంటివారి దర్శనం కలిగింది. ప్రజామిత్ర పత్రికా సంపాదకులయిన శ్రీ రామబ్రహ్మంగారు నాయెడల దయగలవారు గనుక నేటి సాయంకాలం ఈ సభ ఏర్పరిచారు. తెలుగు సారస్వతమందూ తెలుగువారి విద్యాభివృద్ధియందూ అభిమానముగల పండితులకున్ను, కవులకున్ను, పత్రికాసంపాదకులకున్ను, నా కట్టకడపటి విన్నపము తెలియజేయడానికి అవకాశం కలుగజేశారు.

నా ఆరోగ్యం చెడిపోయినది. కాలేయంలో గుల్మ పుట్టినది; చికిత్సకోసం చెన్నపట్టణం వచ్చాను. అట్టేకాలం జీవించగలనని తోచదు. జీవించి ఉన్నా చాలా కృశించిపోయి ఉన్నాను గనుక మునుపటిలాగున మరి ఉపన్యాసాలు చేయలేను.

అందుచేత ఇదే నా కట్టకడపటి విన్నపమంటున్నాను. ఇంక జరుగవలసిన పని మీకు అప్పగిస్తున్నాను. మీరే సాగించవలెను.

ఇప్పుడు లోకంలో పత్రికలు చేస్తూ ఉండే పని సామాన్యమయినది కాదు. పత్రికాసంపాదకులు సామాన్యులు కారు. ప్రభుత్వవర్గాన్ని, మంత్రివర్గాన్ని, పరిపాలనా విధానాన్ని మార్చివేయగలశక్తి పత్రికలకున్ను, పత్రికాసంపాదకులకున్ను ఉన్నది. పత్రికలకు అదీ ఇదీ అని కాదు; అన్ని విషయాలతోను సంబంధముంటుంది. పత్రికాసంపాదకులు అన్ని విషయాల గురించీన్నీ వ్రాయగల సమర్థత, ప్రజ్ఞ గలవారు కాకపోయినా ఆయా విషయాలలో అనుభవముగల ప్రజ్ఞావంతులచేత సకల విషయాలగురించీన్నీ వ్రాయించి దేశంలో విద్య వ్యాపింపజేయగలరు.

ప్రజలలో విద్య వ్యాపింపచేయడమూ, ప్రజల ఆరోగ్యము కాపాడడమూ, ప్రజల సౌఖ్యము పోషించడమూ సంఘములోని పెద్దలు చేయవలసిన పని అంటే అదేమో ప్రజల నుద్ధరించడానికి చేయవలసిన ధర్మకార్యమని ఆలోచించకూడదు. భాగ్యవంతులయిన పెద్దలు తమ ఆరోగ్యం కాపాడుకోవలెనంటే ప్రజల ఆరోగ్యం కాపాడవలెను.

ప్రజల ఆరోగ్యం కాపాడకపోతే పెద్దలు ఎన్ని కట్టుదిట్టాలు చేసుకొన్నా అంటురోగాలు వారిని అంటక మానవు. వారి ఆరోగ్యం చెడక మానదు.

ఆవిధంగానే సంఘంలో నిరక్షరకుక్షులు ఎక్కువగా ఉన్నంతకాలము సంఘం వృద్ధిలోకి రాదు. సౌఖ్యమన్నది సంఘంలోని భాగ్యవంతులూ, పెద్దలూ, సామాన్య ప్రజలతోపాటు సమాంశులుగా అనుభవించవలసినదేకాని తామొక్కరే అనుభవించవలసినది కాదు. ప్రజలలో విద్య వ్యాపిస్తేకాని సంఘం వృద్ధిలోనికి రాదు

ఐతే, ప్రజలలో వ్యాపించవలసిన విద్య ఈ కాలానికి పనికిరాని ప్రాచీన కావ్యాలు వ్యాకరణాలు చదివించడంవల్ల రాదు. ఇంగ్లండులో

కూలివాండ్లు కమ్మర్లు మొదలైనవాండ్లు షేక్స్పియర్, మిల్టన్ మొదలైన మహాకవుల గ్రంథాలు చదవమంటే చదువరు.

"మాకు కడుపునిండా తిండి దొరికే మార్గం చెప్పండి. మా వృత్తులకు సంబంధించే విద్యలు మాకు నేర్పండి" అంటారు. అందుచేత, వాళ్ళకోసం ఇదివరకున్న విద్యావిధానమంతా మార్చవలసి వస్తున్నది. కర్మాగారాలున్న ప్రదేశాలకు విద్యాధికులు పోయి వాళ్ళకు తెలిసే భాషలో ఉపన్యాసాలిస్తూ, ఉపన్యాస విషయాలు చర్చిస్తూ ప్రజలకు జ్ఞానము, వివేకము కలుగజేస్తున్నారు.

రేడియో ప్రసంగాలవల్లను, పత్రికలవల్లను, పుస్తకాలవల్లను ప్రజలలో విద్య వ్యాపిస్తూ ఉన్నది. ఇంగ్లండు మొదలైన పాశ్చాత్యదేశాలలో కేవలం ప్రజలకోసం పెద్ద సారస్వతం పుట్టి వృద్ధి పొందుతూ ఉన్నది. అది అంతా ప్రజల భాషలోనే ఉంటుంది. ఆ విధంగానే మనదేశంలో కూడా ప్రజలలో విద్య వ్యాపించడానికి అనుకూలమైన గ్రంథాలు కావలెను. ప్రజలు తమ భాషలో వ్రాయడానికి చదవడానికి సమర్థులు కావలెను.

ప్రజలలో విద్య ఎక్కువగా వ్యాపింపజేయడానికీ, నవీనాశయములకు అనుకూలంగా అందరిలోను హృదయపరివర్తనం కలుగజేయడానికి ఎక్కువగా తోడుపడేవి పత్రికలే; కనుక పత్రికాసంపాదకులకు నా విన్నపము తెలియజేస్తున్నాను.

సుమారు 30 సంవత్సరములపై వర్తమానాంధ్రభాషా ప్రయోజనము గురించి పాటుబడుతూ ఉన్నాను. వ్యావహారికభాషాగౌరవమును నిలబెట్టడానికి నేను ప్రయత్నిస్తూ ఉంటే దానిని పడగొట్టడానికి ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు పనిచేస్తూ వచ్చారు..

మొదట నేనూ, నామిత్రుడు గురజాడ అప్పారావూ, మాకు తోడుగా మరి ఇద్దరు ముగ్గురు మాత్రమే ఈ ఉద్యమము ప్రారంభించాము. తక్కిన తెలుగువారందరూ మాకు ప్రతికూలంగా ఆంధ్ర సాహిత్య పరిషత్తువారితో కలిసి మా ఉద్యమాన్ని ఎదిరించినవారే.

ఆ కాలంలో ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ప్రతిష్ఠా, గౌరవమూ, ప్రాభవమూ ఎక్కువగా ఉండడంవల్లనూ వ్యావహారికభాషాప్రయోజనము సరిగా బోధపడకపోవడంవల్లనూ ఆ పరిషత్తువారి అభిప్రాయము ననుసరించి తెలుగు దేశమందలి పెద్దలందరూ తీర్మానాలు చేసి గవర్నమెంటువారికి ఎక్కువగా ఒత్తిడి కలిగించి వాస్తవమైన దేశభాష బడిపిల్లలు అభ్యసించకుండా చేశారు.

అప్పుడు 'నిజమైన సంప్రదాయము' అనే పేరను చిన్న వ్యాసమొకటి రచించాను. అది శ్రీ వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రులుగారు అచ్చువేయించి ప్రకటించినారు. అందులో విద్యార్థులు చదువుకొనే గ్రంథాలన్నీ మన పూర్వులు వ్యావహారిక భాషలోనే రచించేవారని కొన్ని నిదర్శనాలు చూపించాను.

దేశంలో అందరూ మీ వాదానికి ప్రతికూలంగా ఒత్తిడి కలుగజేస్తూన్నారు. గనుక వ్యావహారిక భాషా ప్రయోజనం అంగీకరింపజాలమని గవర్నమెంటువారున్ను, యూనివర్సిటీవారున్ను అనడంచేత, తెలుగుదేశమంతా తిరిగి నిజమైన సంప్రదాయం తెలియబరచి ప్రచారం సాగించాను.

పరవస్తు చిన్నయసూరి కావ్యభాషలో తన– నీతిచంద్రిక రచించి గద్యరచనకు కావ్యభాషా సంప్రదాయం తెచ్చిపెట్టక పూర్వము వ్యావహారిక భాషలోనే సకలవిధములైన గద్యరచనలు సాగుతూ ఉండేవని రుజువు చేయడానికి వ్యావహారికభాషలో రచించిన వ్రాతపుస్తకాలూ మొట్టమొదట అచ్చుపడ్డ పుస్తకాలూ కొన్ని సంపాదించి అవి పట్టుకొని తెలుగుదేశంలో ఉన్న కాలేజీలకు వెళ్ళి అక్కడి పండితులకూ ఉపాధ్యాయులకూ చూపించాను. చాలాచోట్ల సభలలో ఈ విషయమై ఉపన్యాసాలిచ్చాను.

1916వ సం!! నవంబరు 19వ తేదీని కొవ్వూరులో జరిగిన ఆంధ్ర సారస్వత మహాసభలో వందలకొలది తెలుగు పండితులూ కవులూ నా వాదమంగీకరించారు. 1919వ సం॥ ఫిబ్రవరి 28వ తేదీని రాజమహేంద్రవరమందు కీ॥శే॥ కందుకూరి వీరేశలింగంపంతులుగారు అధ్యక్షులుగా వర్తమానాంధ్ర భాషాప్రవర్తక సమాజము స్థాపించుటకు ఏర్పాట్లు జరిగినవి.

కాని పంతులుగారు మరి మూడు మాసములకే పరమపదము పొందుటవల్ల వారి తోడ్పాటు సమాజమునకు లేకపోయినది. అయినా మా ఉద్యమం సాగకపోలేదు.

1919 సం॥లోనే 'తెలుగు' పత్రిక ప్రకటించి అందులో వ్యావహారిక భాషాప్రయోజనం గురించి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం గురించి, ఆంధ్రభాషా పరిణామము గురించి వ్యాసాలు రచించి ప్రకటించాను. అవి చాలామంది పండితులూ కవులూ చదివారు. క్రమక్రమముగా నా వాదము ఆమోదించేవారి సంఖ్య అధికమవుతూ వచ్చింది. పత్రికాసంపాదకులందరూ, తమ పత్రికలందు వాడుక భాషలో రచించిన వ్యాసాలకు కొంచెము కొంచెముగానైనా అవకాశం కలుగజేస్తూ వచ్చారు.

తుదకు 1926 సం॥ తణుకులో ఆంధ్ర సాహిత్య పరిషత్ సాంవత్సరికోత్సవము జరిగినప్పుడు సభలోని వారు అందరూ కాకపోయినా అనేకులు వ్యావహారికభాషా ప్రయోజనం అంగీకరించారు. దానితో పరిషత్తు పెద్దలు ఉపద్రవము జరిగిపోయినట్లుగా భయపడి అటుపైని జరిగే సాంవత్సరికోత్సవములలో అటువంటి తీర్మానాలు మరి కాకుండా ఉండేటట్లున్ను వ్యావహారికభాషా వాదులెవరూ తమ పరిషత్తులో సభ్యులుగా చేరకుండా ఉండేటట్లున్ను కట్టుదిట్టాలు చేసుకొన్నారు.

దేశంలో అంతకంతకు వ్యావహారికభాషావాదము అంగీకరించినవారి సంఖ్య ఎక్కువగుట చేతను ఆంధ్రసాహిత్య పరిషత్తువారి ఉద్దేశములను ఆమోదించేవారి సంఖ్య తక్కువగుటచేతను ఆ పరిషత్తు క్షీణించినది; పరిషత్ పత్రిక మరి కనపడదు. నా వాదమును పూర్తిగా ఆమోదించిన నా మిత్రులు 'నవ్యసాహిత్య పరిషత్తు' స్థాపించి 'ప్రతిభ' అనే పత్రిక ప్రకటిస్తున్నారు. ఆ పత్రికే కాదు, అన్ని పత్రికలున్నూ వ్యావహారిక భాషా ప్రయోజనమును అంగీకరించినవి.

వందలకొలది కవులూ పండితులూ తమ వాడుకభాషలో రచన సాగిస్తున్నారు. ఇంతమట్టుకైనా నా కృషి ఫలించినందుకు నేను కృతార్థుడనైనానని సంతోషిస్తున్నాను. కాని బడులలోను కాలేజీలలోను ప్రభుత్వము వారున్ను విశ్వవిద్యాలయములవారున్ను వ్యావహారికభాషాప్రయోజనము అంగీకరించేవరకు నా వాదము పూర్తిగా నెగ్గినదని నేను భావించలేను. 'దేశంలో అందరున్ను మీకు ప్రతికూలంగా ఉన్నారు. గనుక వ్యావహారిక భాషా ప్రయోజనము మేము అంగీకరించలే'మని గదా ప్రభుత్వమువారున్ను

విశ్వవిద్యాలయమువారున్ను 25 సంవత్సరాల క్రిందట అన్నారు.

ఈ 25 సంవత్సరాలలో ఇంతమట్టుకు పరివర్తనం జరిగింది గనుక ఇకనైనా బడులలోను కాలేజీలలోను వ్యావహారికభాష మూలంగా విద్య సాగేటట్టు చూడవలసి ఉన్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు నాకు 'కళాప్రపూర్ణ' బిరుదు అనుగ్రహించడం నా గ్రాంథిక భాషా పాండిత్యానికి కాదు గదా! నా వ్యావహారికభాషావాదము ఆమోదించే ఈ గౌరవము నాకు ప్రసాదించారనక తప్పదు.

నన్ను గౌరవించినందుకు నేను కృతజ్ఞుడనే కాని వ్యావహారిక భాషా ప్రయోజనము ఆంధ్ర విశ్వవిద్యాలయము వారు అంగీకరించి ఆచరణలో పెట్టిన దాకా నేను పూర్తిగా కృతకృత్యుణ్ణయినానని సంతోషించలేను.

ఈ నడుమ విశ్వవిద్యాలయమువారి తెలుగు పరీక్షలలో వ్యాస రచనకు ఒక విషయంగా రేడియో ప్రసంగములవంటి ప్రసంగ మొకటి వాడుక భాషలో విద్యార్థులు రచించేటట్టు ఏర్పరచవలసినదని ఎకడమిక్ కౌన్సిలులో ఒకరు తీర్మానం ప్రవేశపెడితే అది బోర్డు ఆఫ్ స్టడీస్ వారి అభిప్రాయానికి పంపించాలన్నారు.

ప్రభుత్వమువారు బడులలో ఎందుకూ పొందని దిక్కుమాలిన కృతకాంధ్రభాషలో రచించిన వాచకాలే కావలెనంటున్నారు; వాడుక భాషలో రచించిన పుస్తకాలు 'అప్రువ్' చేయమంటున్నారు.

ఎందుచేత ? వ్యావహారిక భాష అంటే గ్రామ్యమన్న దురభిప్రాయం మన పెద్దలికి వదలలేదు. వ్యావహారిక భాషే వాస్తవమైన మాతృభాష అన్న విషయం ఎంత చెప్పినా వారు గ్రహించడంలేదు. ఏమి చేయను? వ్యావహారిక భాషను గ్రామ్యమనకూడదని మరియొకసారి గట్టిగా నచ్చచెప్తున్నాను.

గ్రామ్యశబ్దము పారిభాషికశబ్దము. గొల్లలు మొదలయిన పామరులభాష గ్రామ్యమని సంస్కృత సారస్వతములో ఆలంకారికులన్నారు. లక్షణవిరుద్ధమయిన భాష గ్రామ్యమని తెలుగు పండితులన్నారు. ఏ అర్థంలో చూచినా మన వ్యావహారిక భాషకు గ్రామ్యమన్న పేరు అన్వయించదు.

ఎందుచేతనంటే, నేను గత 30 సంవత్సరముల నుండీ సమర్థిస్తూ వచ్చిన వ్యావహారికభాష, శిష్టజన వ్యావహారిక భాషే కాని గొల్లలు మొదలయిన పామరులు పలికే గ్రామ్యభాష కాదు.

లక్షణ విరుద్ధమైన భాషగ్రామ్యమన్న సూత్రము మన శిష్టజన వ్యావహారిక భాష కెంతమాత్రము వర్తించదు. ఎందుచేతనంటే ఆ సూత్రము కల్పించిన లక్షణకర్త ఉద్దేశించిన భాష భారతాది ప్రాచీన కావ్యములలోని భాష.

అయితే మన వ్యావహారిక భాషకున్ను ప్రాచీన కావ్యభాషకున్ను సంబంధమే లేదా అంటే లేకపోలేదు. సంస్కృత సారస్వతంలో వైదికభాషకున్ను లౌకికభాషకున్ను గల సంబంధంవంటి సంబంధం ఉన్నది.

మన ప్రాచీన కావ్యభాష వైదికభాషవంటిది. వ్యావహారిక భాష లౌకికభాషవంటిది. లౌకికభాషకు లక్షణం చెప్పిన పాణిని, 'కాత్యాయనుడు, పతంజలి లోకంలో ఉన్న వాడుక భాష ప్రమాణంగా గ్రహించి సూత్రాలు, వార్తికాలు, శిష్టులు రచించారు గాని వాల్మీకి వ్యాసాదులు రచించిన గ్రంథాలలోని భాష ప్రమాణంగా చూపించలేదు.

ఇంగ్లండు దేశములో చక్రవర్తిగారు, మంత్రులు, బిషప్పులు, వక్తలు ఉపాధ్యాయులు మొదలయిన పెద్దలందరూ శిష్టులే. వారు వ్యావహారిక భాషలోనే, గ్రంథాలు రచిస్తున్నారు. విద్య బోధిస్తున్నారు. ఉపన్యాసాలిస్తున్నారు. ఆ భాషలోనే మన గవర్నరుగారు రేడియో ఉపన్యాసాలు ఇచ్చారు.

ఆ విధంగానే న్యాయమూర్తులయిన సర్ వేపా రామేశంగారు, ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాలాధ్యక్షులయిన విస్సా అప్పారావుగారు, పండితులును కవులును అయిన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, విశ్వనాథ సత్యనారాయణగారు మొదలయిన పెద్దలు తమ వ్యావహారిక భాషలో రేడియో ప్రసంగాలు చేశారు.

వీరందరూ శిష్టులే, వీరిభాష వర్తమాన శిష్టజన వ్యవహారాంధ్రభాష. వీరెవ్వరూ శిష్టులు కారంటే మన ఆంధ్రదేశంలో ఇంకెవ్వరు శిష్టులు కాగలరో నాకు తెలియదు.

వ్యావహారిక భాష గ్రంథరచన కుపకరించదనడానికి గొప్పకారణంగా భాషలోని మాండలికరూపభేదాలు చూపిస్తూ ఉంటారు కొందరు.

వాడుకభాష ఒక మండలంలో ఒక విధంగాను, మరి ఒక మండలంలో మరి ఒక విధంగాను ఉంటుంది.

అక్కడివారి మాటలు ఇక్కడి వారికి, ఇక్కడి వారి మాటలు అక్కడి వారికి తెలియవు. సర్కారు జిల్లాలవాండ్లు పప్పు అంటారు. రాయలసీమవారు బేడలంటారు. వారు 'అద్దె' అంటే వీరు 'బాడుగ' అంటారు. వారు 'చెక్క' లంటే వీరు 'వక్క' లంటారు– వారు 'ఆనపకాయ' అంటే వీరు 'సొరకాయ' అంటారు గనుక వాడుక భాష గ్రంథరచనకు పనికిరాదంటారు.

ఈ వాదం 30 సంవత్సరములనుండి చేస్తూనే ఉన్నారు. అందుకు సమాధానం చెప్తూనే ఉన్నాను. నా సమాధానం విననట్టుగానే మళ్ళీ మళ్ళీ అదే వాదం చేస్తూ ఉంటారు. ఖండితమైన వాదం ఎక్కువసార్లు చేస్తూ ఉంటే దానికేమైనా బలం వస్తుందా?

లోగడనే ఈ వాదం బయలుదేరినప్పుడు 'సరే మీరన్నమాట నిజమే, ఒక మండలం వారి వ్యవహారంలో పప్పు, అద్దె, చెక్కలు, ఆనపకాయ అనే మాట లున్నవి. అవి రెండో మండలంవారి వ్యవహారంలో లేవు. ఆ రెండో మండలంవారి వ్యవహారంతో వాటికి సరిగా బేడలు, బాడుగ, వక్కలు, సొరకాయ అనే మాట లున్నవి. ఇవి మొదటి మండలంవారి వ్యవహారములో లేవు'.

'అయితే ఏమంటారు? తమ మండలములో లేక ఇతర మండలములో ఉన్నమాటలే వాడాలంటారా? ఏ మాటలూ వాడరాదంటారా?

"ఈ మాటలలో ఏదీ వాడకూడదంటే ఆ విషయం వ్రాయవలసి వచ్చినప్పుడు ఏలాగు వ్రాయడము? ఏమాట ప్రయోగించము; సొరకాయా వద్దు; ఆనపకాయా వద్దు 'అలాబూ' అని సంస్కృతం మాట వాడమంటారా?" అని నేను అడిగినప్పుడు నా ప్రతిపక్షులు ఒకరి మొగము ఒకరు చూచుకొని మారుమాటాడలేక ఊరుకున్నారు.

మాండలిక శబ్దాలు అన్ని భాషలలోను ఉంటవి. అన్నీ సాధువులే. భాషాలక్షణం చేసేవారు ఈ రూపాలన్నీ సేకరించి అనుశాసిస్తారు.

పాణిన్యాదులు అలాగే చేశారు. ప్రాచాం... ఈ రూపము, ఉదీచాం – ఈ రూపము అంటూ అనేకంగా మాండలిక శబ్దాలు

అనుశాసించారు.

మన తెలుగు కవులు మాండలిక శబ్దాలు వాడుట చేశారు; 'పప్పు' శ్రీనాథుని హరవిలాసంలోను, 'బేడలు' ఆముక్తమాల్యదలోను ప్రయుక్తములయి ఉన్నవి.

మాండలీయక శబ్దాలు వ్యావహారికభాషాప్రయోజనానికి ప్రతిబంధకమనేవారికి లక్షణ సంప్రదాయం తెలియదని చెప్పాలి.

'కేశవ! యాంధ్రులు నానాదేశంబుల యందు నిలిచి తెలుగులె తత్త ద్దేశోక్తు లంట బలికిన నా శబ్దము లన్యదేశ్యజాంధ్రము లయ్యెన్' అని అప్పకవి చెప్పలేదా? ఆంధ్రభాషార్ణవము ఆంధ్రనామసంగ్రహము మొదలయిన నిఘంటువులలో ఈ మాండలీయక శబ్దాలు చేరలేదా? ఇవి అన్నీ శబ్దరత్నాకరములోనికెక్కలేదా?

ఎవరివాడుకలో ఉన్నమాటలు వారుపయోగిస్తారు. ఆ మాటలు తమ మండలము వారికేకాని తక్కిన మండలమువారికి తెలియవన్న విషయం తెలియడ మేలాగు? మాండలీయక శబ్దాలను గురించి మా ప్రతిపక్షులు చేసేవాదం సారంలేనిది. దీనిని గురించి సవిస్తరంగా నా 'బాలకవిశరణ్యం' లో వ్రాసి ఉన్నాను. (చూ. పు. 271 – 274).

ప్రాచీన కావ్యభాష నేడున్ను పిల్లలచేత చదివించి, అందులోనే వారిచేత వ్రాయించరాదా? అది అందరికీ సామాన్యభాష అంటారు కొందరు. అది అందరికీ అన్యభాష వంటిదే. అది ఎవరికీ పట్టుపడకపోవడములోనే 'సామ్యం' అంటాను నేను.

ప్రాచీన కావ్యభాష పట్టుపడవలెనంటే సంస్కృతభాష బాగా రావాలి. తెలుగు ప్రబంధాలు, కావ్యాలు అన్నీ చదివి అందులోని భాషారూపాలు గ్రహించాలి. అర్ధానుస్వార శకటరేఫ నిర్ణయాలు గుర్తించాలి. ఇంత చేసినా ఆ కావ్యభాష కొంతవరకు అర్థం చేసుకోవడం సాధ్యమయితే కావచ్చునేమో కాని నిర్దుష్టంగా వాడడం ఇదివరకెవరికీ సాధ్యంకాలేదనీ, సాధ్యం కావడం అసంభవమనీ నేను బాహాటంగా చెప్పగలను. మహామహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నం పంతులుగారికి, రావుబహదూర్ కందుకూరి వీరేశలింగం పంతులుగారికీ గ్రాంథికాంధ్ర భాషరాదనీ సంస్కృత భాషరాదనీ వారి గ్రంథాలలోని తప్పులు చూపించారు కళాప్రపూర్ణులయిన వేదం వేంకటరాయశాస్త్రిగారు. వారు తప్పులు ఒప్పులుగాను ఒప్పులు తప్పులుగాను చెప్పారని చూపించి ప్రాచీన గ్రాంథికాంధ్రభాష వారికి బాగుగా పట్టుపడలేదని నేను రుజువు చేశాను.

నేను రచించిన మిథ్యాపవాదము, ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజము చదివితే మీకీ విషయం స్పష్టమవుతుంది. నాకు పూర్తిగా పట్టుపడిందని నేను చెప్పుకోవడం లేదు. ప్రాచీన కావ్యభాష ఎవరికీ చక్కగా రాదనే చెప్పున్నాను. అది పట్టుపడడం అసాధ్యమని ఎందుకంటున్నానంటే – అది పూర్తిగా తెలుసుకోడానికి తగిన సాధనాలు తక్కువ.

ఏ కవియైనా తన కావ్యములలో తన కాలంలో ఉన్న భాషంతా పూర్తిగా వాడుక చేయడానికి అవకాశ ముండదు. గనుక కావ్యాలలోనికిరానిభాష మనకు పోయినట్లే కదా. కొన్ని శబ్దాలు అకార మధ్యమములో ఉకార మధ్యమములో చెప్పలేము. కొన్ని శబ్దములలోని వర్ణములు పరుషములో సరళములో చెప్పడం కష్టము. ఏకవచనములో మాత్రమే కనబడుతూ ఉన్న శబ్దాలకు బహువచన రూపము లెట్లుంటవో చెప్పలేము. బహువచనములో మాత్రమే కనబడుతూ ఉన్న శబ్దాలకు ఏకవచన రూపము లెట్లుంటవో చెప్పలేము. కొన్ని విభక్తులలో మాత్రమే కనబడుతూ ఉన్న శబ్దాలకు తక్కిన విభక్తి రూపాలెట్లుంటవో చెప్పడం కష్టము. కొన్ని శబ్దాలు కావ్యాలలో ఉన్నా నిఘంటువులలో కనబడవు; కొన్ని శబ్దాలు గ్రాంథిక భాషలో కనబడకపోయినా నిఘంటువులలో ఉన్నవి.

గ్రాంథిక భాషలో శబ్దరూపాలు ఎట్లున్నవో, అర్ధానుస్వారము, శకటరేఫము ఏయే శబ్దాలలో ఉన్నవో – ఎందులో లేవో తెలుసుకోవడము ఎంత కష్టమో చూడండి. ఏదైనా ఒక రూపము గురించి తగవు వచ్చినా, సందేహం కలిగినా అది గ్రాంథిక భాషలో లేదు; తప్పు అని చెప్పడం ఎంత సాహసమో ఆలోచించండి.

గ్రాంథికాంధ్రము పెద్ద పెద్ద పండితులకే సరిగా తెలియనప్పుడు, అది చిన్న చిన్న బడిపిల్లలకు విధించడము కార్యమవునా, కాదా – ఆలోచించండి. లోకంలో ఏదైనా ఒక వృత్తి అవలంబించి బతుకుదామని ఆలోచించి కాస్త చదువూ వ్రాతా నేర్చుకొని తమకు కావలసిన విషయము బోధించే పుస్తకాలు చదువుకొందామన్న సామాన్యులచేత దారీ తెన్నూ లేని ఈ గ్రాంథికభాషలో రచించిన వాచకాలు చదివిస్తే ఏమి ఫలము కలుగగలదు?

20 ఏండ్లు చదువుకొని 30 ఏండ్లు ఉపాధ్యాయులై ఉన్న పండితులకే కాని, ఈ గ్రాంథికభాష నాలుగు క్లాసులు చదివి ఏదో ఒక వృత్తి అవలంబించేవాండ్లకు ఎందుకు ఉపకరిస్తుంది? వాండ్లకు వాండ్ల వాడుకభాషలో పొందికగా వ్రాయడము నేర్చి ఉంటే అది ఉపకరించును. అది నేర్పరు. ఈ గ్రాంథికభాష రాదు. అందుచేత, వాండ్లు రెంటికీ చెడి యథాప్రకారంగా నిరక్షరకుక్షులవుతారు.

దేశభాషద్వారా విద్య బోధిస్తేనేకాని ప్రయోజనం లేదు. శిష్టజన వ్యావహారిక భాష లోకంలో సదా వినబడుతూ ఉంటుంది. అది జీవంతో కలకలలాడుతూ ఉంటుంది. గ్రాంథిక భాష గ్రంథాలలో కనబడేదే కాని వినబడేదికాదు. ప్రతిమవంటిది. ప్రసంగాలలో గ్రాంథిక భాష ప్రయోగిస్తూ తిట్టుకొన్నా సరసాలాడుకొన్నా ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో చూడండి.

గ్రాంథిక భాషయెడల నాకు ఆదరము లేకపోలేదు. ప్రాచీన కావ్యాలు చదువవద్దనీ విద్యార్థులకు నేర్పవద్దనీ నేనననుగాని, ఆ భాషలో నేడు రచన సాగించడానికి పూనుకోవడము వృథా అంటున్నాను. నిర్దుష్టంగా ఎవరున్ను వ్రాయలేరు. వ్రాయగలిగినా వ్రాసేవారికీ కష్టమే, వినేవారికీ కష్టమే. వ్రాసే వాండ్లేమి చేస్తున్నారు? భావం తమ సొంత (వాడుక) భాషలో రచించుకొని గ్రాంథికీకరణం చేస్తున్నారు. అది చదివేవాండ్లు వినేవాండ్లు తమ సొంతవాడుక మాటలలోకి మార్చుకొని అర్థం చేసుకొంటున్నారు. ఎందుకీ వృథా ప్రయాసం?

స్వరాజ్యం కావలెనంటున్నాము. ప్రత్యేకాంధ్ర రాష్ట్రముకోసం చిక్కుపడుకున్నాము. ప్రజాస్వామిక పరిపాలనం కోరుచున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు, సామాన్యజనులకు ఏ భాషద్వారా జ్ఞానం కలుగచేయవలసి ఉంటుందో, ఏ భాషలో గ్రంథరచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి. మీ చేతులలో పత్రికలున్నవి. పత్రికలద్వారా మీరు ఎంతైనా చేయగలరు.

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు
తెలుగునుడి పండుగరోజు

శాస్త్రి

గిడుగు రామమూర్తి పంతులుగారు

చిక్కనైన నిరసనతోటీ, తీవరించిన ద్వేషంతోటీ, గడ్డకట్టిన ప్రాతికూల్యంతోటీ పరిసరాలన్నీ ముజ్జిడ్డుగా వున్న పరిస్థితుల్లో యేటికెదురీది జీవిత సాఫల్యం పొందిన ఆధునికాంధ్రులు, కైలాసవాసి కందుకూరి వీరేశలింగం పంతులుగారి తరవాత గిడుగు రామమూర్తి పంతులుగారొక్కరే కనబడుతున్నారు.

తలచుకుంటే శరీరం జలదరిస్తోంది.

దేశంలో చారిత్రక జ్ఞానం యేమీ లేదు. కాలం మార్పులు తెచ్చి పెడుతుందనే సత్యం అవగాహన కాలేదు. హేతువాదానికి నిలవనీడ లేదు. కేవలమూ వృద్ధ ప్రపితామహుల దగ్గిరనుంచీ సంక్రమించిన గుడ్డి నమ్మకం తప్ప మరేమీ లేని రోజులవి. అలాంటి సమయంలో – ఇరవై అయిదు సంవత్సరాల కిందట రామమూర్తి పంతులుగారు వ్యావహారికాంధ్ర భాషావాదం చేపట్టి గిడనబారిపోయిన పండితవలయంలో వురికారు. పంతులుగారికి వెనక ఆసరా యేట్సుగారొకరు, శ్రీనివాస అయ్యంగారొకరు, గురజాడ అప్పారావు పంతులు గారొకరూను.

కానైతే యీ ముగ్గురూ కూలంకష ప్రజ్ఞావంతులే; అయినా పండితులు యీ వర్గాన్ని చూసి హేళన చేశారు.

కలం పట్టినప్పుడల్లా బ్రౌణ్యం తిరగవేసే పండితులికి యేట్సుగారు ఖండాంతరులై పోయారు. అయ్యంగారి దగ్గర చిరకాలం విద్యాభ్యాసం చేసిన ఆంధ్రజాతికి వారు అరవై వారైపోయారు. ఇక అప్పారావుగారా? ఆయన వొక రాచకూతురికి వూడిగంచేస్తూ ప్రహసనాలు రాసుకునే మనిషి.

ఇంకేం వుందీ? పండితులంతా పంతులుగారి వాదాన్ని కుప్పిగంతులుగా భావించారు. "ఏమీ పని లేదా యేమిటి?" అంటూ విసుక్కున్నారు. "విశాఖపట్నాన్నుంచి తప్పించుకుని పారిపోయి వచ్చారు కాబోలు" అని జాలి తలిచారు.

అప్పటికప్పుడే పంతులు గారికి 'బ్రహ్మచెవుడు' ముదిరిపోయి వుంది. ఎలుగు రాసిన పండితుల కంఠధ్వనులు, పంతులుగారి చెవిదాకా వెళ్ళలేదు.

పండితులు పంతులుగారి మీద శ్లేషలు కురిసేశారు. వ్యంగ్యాలు దిమ్మరించేశారు. దీవనలు గుమ్మరించేశారు; కాని అవి కొండగుహలో ప్రతిధ్వనించినట్లు పండితుల చెవుల్లోనే గింగురు మన్నాయి.

చేసేది లేక పండితులు కలాలు పట్టారు. వెంటనే పంతులుగారు యెర్రపెన్సులు పుచ్చుకున్నారు.

చూడగా వొక్కొక్క పండితుడి వొక్కొక్క పుస్తకంలో రెండు–మూడు –వేల తప్పులు శ్రీకారం చుట్టడానికి కలం యెన్ని తిప్పులు తిప్పాలో పండితులెరగరని పంతులుగారు టొకాయించి చెప్పారు.

కాని ప్రభుత్వం పండితుల వాదానికే చేయూత యిచ్చింది.

పంతులుగారి మార్గానికి పర్వతం అడ్డు తగిలింది. నిజమే; కాని వారు జంకలేదు. అడుగు వెనక్కి వెయ్యలేదు.

అవును. ఎందుకు జంకాలీ? ఎందుకు వెనక్కి వెయ్యాలి?

గమ్యం గమ్యంగానే వుంది. దానికేమీ విఘాతం కలగలేదు.

తెనుగు తల్లి "రావోయి నాయనా, యీ వేపునుంచి రావోయ్"! అంటూ ప్రేమతో చేతులు చాపింది.

వెంటనే పంతులుగారు దారి మార్చారు. ఈసారి వారికి అప్పారావుగారి కలం పూర్తిగా సాయపడింది.

వ్యావహారిక భాషకి "స్వాధీన హక్కు భుక్తా" ల్లో నుంచి తప్పిపోయిన గురుపీఠాన్ని మళ్ళీ దఖలు పరిచిన వారీ యిద్దరే.

అయితే, వొక్క చిన్న భేదం మాత్రం వుంది.

రామమూర్తి పంతులుగారు భాష యొక్క పూర్వోత్తరాలన్నీ క్షుణ్ణంగా తెలిసిన పండితులు. పెద్ద పెద్ద సభల్లో మహామహా మొనగాళ్ళని "గుర్రం దిగూ" అంటూ వురిమి కిందకి లాగేసిన సరదారు.

అప్పారావుగారు శబ్దశక్తి తెలిసిన రచయితలు, రససిద్ధి పొందిన భావుకులు.

రామమూర్తి పంతులుగారి సింహగర్జనలు భాషా తత్వాన్ని బోధపరిచాయి.

అప్పారావు పంతులుగారి కవిత వ్యవహార భాషలో వున్న జీవకళా, మాధుర్యమూ, రసస్ఫూర్తీ, శక్తీ వెల్లడి పరిచింది.

ఇలాగ ఆ గర్జనలవల్ల సత్యం అవగాహనం కాగా, యీ కవిత వల్ల కుమార కవి సింహులకు నూతనావేశం కలిగింది.

ఇంకేం కావాలి?

ఆంగ్ల వాఙ్మయ పరిచయం వల్లా, వివిధ దేశ పర్యటనల వల్లా కొత్తపోకడలు పోతూవున్న యువ కవులంతా వ్యవహార భాషలోనే గ్రంథ రచన ప్రారంభించారు. దేశీయులు ఆంధ్రభాష యొక్క నిసర్గ మాధుర్యాన్ని అనుభవిస్తూ జాను తెనుగు నుద్ధరించిన పంతులుగారి పరిశ్రమని గుర్తించారు. ఇదే మొన్నటి డిసెంబరు 27వ తేదీని రాజమహేంద్రవరంలో నన్నయభట్టు స్నానాలు చేసి జపంచేసిన గోదావరి వాడుక కార్యరూపం తాల్చింది.

ఆంధ్రజాతి అంతా అక్కడ కూడింది. ఆంధ్రుల వైభవం అంతా అక్కడ కొలువు తీరింది. ఆంధ్రుల రసికత అంతా అక్కడ గుబాళించింది.

ఆ వేళ రాజమహేంద్రవరంలో (పరిషద్వార్షికోత్సవంలో) పంతులు గారికి చోటు లేకపోయింది. ఇవాళ రాజమహేంద్రవరం అంతా పంతులుగారి తేజస్సుతో నిండి పోయింది.

ఆ వేళ పరిషత్తు పంతులుగారికి ఆంక్ష చెప్పింది. ఇవాళ దేశం పరిషత్తుకే ఆంక్ష చెబుతోంది.

–శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రీ


'మరోసారి గిడుగు రామమూర్తి' పుస్తకం నుండి.
సంపాదకులు కీ॥శే॥ చేకూరి రామారావు,
ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గార్లకు కృతజ్ఞతలతో.

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు | తెలుగునుడి పండుగరోజు

పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

గిడుగు, శ్రీపాద, చిలకమర్తి....'విస్మృతి అనంతరం'
గిడస బారుతున్న గిడుగు వారసత్వం


పార్వతీపురంలో గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్నప్పుడు నిర్వహించిన సదస్సులో వాడ్రేవు చినవీరభద్రుడు, గిడుగు రామమూర్తి పంతులుగారిని ఒక అంత్రపాలజిస్ట్(మానవ శాస్త్రవేత్త)గా కీర్తించారు. నిజమే. పంతులుగారు, ప్రఖ్యాత అమెరికన్ మానవశాస్త్రవేత్త ఫ్రాంజ్‌బోస్ సమకాలికులు. ఆయన శిష్యురాలు మార్గరెట్ మొదలైనవారి రచనలు యకాఎకి తను గిరిజన బడిపిల్లలకు ఉపయోగించుకోటం కుదరలేదు అని వీరభద్రుడు వాపోయారు. (కొన్ని కలలు, మెలకువలు పుట 109 ఎమెస్కో 2005) కాని 'ఈ పుస్తకం ముఖ్యంగా సవర స్కూలు మాస్టర్లు, స్కూలు పిల్లలు, కనిస్టేపులు, కచేరి గుమాస్తాలు మొదలైన వారికోసం' గిడుగు 1912 లో అచ్చువేసిన 'సవరకథలు' (పునర్ముద్రణ-ఎమెస్కో 2003)ను ఆయన




వాడుకోలేదు.' అన్ని సౌకర్యాలు సాధన సంపత్తి, ఉపకరణాలు, వివిధ ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల ధనసహాయము లభిస్తున్న ఈ రోజుల్లో మనం ఏం సాధిస్తున్నామో ఒకసారి ఆలోచించుకోవాలి. ఇవన్నీ లేని రోజుల్లో తనచేతి డబ్బుతో కష్టనష్టాలకోర్చి సవరల అభ్యుదయమే లక్ష్యంగా సవర భాషపై ఇంతకృషి చేసిన మహావ్యక్తి గిడుగు మనకు సదా స్మరణీయులు' అని సంపాదకులు ఒక నమస్కారం చేసి సరిపెట్టుకున్నారు. 1961లో జనగణనవారు ప్రచురించిన ఎథ్నోగ్రాఫిక్ నోట్స్, విలేజ్ మోనోగ్రాఫ్‌లలో సవరల మీది అధ్యయనం విశిష్టమైనది. 2010లో పార్వతీపురంలో 'ఆర్ట్స్' సంస్థ 'సవర జాతాపు సరాగాలు' వాళ్ళ ఇటీవలి పాటలు ప్రచురించింది. గిరిజన సంక్షేమశాఖ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భాషావిభాగంతో తెలుగేతర గిరిజన భాషలకు వాచకాలు తయారు చేయించింది. **గిడుగుకు జోహార్ చేస్తాం... ఆయన పేరిట పురస్కారాలిస్తున్నాం. కాని ఎవరూ గిడుగు ప్రారంభించిన కృషిని, ఆ తరువాత ప్రయత్నాలతో కలుపుకుని పరివర్ధితం చేయాలని, వాటిని వాడుకోవాలని ప్రయత్నం చేయటం లేదు.** కావాలంటే ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానం చేస్తాం.

గిడుగు లాగే అరకులోయలో కెనడా దేశీయుడు గుస్థాఫ్ గిరిజనులకోసం జీవితకాలం కృషిచేసి బోధనకోసం వాచకాలు, పండుగలు, కథలు మీద పుస్తకాలు తెచ్చాడు. బడులు నడిపాడు.. ఆయనకో నమస్కారం పడేసి, ఆయన కృషిని తీసిపడేశాం ('కొన్ని కలలు మెలకువలు' పుట 290. నేను తిరిగిన దారులు. పుట 28).

గిడుగు ఈ రంగంలో మరింత కృషి చేసే వారేమో! కాని ఆయన తెలుగు ప్రాంతాలు, ఒరిస్సా రాష్ట్రంలో చేర్చినందుకు బాధపడి రాజమహేంద్రవరం మకాం మార్చారు. 1920లో ఆ నగరంలో



జరిగిన సదస్సులో ఆయనకు మాట్లాడే అవకాశమివ్వలేదట. (భాష ఆధునిక దృక్పథం- పోరంకి దక్షిణామూర్తి - నీల్ కమల్ ప్రచురణ). అట్టి పరిస్థితులలో ఆయనను ఆ నగరానికి ఆహ్వానించి స్థిరపరచి, 1930లో వారికి యావదాంధ్రం నుండి విచ్చేసిన ప్రముఖుల సదస్సులో విజయపట్టం ఇప్పించిన వారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. (భాష ఆధునిక




దృక్పథం).

శ్రీపాద అందరివంటి సాహిత్యగాడు కాదు. ఆయన సంవేదనశీలియైన మానవతామూర్తి .ఆయన సాహిత్యాన్ని చాలామంది ప్రశంసించారు కాని, ఆయన పాశ్చాత్య విద్యావిధానం ప్రభావాన్ని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టటం మరో ఎమెస్కో ప్రచురణ 'ప్రియశత్రువు' (2009) ప్రముఖంగా పేర్కొంటూ, **ఆ విద్య ప్రభావానికి లోనైన తత్వవేత్తలను, విద్యావేత్తలను సాహిత్యగాళ్ళను దుమ్మెత్తిపోసింది. వెయ్యేళ్ళ మహమ్మదీయ పాలన తెచ్చిపెట్టలేని మార్పులు తెచ్చిపెట్టింది నూట యాభై సంవత్సరాల క్రైస్తవపాలన. ఇంగ్లీష్ వాఙ్మయం జీర్ణించి, స్వధర్మపరిజ్ఞానం మొదలంటా నశించి, పైపెచ్చు బ్రిటిష్ వారిచేతిలోకంటే వీరి చేతిలోనే ఎక్కువ దెబ్బతింటుంది మన స్వధర్మం(పుట 34). వలస తత్త్వం ఏకంగా ఈ ఆంధ్రజాతిని గొర్రెలమందవలె ఒక దొడ్డిలోకి తోసివేసిందా అనిపిస్తుంది(పుట 20).వలస పాలన ఏకంగా పాలకులను పాలితులను కూడా భ్రష్టుపట్టించి వారిని అమానుషులను చేస్తుంది(పుట 37).**

విభిన్న గాథలపై వచ్చిన గ్రంథానికి ('తెలుగులో వీర గాథలు' తంగిరాల సుబ్బారావు)ముందుమాట('సమాంతర సాహిత్యం') రాస్తూ, ఈ జాతుల గురించి ఆలోచించటం మనం పాశ్చాత్యుల నుండి వెలువడుతున్న కొత్త సిద్ధాంత ప్రాతిపదికపై సాగించాలి.అంటే నయా పరిశోధకుల్ని proffessional folklorists కమ్మంటారు కె.వి.రమణారెడ్డి లాంటి వారు కూడా (పుట34) ఒక శతాబ్దం పైగా ప్రబలిన ఈ రేచీకటిలో స్వైరం చేస్తున్నది. మన తెలుగు తత్వ చితి చింతన'.'తత్వ విద్యార్థులున్నారు కాని వారిదంతయు పుస్తకపాఠము.వారి శక్తి యంతయు ఇతరులు చెప్పినదానిని వల్లించుటలోనే ముగిసినది' (పుట 15)అంటూ శ్రీపాదతో పాటు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మలనుకూడా ఈ పుస్తకం ఉదహరించింది. ఆశిష్ నంది రచన intimate enemy ని, ఆంధ్రదేశంలోని పరిణామాలకు అన్వయిస్తూ, ఆచార్య వెంకట రావు చేసిన 30 పేజీల పరిచయంతో 'పొరుగునుంచి తెలుగులోకి –విమర్శ చర్చల కోసం' పేరిట తెస్తున్న ప్రచురణపరంపరలో మొదటిదిగా అందించిన అనువాదం ఇది, 'మనకు మనమే న్యూనం చేసుకోటానికి ... మరో వలసపాలక దేశపు ప్రతినిధి అవసరం లేదు. మెకాలే మానసపుత్రులే ఈ ప్రణాళికను కొనసాగిస్తారు'.(పుట 43) అంటూ మన విద్యాలయాలు తయారు చేస్తున్న బతక నేర్చిన పాలకవర్గాన్ని, మేధావులను, సాహిత్యగాళ్ళను నంది తిట్టిపోస్తాడు.

వెంకటరావు తన సుదీర్ఘపరిచయంలో 'మొత్తం సాహిత్య చరిత్రలో సంఘచరిత్ర నిర్మాణానికి పనికివచ్చే గ్రంథాలు పట్టుమని పదికన్నా లేవని సురవరం ప్రతాపరెడ్డి గారు క్షోభించిన మాట వాస్తవం' అని బిరుదురాజు రాధాకృష్ణను ఉట్టంకించారు కాని 'జానపద గేయాలు సాంఘిక చరిత్ర (బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణ కుమారి. 1976 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ) నృశాస్త్ర నేపథ్యంలో గేయగాథలను వ్యాఖ్యానించటం మొదలైంది.(తెలుగు జానపద సాహిత్యం – పురాగాథలు. రావి ప్రేమలత తెలుగు విశ్వవిద్యాలయం') తెలుగు గిరిజన గీతాలు (91) పరివర్ధిత ముద్రణ కొండకోనలలో తెలుగు గిరిజనులు 2007) విస్మరించారు.

ప్రభుత్వ గురుకులాల 'బందెల దొడ్డి'లో వలస చదువు చదివి ఉద్యోగం చేసే పాలకవర్గం అధికారమదాన్ని చిత్రించిన' నువ్వేం తాలుక్కచేరి



బంట్రోతువా,పోలీసు జవానువా, ముంచిబువా, కరణానివా నీకుదద్దేతందుకు' (మరపురాని మాటలు. బూదరాజు సంకలనం పుట 104. మీడియా హౌస్ ప్రచురణ) చిలకమర్తి మాటలు మరపురానివి..

ఈ అధికార, విద్యారంగాలలో పెత్తనం చలాయిస్తూ మనం విస్మరించిన పౌర ధర్మాన్ని, దేశి వారసత్వాన్ని మరో ఎమెస్కో అనువాదం 'విస్మృతి అనంతరం'(2014) (మూలం గణేష్ దేవి After Amnesia) గర్హించింది. 'భూమి

"ఒక బిడ్డ మాతృభాషలో ఒక సంవత్సరం నేర్చుకున్న విద్య పరాయి భాషలో నేర్చుకోవడానికి నాలుగేళ్ళు పడుతుంది" –విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

పంపకాన్ని, రివెన్యూ నిర్మాణాలను ప్రభావితం చేసిన అధికార యంత్రాంగం, పాశ్చాత్య తరహా విశ్వవిద్యాలయ విద్యను ప్రవేశ పెట్టటము, విద్యావిధానంలో 'ఇంగ్లీష్ అంశాన్ని ప్రవేశ పెట్టటం కూడా చేసింది. అధికార యంత్రాంగం ద్వారా ప్రసరించిన పాశ్చాత్య సాహిత్య ప్రభావాలకు ప్రత్యక్షంగా ప్రభావితులైన వారిలో అత్యధికులు మధ్య తరగతి బ్రాహ్మణులు, ఇండాలజిస్టులు, మిషనరీలు'.(పుట144).

'వివేక శూన్యమైన పరిజ్ఞానం మూర్తీభవించినమనిషిని పద్ధత మూర్ఖ అని సంబోధిస్తాడు. భక్తి వైరాగ్య, భజన ఆచరణలను ఇసుమంతైనా ఎరుగక లిఖిత రూపమైన జ్ఞానమంతటిని చదివేవాడు కేవలం ఒక గ్రాంధిక మూర్ఖుడు'.(పుట 122). అంటూ సమర్థ రామదాసును ఉదాహరిస్తూ దేశి సాహిత్యం పట్టించుకోని పుస్తకాలపురుగులను మూర్ఖులకింద జమకట్టింది.

'ఈ పుస్తకంలో రచయిత పరిగణన లోకి తీసుకున్నది సంస్కృతం, మరాఠీ, గుజరాతీ హిందీ. దేవి ప్రతిపాదించిన సిద్ధాంతం భారతీయ ఇతర భాషలకు, ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో ఎలా వర్తించిందో, ఏమేరకు వర్తిస్తుందో, అసలు వర్తిస్తుందా అనేచర్చకు ఈ పుస్తకం ఒక అవకాశం కల్పించే వీలుందని అనువదించటమైనది' అని సంపాదకీయంలో పేర్కొన్నారు. కాని 'ప్రియశత్రు'కువలె తెలుగు సాహిత్య రంగానికి అన్వయించే పరిచయం లేకుండా అనువాదం తో సరిపెట్టుకున్నారు. అటువంటి పరిచయం తెలుగులో జరిగే కృషిని; కన్నడ, తమిళ దేశి సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఏ.కే.రామానుజన్ కృషిని విస్తృతంగా ప్రస్తావించి ఉండేది.


అయితే దేవితో పాటు ఇతరుల వ్యాసాలతో సాహిత్య అకాడెమీ 'నేటివిజం' 90లలో ప్రచురించింది. దాంట్లో రామానుజన్ పేరు ఒకే ఒకసారి కనిపించింది. ఇటువంటి 'విస్మృతి' చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి లోపించటాన్ని పట్టి చూపుతుంది.

నోబెల్ సాహిత్య పురస్కారం పొందిన అక్టేవియో పాజ్ గురించి, బహుమతి తిరస్కరించిన జీన్ పాల్ సార్త్రే గురించి గుంటూరు శేషేంద్ర శర్మనుండి ఆర్.యస్ సుదర్శనం దాకా తెలుసు. కాని పాజ్, సార్త్రే సమకాలికుడు పురాగాధలు విశ్లేషించిన మానవశాస్త్రవేత్త లేవిస్ట్రాస్ మీద పుస్తకం రాశాడని తెలియదు. ఈ పద్ధతి మూర్ఖులకు జానపద సాహిత్య సేకర్త నేదునూరి గంగాధరం, కళింగ చరిత్రను వెలుగులోకి తెచ్చిన రాళ్లబండి సుబ్బారావును తలచుకోరు. లేవిస్ట్రాస్ గురించి ఎక్కడన్నా రాసినా అది 'పుస్తక పాఠం'. స్ట్రాస్, మార్గరెట్ మిడ్ వంటి వాళ్ళను చదివితే, తప్పక మన దృష్టి సమాజం మీదికి ,వాళ్ళ సాహిత్యం మీదికి, వాటిని అధ్యయనం చేసే సాంఘిక శాస్త్రాల మీదికి పోతుంది. ఆలోచన పెరుగుతుంది. అలా చెడిపోకుండా, పై వాడికి తలలో నాలికలా ఉద్యోగం చేసుకుంటూ, సాయంత్రమయ్యేసరికి సజ్జన సాంగత్యంలో కావ్యామృత రసాస్వాదనం చేస్తూ తరిస్తుంటారు. ఏ విషయం మీదైనా అరటిపండు వలిచినట్లు ప్రసంగిస్తారు.దాంట్లో పండే ఉండదు.


'వెన్నెలకోసం ఏడ్చే రాత్రిని చుక్కలు ఓదార్చినట్లు, కర్తవ్యం బోధపడని వాడిని కవి ఓదారుస్తాడు' (మరపురాని మాటలు పుట 62 'మేల్కొన్న మనిషి' నుండి')

గిడుగు, శ్రీపాద, చిలకమర్తి కష్టపడ్డారు.కర్తవ్యం తెలుసుకోడానికి చాలా మధన పడ్డారు.. మనం వారి భజనతో ఉనికిని చాటుకుంటున్నాం. అ

గ్రంథాలయం



చంద్రుడు ఉండడు! తారలూ ఉండవు!
కానీ, నేను ఎప్పుడూ నీ దాన్నిగా ఉంటాను
ఒక నవలికా, ఒక కథా,
10 వ్యాసాలూ కలిసిన సంపుటం
రచన: **రంగనాయకమ్మ**
పుటలు: 216, వెల :80/-
ప్రతులకు :అరుణా పబ్లిషింగ్ హౌస్,
ఏలూరు రోడ్డు, విజయవాడ- 500 002



జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర
రచన: **పోతం జానకమ్మ రాఘవయ్య**
అనువాదం: కాళిదాసు పురుషోత్తం
పుటలు: 119, వెల :100/-
ప్రతులకు :నవోదయ బుక్‌హౌస్
కాచిగూడ, హైదరాబాద్-500027
ఫోన్: 040-24652384



విద్యాదానకర్ణ-యక్షగాన కళానిధి
తెల్లాకుల వేంకటేశ్వర గుప్త
రచన: **బి.ఎల్.నారాయణ**
పుటలు: 119, వెల :100/-
ప్రతులకు :తెనాలి ఇంప్రెషన్స్
22-5-42 సరోజినినాయుడు వీధి,
కొత్తపేట, తెనాలి-1
ఫోన్: 9550930789,



వెలుగు దివ్వెలు (కవిత్వం)
రచన: **పిల్లి హజరత్తయ్య**
పుటలు: 128, వెల :150/-
ప్రతులకు :పిల్లి హజరత్తయ్య
డోర్ నెం. 7-128ఎ, హనుమాన్ నగర్,
సింగరాయకొండ, ప్రకాశంజిల్లా,
ఆం.ప్ర-523101 ఫోన్: 9848606573

29 ఆగస్టు
గిడుగు పుట్టినరోజు
తెలుగునుడి పండుగరోజు

రావిపూడి వెంకటాద్రి

ఈ వైతాళికుల పేర్లు చరిత్రకెందుకు యెక్కలేదు?

వేమన, వీరబ్రహ్మం వేదాంతులే కావచ్చు. నాస్తికులు, భౌతిక వాదులు కాకపోవచ్చు. తత్త్వాల దురభిమానాలు కొన్ని వారిలోనూ వుంటే వుండవచ్చు. కాని, వారు ఆనాటి సమాజంలోని అనేక దురాచారాల మీద మూఢనమ్మకాల మీద కులతత్వం మీద ధ్వజమెత్తారు. కావలసినంతగా కాకున్నా, వారి వాణిని సమాజం విన్నది. ప్రతిస్పందించింది, కల్లకపటమెరుగని పామరజనం వారి భావాలతో ప్రభావితమై వారిని కొలిచింది. తెలుగుదేశంలో వారి వాణి మ్రోగినంతగా వారి సమకాలంలో యితర భాషా ప్రాంతాల్లో కూడా అలాంటి వాణి మ్రోగిందేమో చెప్పలేము. కాని, వేమన పద్యాలను సి.పి.బ్రౌన్ సేకరించి మనకు అందించి వుండకపోతే, ఆ వేమన కూడా మనతరానికి దక్కేవాడు కాదు. అలానే బ్రహ్మంగారి తత్త్వాలను అచలవేదాంత బైరాగులు తమ భిక్షాటనకు దన్నుగా స్వీకరించకుంటే, ఆ బ్రహ్మంగారు కూడా మనకు దక్కేవాడు కాదు. **తమాషాయేమిటంటే, ఆ వేమన, బ్రహ్మంకూడా బ్రాహ్మలు కాదు. అందుకే వారి గురించిన చరిత్రకూడా గూడమంచులో గూఢంగా మరుగుపడి వుంది. వారు బ్రాహ్మణ మతాన్ని సమర్థించి వుంటే, వారి చరిత్ర కావ్యాల్లో కీర్తించబడి వుండేది. కాని వారు బ్రాహ్మణ మతాన్ని, దాని చేత ప్రభావితమైన సమాజాన్ని ఘాటుగా విమర్శించిన వారయ్యారు.**

కాని, ఆ తరువాత వీరేశలింగంగారి వితంతు పునర్వివాహాలు, గిడుగుగారి వ్యావహారిక భాషా వాదం, గురడాడ వారి కన్యాశుల్క సాహిత్యం, వచ్చేదాక – నిన్న మొన్నటి దాక అంతా యెడారేనని పించింది. ఆ యెడారిలో వున్న ఒయాసిస్‌ల గురించి అ తరాల వారెవ్వరూ మన తరం వారికి పరిచయం చేయలేదు అనేది విడిపడని చిక్కు ప్రశ్న.

కందుకూరి, గిడుగు,గురజాడల ముందే వారి ముగ్గురి వాదాలను ముప్పిరిన ప్రారంభించిన స్వామినేని ముద్దునరసింహం నాయుడు గారు, ఆయనకు పూర్వం బ్రాహ్మణుల వేద గుత్తాధికారాన్ని ధిక్కరించిన మామిడి వెంకయ్యగారూ వుండడం ఆశ్చర్యం! ఈ సమాచారం మాకు కేవలం 15 యేండ్ల నాడు అందింది. అంతదాక ఆ సమాచారాన్ని అణచిపెట్టగలిగిన చారిత్రకులు తెలుగునాడులో వుండడం బాధాకరమనిపించింది.

బ్రాహ్మలు మంత్రాలు చదివితే తప్ప, వివాహాది క్రతువులు పూర్తికావనే మౌఢ్యంలో నేటితరం వారే వున్నారు. కాని 19వ శతాబ్ధి ప్రారంభంలోనే బ్రాహ్మణుడి యాజకత్వ హక్కును ప్రశ్నించి, తన కుమారుని ఉపనయనానికి తానే యాజకత్వం వహించి, బ్రాహ్మణ్యంతో తగాదా పడి, న్యాయం కోసం ఇంగ్లాండులోని ప్రీవీ కౌన్సిల్ వరకుపోయిన మామిడి వెంకయ్య (1764–1834) వంటి వారు దాదాపు రెండు శతాబ్దాలనాడు తెలుగుదేశంలో వున్నారంటే, నిజంగానే మనకు ఆశ్చర్యం వేస్తుంది !

ఆశ్చర్యంతోపాటు బాధ కూడా. యెందుకంటే మానవహక్కుల కోసం అగ్రవర్ణ దౌష్ట్యం మీద పోరాటం జరిపిన మామిడి వెంకయ్య వంటి వారి పేరు చరిత్రకు జ్ఞాపకంలేదంటే సాంస్కృతిక పోరాటం, భావపోరాటం, హక్కులపోరాటం జరిపిన వారిపేర్లలో ఆయన పేరు చేరలేదంటే, ఇక మనకు లభించే చరిత్రలో నిజమెంత వుంటుంది; (కందుకూరి, గిడుగు, గురజాడవలె) ఆయన బ్రాహ్మడు కాకపోవడం వల్ల ఆయనపేరు చరిత్రకెక్కలేదా? బ్రాహ్మణులమీద పోరాటం జరిపాడు కాన, ఆయన పేరు చరిత్రలో లేకుండా తుడిచివేయబడిందా ? సి.పి.బ్రౌన్ సైతం తన నిఘంటువుకు వ్రాసుకున్న పీఠికలో వెంకయ్యను నిఘంటుకర్త అయిన పండితునిగా ప్రస్తావించాడు. (1853). అనంతరం వచ్చిన మన తెలుగు పండితులకు వెంకయ్య ప్రస్తావన చేదయింది. సంస్కృతంలో, తెలుగులో ఆయన వ్రాసిన నిఘంటువులూ, వ్యాకరణాలూ కూడా ఆ తర్వాత పండితులకు ప్రస్తావన యోగ్యాలు కాకపోయాయి.

అలాగే వ్యావహారిక భాషా వాదాన్ని ప్రారంభించడమే కాక, అందులో తొలిసారిగా ఆ "హితసూచిని" అనే గ్రంథాన్ని రచించి, ప్రచురించిన వేగుచుక్క స్వామినేని ముద్దునరసింహం కూడా విస్మరించబడ్డాడు. ఆ గ్రంథంలో ఆయన పద్యరచన వద్దని సలహా యిచ్చాడు. వచన రచన ప్రోత్సహించాలన్నాడు. దయ్యాలు, పిశాచాలు, రాక్షసులు లేవన్నాడు. మూఢవిశ్వాసాలు వదలుకోవాలన్నాడు. స్పర్శవేదిచేత తాకించి యినుమును బంగారంగా మార్చడం అబద్ధమన్నాడు. పురాణాలు పుక్కిటి కథలన్నాడు. ధర్మశాస్త్రాలు స్వార్థపరుల కల్పితాలన్నాడు. దివ్యదృష్టులు, బాణామతులు, మహాత్మ్యాలు అబద్ధమన్నాడు. వివాహ వ్యయం తగ్గించాలన్నాడు. బాల్య వివాహాలు వద్దన్నాడు. కన్యాశుల్కాలు తప్పన్నాడు. హిందూ వితంతు పునర్వివాహాలు చేయాలన్నాడు. స్త్రీలు అన్నిటా పురుషులతో సమాన హక్కులు కలిగి వుండాలన్నాడు; వివాహంలో కన్యాదానం అనవసరమన్నాడు. తాళి బొట్టు అవసరమనలేదు. ఏ కందుకూరీ, ఏ గురజాడా అంత అభ్యుదయకరంగా ఆలోచించనూలేదు, వ్రాయనూలేదు. **ఒకటిన్నర శతాబ్దినాడు యింత తీవ్రంగా ప్రగతిపథంతో వాదించి, గ్రంథం రచించిన స్వామినేని ముద్దు నరసింహం ప్రతిభా వ్యుత్పత్తులు బహుముఖమైనవే కాక, ఆశ్చర్యకరమైనవి కూడా.**

కాని ఆయన పేరు చరిత్ర పుటల్లో, సంఘ సంస్కర్తల జాబితాలో నవయుగ హేతువాద వైతాళికుల శ్రేణిలో చేరకపోవడం ఆశ్చర్యకరమే కాదు బాధాకరంకూడా, ముద్దునరసింహం కూడా బ్రాహ్మడు కాకపోవడం వల్లనే యిలా జరిగిందా? లేక ఇందుకు మరొక బృహత్తర కారణమేమైనా వుందా?

రచయిత కీ॥శే॥ రావిపూడి వెంకటాద్రిగారి
'స్వామినేని హితసూచని పర్యాలోకనం' నుండి.
ఆయన భారత హేతువాద సంఘ అధ్యక్షులుగా,
హేతువాది పత్రిక సంపాదకుడిగా ప్రసిద్ధులు.


రహ్మానుద్దీన్ షేక్
94930 35658

భాషకు, లిపికి ఉన్న బంధం ఏమిటి? - సాంకేతిక కోణం.

నేను వృత్తిరీత్యా ఒక కంప్యూటర్ కోడ్ వ్రాసే నిపుణుడిని. వ్యవహారంలో నా వృత్తిని సాఫ్టువేర్ ఇంజనీరింగ్ అని స్థూలంగా అంటారు. మనకు కావాల్సిన వివిధ సేవలను, పనిముట్లను, జాలస్థలాలను, మొబైల్ ఫోన్ ఆప్‌లను తయారు చేసి కంప్యూటర్లలో, ఫోనుల్లో అవి పని చేసేలా చేయడం, వాటిలో ఇబ్బందులు ఎదురైనపుడు సరిచేయడం లాంటివి సాధారణంగా సాఫ్టువేర్ ఇంజనీర్లు చేసే పని. కంప్యూటర్లకు రెండే విషయాలు అర్థమవుతాయి - తెరిచి ఉండటం, మూసి ఉండటం - చేతన స్థితి, అచేతన స్థితి. ఇంగ్లిష్‌లో ఆన్-ఆఫ్. కరెంటు పనిముట్లను మనం ఒక మీట(స్విచ్) తో మొదలుపెట్టడం, ఆపివేయడం చేస్తాం కదా. అలా మొదలుపెట్టినపుడు కరెంటు లైటో, ఫ్యానో చేతనావస్థకు వస్తాయి. మీట కట్టేస్తే అవి అచేతనమవుతాయి. కంప్యూటర్లూ అంతే. తెరిచిన/మొదలుపెట్టిన/చేతన స్థితికి 1 అంకెతో గుర్తు పెట్టి, మూసిన/కట్టివేసిన/అచేతన స్థితికి 0 అంకెతో గుర్తు పెట్టామన్నమాట. మనం కంప్యూటర్ చేత చేయించే పనిని బట్టీ ఈ 0,1ల అనేకానేక కూడికలతో, మేళనాలతో సాధారణంగానో, సంక్లిష్టంగానో తయారవుతుంది.

ఒక అంకెలు చూపెట్టే గడియారం ఉందనుకోండి. అందులో గంటల్లో, నిమిషాల్లో సమయాన్ని చూపేందుకు 4 అంకెలకు ఖాళీలు ఉండి ఒక్కో అంకెకు గానూ 7 గీతలుంటాయి. పొట్టలో ఉన్న గీత తప్ప మిగితావన్నీ సచేతనంగా ఉంటే ఆ అంకె 0. అన్ని గీతలు సచేతనంగా ఉంటే ఆ అంకె 8. కుడివైపు నిలువుగా ఉన్న రెండు గీతలు మాత్రమే సచేతనంగా ఉంటే ఆ అంకె 1. అడ్డంగా ఉన్న మూడు గీతలు సచేతనంగా ఉండి, పై కుడి, కింది ఎడమ నిలువు గీతలు సచేతనమై, పై ఎడమ, కింద కుడి నిలువు గీతలు అచేతనంగా ఉంటే ఆ అంకె 2. అడ్డంగా ఉన్న మూడు గీతలు సచేతనంగా ఉండి, కుడి వైపు రెండు నిలువు గీతలు సచేతనమై, ఎడమ వైపు రెండు నిలువు గీతలు అచేతనంగా ఉంటే ఆ అంకె 3. పై అడ్డ గీత, కింద అడ్డ గీత, కింద ఎడమ వైపు నిలువు గీత అచేతనంగా ఉండి మిగతావన్నీ అంటే పై ఎడమ నిలువు గీత, కుడి వైపు రెండు నిలువు గీతలు, మధ్యలో అడ్డగీత సచేతనంగా ఉంటే ఆ అంకె 4. అడ్డంగా ఉన్న మూడు గీతలు సచేతనంగా ఉండి, పై ఎడమ వైపు నిలువు గీత, కింద కుడి వైపు నిలువు గీత సచేతనమై, పైన కుడి వైపు, కింద ఎడమ వైపు నిలువు గీతలు అచేతనంగా ఉంటే ఆ అంకె 5. అడ్డంగా ఉన్న మూడు గీతలు సచేతనంగా ఉండి, ఎడమ వైపు రెండు నిలువు గీతలు సచేతనమై, కింద కుడి వైపు నిలువు గీత సచేతనమై, పై కుడి నిలువు గీత అచేతనంగా ఉంటే ఆ అంకె 6. పై అడ్డ గీత, కుడి వైపు నిలువు గీతలు రెండూ సచేతనంగా ఉండి, మిగితావి అచేతనమైతే అనగా ఎడమవైపు రెండు నిలువు గీతలూ, మధ్య అడ్డగీత, కింద అడ్డగీత అచేతనంగా ఉంటే వచ్చే అంకె 7. ఇలా మన సంఖ్యామానంలో ఉన్న 10 అంకెలకు చిహ్నాలను తయారు చేసుకుని. ఆయా గీతలను చేతనం చేసి, అచేతనం చేసి అంకెలను ప్రదర్శిస్తామన్న మాట. పై మేళనాలు కాకుండా వేరే మేళనంలో వచ్చే ఏ అంకె అయినా అర్థం లేనిది అవుతుంది.

బొమ్మలో చూపించినట్టు అ,ఆ,ఇ,ఈ లలో ఈ అంకెల సచేతన/అచేతన స్థితిని చూపించాలంటే ఒక్కో గీతకు ఒక్కో సంజ్ఞను నిర్దేశించామనుకోండి. ఇక్కడ అవి అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ- మొత్తం ఏడు సంజ్ఞలు. పై అడ్డగీతకు సంజ్ఞ అ, పై కుడివైపు నిలువుగీతకు ఆ, పై ఎడమవైపు నిలువుగీతకు ఇ, మధ్యలో అడ్డగీతకు ఈ, కింది ఎడమవైపు నిలువుగీతకు ఉ, కింద కుడివైపు నిలువు గీతకు ఊ, కింద అడ్డగీతకు సంజ్ఞ ఋ.



సమయం తెలిపేందుకు ఇలాంటివి నాలుగు అంకెలు కావాలి. ఒక్కో అంకెని నిక్షిప్తం చేసేందుకు అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ అక్షరాల మాలికలో ఏ అక్షరం అచేతనమో దానిని 0తో, ఏ అక్షరం చేతనమో దాన్ని 1తో చూపిస్తామన్నమాట.

అంటే 8 అంకెకు అ-1, ఆ-1, ఇ-1, ఈ-1, ఉ-1, ఊ-1, ఋ-1. 1 అంకెను చూపాలంటే అ-0, ఆ-0, ఇ-1, ఈ-0, ఉ-0, ఊ-1, ఋ-0. ఇలా 0 నుంచి 9 వరకు పది అంకెలకు అఆఇఈఉఊఋ అక్షరమాలలో అక్షరాలకు బదులు 0, 1 రాసుకుని ఏ అంకెను చూపాలో చెప్పగలుగుతాం. 8 అంకెకు ఈ 0ల 1ల కొత్తభాషలో గుర్తు 1111111, 0 కు 1110111, 1 కి 0010010, 2 కి 1011101, 3 కి 1011011, 4 కి 0111010, 5 కి 1101011, 6 కి 1110111, 7 కి 1010010, 9 కి 1111011.

ఈ పది 0-1ల వాక్యాలకు మాత్రమే అంకెల గడియారంలో అర్థం ఉంది. ఇవి కాక 1000001 అని చిహ్నం ఇచ్చామనుకోండి, అనగా పై అడ్డగీత, కింద అడ్డగీత మాత్రమే ఉండి మిగితా గీతలు లేవనుకోండి "? " ఇలా వస్తుంది, అది అర్థంలేని అంకె అందుకని

1000001 వాక్యానికి ఈ భాషలో స్థానం లేదు.

ఇలా 0 లు, 1లలో రాసుకున్న ఈ కంప్యూటర్ భాషకు బైనరీ లాంగ్వేజ్(రెండు గుర్తుల నుడి) అని పేరు. ప్రపంచంలోని అన్ని భాషల లిపి గుర్తులు ఈ 0, 1 లలో నిక్షిప్తం చేయవచ్చు. ప్రస్తుతమున్న(గత 30 ఏళ్ళుగా చెలామణీలో ఉన్న) యూనికోడ్‌లో ఇలాంటివి 1,114,112 అక్షరాలను నిక్షిప్తం చేసుకోవచ్చు. అయితే ప్రపంచ భాషలన్నిటినీ, చాలా లుప్తమైన లిపులతో సహా పొందుపరిచినా, 96,382 చిహ్నాలను మాత్రమే వాడుకున్నాము. ఇంకా మరిన్ని కొత్త లిపులను కనిపెట్టినా కంప్యూటర్లలో వాటిని మనం యథేచ్ఛగా నిక్షిప్తం చేసుకోవచ్చు. ఇవి తక్కువ అవుతున్నాయి అనుకున్న రోజు 4,29,49,67,296 అక్షరాలను నిక్షిప్తం చేయదగిన కొత్త నియమాన్ని పాటించవచ్చు కూడా. కూతల్లో, ఈలల్లో మాట్లాడే భాషలకు సైతం ప్రస్తుత కంప్యూటర్ వ్యవస్థలో స్థానముంది. మన ఇంట్లో ఉన్న కంప్యూటరులోనో, మొబైల్ ఫోనులోనో, ట్యాబ్‌లోనో తెలుగు కనిపించక పోతే అది ఆ వస్తువులో ఉన్న లోపమే తప్ప తెలుగు కంప్యూటరులలో కనపడదు, రాయలేము అన్నందువల్ల కాదు. తెలుగును మనం చక్కగా కంప్యూటర్లలో, ట్యాబుల్లో, మొబైల్ ఫోనుల్లో, ఇతరత్రా కంప్యూటర్ ఆధారిత అన్ని వస్తువుల్లో (బట్టలుతికే మర, ఫ్రిజ్, మైక్రోవేవ్ మొ? అన్నింటా) చూడగలము, రాయగలము.

కంప్యూటర్లలో, ఫోనుల్లో, ట్యాబుల్లో తెలుగు చదవలేకపోవటం, రాయలేకపోవటం ఒక నైపుణ్యలోపంగా భావించి, అందరమూ తెలుగులోనే రాయటం, చదవడం కొనసాగిద్దాము. తెలీని వారికి అవగాహన కల్పించి నేర్పుదాం.

నేను భారతీయ భాషల్లో వికీపీడియా కోసం పని చేస్తున్న రోజుల్లో భాషలకు, వాటి లిపులకు సంబంధించిన అనేకానేక విషయాలను గమనించాను. కొన్ని అద్భుతమైనవి, కొన్ని విచిత్రమైనవి. మన ద్రావిడ భాషల్లో అతి పురాతనమైనదని చెప్పుకునే తమిళ భాషలోని చాలా సాహిత్యం తెలుగులిపిలో లిపిబద్ధం చేసి తిరిగి తమిళంలోకి తీసుకున్నారు. ఇందులో మధ్యయుగాల దేశికాచార్యుల శ్రీవైష్ణవ సాహిత్యం ముఖ్యంగా మూల భాష మూలద్రావిడమో, తమిళమో అయినా లిపి మాత్రం తెలుగు. తుళు భాషకు ప్రస్తుత మలయాళ లిపికి బహుశా మాతృక లిపి అయిన తిగలారి అనే లిపి ఒకటుంది. రాజకీయ కారణాల వలన తుళు భాషను కన్నడ లిపిలో రాస్తున్నా పాత దస్తావేజులు, అక్కడి జ్యోతిష్కులు నేటికీ రాసిచ్చే జాతకచక్రాలు, పంచాంగాలు ఈ తిగలారి లిపిలోనే ఉంటాయి. అయితే ఈ తిగలారి లిపిని ప్రయాసొనర్చి నేర్చుకుంటేనే తప్ప, తుళులో వచ్చే సాహిత్యం కానీ పత్రికలు కానీ కన్నడ లిపిలోనే ఉంటున్నాయి. కొంకణీ భాషది మరొక విచిత్రమైన సందర్భం. కర్నాటకలోని ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ జిల్లాలలో ఉండే క్రిస్టియన్లు కొంకణీ భాషను కన్నడ లిపిలో రాసుకుంటారు. గోవాలో ఉండే కొంకణీ క్రిస్టియన్లు రోమన్ లిపిలో(ఇంగ్లిష్ అక్షరాల్లో) కొంకణీ భాష రాసుకుంటారు. గోవాలోని హిందూ కొంకణీ వారు కొంకణీ భాషను రాసేందుకు దేవనాగర లిపిని వాడతారు. కర్నాటకలోని హిందువులలో బ్రాహ్మణులు దేవనాగరిలో రాస్తుండగా, మిగితా హిందువులు కన్నడ లిపిలోనే రాస్తున్నారు. మరాఠీకి ఒకప్పుడు మోడీ లిపి అని ఉండేది. ఆ లిపిని మరిచి నేడు వారంతా దేవనాగరిలిపిలోనే మరాఠీ భాషను రాసుకుంటున్నారు. లిపి లేని భాషలకు ఆ ప్రాంతపు పెద్ద భాష లిపే దిక్కవుతోంది. గోండ్ భాష మాట్లాడే తెలుగు ప్రాంతాల వారు ఆ భాషను తెలుగులో ఇక్కడ లిపిబద్ధం చేసుకుంటున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లో వారు దేవనాగరి లిపిలో గోండ్ భాషను రాసుకుంటున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో చాలా భాషలకు ఆయా భాషల సొంత లిపి రాసే తరం వారు కనుమరుగు అవ్వగా ఇంగ్లిష్ భాషను మనం రాసుకునే రోమన్ లిపిలో చాలా భాషల వాళ్ళు తమ భాషను లిపిబద్ధం చేసుకుంటున్నారు. కొందరు బెంగాలీ, అస్సామీ లిపులలో తమ భాషలను రాసుకుంటున్నారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం దేవనాగరి లిపిలో ఈశాన్య రాష్ట్రాల వారిని తమ భాషలను లిపిబద్ధం చేసుకోమని ప్రోత్సహిస్తూ చాలా నిధులు కేటాయించింది. ఒడిషా, ఝార్ఖండ్ రాష్ట్రాలలోని సంతాలీ తెగ వారు మాట్లాడే సంతాలీ భాషకు రోమన్ లిపి బాగా ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ వారి ప్రాచీన లిపి ఓల్‌చికీని కంప్యూటర్లలో నిక్షిప్తం చేసేలా యూనికోడ్ ఫాంట్లను ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు విడుదల చేయగా, రెండు దశాబ్దాల్లోనే ఆ భాషా సముదాయం ఈ ఓల్‌చికీ లిపిలో తమ ప్రధాన సాహిత్యాన్ని మార్చుకోవటమే కాక, వ్యవహారంలో కూడా ఈ లిపిని చురుగ్గా వాడుతున్నారు. పంజాబీ భాషను మన దేశంలో దేవనాగరి లిపికి దగ్గరగా ఉండే గురుముఖి లిపిలో రాస్తారు. సరిహద్దుకు అవతల పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో అక్కడి వారు పంజాబీ భాషను షాహ్‌ముఖీ అనే కుడి నుంచి ఎడమకు రాసే ఉర్దూ లిపికి దగ్గరగా ఉండే లిపిలో రాసుకుంటారు. ఉర్దూ భాషను పంజాబ్‌లో గురుముఖిలో, రాజస్థాన్‌లో దేవనాగరిలిపిలో, ఉత్తరప్రదేశ్‌లో నస్తలీక్ లిపిలో రాస్తారు. మన దక్షిణాదిలో ఉర్దూ భాషలో, అరబ్బీ భాషలో ఉండే ముస్లిం మత సంబంధ రచనలను ఆయా రాష్ట్రాలలోని ప్రాంతీయ లిపులలోనే రాసుకుంటున్నాం. తెలుగులో లేని ఉర్దూలో ఉన్న అక్షరాల కోసం తెలుగు అక్షరాల్లోనే చిన్నపాటి మార్పులు చేసి ఉర్దూ భాషలో సంగతులు తెలుగు లిపిలో రాసుకుంటున్నాం. సంస్కృతం లిపి నాగరలిపి అయినా, సంస్కృతానికి లిపి లేదని ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతపు లిపిలో సంస్కృత భాషను రాసుకుంటున్నారు.

కేంద్ర సాహిత్య అకాడెమీ కొంకణీ భాషకు ఇచ్చే పురస్కారాలకు గానూ దేవనాగరి లిపిలో వచ్చినవాటినే పరిగణిస్తామని ప్రకటించింది. కన్నడంలో, రోమన్‌లో రాసే సాహిత్యకారులు కూడా అలా తమ సాహిత్య లిపిని దేవనాగరికి మార్చుకున్నారు.

ఆధునికులము అని అనుకునే తెలుగువారంతా తెలుగు భాషను తెలుగు లిపిలో కాకుండా ఇంగ్లిష్ లిపిలో రాసుకుంటున్నారు. తెలుగుకు వేరే లిపి ఉందా అని కొందరు అబ్బురపడటం కూడా నేను చూసాను. కంప్యూటర్లలో, ఫోనుల్లో తెలుగు లిపిలో రాయలేము కనుక ఇంగ్లిష్ లిపిలోనే తెలుగును రాయటం సబబని నమ్మి తెలుగు లిపిని నేర్చుకోకుండా ఉండే వారూ రేపు పుట్టుకొస్తారేమో !!

ఈ లిపి-భాష అంశాలు ఆయా భాషలు మాట్లాడే సముదాయాల సొంత విషయమా?

తెలుగును తెలుగు లిపిలోనే రాయాలా? ఇంగ్లిష్ లిపిలో రాయవచ్చా?

తనది కాని వేరే లిపిలో ఒక భాషను లిపిబద్ధం చేస్తే వచ్చే సమస్య ఏంటి?

ఒక భాషను ఒక నిర్దిష్ట లిపిలోనే రాయాలని ఎవరు నిర్ణయిస్తారు?

భాషకు లిపికి ఉన్న సంబంధం ఏమిటి?

నా ఊహ ప్రకారం భాష లిపికన్నా చాలా శతాబ్దాల ముందే ఉనికిలో ఉండింది. భాషను మాట్లాడే సముదాయం తమ మాటలను రాతలో నిక్షిప్తం చేసే ప్రయత్నాలు మొదలుపెట్టాకనే లిపి అవసరం పడి అలా ఒక లిపి ఏర్పడి ఉంటుంది. భట్టిప్రోలులో దొరికిన లిపిలో రాసిన భాష తెలుగే అని అనుకుంటే తెలుగు లిపి 2400 ఏళ్ళకన్నా పాతది. తెలుగు భాష అంతకన్నా ఎన్నో ఏళ్ళు పాతది.

అంటే లిపి అస్తిత్వంతో సంబంధం లేకుండా భాష మనగలదు, పూర్తి స్థాయిలో మనిషి భావవ్యక్తీకరణకు ఉపయోగపడగలదు కానీ భాష లేనిదే లిపికి విడిగా అస్తిత్వం లేదు. భాషకు గుర్తింపు ఆ భాషలోని పలుకుబళ్ళు, మాటలు, సాహిత్యం, ఇతరత్రా భాషా విశేషాలు. ఇందులో అన్నిటినీ లిపి నిక్షిప్తం చేయలేదు. ముఖ్యంగా భావవ్యక్తీకరణ జరిగేప్పుడు బయటపడే సంతోషం, సుఖం, కోపం, బాధ, లాంటి భావాలను లిపి పూర్తి స్థాయిలో నిక్షిప్తం చేసుకోలేదు. ఆయా భావాలను లిపిబద్ధం చేసేందుకు లిపిలో చాలా మార్పులు తేవాలి. చాలా పదబంధాలను అదనంగా వాడాలి.

లిపి వలన మరొక సమస్య ఏమిటంటే ఒకానొక కాలంలో లిపి ఉన్న భాషలలో, భాషను అన్ని వర్గాల వారు మాట్లాడగలిగినా, లిపిని రాసే వారు మాత్రం కొన్ని కులాలకు, సామాజిక వర్గాలకు పరిమితమయ్యారు. ఆ భాష మాట్లాడే అందరికీ లిపి వచ్చేది కాదు. అలా కేవలం రాజుల ఫర్మానాలకు, పత్రాలకు పరిమితమయింది కనుకనే మోడీ లిపి మరాఠీ భాష వారికి చాలా మందికి అసలు తెలీదు. సింధులోయ నాగరికత లిపిని నేటికీ అర్థం చేసుకోలేకపోవటానికి కారణం ఇదేనేమో. సమాజంలో అందరికీ అందుబాటులో ఉండి, అందరూ సులువుగా నేర్చుకునేదిగా ఉండి, భాషలోని అన్ని చప్పుళ్ళను, అన్ని భావాలను అక్షరరూపంలో చూపగలిగే గుర్తులు, చిహ్నాలు, సంజ్ఞలు కలిగి ఉండినపుడే ఆ లిపి ఆ భాషకు వెన్నుదన్నుగా నిలిచి సాహిత్య రచన నుంచి రాజకీయ కార్యకలాపాల నుంచి విద్య వరకు అన్నింటా విలసిల్లుతుంది. సమాజంలోని ఏదైనా వర్గానికి ఆ లిపి క్లిష్టమైనదిగా తోచిననాడు వారు ఆ లిపిని వీడి మరొక లిపిలో భాషను రాయటం మొదలుపెడతారు. ఈశాన్య రాష్ట్రాలలో జరుగుతున్నది అదే. రాజకీయ కారణాల వలన సాహిత్య అకాడెమీ లాంటి సంస్థలు భాషను రాసే లిపిపై ప్రతిబంధకాలు ఏర్పరిస్తే ఆ భాష తన లిపిని మరిచి ఆ రాజకీయ వత్తిడి వలన కొత్త లిపిని రుద్దుకుంటుంది. కర్నాటకలోని కొంకణీ సాహిత్యకారులు తమ రచనలను దేవనాగరి లిపిలో రాయటం చేసినట్టు. అదే నియంతృత్వ ధోరణితో నేడు కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలలో దాదాపు 22 వేల మంది బోధనా సిబ్బందిని అదనంగా తర్ఫీదు ఇచ్చి, దేవనాగరి లిపిలోనే లిపి లేని తెగల భాషలను నిక్షిప్తం చేసే పనికి పూనుకుంది.

భాషను పెనవేసుకుని ఉండే లిపిని వదిలి, భాష మరో లిపిలో రాయబడితే- ఆ భాషలోని అన్ని చప్పుళ్ళకు, శబ్దాలకు, మాటలకు సరిపోయే అక్షరాలు ఈ కొత్త లిపిలో ఉండకపోవచ్చు. దాదాపుగా ఉండవు కూడా. భాషలో లేని అదనపు శబ్దాలు లిపి వలన ఆ భాషలోకి చొచ్చుకుని వస్తాయి. ఇది ఒక రకంగా ఆ భాష పదసంపదకు చేటు చేస్తుంది. పరలిపి మాతృక భాషలోని కొన్ని పదాలు ఈ భాషలోకి కొత్తగా వచ్చి చేరతాయి కూడా. అప్పుడు కొత్త లిపి తెచ్చిపెట్టిన కొత్త పదాల వలన భాషలోని కొన్ని పదాలు వాడుక నుంచి కనుమరుగు అవుతాయి. సాంస్కృతికంగా కూడా ఇది కొంత నష్టాన్ని భాషకు తెచ్చి పెడుతుంది.

ఒక ఊహాజనిత సందర్భంలో తెలుగును నాగరలిపిలో రాయటం మొదలుపెట్టామనుకుందాం. మొదటగా హ్రస్వ ఎ, హ్రస్వ ఒ ఉన్న పదాలన్నీ దీర్ఘ ఏ, దీర్ఘ ఓ కి మారిపోతాయి. చెయ్యి-చేయ్యి, మెకు-మేకు, ఒక-ఓక, ఒడ-ఓడ, ఎడ-ఏడ, ఎందుకు-ఏందుకు, ఎలా-ఏలా ఈ పదాల మధ్య వ్యత్యాసం ఉండదు.

అకారాంత పదాలుండవు. రామ అని రాసినా రామ్ అని పలకాలి. కల, ఇల, వల అని రాసినవన్నీ అల్, ఇల్, వల్ అని ధ్వనిస్తాయి.

తెలుగులోనే ఇంత గందరగోళం తెచ్చిన దేవనాగరి లిపి ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని వందల భాషలకు ఇలా చేటు చేయనుంది.

ఇది పై నుంచి కిందకు పద్ధతిలో ప్రభుత్వం నుండి ప్రభుత్వానికి రుద్దబడుతున్న విధానం. కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికే నాయకులకు ఈ చేటు కనిపించకపోవచ్చు. వారు సహృదయంగా తమ లిపిలేని భాషకు హిందీ లిపి నీడనిస్తుందని నేడు నమ్మవచ్చు. కానీ, రేపటికి ఆ భాషా సముదాయం అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది. వారి భాషా సముదాయం విడిగా ఉన్నంత వరకూ వస్తూత్పత్తుల సేవల నుండి అన్నింటా వారు తమ ప్రకారం నడిపించుకునే సత్తా కలిగి ఉంటారు. మొదటి గొడ్డలిపెట్టుగా లిపి మార్పిడి, ఆపై భాషలోకి లిపి మాతృక భాష శబ్దాలు, పదాలు, సందర్భాలు, సంస్కృతి వచ్చి పెద్ద భాష చిన్న భాషా సముదాయాన్ని మింగేస్తుంది. చిన్న భాషా సముదాయం వారు ఉద్యోగం నుండి వనరుల వరకూ అన్నింటా పెద్ద భాషా సముదాయం వారితో పోటీ పడాలి, తత్ఫలితంగా ఘర్షణ పడాలి. చివరన పెద్ద భాష వాడే నెగ్గుతాడు. చిన్న భాష వాడికి తన మాతృభాష అస్తిత్వం లుప్తమయి, అతను కూడా పెద్దభాష సముదాయ సభ్యుడవటం వలన తనకు జరిగిన చేటు అర్థమవకపోవడానికే అవకాశాలు ఎక్కువ.

ఇక తెలుగు భాషకు వద్దాం. పైన నేను బైనరీ భాషను ఉదహరించిన సందర్భం ఏమిటంటే. కంప్యూటర్లకు చిట్టచివరన మనమిచ్చే అన్ని ఆజ్ఞలు 0లు, 1లు గానే వెళతాయి. మనం తెరపై ఒక చోట నొక్కుతాం, అది పాటలు పాడే ఆప్ అయితే మనం నొక్కిన గుర్తును బట్టి పాట రావటం మొదలవుతుంది లేదా ఆగిపోతుంది. మనం చేసిన ఈ నొక్కిన పనిని కంప్యూటరుకు, ఫోనుకు అంతర్గతంగా అర్థమయ్యేలా ఒక భాషలో సాఫ్టువేర్ నిపుణులు ఒక ఆజ్ఞల క్రమాన్ని ఇస్తారు. ఈ ఆజ్ఞల క్రమాన్ని 0-1లలో రాయటం కష్టం కనుక కంప్యూటరులకు 0-1లలో తర్జుమా చేసి మధ్యస్థాయి భాషలో ఒక దాంట్లో ఈ ఆజ్ఞలక్రమాన్ని సాఫ్టువేర్ నిపుణులు కంప్యూటరుకు రాసిస్తారు.

ఏ భాషలో రాసారు అన్నది ఇక్కడ ముఖ్యం కాదు. కంప్యూటరుకు

> "మాతృభాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసివస్తే అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం ఏ దేశానికీ లేదు" - మహాత్మాగాంధీ

తెలుగు ప్రచురణకర్తలకు, డి.టి.పి. చేసేవారికి విజ్ఞప్తి

తెలుగులో పుస్తక ప్రచురణలో అతి క్లిష్టమైన భాగం పుస్తకం కాంపోజ్ చేయటమని పలువురు ప్రచురణకర్తల అభిప్రాయం. సంప్రదాయ తెలుగు ముద్రణారంగం పేజ్‌మేకర్ అనే సాఫ్టువేర్, అను ఫాంట్స్ అనే తెలుగు ఖతులపై ఆధారపడి ఉంది. ఈ రెండు ఉపకరణాలు కూడా విండోస్ ఎక్స్‌పి తరువాత వచ్చిన నిర్వహణా వ్యవస్థల్లో పని చేయవు. అందువలన ప్రచురణకర్తలు పాత కంప్యూటర్లలోనే కాంపోజింగ్ చేస్తున్నారు. ఇలా అను ఫాంట్స్ వలన రూపొందిన పుస్తకం వలన కొన్ని సమస్యలున్నాయి. అను ఫాంట్స్‌లో పలు తెలుగు అక్షరాలు స్పష్టంగా ఉండవు. మనం మాట్లాడే, రాసే తెలుగుకు, అను ఫాంట్స్‌లో ఉండే సమ్మిళిత ఆకారాల జతల్లో వచ్చే అక్షరాలకు సంబంధం ఉండదు. గత ఇరవై ఏళ్ళుగా ప్రాచుర్యంలో ఉండి, గత దశాబ్ద కాలంగా బాగా జనాదరణ పొందిన యూనికోడ్ ఫాంట్స్‌ని అను ఫాంట్స్‌లోకి మార్చుకోలేము. తెలుగు యూనికోడ్‌లో ఉన్నన్ని ఫాంట్లు(ఖతులు) మనకు అనుఫాంట్స్‌లో ఉండవు. పైగా యూనికోడ్ ఫాంట్లు ఉచితం, అనుఫాంట్స్ ఖర్చుతో కూడుకున్నవి.

కాలం మారింది. కాలంతోనే మనమూ మంచి కోసం మార్పుకు స్వాగతం పలకాలి. పేజ్‌మేకర్ అంతరించిపోయాక ఇన్‌డిజైన్ అని ఒక పేజ్ సెట్టింగ్ సాఫ్టువేర్ వచ్చింది. అయితే అడొబె వాడి ఈ ఉత్పత్తి ధర చాలా ఎక్కువ. డిటిపి చేసుకుని బ్రతికే వారికి అందనంత ఎక్కువ ధరలో ఉంది.

పేజ్‌మేకర్‌కు ప్రత్యామ్నాయంగా పదిహేనేళ్ళ క్రితమే ప్రజాశక్తి వారు ఒక ఉచిత, స్వేచ్ఛా సాఫ్టువేర్‌పై పని చేసారు. ఇందులో యూనికోడ్ ఫాంట్లతో పని చేసే సౌలభ్యం ఉండేది. కొన్ని కారణాల వలన అది బయటకు రాలేదు. అయితే ఇటీవల స్క్రైబస్ అధునాతన రూపంలో తెలుగు యూనికోడ్‌కు సహకారంతో వచ్చింది.

స్క్రైబస్‌లో మనం పుస్తకాలను తయారు చేసుకోవచ్చు. కరపత్రాలు తయారు చేసుకోవచ్చు. అన్నీ కూడా ఉచితంగా, యూనికోడ్ ఫాంట్లలో!

అవును. మీరు వాట్సాప్, ఫేస్‌బుక్ పోస్టుల కోసం తెలుగులో రాసుకుంటారే, అచ్చంగా ఆ అక్షరాల్లోనే పుస్తకం తీర్చిదిద్దే సామర్థ్యం వచ్చింది.

స్క్రైబస్ సాఫ్టువేరును వాడి మనం డిటిపిలో చేసే అన్ని పనులూ యూనికోడ్ ఖతులతో చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలు, స్క్రైబస్‌ను మీ కంప్యూటర్లలో స్థాపించుకునే విధానంతో పాటుగా వచ్చే నెల అమ్మనుడి పత్రికలో తెలుసుకోండి.

చివరాఖరున ఆయా ఆజ్ఞల క్రమం సక్రమంగా అంది, అది ఆ ఆజ్ఞల క్రమాన్ని పాటించిందా లేదా అన్నది ముఖ్యం. అందువలన సాఫ్టువేర్ నిపుణుల్లో ఒకరు తనకు సీ ప్రోగ్రామింగ్ వస్తుంది అంటే, మరొకరు జావా అని, ఇంకొకరు సీప్లస్‌ప్లస్ అనీ మరొకరు పైథాన్ అనీ చెబుతుంటారు.

అలా ఒక వ్యక్తి తన భావ వ్యక్తీకరణకు ఏ భాషని వాడుతున్నాడు అన్నదానికన్నా- ఎదుటి వ్యక్తి ఈ వ్యక్తి భాష ద్వారా మాట్లాడో రాసో చెబుతున్నది సరిగ్గా అర్థం చేసుకున్నాడా అన్నది చాలా ముఖ్యం.

తెలుగు భాష మాట్లాడే వారిలో, చదివే వారిలో ఒక చిన్న శాతం, బహుశా 1-2 శాతం మంది మాత్రమే ఆంగ్లంలో స్పష్టంగా మాట్లాడగలరన్నది నా వఅనుభవం. మిగిలిన 99 శాతం మందికి మనమేమన్నా చేరవేయాలంటే వారికి తెలుగులో చెబితేనే అర్థమవుతుంది. ఒక సినిమాకు వెళ్ళి, ఆ సినిమాలో చిన్న సంభాషణ అర్థం కాకపోతే ఆ సినిమాను నిరర్థకమని అంచనా వేసేస్తారు మన తెలుగువాళ్ళు. అలాంటపుడు 99శాతం మంది తెలుగువారికి చక్కగా అర్థమయ్యే తెలుగులో కాకుండా వేరే ఏ భాషలోనో, లిపిలోనో మనం ఏం రాసి ఏం లాభం? మనం ఈ జాతిలో పుట్టినందుకు, ఈ జాతిని మన అస్తిత్వానికి వాడుకుంటున్నపుడు ఈ జాతి ఎదుగుదలకు అన్ని విధాలా మన వంతు చేయి వెయ్యాలి.

కంప్యూటర్లకు తెలుగు రాదేమో అనే అపోహలో ఉండి, కంప్యూటర్లకు ఇంగ్లిషే తెలుసేమో అని మనమనుకుని- మనమే ఇంగ్లిష్ నేర్చుకునే వ్యామోహంలో పడే బదులు, నేను కంప్యూటరుకు తెలుగు నేర్పలేనా అనే కాంక్ష మనలో కలగాలి.

నేడు ఏ సామాజిక మాధ్యమానికి వెళ్ళినా కిశోరావస్థలో ఉన్న, ఇప్పుడే కిశోరావస్థ దాటిన తెలుగువారికి తెలుగులిపి జ్ఞానం లేదు అనుకోవడంలో ఒక సాధించిన భావం కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో రూపొందించే మౌఖిక వస్తువిషయాల్లో కూడా తెలుగుపాళ్ళు తక్కువవుతున్నాయి.

అసలు భాషలకు, లిపులకు అతీతంగా నేటి సాంకేతిక పరికరాలు మనిషి భావాలను నిక్షిప్తం చేసుకునే నేర్పును పొందాయి.

అందువలన సాంకేతికతను సాకుగా చూపుతూ దయచేసి తెలుగును తెలుగు లిపిలో రాయటం మానకండి.

రమేష్ పట్నాయక్
9440980396

పాఠశాల విద్యా సంస్కరణలు : ఏ అగాధాలకు ఈ ప్రస్థానం?

మంత్రుల అలసత్వం, అధికారుల అత్యుత్సాహం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయకూడదనే రాజకీయ నిర్ణయం' ఇవే ప్రభుత్వం తీసుకువస్తున్న పాఠశాలల సంస్కరణలకు ప్రాతిపదికలు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలలో సుమారు 30వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయకపోవడం మాత్రమే కాదు వాటిని మొత్తానికి మొత్తం మిగులు చూపించాలనే ప్రయత్నం కూడా గట్టిగా జరుగుతున్నది. విద్యాశాఖా మంత్రి బొత్స సత్యన్నారయణ గారు వివిధ ప్రాతినిధ్యాల సందర్భంలో ఇచ్చిన వెసులుబాటులు నామమాత్రమే. అవి కూడా జి.ఒ.లుగా రాలేదు. ఇక విధానపరమైన నిర్ణయాలలో ఎటువంటి మార్పు ఉండదని మంత్రిగారు తేగేసి చెప్పారు. ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా కుదించి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలకు బదిలీ చేయడం, ప్రాథమికోన్నత పాఠశాలలలో 6,7,8 తరగతులను తొలగించి ప్రాథమిక పాఠశాలలుగా కుదించడం, ఉన్నత పాఠశాలలలో సమాంతర మాధ్యమ విభాగాలను రద్దుచేయడం, ఆచరణలో తెలుగు, ఉర్దూ మాధ్యమాలను రద్దు చేయడం, తమిళ, ఒరియా, కన్నడ వంటి మైనర్ మీడియాలను నిర్లక్ష్యం చేయడం వంటి విధానపరమైన నిర్ణయాలలో ఎటువంటి మార్పు లేదు. ఇక విధానేతర నిర్ణయాల విషయానికి వస్తే, అత్యధిక ఉన్నత పాఠశాలలలో తరగతి గదిలో విద్యార్థుల గరిష్ఠ పరిమితిని యాభై శాతం పెంచడం యధావిధిగా కొనసాగనున్నది, ఒక వారంలో ఉపాధ్యాయులు బోధించవలసిన పీరియడ్స్ గరిష్ఠ పరిమితిని కూడా పెంచుతున్నారు. ఉన్నత పాఠశాలలలో ప్రధానోపాధ్యాయ మరియు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను కొనసాగిస్తామని మంత్రిగారు ఇచ్చిన హామీలు అధికారులు పట్టించుకోకుండానే ముందుకు వెళుతున్నారు. మంత్రిగారు మొత్తంగానూ అధికారులు కఠినంగా ఉండాలన్నది కూడా విధాన నిర్ణయమే అయి ఉండవచ్చు. టి.డి.పి ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీలను సరిగా నింపడం లేదని, తాను అధికారంలోనికి వస్తే మెగా డి.యస్.సి వేస్తానని ఎన్నికల సభలలో ప్రస్తుత ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. మూడు సంవత్సరాలు గడిచింది. ఒక్క డి.యస్.సి కూడా వేయలేదు. పైగా ఇప్పుడు అసలు ఖాళీలనే రద్దు చేయడానికి దారివేస్తున్నారు.

విషయాన్ని జి.ఒల వారీగా పరిశీలిస్తే, గత సంవత్సరం డిసెంబరు 24న జి.ఒ 84 ఇచ్చారు. ఇది 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలనుండి ఉన్నత పాఠశాలలకు బదలాయించడానికి అవకాశం కల్పిస్తుంది. అదే రోజు జీ.ఒ 85 ఇచ్చారు. దీని ద్వారా 3, 4, 5 తరగతుల విద్యను ఆవాస ప్రాంతం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలలకు కూడా బదలాయించడానికి అవకాశం ఏర్పడింది. ఈ రెండు జి.ఒలు బాలలకు ప్రాథమిక విద్యను కూడా దూరం చేస్తున్నాయి. గత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను మూసి వేయడానికి ప్రయత్నిస్తే, ఈ ప్రభుత్వం ప్రాథమిక విద్యను ముక్కలు చేసి దూరం చేస్తుంది. ఇంకా, ఈ నెల 10వ తేదీన జి.ఒ నెంబరు 117 ఇచ్చారు. ఈ జి.ఒ సమాంతర మాధ్యమానికి, మైనర్ మీడియాల కొరకు ప్రత్యేక సెక్షన్ల ఏర్పాటుకు ఇంతవరకు ఉన్న అవకాశాలను ఆచరణలో రద్దుచేస్తుంది. ఇంకా ఈ జి.ఒ, తరగతి గదిలో విద్యార్థుల గరిష్ఠ పరిమితిని, వారంలో ఉపాధ్యాయులు బోధించాల్సిన పీరియడ్ల గరిష్ఠ పరిమితిని పెంచివేసింది. ఈ జి.ఒ కు తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. దానికి జూలై 13న ఒక సవరణ జి.ఒ 128 ఇచ్చారు. అయితే అది నామమాత్రమైన మార్పులకు పరిమితం అయింది. అందుకే ఈ జి.ఒల పై ఇటు విద్యార్థి సంఘాలు, అటు ఉపాధ్యాయ సంఘాలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యారంగ సంస్థలు బలమైన ఉద్యమాలకు సిద్ధం అవుతున్నాయి. అన్నింటి కంటే ముఖ్యంగా 3,4,5 తరగతుల తరలింపుకు వ్యతిరేకంగా అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలలో 6,7,8 తరగతుల రద్దుకు వ్యతిరేకంగా వందలాది గ్రామాలలో ప్రజలు ప్రదర్శనలు చేస్తున్నారు. పాఠశాలలకు తాళాలు వేస్తున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ఏఏ గ్రామాల నుంచి వ్యతిరేకత వస్తున్నదో పట్టిక ఇవ్వమని విద్యాశాఖా మంత్రిగారు శాసన సభ్యులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాలల వారీగా తల్లిదండ్రుల సంఘాల సమావేశాలను ఏర్పాటుచేసి, వారి అభిప్రాయంపై ఆధారపడి ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతుల తరలింపు, ఇంకా ప్రాథమికోన్నత పాఠశాలలలో 6, 7, 8 తరగతుల రద్దు విషయాలపై నిర్ణయం తీసుకోవడం సరియైన పద్ధతి అవుతుంది. అయితే తరగతుల తరలింపులో తల్లిదండ్రుల అభిప్రాయాన్ని తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం కావడం లేదు. ప్రదర్శనలు చేయని వారు కూడా వ్యతిరేకిస్తున్నారని ప్రభుత్వానికి తెలుసు.


బోధనా మాధ్యమ సమస్య చాలా సంక్లిష్టమైనది. గత నాలుగు దశాబ్దాలుగా ప్రైవేటు రంగంలో వాణిజ్యంగా విద్యను అడ్డుకోలేక పోవడం, అలాగే ప్రైవేటు పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని అడ్డుకోలేకపోవడం వామపక్ష, ప్రగతిశీల, భాషారంగ ఉద్యమాల వైఫల్యం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 నాటికి పరిస్థితి చూస్తే మధ్యతరగతే కాక దిగువ మధ్య తరగతి వారు కూడా ప్రైవేటుకు, ఆంగ్ల మాధ్యమానికి మారిపోయారు. ప్రభుత్వ రంగంలో పూర్తిగా నిరుపేద వారే మిగిలారు. దీనిని ఒక రాజకీయ అవకాశంగా తీసుకుని అప్పటి ముఖ్య మంత్రి కీ.శే శ్రీ రాజశేఖర్ రెడ్డి గారు పేదలకు కూడా కార్పొరేటు విద్య అనే నినాదం ఇచ్చి 6,500 ఉన్నత పాఠశాలలను సక్సెస్ పాఠశాలలుగా ప్రకటించాడు. వాటిలో ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టాడు. అయితే అవసరమైన వసతులు కల్పించడంగాని, తగినంత మంది ఉపాధ్యాయులను నియమించడం గాని చేయలేదు. ఇక వాస్తవాలకు వస్తే, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో పాఠం తెలుగులోనే చెప్పి నోట్సు ఇంగ్లీషులో ఇస్తారు. వాటిని బట్టీపట్టి

విద్యార్థులు పరీక్షలు రాస్తారు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అన్ని ఉన్నత పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టడమే కాకుండా ప్రాథమిక విద్యలో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. దాని మీద వ్యతిరేకత వస్తే రెండు మాధ్యమాలకు అవకాశం కొనసాగించారు. పదివేల ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు ఉన్న రాష్ట్రంలో రెండు మాధ్యమాలకు అవకాశం అన్న విషయాన్ని పాఠకుడే అర్థం చేసుకోవాలి. ఇక ప్రస్తుతం ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019 నవంబర్‌లో 81, 85 జి.ఒ లు ఇచ్చింది. 1 నుండి 6వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమం మాత్రమే ఉండాలని నిర్దేశించింది. ఈ సందర్భంలో ఒక ప్రజా ప్రయోజన వాజ్యంలో తీర్పు ఇస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విద్యార్థిపై ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దడానికి లేదని, మాధ్యమాన్ని ఎంచుకునే అవకాశం ఉండాలని తీర్పు ఇచ్చింది. 81, 85 జీ.ఒ లను రద్దు చేసింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు సుప్రీం కోర్టుకు అప్పీలు చేయడమే కాక, విద్యార్థికి మాధ్యమాన్ని ఎంచుకునే హక్కుకు వ్యతిరేకంగా పాఠశాల విద్యను నడుపుతుంది. ఈ విద్యా సంవత్సరంలో జూన్ 10న విడుదల చేసిన జీ.ఒ 117లో మాతృభాషా మాధ్యమ సమస్యను చాలా దొంగచాటుగా దాటవేశారు. ఈ జి.ఒలో 8వ తరగతి వరకు ఒకటే మాధ్యమం ఉంటుంది అని నిర్దేశించడం జరిగింది. నిజానికి పాఠశాలలో మెజారిటీ విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు ఏ మాధ్యమం కోరుకుంటే ఆ మాధ్యమం ఉంటుంది అని రాయడం ఒక మార్గం. అయితే అలా కూడా రాయలేదు. అంటే 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం మాత్రమే ఉంటుందని చెప్పక చెప్పినట్లు. ఇక 9, 10 తరగతులలో మాత్రమే రెండు మాధ్యమాలు పెట్టుకోవచ్చని, అయితే ప్రతి తరగతిలో కనీసం 20 మంది విద్యార్థులుండాలని నిర్దేశం జరిగింది. అంటే ఇక్కడ కూడా ప్రధానంగా ఆంగ్ల మాధ్యమం ఉంటుంది. కాని విద్యార్థులు కోరుకుంటే వారు తరగతికి 20 దాటితే మాత్రమే తెలుగు మీడియం ఉంటుందని అర్థం చేసుకోవాలి. నిజానికి జి.ఒలో అర్థం స్పష్టంగా లేదు కాని ఆంగ్లమాధ్యమానికి అనుకూలంగానే అర్థం చేసుకోవాలని అధికారులు అనధికారంగా ప్రధానోపాధ్యాయులకు చెప్తున్నారు. ఈ విధంగా తెలుగు మాధ్యమాన్ని సమాధిచేయడం జరిగింది. జాతీయ విద్యావిధానం 2020 లో 5వ తరగతి వరకు తప్పని సరిగా, వీలయితే 8వ తరగతి ఆ పైన కూడా మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేయమని ఉంది. జాతీయ విద్యా విధానం ఒక చట్టం కాదు. దానిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదు. సరే, కాని 2010 ఏప్రిల్ 1 నుండి అమలులో ఉన్న కేంద్ర విద్యాహక్కు చట్టం పార్లమెంటు ఆమోదించిన చట్టం. 8వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో మాతృభాషా మాధ్యమమే ఉండాలని ఈ చట్టం నిర్దేశిస్తున్నది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదు, రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ముందుకు వెళుతుంది. మాధ్యమ విషయాన్ని ఇక్కడితో ఆపి జి.ఒ 117 లో ఉన్న ఇతర సమస్యలను పరిశీలిద్దాం.

మన రాష్ట్రంలో 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక విద్య అంటారన్న విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలలలో పూర్వ ప్రాథమిక విద్య(ప్రీ ప్రైమరీ) ఇంతవరకు లేదు. ఇప్పుడు ప్రభుత్వ రంగంలో కూడా పూర్వ ప్రాథమిక విద్య పెడుతున్నారు. అయితే అందుకు సంతోషించాలో, బాధపడాలో అర్థం కావడం లేదు. ప్రాథమిక పాఠశాలలలో పూర్వ ప్రాథమిక (ప్రి ప్రైమరీ విద్య – పి.పి 1,2లు) విద్య పెట్టి వాటినుంచి 3, 4, 5 తరగతులను తొలగిస్తున్నారు. దీని వలన 3, 4, 5 తరగతుల విద్యార్థులకు పాఠశాల దూరం కావడం మాత్రమే కాదు, వారి తోడు, సహకారం తమ కంటే చిన్న తరగతుల బాలలకు కూడా దూరం అవుతుంది. ఇది సైకిలాజికల్‌గా వారికి ఒక సమస్యగా మారుతుంది. ఇక పూర్వ ప్రాథమిక విద్యకు తగిన అర్హతలు, శిక్షణ కలిగిన ఉపాధ్యాయులను నియమించడం లేదు. అంగన్ వాడీ వర్కర్లకు ఆ బాధ్యత అప్పజెప్పుతున్నారు. వారికి ఆ అర్హతలూ లేవు, ఆ పైన వారికి ఇప్పటికే చాలా పని భారం ఉంది. ఇంకా 1, 2 తరగతులు బోధించడానికి ఒక యస్.జి.టి మాత్రమే ఉంటాడు. ఈ ఫౌండేషన్ పాఠశాలలో అందగల విద్యా ప్రమాణాల గురించి ఏం మాట్లాడగలం?

ఇంకా, ప్రాథమికోన్నత పాఠశాలలు చాలా వరకు నష్టపోయే పరిస్థితి కనిపిస్తుంది. ఈ జి.ఒ క్రింద చాలా ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా కుదించబడతాయి. ఆ పాఠశాలలలో ఉన్న 6, 7, 8 తరగతులు రద్దు చేస్తున్నారు. ఆ తరగతులలో చదివే అమ్మాయిలు చదువు కొనసాగించడానికి ఇతర గ్రామాలలో ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్ళవలసి ఉంటుంది. వారు, అనేక సందర్భాలలో, తమ ఆవాస ప్రాంతం నుండి రెండువైపుల కనీసం పది కిలోమీటర్లు నడవవలసి ఉంటుంది. ఈ ప్రభుత్వం వారికి సైకిళ్ళు కూడా ఇవ్వదు. ఇది బాలికల విద్యకు వ్యతిరేకమైన నిర్ణయం. ఇక స్థాయి కుదింపుకు గురికాని ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రమాణాల కుదింపుకు గురికానున్నాయి. ఇంత వరకు ఉన్న నిబంధనల ప్రకారం అంటే 2017 నాటి జి.ఒ 29 ప్రకారం 1 నుండి 8 తరగతులు ఉండే ప్రాథమికోన్నత పాఠశాలలకు కనీసం ఇద్దరు యస్.జి.టిలు, ఆరుగురు సబ్జక్టు టీచర్లు మొత్తం ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉండేవారు. ప్రధానోపాధ్య పోస్టు లేకపోయినా ఎనిమిది తరగతులకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు మంజూరుచేయబడిన విధానం ఉంది. అయితే, క్రొత్త జి.ఒ 117 ప్రకారం అత్యధిక ప్రాథమికోన్నత పాఠశాలలకు ముగ్గురు నుంచి ఐదుగురు యస్.జి.టిలు మాత్రమే మంజూరు చేస్తారు. ఈ పాఠశాలలలో బి.ఇడి పోస్టులు (యస్.ఎ పోస్టులు) కొనసాగిస్తామని మంత్రిగారు ఇచ్చిన హామీని అధికారులు పట్టించుకోలేదు.

జూన్ 10వ తేదీన ఇచ్చిన జి.ఒ 117 అనేక విషయాలతో కూడుకుని ఉంది. దీని ఫలితంగా ఉన్నత పాఠశాలలలో తలెత్తే సమస్యలను అర్థం చేసుకోవడానికి కొన్ని ఉదాహరణలు చూడడం మంచిది కావచ్చు. ఒక ఉన్నత పాఠశాలలో రెండు మాధ్యమాలు ఉంటే, 2017 ప్రసన్న కుమార్ కమిటీ నివేదిక ప్రకారం, మొదటి మాధ్యమానికి 9 పోస్టులు, రెండవ మాధ్యమానికి అదనంగా నాలుగు సబ్జక్టు పోస్టులు ఇస్తున్నారు. ఇది ఇప్పటి వరకు ఉన్న విధానం. వేలాది ఉన్నత పాఠశాలలలో తెలుగు, ఉర్దూ వంటి సమాంతర మాధ్యమాలు, తమిళ, ఒరియా వంటి మైనర్ మాధ్యమాలు ఉన్నాయి. ఈ 117 జి.ఒ ద్వారా



సమాంతర, మైనర్ మాధ్యమాలను రద్దుచేస్తూ ఆంగ్ల మాధ్యమాన్ని మాత్రమే కొనసాగాలని నిర్ణయించారు. అంతేకాదు సమాంతర మాధ్యమాలకై కేటాయించిన నాలుగు పోస్టులూ అవసరం లేదని పరిగణిస్తున్నారు. ఆవిధంగా సుమారు పది వేల ఉపాధ్యాయ పోస్టులు మిగులు తేలుస్తున్నారు. అయితే, మాధ్యమాలు రద్దయినా విద్యార్థులు ఆ పాఠశాలలలోనే కొనసాగుతారు. వారిని ఏం చేయాలి? రెండు సెక్షన్ల విద్యార్థులను ఒక్క సెక్షన్‌లో కూర్చోబెట్టడం దీనికి పరిష్కారంగా ప్రభుత్వం భావించింది. సెక్షన్‌లు తగ్గించినప్పుడు సెక్షన్‌లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. అందుకే సెక్షన్‌లో ఉండగల విద్యార్థుల గరిష్ట సంఖ్యను 30, 35, 40 నుండి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విభాగాలలో, వరుసగా 45, 52, 60 కి పెంచారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 'విద్యాహక్కు చట్టం 2009' క్రిందకు వస్తాయి. విద్యాహక్కు చట్టం ప్రకారమే గతంలో సెక్షన్ గరిష్ట పరిమితిని 30, 35 గా నిర్ణయించారు. మరి ఇప్పుడు దానిని 45, 52 గా మారిస్తే అది చట్ట విరుద్ధం అవుతుంది. బాధితులు కోర్టుకు వెళ్ళే అవకాశం ఉంటుంది. గిరీశం లాగ 'కథ అడ్డం తిరిగితే అట్నుంచి నరుక్కొస్తార'నుకోవాలి. 9, 10 తరగతులలో సెక్షన్ గరిష్ట పరిమితి 60గా నిర్దేశించారు. ఇది సమగ్ర శిక్షా అభియాన్ నిబంధనలకు విరుద్ధం. అంతేకాదు, తరగతి గదిలో 60 మంది కూచుంటే చివర కూచున్న వారికి బోర్డు కనిపించదు, పాఠం వినిపించదు. అల్లరి ఎవరు చేస్తున్నదీ టీచర్‌కు తెలియదు.

నేడు ఉదాహరణలుగా నిలుస్తున్న, విద్యార్థుల నమోదు గణనీయంగా కలిగి ఉన్న ఉన్నత పాఠశాలలు ఈ జి.ఒ 117 వలన తీవ్రంగా నష్టపోతాయి. వందలాది మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల(6నుంచి 10 తరగతులు) నుంచి ఒక ఉదాహరణ తీసుకుందాం. ఉదాహరణకు 441 నుండి 480 మంది విద్యార్థులున్న ఒక ఉన్నత పాఠశాలలో ప్రసన్న కుమారు నివేదికపై ఆధారపడి వచ్చిన 2017 నాటి జి.ఒ 29 ప్రకారం 21 మంది ఉపాధ్యాయులను ఇస్తున్నారు. ఆ పాఠశాలలో సమాంతర మాధ్యమంగా తెలుగు, ఉర్దూ లేదా ఏ ఇతర భాష ఉన్నా అందుకు అదనంగా 8 పోస్టులు ఇచ్చారు. అంటే 480 మంది విద్యార్థులకు 29 మంది ఉపాధ్యాయులన్న మాట. ఇప్పుడు జి.ఒ 117 ప్రకారం సమాంతర మాధ్యమం సుమారు ఉండదు. ఉన్నా అదనపు ఉపాధ్యాయులు ఉండరు. అంతేకాదు క్రొత్తగా తీసుకు వచ్చిన ఈ జి.ఒ ప్రకారం 460 మంది విద్యార్థులకు 12 మంది ఉపాధ్యాయులను మాత్రమే ఇస్తున్నారు. అంటే ఇంతకు ముందు 480 మంది విద్యార్థులకు కనీసం 21 మంది ఉపాధ్యాయులు ఇప్పుడు 460 మంది విద్యార్థులకు 12 మంది ఉపాధ్యాయులు బోధించవలసి ఉంటుంది. ఫలితంగా నేడు విజయవంతంగా నడుస్తున్న ఈ పాఠశాలలలో విద్యా ప్రమాణాలు అడుగంటిపోతాయి. ఈ జి.ఒ 117 ప్రభుత్వ విద్యకు ఉరితాడే! గత మూడు సంవత్సరాలుగా ఉపాధ్యాయ

"భాషాపెత్తనం స్వరాజ్యం కాబోదు మొదటి ప్రాధాన్యత ఎల్లవేళలా మాతృభాషదే. ఆ తర్వాతనే హిందీ భాష. నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం" – మహాత్మాగాంధీ

ఖాళీల భర్తీ కొరకు పోరాడని ఉపాధ్యాయ వర్గం ఆ పాపాన్ని ఇప్పుడు పెరిగిన పని గంటల రూపంలో ఎదుర్కోవాలి. ఉపాధ్యాయులు వేతన సంతృప్తి కొరకు మాత్రమే కాదు, వృత్తి సంతృప్తి కొరకు, అంటే మెరుగైన బోధనా పరిస్థితుల కొరకు కూడా పోరాడాలని గ్రహించేవరకు విద్యా వ్యవస్థకు నిష్కృతి లేదు. ప్రతిపక్ష, వామపక్ష పార్టీలకు విద్య ఒక రాజకీయ సమస్యగా కనిపించకపోవడం ప్రజల దురదృష్టం.

ఇంకా గ్రామ, వార్డు సెక్రటరీలకు పాఠశాలలపై అజమాయిషీ పాక్షికంగానైనా, కల్పించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఉపాధ్యాయులలో వివిధ స్థాయిలో అలసత్వం లేదని కాదు. కాని ఆ సమస్యను ప్రపంచ బ్యాంకు చెప్పినట్లు సూపర్‌విజన్ ద్వారా, ఎలక్ట్రానిక్ సర్వియలెన్స్ ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నిస్తే యునెస్కో నివేదిక (2017) ఋజువు చేసినట్లు వైఫల్యమే కాదు ప్రతికూల ఫలితాలు గ్యారంటీ. ఈ విషయాన్ని గ్రహించకపోవడం వలననే ప్రభుత్వ విధానాలు వ్యతిరేక ఫలితాలనిస్తున్నాయి, ఉపాధ్యాయులను ప్రశాంతంగా పనిచేయనివ్వకుండా చేస్తున్నాయి. ఫిన్‌లాండ్ ప్రభుత్వం, కనీసం ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్నట్లు ఉపాధ్యాయులలో ఆత్మాభిమానాన్ని పెంచడం ద్వారా సమస్యను పరిష్కరించాలి. **ప్రపంచ ప్రఖ్యాత విద్యావేత్త ప్రొఫెసర్ పాల్ సెహల్‌బర్గ్ విశ్లేషణలను మంత్రులు కాదు మన అధికారులు కూడా చదవరు. మరి విద్యావ్యవస్థను ఎలా నిర్వహించాలో వారికి ఎలా తెలుస్తుంది. ఉపాధ్యాయుని మీద అపనమ్మకమే విద్యావిధానానికి ఇరుసయితే మన ప్రస్తానం అగాధాలకే కాగలదు.**

రచయిత కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటి,
అధ్యక్షవర్గ సభ్యులు, అఖిలభారత విద్యాహక్కు వేదిక

స్పందనను వ్రాయండి

'అమ్మనుడి'లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ
కళాశాల వీధి, మాచవరం,
విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

కవిత

పుస్తకం నా నేస్తం

మళ్లీ మళ్లీ బుజ్జగించి చెప్తున్నాను
పిల్లలూ పెద్దలూ
పుస్తకాలు చదవండి
ఓపిక దీపికలా వెలుగుతుంది
ఏకాగ్రత దాని కత.
పుస్తకాలు
ఉన్న లోకాన్నే ఉన్నతంగా చూపెడతాయి.
అక్షరాల దారుల వెంట పరిగెడితే
అనంత దూరాలను చేరుకోవచ్చు.
గ్రంథం
ఇంటికి అందం.
పక్కనే వుంటుంది
స్నేహితుడిలా పలకరిస్తుంది.
ఒంటరితనంపై
ఓదార్పును చిలకరిస్తుంది.

కాలక్షేపం కోసం కాదు
కాలం విలువ తెలియడం కోసం.
పుస్తక పఠనం ఒక ధ్యానం
నరనరాన రవళించే జీవనగానం.
పుస్తకం వ్యక్తిత్వాన్ని చెక్కుతుంది,
సమస్యలకు పరిష్కారం చెప్తుంది.
పుటల రెపరెపల చప్పుళ్ల ముందు
ఏ సంగీతమూ పనికి రాదు.
ప్రయాణంలో
దూరం దారం ఉండలా చుట్టుకపోతుంది.
బస్సు కిటికీలు
టీవి స్క్రీన్‌లుగా మారి పోతాయి.
పోయిన మా అమ్మను
పుస్తకాల్లోనే బతికించుకున్నాను
అలనాటి మా నాన్నను
ధైర్యంగా మలుచుకున్నాను.

కాస్సేపు సెల్‌ఫోన్లు పక్కన పెట్టండి
తొందరగా వచ్చేది తొందరగానే పోతుంది.
జీవితం ఆగమాగం కాదు
నిదానంలో తోడొచ్చే నేపథ్యరాగం.
ఒక్కసారి పుస్తకాన్ని ముట్టుకో!
దాని మీది దుమ్మును
ఒక్కసారన్నా చేతుల కంటించుకో
గంధపు పొడిలా పరిమళిస్తుంది.
'ఏముంది మీ యింటి కొస్తే' అన్నాడు ఓ మిత్రుడు
'పుస్తకాలు
పుస్తకాలున్నాయ
నా కంటే శ్రీమంతుణ్ని చూపించు' అన్నాను.

డా॥ ఎన్. గోపి
9391028496

సి.వి.క్రిష్ణయ్య
93965 14554



ఎవరు తెలివి గలవారు?! 9

జరిగిన కథ:

కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకొన్నారు జంతు పక్షిజనాలు. ఆడవిలో పిల్లలకు అనేక మానసిక శారీరక అనారోగ్య సమస్యలు వచ్చాయి. తొలకరి వానలు కురవడంతో అడవిలో మొలకల పండుగ వచ్చింది. ఈ పండుగ సందర్భంగా అడవిలో ఆనందంగా ఆటల ప్రదర్శనలు జరిగాయి. బడిలో పరీక్షలూ, మార్కులు నిషేధించారు. శిక్షలు బహుమతులు కూడా నిషేధించారు

పిల్లలు ఎలా నేర్చుకొంటారు?

చిలుక చెప్పిన మాటలు విన్న పిల్లికి ఒక సందేహం వచ్చింది. "కొంత మంది తల్లిదండ్రులు పిల్లల్ని కొట్టి తిట్టి బలవంతంగా నైనా తాము చెప్పినట్లు వినాలనే అభిప్రాయంతో ఉన్నారు. వీరిని మార్చడం ఎలా" అని అడిగింది పిల్లి.

"మీరు ఒక పనిచేయండి. సమస్య ఏ ఒక్క తల్లిదండ్రులకో బడికో సంబందించింది కాదు. ఇది మొత్తం సమాజానికి సంబందించిన సమస్య. అందర్నీ సమావేశపర్చి ఒక సభ ఏర్పాటు చేయండి. ఈ సభకు రాజుగారిని కూడా ఆహ్వానిద్దాం" అని చెప్పింది చిలుక.

అడవిలో ఒక ఆదివారం రెండో సభ ఏర్పాటు చేసారు. అంతా వచ్చి కూర్చున్నారు. ఎవరేమి చెబుతారో వినాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సింహరాజు గారి పక్షాన మంత్రిగారైన ఎలుగుబంటి లేచి నిలబడ్డారు " ప్రజలారా! ఆరు నెలల కిందట ఈ అడవిలో ఒక సభ పెట్టుకొన్నాం. ఈ భూమండలంలో ఎవరు తెలివిగలవారో చర్చించుకొన్నాం. మానవులు తెలివి గలవారేగాని వారి తెలివి తేటలకంటే బుద్ధి హీనత, చేతకానితనం, దుర్మార్గం ఎక్కువనీ ఇందుకు గల కారణం బడి అని తెలుసుకొన్నాం. బడిని మంచిగా మార్చుకొంటే మనుషులు విశ్వప్రేమికులుగా మారి ఈ భూమండలంలో సకల జీవరాశులు సుఖంగా జీవిస్తాయని చెప్పుకొన్నాం. ఈ సందర్భంలో అడవిలో ఒక మంచి బడి పెట్టుకొందామనే ప్రతిపాదనవచ్చింది. మేము దాని విషయంలో తర్వాత ఆలోచిద్దాం అని తెలియజేసాం.కాని ఒక పెంపుడు కోతి సాయంతో కొందరు ఒక బడిని పెట్టుకొన్నారు. ఈ విషయం మాకు తెలిసినప్పటికీ ఏమి జరుగుతుందో చూద్దాం అని వేచి చూస్తూ ఉన్నాం. బడి వలన అనేక సమస్యలు వచ్చినట్లు తెలుసుకొన్నాం. ఈ సమస్యలకు మూలకారణాలేమిటో పిల్లలు కాని పెద్దలు గాని ఒక విషయాన్ని ఎలా నేర్చుకొంటారో ? నేర్చుకోవడంలో ఎలా విఫలమవుతారో? బడి ఎలా ఉండాలో? ఈ రోజు చర్చించుకొందాం.

బుద్ధిలో బృహస్పతియైన హయరాజాన్ని వచ్చి అన్ని విషయాలు వివరించాలని మనవి చేస్తున్నాను" అంటూ మంత్రిగారు చుక్కల గుర్రాన్ని ఆహ్వానించారు. సభాజనులంతా ఎంతో ఆసక్తిగా చూస్తూ ఉండగా చుక్కల గుర్రం సభ ముందుకు వచ్చి నిలబడ్డది. తన గంభీరమైన కంఠంతో రాజుకు సభలోని సకలజనులకు అభివాదము తెలిపింది.

"సభాసదులారా మొదటి మహాసభలో బడి వలన, సారహీనమైన చదువుల వల్ల మానవ సమాజం, ఆ మానవుల మీద ఆధారపడ్డ ఈ భూమండలం ఎంత నష్టపోతున్నాదో తెలుసుకొన్నాం. అలాంటి బడినే మనలోకొందరు కావాలన్నారు. ఏమి జరుగుతుందో అనుభవపూర్వకంగా తెలుసుకోవడం మంచిదని మేము రాజుగారికి విషయం చెప్పి మౌనంగా ఉన్నాం. జరిగిన నష్టాలు ఏమిటో తెలుసుకొన్నారు ఈ నష్టాలకు కష్టాలకు అలవాటు పడి ఇవి సహజమనుకొనే ప్రమాదం లేకపోలేదు. ఎందుకంటే మనుషులు కూడా ఈ బడిపద్ధతులకు అలవాటుపడి ప్రపంచాన్ని వారివారి స్వబుద్ధితో అర్థం చేసుకొనే శక్తిని కోల్పోయి మళ్ళీ పాతకాలం నాటి రాజుల పాలనకు నియంతల పాలనలకు వెనక్కి వెళుతున్నారు. ఈ నియంతలు విజ్ఞులను, వివేకవంతులను పక్కనబెట్టి అధికారం తలకెక్కి అహంకారంతో తీసుకొనే నిర్ణయాలు చాలా ప్రమాదకరంగా ఉంటాయి. చివరకు మనం మాట్లాడుకొనే మాతృభాషలో చదువులు నిషేధించేవరకు వెళతారు. ఈ ప్రపంచంలోని సకల విషయాలు గురించి తెలుసుకొంటున్నమనుషులు తాము ఎలా ఆలోచిస్తున్నామో పసితనంలో ఎలా నేర్చుకొంటున్నారో తెలుసుకోలేక పోతున్నారు. తెలుసుకొన్నా ఈ సంప్రదాయ బడికి అలవాటుపడిపోయి దానికి విరుద్ధంగా ఆలోచించలేకున్నారు. ఇది అత్యంత విషాదకరమైన విషయం.

ఇదిగో ఈ రోజు ఈ సభా ముఖంగా నేను కొన్ని ముఖ్యవిషయాలు ప్రయోగపూర్వకంగా మీకు తెలియజేయబోతున్నాను. జాగ్రత్తగా



గమనించండి. రాజభటులు మీలో కొందరికి రెండు కర్రపుల్లలు ఒక తాడు తెచ్చి ఇస్తారు. ఆ రెండు కర్రపుల్లలను బందించేటట్లు నేను ఒక ముడి వేస్తాను. ఆ ముడి మీరు ఎంతసేపటిలో నేర్చుకొంటారో ప్రయత్నించండి" ఈ మాటలు విన్న రాజభటులు ముందు వరసలో ఉన్న వారికి కర్రపుల్లలు తాళ్లు తెచ్చి ఇచ్చారు. చుక్కలగుర్రానికి కూడా రెండు కర్రపుల్లలు ఒక తాడు తెచ్చి ఇచ్చారు. చుక్కలగుర్రం ఆ రెండు కర్రపుల్లలను కలిపి అందరికి కనిపించేటట్లు ఒక తాడుతో ముడివేసి గట్టిగా లాగి చూపించింది. రెండు కర్రలుగట్టిగా బిగించుకొని పోయాయి. ముందు కూర్చున్న వారిలో ఒకరని వచ్చి ఒక కొసపట్టుకొని లాగమన్నది. ఆ తాడు కొస పట్టుకొని లాగగానే ముడి నుండి సులభంగా కర్రలు విడిపడ్డాయి. ఈ ముడిని అందరిని వేయమని చెప్పింది. మళ్లీ మళ్లీ ముడివేసి చూపించింది. అయినా ముడి వేయలేకపోయారు. వేదికమీద ఉన్న మంత్రిగారు, సేనాధిపతి, ఇతరప్రముఖులు కూడా ప్రయత్నించారు. విఫలమయ్యారు. విసిగిపోయి ఇది చాలా కష్టమన్నారు. మాకు రాదు అన్నారు. చుక్కల గుర్రం ఒక జింకపిల్లను దగ్గరకు పిలిచింది. రెండు నిమషాలు ముడి వేయడం నేర్పించింది. జింకపిల్ల తాను స్వయంగా ముడివేసి అందరికి చూపించింది. అంతా చప్పట్లు కొట్టారు.

చూసారుగదా! ఇంతమంది ఎందుకు నేర్చుకోలేకపోయారు. ఒక చిన్నబిడ్డ రెండు నిముషాల్లో ఎలా నేర్చుకొన్నది. మీరు నేర్చుకోలేపోవడం మాత్రమే గాదు. భయపడ్డారు. ప్రయత్నించి మాకు రాదని నిర్ణయించుకొన్నారు. అవునా కాదా! అని సభాజనం వైపు చూసింది చుక్కల గుర్రం. తమ మనస్సులో ఉన్న అభిప్రాయాలన్నీ సరిగ్గా చెప్పినందుకు గుర్రం తెలివిని అంతా మెచ్చుకొన్నారు. " ఇప్పుడు బాగా ఆలోచించండి. సరిగ్గా బడిలో గూడా ఇదే జరుగుతున్నది. ఉపాధ్యాయుడు చెబుతాడు, లేదా చేసి చూపిస్తాడు. పిల్లలు వింటారు. చేయడానికి ప్రయత్నించి విఫలమవుతారు. మాకు రాదని నిర్ణయించుకొంటారు. పాఠం అయిపోయింది. మరో పాఠానికి ఉపాధ్యాయుడు వెళతాడు. అంతా నేర్చుకొనేదాకా ఆగాలి గదా! వచ్చిందాకా నేర్పాలిగదా! ఇదేమీ జరగదు. కాని పరీక్షల్లో మార్కులు వస్తాయి. ఏమిరాస్తారు!

" ఒకతాడుతీసుకోవాలి. రెండు కర్రలన్నీ దగ్గరగా చేర్చాలి. తాడుతో ముడి వేయాలి" ఇలారాస్తే ముడి వేయడం వచ్చినట్లా? ముడి వేయడంరాకున్నా వచ్చినట్లు మనం భావించాలి. మార్కులు వేస్తారు. పరీక్షల్లో కృతార్థులు అవుతారు – ఈత ఎలా ఈదుతారు అంటే నీళ్లలోదిగి చేతులు కాళ్లు ఆడించాలి అని చెబుతారు. ఈత వచ్చినట్లా?

బడిని గురించి నేర్చుకోవడం గురించి మరికొన్ని విషయాలు తెలుసుకొందాం. ఈ బడిని ప్రారంభించిన వానర సోదరుడిని సభలో ప్రవేశపెట్టండి అంటూ భటులవైపు చూసారు. చుక్కల గుర్రంగారు. భటులు పెంపుడుకోతిని సభలోనికి తీసుకువచ్చారు. పెంపుడుకోతి వంటి మీద బట్టలు నల్లగా మాసి చీలికలై వేలాడుతున్నాయి. దాని ఎడమ చేతిలో ఒక పుస్తకం. కుడి చేతిలో ప్రపంచపటం కాగితపు చుట్ట ఉన్నాయి. చుక్కల గుర్రం కోతి వైపు చూసింది. "వానర మహాశయా తమరు మనుషుల దగ్గర నేర్చుకొన్న విద్యలేమిటో ప్రదర్శించి చూపిస్తారా ! అని అడిగింది.

పెంపుడుకోతి వైపు అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

పెంపుడుకోతి తనచేతిలో ఉన్న ప్రపంచపటాన్ని చూపించింది. "ఇదిగో ఈ ప్రపంచపటంలో ఎక్కడ ఏ దేశమేందో చూపిస్తాను. ఈ పుస్తకాన్ని గడగడ చదువుతాను. సంవత్సరం రోజులు కష్టపడి నేర్చుకొన్న కొన్ని శారీరక విన్యాసాలు చేస్తాను. అని చెప్పింది.

"ప్రపంచపటంలో దేశాలు చూపిస్తావు మంచిదే. కాని ముందుగా నీకు కొన్ని విషయాలు తెలిసి ఉండాలి. ప్రపంచం అంటే ఏమిటి? దేశం అంటే ఏమిటి? వివరించి చెప్పగలవా? అని అడిగింది చుక్కల గుర్రం.

"అవన్నీ నాకు తెలియదు. ఏమి నేర్చుకొన్నానో అవే చెప్పగలను. నేర్చుకోనివి ఎలా చెప్పగలను అన్నది కోతి కోపంగా.

"కోపగించుకోకు మిత్రమా! నిన్ను అగౌరవపరచాలని మా ఉద్దేశ్యంకాదు. నీవు చెప్పే సమాధానాలవలన ఇక్కడున్న జనసమూహానికి చాలా విషయాలు అర్థంగావాలి– దేశమంటే మట్టి రాళ్లు ఉన్న నేల ముక్కగాదు. అక్కడున్న మనుషులు, వాళ్ల వేషభాషలు, సంస్కృతీ నాగరికతలు, ఆహారపు అలవాట్లు. ఒక జాతిగా ఒక దేశంగా ఎలా ఏర్పడిందో తెలిపే వేల సంవత్సరాల చరిత్ర. సరిహద్దులలో గల స్థలంకాదు. బలాబలాలను బట్టి సరిహద్దులు మారుతూ ఉంటాయి. ఇలాంటి అనేక దేశాలు– ఖండాలు సముద్రాలు అంతా కలిస్తే ప్రపంచం. ఇవన్నీ తెలియకుండా దేశం ప్రపంచం అనే మాటలు

మాట్లాడితే ఏవో పిచ్చి శబ్దాలు పలికినట్లే, అలాగే పుస్తకం కూడా చదువుతావు. కాని ఆ చదివిన దాని భావం ఏమిటో తెలియదు. చదవడం అంటే అక్షరాలు చదవడం గాదు. చదవడం అంటే అర్థం చేసుకోవడం. అక్షరాలు రానివాళ్లుకూడా ఈ ప్రపంచాన్ని చదువుతూ ఉంటారు. ఇప్పుడు మనుషుల పిల్లలు బడిలో చదివేది అర్థం చేసుకోవడం లేదు. పదే పదే వాక్యాలు చదివి గుర్తుపెట్టుకొంటున్నారు. దీని వలన పెరిగి పెద్దవారై మూర్ఖ శిఖామణిగా మారుతున్నారు. కాబట్టి నువ్వు నేర్చుకొన్న రెండు విషయాలూ వ్యర్థమే. మూడోది నీ శరీర విన్యాసాలగురించి కూడా తెలుసుకొందాం. ఏదీ ! నీవు కష్టపడి నేర్చుకొన్నా ఆ విద్యలేవో ప్రదర్శించి చూపు" అని అడిగింది చుక్కలగుర్రం.

పెంపుడుకోతి తన చేతుల్లో ఉన్న పుస్తకం, ప్రపంచపటాలను తీసి కిందపెట్టింది. పరుగెత్తుకొంటూ వచ్చి రెండు పల్టీలు కొట్టింది. ఒకరాయి నెత్తిమీద పెట్టుకొని రెండు కాళ్లమీద నడిచింది. చేతులు కింద పెట్టి కాళ్లు పైకెత్తి నడిచింది. కోతి సభలోని జనం వైపుచూసి నేను ఈ విద్యలు కష్టపడి సంవత్సరం రోజులు నేర్చుకొన్నాను. ఎన్నో దెబ్బలు తిన్నాను. ఈ విద్యలు ప్రదర్శించి డబ్బులు సంపాదించుకొని నన్ను పెంచిన బాలయ్య నేను బ్రతికాం. అని ఎంతో గొప్పగా చెప్పింది పెంపుడుకోతి.

ఈ మాటలు విన్న జంతువులు పక్షులు పగలపడి నవ్వాయి. నవ్వలేక నవ్వలేక పొట్టలు చెక్కలయ్యేటట్లు నవ్వాయి. కోతులు పిల్లులు కింద బడి దొర్లి దొర్లి నవ్వాయి. ఎప్పుడూ నవ్వని సింహాలు, పులులు, కూడా నవ్వాయి. "ఓరి కోతిగా" ఇవి విద్యలా అంటూ పొట్టపట్టుకొని నవ్వాయి. ఓరి బడుద్దాయి అంటూ సింహం జుట్టు పీక్కున్నది. ఆ ప్రాంతమంతా నవ్వులతో దద్దరిల్లిపోయింది. పక్షులు పైకి ఎగిరి కోతి పైన రెట్టలు వేశాయి. కోతులు, చింపాంజీలు మన జాతి పరువుతీశావుగదా అంటూ రాళ్లు విసిరాయి. అంతా గోలగోలగా తయారైంది వీళ్లంతా ఎందుకునవ్వుతున్నారో కోతికి అర్థం గాలేదు.

"మీ నవ్వులు గోల ఆపండి" అంటూ ఏనుగు ఘీంకరించింది. సభ సద్దుమణిగింది. చుక్కల గర్రం మాట్లాడడం ప్రారంభించింది. "మన పెంపుడుకోతి గారు ఈ విద్యలు సంవత్సరం రోజులు కష్టపడి నేర్చుకొన్నారట – ఏ విద్యలు ? నడవడం, ఎగరడం, విద్యలు కాదు. అవన్నీ సహజంగా అందరూ చేసే పనులు ప్రత్యేకంగా నేర్చుకోనవసరం లేదు. కావాలంటే పరీక్షించి తెలుసుకుందాం. ఇప్పుడు పెంపుడు కోతి చేసిన విన్యాసాలు మనలో కొందరు చేసి చూపిస్తారు అంటూ ముందువరసలో నిలబడి చూస్తున్న పదిమంది పిల్లల్ని పిలిచింది. కొన్ని జింకపిల్లలు, కోతులు, కుందేళ్ళు వచ్చి పెంపుడుకోతి నడిచినట్లు ముందు కాళ్లు పైకెత్తి వెనక రెండు కాళ్లతో నడిచాయి. పల్టీలు కొట్టాయి–రాయి నెత్తిమీద పెట్టుకొని నడిచాయి.

"చూసారా ఇవన్నీ నేర్చుకోవాలసిన అవసరం లేదు మరి కోతిగారు ఎందుకు సంవత్సరం రోజులు నేర్చుకొన్నారు. చిన్న బిడ్డను లొంగదీసుకొని తాను చెప్పినట్లు చేయించడానికి బాలయ్య ప్రయత్నించాడు. మన కోతి బాలయ్య మాటవినకుండా ప్రతిఘటించి తన స్వేచ్ఛనుపోగొట్టుకొని లొంగిపోవడానికి ఇష్టపడలేదు. కాని బాలయ్య కొట్టి, తిండి పెట్టకుండా మాడ్చి, హింసించి తన దారికి తెచ్చుకొన్నాడు. బాలయ్య చెప్పినట్లు వినక తప్పలేదు పెంపుడుకోతికి.

ఇప్పుడు బడుల్లో జరుగుతున్నది ఇదే. సహజంగా సులభంగా నేర్చుకోగల అనేక విషయాలు బలవంతంగా ఇదిగో ఇప్పుడే నేర్చుకోవాలని నిర్బంధించి వారి స్వేచ్ఛను ఇష్టాయిష్టాలను హరిస్తున్నారు. పిల్లలు నేర్చుకోకుండా ప్రతిఘటిస్తున్నారు. ఆలోచించి అర్థం చేసుకోవాల్సిన అద్భుత విషయాల ఎడల నిరాసక్తంగా ఉంటున్నారు. ఎలాంటి అనుభూతిని పొందలేక పోతున్నారు. వారి ఆలోచనలు ఆగిపోతున్నాయి. క్రమక్రమంగా అర్థం చేసుకొనే సహజశక్తిని పోగొట్టుకొంటున్నారు. ఇదే బడిలో జరిగే పెద్ద విషాదం. ఈ విషయాన్ని మనుషులు గ్రహించలేకున్నారు. 40 అక్షరాలు నేర్చుకోడానికి ఎన్ని రోజులుకావాలి. ఐదేళ్లయినా నేర్చుకోలేని పిల్లలుఎందుకున్నారు. ఈ అక్షరాలు నాకు రావు అని బడి నుండి పారిపోవడం ఏమిటి? ఉపాధ్యాయులు చెప్పకపోయినా బడిలో వచ్చి కూర్చున్నందుకైనా అవి వచ్చే తీరాలి. రాలేదంటే రాకుండా చేసేది ఏదో బడిలో ఉంది. అదే స్వేచ్ఛను హరించి నిర్భంధంగా నేర్పించడానికి పూనుకోవడం. మనుస్సుతో చేసే పనులు, ఆలోచించి చేయాల్సిన పనులు ప్రశాంతంగా ఆనందంగా చెయ్యాలి.

పెంపుడు కోతి బలవంతంగా నేర్చుకొన్న విద్యలు వీధుల్లో ప్రదర్శించి తన తిండి సంపాదించుకోవడమే కాకుండా తన యజమానికి కూడా తిండి సంపాదించి పెట్టింది. ఇప్పుడు మన ప్రపంచంలో జరుగుతున్నది కూడా ఇదే. కోట్లాది మంది పిల్లలు బడుల్లో చేరి కొన్ని విద్యలు నేర్చుకొని ఉద్యోగులై తిండి కోసం పనిచేస్తున్నారు. తమ తిండి సంపాదించుకోవటంతో పాటు తమ యజమానులకు కూడా తిండి, సకల సిరిసంపదలు సమకూర్చి పెడుతున్నారు. కాని యజమాని ఉద్యోగులకు తిండి పెడుతున్నట్లు తలకిందుల ప్రచారం జరుగుతున్నది. **ఎంత విచిత్రం? ఈ బడులు కేవలం తిండి కోసం తమ యజమానులకు సంపదలు పోగు చేసే కూలీలను మాత్రమే తయారు చేస్తున్నవి.**

ఈ ప్రకృతిని, ప్రజలను ప్రేమించి రక్షించే వాళ్లను, విజ్ఞాన వంతులను, సృజనశీలురను, ఆలోచించి అర్థం చేసుకోగల మనుషులను, కళాకారుల్ని, శాస్త్రవేత్తలను, మంచి పాలకులను, తయారు చేయడంలేదు.

ఈ బడులు రాజుల్ని, నియంతలను, భజన చేసే బానిసలను తయారు చేస్తున్నాయి. గతంలో నియంతలను రాజులను కూల్చి విప్లవాలు చేసిన మనుషులు బహుశా ఈ బడుల్లో చదివి ఉండరు. ఇలాంటి బడులు అప్పటికి ఇంకా ఉనికిలోకి రాలేదని అర్థం చేసుకోవాలి. ఇప్పుడు ఈ బడుల్ని కూల్చడానికి మహా విప్లవాలు కావాలి. ఈ పని ఈ మనుషులు చేయగలరా?

వచ్చే సంచికలో: సహజమైన బడి

మాతృభాషల్ని అణచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి. అభివృద్ధి నిరోధకమైనవి కూడ. అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు. –ఒక సామాజిక ఉద్యమనేత

బద్రి కూర్మారావు
97047 98643

చరిత్ర విస్మరించిన సిక్కోలు ఆదివాసీ యోధులు- కొర్ర మల్లయ్య, థాట్రాజు

భారతదేశంలో బిర్సాముండా (1875-1900), కొమరం భీం (1901-1940), అల్లూరి సీతారామరాజు (1922) పోరాటాలకు ముందే కళింగసీమలోని సిక్కోలు గడ్డపై బ్రిటిష్ వారిని ఎదిరించి అసువులు బాసిన ఆదివాసీ సమరయోధుల చరిత్ర అంతగా వెలుగులోకి రాలేదు.

అందులో ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాకు చెందిన థాట్రాజు (1865), విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన కొర్ర మల్లయ్య (1900), తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ద్వారబంధాల చంద్రయ్య దొర (1880) (ఇతని జన్మస్థలం బొబ్బిలి) చరిత్ర- గ్రంథస్థం కాలేదు. పూర్తి సమాచారం లభ్యం కావటం లేదు. బిర్సాముండా, కొమరం భీం, అల్లూరి సీతారామరాజుల పోరాటాలను తక్కువగా చూపడం ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు. ఈ ఆదివాసీ సమర యోధుల పోరాటం-చరిత్ర వెలుగులోకి తేవడమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం. అల్లూరి సీతారామరాజు అనుచరులు గాం గంటం దొర, మల్లు దొరలు, మరో అనుచరుడు పండూ పడాల్ బ్రిటిష్ వాళ్ళకు పట్టుబడ్డారు. వారిలో పండూ పడాల్‌ను అండమాన్ నికోబార్ దీవులలో సెల్యులర్ జైలులో ఉంచగా, విడుదలైన అనంతరం పండూ పడాల్ అక్కడనే తన జీవిత చరమాంకం గడపడం జరిగింది. మరణానంతరం ఇతని విగ్రహాన్ని విశాఖ జిల్లా, కొయ్యూరు మండలం, మంప దగ్గరలో గొందిపాకలో నిర్మించడం జరిగింది. అల్లూరి మరో శిష్యుడు మర్రి కామయ్య వర్ధంతి, జయంతిని అక్కడి ప్రజలు జరుపుకుంటున్నారు.

తాట్రాజు ఉరి:

తాట్రాజు లేదా తాటిరాజు నాటి స్వాతంత్ర్య సమరంలో సిక్కోలు గడ్డకు చెందిన గిరిజన తిరుగుబాటు నాయకుడు. ఈయన జన్మస్థానం, పోరాట వివరాలు సేకరించవలసి ఉంది. 1865లో శ్రీకాకుళం, ప్రస్తుత ఏడు రోడ్ల కూడలి దగ్గరిలో గల మున్సిపల్ మైదానంలో 2,000 మంది బ్రిటిష్ సైనికుల సమక్షంలో ఉరి తీసారు. బ్రిటిష్ వారి నెదిరించిన వారికెవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించడానికి, బ్రిటిష్ వారు బహిరంగంగా ఉరితీసారు. ఆ సమయంలో ఆయన నా దేశానికి స్వాతంత్ర్యం కావాలని నినాదాలు చేసారు. అయితే ఈ చరిత్ర ఎక్కడా నమోదు కాలేదు.



థాట్రాజు వేషధారి చిత్రం

థాట్రాజు చరిత్రకు జానపద కళా సాక్ష్యం :

థాట్రాజు చరిత్రకు పెద్ద ఆధారాలు లేకపోయినా, శ్రీకాకుళం జిల్లాలో అంపోలు, రాజాం , భామిని, కొత్తూరు, హీరమండలం, టెక్కలి, నందిగాం ప్రాంతాలలో ఇప్పటికీ ప్రదర్శిస్తున్న జానపద కళ సాక్ష్యంగా నిలిచియున్నది. ఈ కళను పల్లెవాసులు గ్రామ దేవత ఉత్సవాలలో పగటి వేషంగా లేదా వాలకంగా ప్రదర్శిస్తుంటారు. ఈ వేషధారి ఆజానుబాహుడైన ఆహార్యం కలిగియుండాలి.

థాట్రాజు ఆజానుబాహుడైన గిరిజనుల రాజు. అతనిని పట్టుకోవడానికి బ్రిటిష్ సైన్యం వస్తే, ఆయన తన చేతిలో కత్తి, డాలుతో సైన్యాన్ని ఎదిరిస్తుంటాడు. గుర్రాలపై వచ్చిన పోలీసులను ఎదిరిస్తూ అమాంతం ఇంటి పైకి పల్టీలు కొడతాడు. ఎద్దుల బండిపైకి పల్టీలు కొడతాడు. అలాగే పై నుండి క్రిందికి పల్టీలు కొడుతూ డాలు, కత్తితో యుద్ధం చేస్తుంటాడు. పోలీసులు వెంబడించి తుపాకీలతో బెదిరిస్తుంటారు. ఎంతకూ ఇతనిని బంధించలేని బ్రిటిష్ సైన్యం, నులక మంచంపై తాటికల్లు తాగుతున్న సమయంలో థాట్రాజును పట్టుకొని, బంధించి స్థానికంగా ఉన్న సోండీల ద్వారా సారా పట్టించి, అతను నిషాలోకి జారుకున్నాక బంధించి అందరి సమక్షంలో పోలీసుల పహరాతో ఉరి తీసినట్లు ఈ వేషధారణ ద్వారా ప్రదర్శిస్తారు. ఈ వేషధారణ వేసిన వ్యక్తితో

పాటు పోలీసు పాత్రలు సుమారు 50 వరకు ఉంటాయి. మేళతాళాలు మధ్య ఈ పగటి వేషం కళ ప్రదర్శింపబడుతోంది.

కురుపాం జమీందార్లుకు థాట్రాజు అనే పేరు ఉంది. జనార్ధన థాట్రాజు శాసనసభ్యునిగా కూడా పని చేసారు. జమిందార్ల కాలంలో గంజాం జిల్లా, జరడా ప్రాంతానికి వాసుదేవ థాట్రాజు కూడా జమిందారుగా పనిచేసినట్లు చరిత్ర ఆధారాలు ఉన్నాయి. ఈ చారిత్రక ఆధారాలలో థాట్రాజు పై మరింత సమగ్ర సమాచారం సేకరించవలసి ఉంది.

సాలూరులో బ్రిటిష్ పాలకులకు ఎదురుతిరిగిన 'కొర్ర మల్లయ్య'

1813లోనూ, 1832లోనూ శ్రీకాకుళం సర్కారు రాజకీయ అలజడులకు గురైంది. 19వ శతాబ్దపు మూడవ దశకంలో పిండారీలు ఈ జిల్లాను దోపిడీ చేశారు. 1836లో గోండులతోపాటు, యితర కొండజాతి ప్రజలు తిరుగుబాటు చేయగా జార్జి రస్సల్ అణచివేయగలిగాడు. 19వ శతాబ్దం చివరిలో కొర్ర మల్లయ్య నాయకత్వంలో మరో తిరుగుబాటు జరిగింది. మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారస్తులు అవలంబించిన దోపిడీ విధానాల వల్ల, అవినీతి పరులైన అధికారుల నిరంకుశ ప్రవర్తన వలన గిరిజనులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు. ఈ తిరుగుబాటును అణచివేసి, మల్లయ్యను అరెస్టు చేశారు. మల్లయ్య జైలులోనే తన ప్రాణాలను వదిలాడు.

మద్రాసు ప్రెసిడెన్సిలో వైజాగ్ పటంలో ప్రస్తుతం విజయనగరం జిల్లా, సాలూరు తాలూకా, పాచిపెంట దరి కొర్రవానివలసకు చెందిన కొర్ర మల్లయ్య, కొండదొర తెగకు చెందినవారు. 1900 మే 7న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాలూరు ఏజన్సీ ప్రాంతాలకు చెందిన జాతాపు, కొండదొర, కోద్, గదబ తెగలకు చెందిన 4–5 వేల మంది గిరిజనులను కూడబెట్టి ఎదురు తిరిగాడు. దీనిని ఈ ప్రాంతంలో "కొర్రోడువలస పితూరి" అంటారు మొదటిలో ఆయన చర్యలు హానికరం చేసేవిగా ఉండేవి కావు. తరువాత దశలో తాను పంచపాండవులకు ప్రతీకగా శిశు దశలో ఉన్న తన కుమారుని శ్రీకృష్ణునిగా అభివర్ణించుకొని, బ్రిటిష్ వారిని తన ప్రాంతం నుండి వెడల గొట్టాలని, వారి స్థానంలో తానే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావించాడు. తరువాత ఆధ్యాత్మిక స్వామిగా పిలువబడే కొర్ర మల్లయ్య వెదురు బొంగులను కఱ్ఱ తుపాకీలుగా తయారుచేసి ఆయుధాలుగా ధరించాడు. తరువాత ఈ దండు అంతా పాచిపెంటలో ఉన్న స్థావరాలను దోచుకుంటామని వర్తమానం పంపారు. ఇది విన్న బ్రిటిష్ పోలీసులకు చెందిన ఇద్దరు కానిస్టేబుల్స్, వీరి వద్దకు చేరుకొని, దొరికిన వారిని మరణించే వరకు కొట్టారు. స్థానిక పోలీసులు వారి శవాలను తీసుకెళ్ళాలని ప్రయత్నించగా 'స్వామి' అనుచరులు హెచ్చరికల జారీచేయగా శవాలను విడిచి పెట్టి వెళ్ళిపోయారు. తరువాత జిల్లా కలెక్టర్, వైజాగ్ పటం, పార్వతీపురం, జయపురం పోలీసులు సహకారంతో, మే 7వ తేదిన చేరుకుని స్వామి(మల్లయ్య)ని, ఉద్యమ అనుచరులను అరెస్టు చేసారు. పోలీసులను అడ్డుకోవడానికి మూకగా వచ్చిన మల్లయ్యను, అనుచరులపై కాల్పులు జరపగా 11 మంది అక్కడి కక్కడే మరణించారు. మరి కొంతమంది గాయాలతో పరుగెత్తారు. కొంతమందిని చెదర గొట్టారు. మరి కొంతమందిని అరెస్ట్ చేసారు. ఎదురుతిరిగిన మల్లయ్యతోపాటు అరవై మందిని జైలుకు పంపారు. కొర్ర మల్లయ్యను కానిస్టేబుల్‌ను చంపిన నేరంపై జైలుకు పంపారు. కొర్ర మల్లయ్య జైలులోనే మరణించగా, మరో యిద్దరిని ఉరి తీసారు.

స్వామి కుమారుని కూడా బ్రిటిషు వారు శిక్షించారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన యోధునకు చరిత్రలో స్థానం లేకపోవడం చింతించదగ్గ విషయము. ఇటీవల భారత ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధుల వారసులను గౌరవించాలని వాకబు చేసినపుడు కొర్రవానివలస గాని, కొర్ర మల్లయ్య కుటుంబ వారసులు గాని లేరని తెలియడం బాధాకర విషయం. అందుకే విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన విశ్వవిద్యాలయానికి కొర్ర మల్లయ్య గిరిజన విశ్వవిద్యాలయంగా నామకరణం చేయాలనే డిమాండ్‌ను ఉత్తరాంధ్ర వాసులైన ఆచార్య కె. యస్. చలం వంటివారు ప్రతిపాదించారు. ఇటువంటి వారి చరిత్రను సమగ్రంగా తీసుకు రావాలసిన అవసరం, పాఠ్యాంశాల్లో చేర్చవలసిన అవసరం ఉంది.

శ్రీకాకుళం జిల్లా, నందిగాం మండలం, సవర జయరామపురం గ్రామం దరి తేనె కొండపై ఉన్న చిత్ర లిపిని కూడా వెలుగులోకి తీసుకురావలసిన అవసరమున్నది. గ్రానైట్ పరిశ్రమ నుండి ఈ కొండను కాపాడవలసిన అవసరమున్నది. వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి గారు సవర భాషా, సంస్కృతికి చేసిన కృషితో గిరిజన భాషలను, చరిత్ర సంస్కృతులను కాపాడవలసిన అవసరమున్నది.

ప్రజా హృదయాలను దోచుకున్న గజదొంగ దువ్వన్న దొర (1904–1966)

దువ్వన్న దొర చరిత్ర అమోఘమైనది. కళింగాంధ్రలో దువ్వన్న దొర, తెలంగాణాలో మియా సాహెబ్., పండుగ సాయన్న లాంటి ప్రజా వీరులు సాహసం చూపించి, ధనికులను, ప్రభుత్వాధికారుల్ని దోచి ప్రజలకు పంచిపెట్టారు. **వీరు తమ కోసం కాకుండా, పరుల కోసం బతికిన వీరులు. వీళ్ళ చరిత్ర జానపద పాటల ద్వారా ప్రజల నాల్కలలో నేటికీ నానుతూనే ఉన్నాయి.**

దువ్వన్న దొర ఒక నాటి శ్రీకాకుళం, నేటి విజయనగరం జిల్లా, మెరకముడిదాం (చీపురుపల్లి) సమీపంలోని ఊటపల్లి కుగ్రామంలో 'కొండదొరల' ఇంటిలో జన్మించాడు.

కొండ జాతికి చెందిన సాహసదారుడు. ఊటపల్లిలో కాపు కులస్తుల సరసన ఉండే దువ్వన్న దొర తండ్రి రామన్న దొర మొఖాసా భూస్వామి. అయినా పేదవారిని ఆదుకోవడానికి

అన్నీ జాతీయ భాషలే... ఇంగ్లీషు, హిందీల కంటే ఏదీ తక్కువ కాదు.

హైకోర్టుల్లో, క్రింద కోర్టుల్లో వాద ప్రతివాదనలు, తీర్పులు ఆ ప్రాంత భాషల్లోనే ఉండాలి- కేంద్ర న్యాయశాఖ మంత్రి

'సుప్రీంకోర్టులో వాదనలు, తీర్పులు ఇంగ్లీషులో ఉంటాయి. హైకోర్టులు, ట్రయల్ కోర్టుల్లో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాకు ఆలోచన ఉంది. న్యాయశాస్త్రంలో పరిజ్ఞానం ఉన్న న్యాయవాదులు ఉండవచ్చు, కానీ తమ వాదనలను ఇంగ్లీషులో పూర్తి స్థాయిలో వినిపించలేరు. స్థానిక భాషలకు కోర్టుల్లో అనుమతి ఇస్తే చాలా సమస్యలను పరిష్కరించుకోవచ్చు. నాకు ఇంగ్లీషు రాకపోతే మాతృభాషలో మాట్లాడే స్వేచ్ఛ ఉండాలి. ఇంగ్లీషు మాట్లాడే వాళ్లకే ఎక్కువ ఫీజులు, అధిక కేసులు, మరెంతో గౌరవం వస్తుందని కాదు. దీన్ని నేను వ్యతిరేకిస్తున్నది ఎందుకంటే, ఇంగ్లీషు కంటే మాతృభాషలు తక్కువవేమీ కాదు. హైకోర్టులు, దిగువ కోర్టుల్లో స్థానిక భాషలోనే వాద ప్రతివాదాలు, తీర్పులు వచ్చే అవకాశం ఇస్తే మనకు ఖచ్చితంగా మేలు జరుగుతుంది – కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు.

అన్నీ భాషలూ జాతీయ భాషలే!- కేంద్ర విద్యాశాఖ మంత్రి

కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) అమలులో భాగంగా స్థానిక భాషలకు ఇచ్చిన ప్రాధాన్యతను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం ప్రస్తావిస్తూ, దేశంలోని అన్ని భాషలు జాతీయ భాషలేనని, హిందీ, ఆంగ్ల భాషలకంటే తక్కువ కాదన్నారు. ఇక్కడి మహాత్మా మందిర్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ విద్యా మంత్రుల సదస్సులో ప్రధాన్ ప్రసంగించారు.

"అన్ని భాషలు జాతీయ భాషలే, అది గుజరాతీ అయినా, తమిళం అయినా, బెంగాలీ అయినా లేదా మరాఠీ అయినా కావచ్చు. ప్రతి భాషకు దాని స్వంత ప్రాముఖ్యత ఉన్నందున ఏ భాష కూడా హిందీ లేదా ఆంగ్లం కంటే తక్కువ కాదు. అందుకే మా కొత్త ఎనీపీ (ఐఇఫ్) లో స్థానిక భాషలకు మేము ప్రాధాన్యత ఇచ్చాము" అని ప్రధాన్ తన ప్రారంభ ప్రసంగంలో వివరించారు.

దువ్వన్న దొర, పెద్దల ఇండ్లలో దొంగతనాలు చేసి, పేదవారికి పంచిపెట్టేవాడు.. పెళ్ళి కాని ఆడపిల్లల తల్లితండ్రులకు సాయపడేవాడు. గుడ్డి వారికి, కుంటివారికి దోచినది పంచి పెట్టేవాడు.

తెల్లని పంచె, తెల్లని లాల్చీ, లోపల నల్లని బనియాను, కోరమీసం, ఉగ్గరాల జుత్తు వంటి ఆహార్యం కలిగిన . దువ్వన్న దొర దొంగతనాలకు తెగబడేవాడు. చీపురుపల్లి, గజపతినగరం, బొబ్బిలి, పాలకొండ మొదలగు ప్రాంతాలలో రాత్రిపూట హెచ్చరించి, మరీ దొంగతనాలను చేసేవాడు. దువ్వన్న దొర దొంగ పనులు చూసి – తల్లి 'నీకిదేం ఖర్మరా?' అని మందలిస్తే 'అమ్మా! నేను నాకోసం, మీ కోసం చేయడం లేదు. పెద్దాళ్ళ ఇండ్లను దోచి, పేదోళ్ళకు పంచుతున్నాను" అన్నాడు.

దువ్వన్న దొర ముందుగానే దొంగతనానికి వస్తానని చెప్పి, వీలైతే నన్ను పట్టుకోండని సవాల్ విసిరేవాడు. అనుకున్న సమయానికే మారువేషంలో వెళ్ళి దొంగతనం చేసి ఇంటికి చేరుకునేవాడు. సవాల్ విసిరి, పందెం కాసినవారు ఓడిపోతే, వారు చెల్లించని పందెం బుకాయించినపుడు మరలా హెచ్చరించి, ధనవంతులు, భూస్వాముల ఇండ్లలో డబ్బులు, బంగారం ఎత్తుకు వచ్చేవాడు. అన్నింటికంటే మరో సవాల్ జిల్లా కలెక్టర్ గారి ఇంట్లో దొంగతనం. ఎంత మంది కాపలా ఉన్నా మారువేషంలో కలెక్టర్ గారి ఇంట్లో దొంగతనం చేశాడు. ఇలా ఇతని దొంగతనాలకు లెక్కలేక పోవడంతో, ఇతన్ని పట్టుకోవడానికి బుదరాయవలసలో ప్రత్యేక పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసారని తెలుస్తోంది. ఇతను పార్వతీపురం జైలు నుండి విడుదల అయినప్పుడు, ప్రజలు తండోపతండాలుగా చూడడానికి వచ్చేవారనీ, నేటికీ చిన్నతనంలో దువ్వన్న దొరను తమ ప్రాంతంలో చూసానని పెరుమాళి గ్రామానికి చెందిన 75 సంవత్సరాల సత్యన్నారాయణ గారు, మరియు దువ్వన్న దొర సమకాలీకులైన గ్రామస్తుల అనుభవం. చివరికి దువ్వన్న దొరను ఎంతకూ దారికి తేలేక పెద్ద రైతులు, ధనవంతులు కుట్ర పూరితంగా షికారుగంజి తోటలలో అంతం చేయించారని కథనం.

అయితే దువ్వన్న దొర సాహసకృత్యాలపై జానపదులలో పాటలు పుట్టాయి. ఉత్తరాంధ్రలో జముకులు పాటవారు, ఎరుకుల పాట గ్రామాలలో పాడుతూనే ఉన్నారు.


"పగలంత నాయుడండి ...దువ్వం దొర
పొద్దు బోతే దొంగడండి ... దువ్వం దొర
పెద్దాళ్ళను కొడతాడు ...దువ్వం దొర
పేదోళ్ళకు పంచుతాడు . .... దువ్వం దొర"

అలాగే మీసాల నాయుడుకు విసిరిన సవాల్ పై "పాట"


" జాగ్రత్త జాగ్రత్త
.....మీసాలునాయుడు
మీ ఇల్లు జాగ్రత్త
.....మీసాలునాయుడు
అద్ద రేతిరికి .....మీసాలునాయుడు
నీ ఇల్లుకు కన్నం వేస్తాను
....మీసాలునాయుడు
నీ ఇల్లు జాగర్త....మీసాలునాయుడు"

ఇలా దువ్వన్న దొర చరిత్ర ముగిసినప్పటికీ పాటల రూపంలో దువ్వన్న దొర సాహసాలు బ్రతికే ఉన్నాయి. ఇటువంటి చరిత్రలు ఇంతవరకు చరిత్రకు ఎక్కకపోవడం శోచనీయం. చరిత్ర కెక్కని సిక్కోలు ఆదివాసీ చరిత్రలు మరింత పరిశోధించి వెలుగులోకి తేవలసిన అవసరం ఎంతైనా ఉంది.

రచయిత – ఉత్తరాంధ్ర సాంస్కృతిక వికాశ ఉద్యమ ప్రముఖుడు.
ఆదివాసుల కళల రక్షణకై పనిచేస్తున్నారు.



సవరల గురించి రామమూర్తిగారు వ్రాసుకున్న నోట్సు



గిడుగు రాసిన సవరపాట

సవరలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో సవరభాషాసంఘం 2000 సంవత్సరంలో స్థాపించబడింది. సవరభాషకు సాంప్రదాయకమైన లిపిలేదు. సుమారు వంద సంవత్ససరాలక్రితం గిడుగు రామమూర్తిగారు సవరలకోసం బళ్లుపెట్టి వారి మాతృభాషలో విద్యాబోధన జరిపే ఏర్పాట్లు చేశారు. మొదటిలో వారు తెలుగులిపిని వ్రాతకు ఉపయోగించారు. ఒక 'సవర సాంగ్సు' పుస్తకం, నాలుగు 'సవర రీడర్సు' ప్రచురించారు. నావద్ద 'సవర సాంగ్సు' పుస్తకం, 2,3 సవర రీడర్సు వున్నాయి.

రామమూర్తిగారి తరువాత ఇద్దరు అమెరికన్లు, మరికొద్దిమంది మాత్రమే సవరభాషపై పరిశోధన చేశారు. 1992–1998 వరకు నేను పిహెచ్. డి కోసం సవరభాషపై పరిశోధనచేసి A Descriptive Grammar of Sora(Savara) Lnaguage అన్న సిద్ధాంత వ్యాసం రాశాను. అందులో సవరభాషకు వర్ణ నిర్ణయంచేస్తూ, ఈ భాషకు వర్ణాలు 25 అని నిర్ధారణచేసి, లేఖనవిధానాన్నిగూడ సూచించాను. వ్రాతకు తెలుగు గాని, అంతర్జాతీయ ధ్వనిలిపి గాని వాడుకోవచ్చని సూచించాను. రామమూర్తిగారు సవర మాన్యుయల్, సవర నిఘంటువులను అంతర్జాతీయ ధ్వనిలిపిలో రాశారు.

2000–2002 వరకు సవరభాషా సంఘం శ్రీకాకుళంలో కళాశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సవరలేఖనంలో శిక్షణాతరగతులు నిర్వహించింది. ప్రతి ఏటా గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా సవర కథల పోటీ నిర్వహించింది. సవర పాటల సేకరణగూడ చేపట్టింది.

సవరభాషా పరిరక్షణకోసం, సవరభాషా సంఘం 2005 నుండి ఒక సంవత్సరకాలం 'సవర' మాస పత్రికను ప్రచురించింది. 11 సంచికలు వెలువడ్డాయి. ఈ సంచికలలో గిడుగు రామమూర్తిగారు సేకరించిన నాటికథలు, పాటలు, సవరపిల్లలు రచించిన నేటికథలు, పాటలు తెలుగు అనువాదంతో వున్నాయి. తెలుగు సవర భాషలలో అక్షరాభ్యాసం చేయించే విధానం తెలిపే పాఠాలున్నాయి.

గిడుగు రామమూర్తిగారు సంకలనం చేసిన 'సవర సాంగ్స్' అన్న పాటల పుస్తకంలో 32 సవర పాటలున్నాయి. వాటిలో 23, 24 సంఖ్యగల రెండు పాటలు రామమూర్తిగారు రాశారు. ఈ సంకలనాన్ని 1912లో ప్రభుత్వం ప్రచురించింది.

–అల్లంసెట్టి చంద్రశేఖరరావు

గిడుగు రామమూర్తి గారు సవర భాషలో వ్రాసిన ఒక కవితను తెలుగులో అనువదించారు. ఈ పక్కపుటలో చూడండి.

పర్యావరణ రక్షణలో గిరిజనుల నుంచి మనం ఎంతో నేర్చుకోవాలి. దాన్ని ఎంతచక్కగా ఈ కవితలో గిడుగు వర్ణించారో ఈ కవితలో చూడండి. *–సంపాదకుడు*

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

కవిత

చెట్లు రోదిస్తున్నాయి

గిడుగు రామమూర్తిగారు సవర భాషలో రాసిన కవితకు అనువాదం

తెలుగు అనువాదం : డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు

చెట్లు మాట్లాడుకొంటున్నాయి.
ఏడుస్తూ రోదిస్తూ
పిలుచుకొంటూ పలకరించుకొంటూ
చెట్లు మాట్లాడుకొంటున్నాయి.

1. **(పని)**మనిషి వస్తున్నాడు!
గొడ్డలి తెస్తున్నాడు!
చూడండి! చూడండి! ఆ దారు, ఆ వాడి!
మనల్ని నరుకుతాడు,మనల్ని చీల్చుతాడు!
దారుగా వాడిగా
నూరాడు కీడాడు
దాని అంచు దాని మొన

2. **(పని)**మనిషి వస్తున్నాడు !
గొడ్డలి తెస్తున్నాడు !
చూడండి ! చూడండి ! ఆ దారు ఆ వాడి!
మనల్ని నరుకుతాడు, మనల్ని చీల్చుతాడు!
చూడు, చూడు, చూడు, నేస్తం.

దాని అంచు దాని మొన, నేస్తం
దాని గుర్రు దాని పొగరు;
మిరుమిట్లు గొలుపుతోంది
తళతళా మెరుస్తోంది!
భయమేస్తోంది నేస్తం!
ఏం చెయ్యలేం, నేస్తం, బలంలేని వాళ్లం!

ఏం చెయ్యలేం నేస్తం! కదలలేని వాళ్లం!
ఎలాగ, నేస్తం ఏం చెయ్యాలి?
నరకొద్దు అని వేడుకొందాం;
చీల్చవద్దు అని అడుగుదాం!
అని అనుకొన్నాయి చెట్లు
మాట్లాడుకొంటున్నాయి,
పిలుచుకొంటున్నాయి.

3. **ఇంకా** ఇలా చెట్లు
కనికరించమని అడుగుతున్నాయి !
ఓ పని మనిషీ, మంచి మనిషీ
వద్దు వద్దు నరకవద్దు నేస్తం
వద్దు వద్దు చీల్చ వద్దు నేస్తం
ఇంతకాలం, ఇన్నేళ్లు
ఆకులు ఇచ్చాం, పువ్వులు ఇచ్చాం
కాయలు ఇచ్చాం, పళ్లు ఇచ్చాం
మట్టలు ఇచ్చాం, మొదళ్లు ఇచ్చాం
నార ఇచ్చాం, మొగ్గలు ఇచ్చాం
కర్రలు ఇచ్చాం, కంపలు ఇచ్చాం
మత్తు సారా ఇచ్చాం, తీపి కల్లు ఇచ్చాం
నీడనిచ్చాం, విత్తనాలనిచ్చాం,
కూడు ఇచ్చాం, తిండి ఇచ్చాం
మేం నీకు తండ్రులం, మేం నీకు తల్లులం
చంపుతావా నీతండ్రిని?చీల్చుతావా నీతల్లిని?
అని బాధపడుతూ
చెట్లు అడుగుతున్నాయి.

4. **ఇంకా** ఇలా కనికరించమని
చెట్లు అడుగుతున్నాయి !
మా కొమ్మల్లో, మా రెమ్మల్లో
మా పూవుల్లో, మా ఆకుల్లో
జంతువులు, పక్షులు
పిల్లా పాపలతో వున్నాయి.
పురుగులు, చీమలు లెక్కలేనన్ని, నేస్తం!
ఎవరు లెక్క పెట్టగలరు నేస్తం?
గూళ్లలో, నేస్తం, అన్నీ ఒకటిగా, నేస్తం,
సరదాగా, హాయిగా
గూళ్లుకట్టి, జట్టుగా వుంటాయి.
గుడ్లు పెడతాయి, పొదుగుతాయి
పాలు ఇస్తాయి, మేపుతాయి;
ఆకులు పైనా, చిగురులు పైనా,
మొగ్గలు పైనా, పువ్వులు పైనా,
కాయలు పైనా, పళ్ళు పైనా,
పాల పైనా, ఆ నీళ్ల పైనా
ముసురుకుంటూ, ఝుర్రుతున్నాయి.
ఆనందంగా జీవిస్తున్నాయి.
వద్దు వద్దు నరకవద్దు, నేస్తం;
వద్దు వద్దు చీల్చ వద్దు, నేస్తం
మమ్మల్ని నరికితే మమ్మల్ని చీల్చితే
జంతువులు, పక్షులు
పెద్దచీమలు, చిన్నచీమలూ, పురుగులూ
పిల్లా పాపలతో చచ్చిపోతాయి.
అని బాధపడుతూ
చెట్లు వేడుకుంటున్నాయి.

5. **ఇంకా** కనికరించమని ఇలా
చెట్లు అడుగుతున్నాయి !
ఓ మనిషీ ఎందుకు
నరుకుతావు మమ్మల్ని, చీల్చుతావు మమ్మల్ని?
ఏం నేరం చేశాం మేం?
ఏం తప్పు చేశాం మేం?
నీదేమి దొంగిలించాం? నీదేమి దోచుకున్నాం?
ఎక్కడైనా ఎప్పుడైనా నేస్తం
నిన్ను మోసగించామా నేస్తం?
నీ అన్నం అడిగామా?
నీ కూడు అడిగామా?
నీ గుడ్డ అడిగామా?
ఎండలో మాడి
వానలో నానుతాం.
మాకు గాలే కూడు
మాకు మట్టే రుచి.
మలం వేసినా తీసుకుంటాం
మూత్రం పోసినా తీసుకుంటాం.
ఈ అడవుల్లోనే, ఈ కోనల్లోనే
ఈ కానల్లోనే, ఈ కోనల్లోనే.
ఎక్కడికీ తిరగలేక
ఎవరి వద్దకూ వెళ్లలేక
ఉన్నచోటే నేస్తం! వుండి
పెరిగాం నేస్తం, జీవిస్తున్నాం
అని బాధపడుతూ
చెట్లు అంటున్నాయి.

6. **ఇంకా** కనికరించమని ఇలా
చెట్లు అడుగుతున్నాయి !
ఓ మనిషీ ఎందుకు
నరుకుతావు మమ్మల్ని, చీల్చుతావు మమ్మల్ని
మమ్మల్ని నరికితే, మమ్మల్ని చీల్చితే
ఏమొస్తుంది నీకు? ఏం మోసుకుపోతావ్ నువ్వు?
మమ్మల్ని నరకకు, మమ్మల్ని చీల్చకు
మమ్మల్ని నాశనం చేస్తే, మమ్మల్ని పడవేస్తే
మీ తాత, ముత్తాత, ముత్తాత పిల్లలు
మీ చుట్టాల పిల్లా పాపలు
మీ మనవలు, మీ మునిమనవలు
మీ ఆవులు, మీ గేదెలు
తిండిలో, కూడులో
మమ్ము నంచుకోలేరు, కలుపుకోలేరు.
మమ్మల్ని పెంచుకో, మమ్మల్ని పోషించుకో.
వద్దు వద్దు నరకవద్దు, నేస్తం!
వద్దు వద్దు చీల్చవద్దు, నేస్తం!
అని ఆ విధంగా బాధపడుతూ
అడుగుతున్నాయి చెట్లు.
ఏడుస్తూ, రోదిస్తూ
పిలుచుకుంటూ, ఓదార్చుకుంటూ.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
August Vol :8, Issue: 5
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244